

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 67

గురువారం 29-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కాటుక రంగులోకి కడలి!
ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా నల్లగా మారుతున్న సాగరజలాలు -6లో



గది నిండా నోట్లకట్టలే
జస్టిస్ వర్మపై ఆరోపణలు నిజమే. నిర్ధారించిన సుప్రీంకోర్టు కమిటీ -6లో

న్యూస్‌రీల్

రాష్ట్రమంతా నైరుతి!



బుధవారం సాయంత్రానికి తెలంగాణ అంతటా నైరుతి రుతుపవనాలు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది.

- వివరాలు 3లో▶

ఆర్జీయూకేటీ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల



నిర్మల్ జిల్లా బాసరలో ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధికారులతో కలసి ఆర్జీయూకేటీ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. బాసర క్యాంపస్‌లో 1,500 సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

- వివరాలు 2లో▶

రాజ్యసభకు కమల్



ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్‌హాసన్ రాజ్యసభలోకి అడుగుపెట్టనున్నారు. ఆయనకు రాజ్యసభ స్థానాన్ని కేటాయిస్తున్నట్టు అధికార డీఎంకే బుధవారం ప్రకటించింది. - వివరాలు 6లో▶

వేడుకగా బ్యూటీ విత్ చారిటీ



ప్రపంచ సుందరి అంటే అత్యంత అందమైన అమ్మాయనే కాదు.. మానవీయ విలువలున్న హృదయం, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వమని మిస్ వరల్డ్ వేదిక నినదిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్ వేదికగా నిర్వహించిన 'హార్ట్ ఆఫ్ గోల్డ్' చారిటీ ఈవెంట్ అలాంటి వ్యక్తిత్వాలను, మనస్సులను ప్రతిబింబించింది. -16లో▶

ఇదండీ సంగతి



టూ ఇన్ వన్! ముందు జాగ్రత్త చర్యగా కారును అలా డిజైన్ చేయించుకున్నా..!

యంగ్ ఇండియా నా బ్రాండ్

మీరే నా అంబాసిడర్లు

గురుకుల విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానంలో సీఎం రేవంత్‌రెడ్డి

- రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం
- ప్రతి ఒక్కరికి తొలి పాతికేళ్లు కీలకం.. కెరీర్‌పై దృష్టి సారిస్తే జీవితంలో మంచి స్థానం.. కులం పేరుతో అవకాశాలు రావు.. చదువే ముఖ్యం
- కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ సర్కారు మోసం చేసింది..
- బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను దూరం చేసింది
- మేం వచ్చాక దళితులకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్న ముఖ్యమంత్రి
- సబ్‌ప్లాన్‌ను బీఆర్ఎస్ వదిలేస్తే.. మేం ఖర్చుచేస్తున్నాం: భట్టి

అందరి అభిప్రాయాలు తీసుకోండి
సీఎం ఇచ్చిన విందులో మంత్రుల సూచనలు
- వివరాలు 3లో▶



గురుకుల విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: పాతికేళ్లు వచ్చే వరకు కష్టపడిన ప్రతి వ్యక్తి జీవితంలో స్థిరపడతారని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. ప్రతి మనిషికి మొదటి పాతిక సంవత్సరాలు ముఖ్య కాలమని, అందులోనూ 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు అత్యంత కీలకమైనదని తెలిపారు. ఈ సమయంలో క్రమశిక్షణతో, నిబద్ధతతో ఉండాలని సూచించారు. రంగుల ప్రపంచానికి ఆకర్షితులు కాకుండా కెరీర్‌పై దృష్టి సారిస్తేనే జీవితంలో మంచి స్థానానికి చేరుకుంటారని విద్యార్థులకు హితబోధ చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల మిగతా 2వ పేజీలో ▶

హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్!

మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ వినోద్‌కుమార్ బదిలీ

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

5 నెలల తర్వాత భర్తీ అయిన తెలంగాణ సీజే పోస్టు

సాక్షి, హైదరాబాద్

దేశంలోని నాలుగు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ నెల 26న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన కొలీజియం ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జస్టిస్ ఏకే సింగ్ బదిలీకి కేంద్రం ఆమోదముద్ర వేస్తే ఆయన తెలంగాణ హైకోర్టు ఏడో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారు. 1965, జూలై 7న జస్టిస్ ఏకే సింగ్ జన్మించారు. బీఏ ఆనర్స్ తర్వాత ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు.



1990లో పట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2000 వరకు అక్కడ న్యాయవాదిగా పనిచేసి.. 2001లో జార్ఖండ్ హైకోర్టుకు మారారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్ 'కాళేశ్వరం' కసరత్తు

జూన్ 5న విచారణ కమిషన్ ముందుకు బీఆర్ఎస్ అధినేత

- ఎర్రవల్లి నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరుల సుదీర్ఘ భేటీ
- ఇప్పటివరకు జరిగిన విచారణ తీరు తెన్నులపై కేసీఆర్ సమీక్ష.. విన్పించాల్సిన వాదనలు, ఇవ్వాల్సిన వివరణపై చర్చలు
- విచారణకు వెళ్లక ముందే మీడియాకు హరీశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్!



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు జూన్ 5న హాజరు కావాలని నిర్ణయించుకున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు.. ఆ మేరకు కసరత్తు ప్రారంభించారు. బుధవారం కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో ఆయనతో మాజీ మంత్రి హరీశ్‌రావు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. మరో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 5న కేసీఆర్, 9న హరీశ్‌రావు కమిషన్ ముందు హాజరు కానున్న నేపథ్యంలో అక్కడ వినిపించాల్సిన వాదనలు, ఇవ్వాల్సిన వివరణపై వారు చర్చించినట్లు సమాచారం. కమిషన్ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు జరిగిన విచారణ తీరుతెన్నులను కేసీఆర్ సమీక్షించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అందులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు క్రోడీకరించి నివేదిక సిద్ధం చేయాలని మిగతా 2వ పేజీలో ▶

మన ప్రత్యర్థి

బీఆరెస్సా.. బీజేపీనా?



- సంక్షేమ పథకాల ప్రచారం ఎలా ఉంది?
- ప్రజలేమంటున్నారు? కార్యకర్తల మూడ్ ఏంటి?
- ఎమ్మెల్యేలకు రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఏం జరుగుతోంది? కాంగ్రెస్ పార్టీలో తాజా పరిణామాలు ఏంటి? అని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆరా తీశారు. బుధవారం ఆమె ఏడు పార్లమెంటు నియోజకవర్గాలకు చెందిన నేతలతో ముఖాముఖి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులతో విడివిడిగా సమావేశమయ్యారు. 'క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితేంటి? కార్యకర్తలు మిగతా 3వ పేజీలో ▶

ఆంధ్రజ్యోతిది

జర్నలిజమా.. శాడిజమా?



ఆ పత్రిక కథనాలపై కవిత ఫైర్
- కొత్త పార్టీ పెడతారని, కాంగ్రెస్‌లో చేరికకు రాయబారమని రాయడంపై సీరియస్

సాక్షి, హైదరాబాద్: పార్టీలో సముచిత స్థానం ఇవ్వకుంటే తాను కొత్త పార్టీ పెడతానంటూ ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంపై ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరేందుకు రాయబారం చేస్తున్నారని వచ్చిన కథనంపైనా ఆమె మండిపడ్డారు. హస్తం గూటికి చేరుకునేందుకు మధ్యవర్తి ద్వారా కవిత సంప్రదింపులు జరుపుతున్నారంటూ ఆ పత్రికలో రాయడంపై బుధవారం 'ఎక్స్'వేదికగా సీరియస్ అయ్యారు. 'కనీసం నన్ను సంప్రదించకుండా ఈ వార్త రాసిన పత్రికది జర్నలిజమా లేక శాడిజమా?'అని ప్రశ్నించారు. కేసీఆర్‌తో తాడోపేడో తేల్చుకోవాలని కవిత అనుకుంటున్నారని సదరు పత్రికలో వచ్చిన కథనంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

నకిలీ సీడ్.. అమ్మకాలు స్పీడ్

రైతులకు నిషేధిత బీజీ- 3 విత్తనాలు అంటగడుతున్న కేటుగాళ్లు



- దోమపోటు, తెగుళ్లు రావని నమ్మిస్తూ అక్రమ దందా
- ఆదిలాబాద్, నల్లగొండ, పాలమూరు జిల్లాలే టార్గెట్
- అడ్డుకట్ట వేసేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ
- అయినా ఆగని నకిలీ విత్తనాల విక్రయాలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో నకిలీ పత్తి విత్తనాల దందా యథేచ్ఛగా సాగుతోంది. మాయమాటలతో రైతులను కొందరు వ్యాపారులు నిండా ముంచుతున్నారు. నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి, అక్కడక్కడా అరెస్టులు చేస్తున్నప్పటికీ.. మోసాలు ఆగడం లేదు. ఓ వైపు నిషేధిత బీజీ-3 (బోల్‌గార్డ్-3) విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తూ.. దిగుబడి ఇవ్వటంలేదని తిరస్కరించిన విత్తనాలను లూజ్‌గా రైతులకు అంటగడుతున్నారు. నిషేధిత బీజీ-3 విత్తన కంపెనీలతోపాటు కొందరు దళారులు జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకొని నకిలీ విత్తనాల దందా సాగిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశిస్తున్న నేపథ్యంలో రైతులు పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా దళారులు మిగతా 5వ పేజీలో ▶

యూఎస్ కల.. వీసా ఎలా?

స్టూడెంట్ వీసాలు తాత్కాలికంగా నిలిపివేత

- తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో కలవరం
- అమెరికా ఆంక్షలతో 54 వేల మందిలో ఆందోళన
- భారతీయులు భయపడాల్సిన పనిలేదంటున్న కన్సల్టెన్సీలు
- సోషల్ మీడియా ఖాతాలతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు
- అమెరికా వెళ్లదలచుకున్న వారి నేపథ్యాలను ఆరా తీస్తున్న కన్సల్టెన్సీ వర్గాలు



వీసా వస్తుందో లేదో..?

నాకు అమెరికా యూనివర్సిటీలో సీటు ఖరారైంది. అప్పులు చేసి అన్ని విధాలుగా సిద్ధమయ్యా. ఆగస్టులో వెళ్లాలి. కానీ ఇంతవరకూ వీసా ఇంటర్వ్యూకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. దీంతో మొదటి సెమిస్టర్‌కు వెళ్లగలనా? లేదా అనే భయం వెంటాడుతోంది.

- శశాంక్ ఇరుకుపాటి (అమెరికా వెళ్లేందుకు సిద్ధమైన మహబూబ్‌నగర్ విద్యార్థి)

సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు భారతీయ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలవర పెడుతున్నాయి. స్టూడెంట్ వీసాలకు ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేయాలని కాన్సులేట్ అధికారులను అగ్రదేశం ఆదేశించడం ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్న వారిని గందరగోళానికి గురి చేస్తోంది. తమ దేశంలోని కొన్ని యూనివర్సిటీల్లో ఉగ్రవాద సమర్థనీయ చర్యలున్నాయని అమెరికా ప్రభుత్వం అనుమానిస్తుండటమే ప్రస్తుత పరిస్థితికి కారణమని అంటున్నారు. అమెరికా రావాలనుకునే ప్రతి విద్యార్థి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలని అధికారులకు అమెరికా ఆదేశాలు ఇచ్చింది. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయోనని అమెరికా వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి మరీ వీసా కోసం సిద్ధమైతే అమెరికా ప్రభుత్వం నుంచి రోజుకో నిర్ణయం వెలువడుతోందని కంగారు పడుతున్నారు. అయితే అమెరికా నిర్ణయాలు భారతీయ విద్యార్థులకు పెద్దగా ఇబ్బంది కల్గించవని ప్రవాస భారతీయులు అంటున్నారు. కానీ అమెరికా ఈ ఏడాది 41 శాతం విద్యార్థి వీసాలను తిరస్కరించింది. ఇందులో భారతీయుల వీసాలు 38 శాతం ఉండటం గమనార్హం. కాగా ఇప్పటికే వీసా ఇంటర్వ్యూకు తేదీ ఖరారైన వారిని అనుమతించాలని అమెరికా సూచించడం ఆయా విద్యార్థులకు ఊరటనిస్తోంది.

ఈ ఏడాది ఇప్పటికి 6 వేల మందికి తిరస్కరణ: భారత్ నుంచి ప్రతి ఏటా 7 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తున్నారు. ఇందులో 3 లక్షల మంది అమెరికా దేశానికే వెళ్తున్నారు. చదువు కోసం ఆ దేశానికి మిగతా 2వ పేజీలో ▶

వరి నుంచి ఇతర పంటలకు మారతారా?



- వరి మినహా ఇతర పంటల మద్దతు ధరలను భారీగా పెంచిన కేంద్రం
- పత్తి మద్దతు ధర ఏకంగా రూ.589 పెంపు
- ధాన్యం ఎమ్మెస్పీ కేవలం రూ.69 పెంపు
- మొక్కజొన్న, కంది, మినుము, రాగులు తదితర పంటలకూ భారీగా పెంపు
- పత్తి సహా ఇతర పంటల సాగు పెరుగుతుందంటున్న వ్యవసాయ నిపుణులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం వరి రైతుకు షాక్ ఇస్తూ.. ఇతర పంటలు సాగు చేసే రైతులకు బాసటగా నిలిచింది. వరి ధాన్యానికి మినహా ఇతర అన్ని ప్రధాన పంటలకు ఎమ్మెస్పీ భారీగా పెంచింది. దీంతో రైతులు ఆయా ఇతర పంటలకు మారే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీగా పెరిగిన మద్దతు ధర నేపథ్యంలో ఈసారి పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. పెరిగిన నీటి వనరులతో మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తారా?: ఎమ్మెల్సీ కవిత

గురుకుల పాఠశాలల్లో స్వీపర్ల తొలగింపు తగదని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు చేసే పని పట్ల గౌరవం నేర్పుతామనే ముసుగులో వారితో వెట్టి చాకిరీ చేయించడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 1,200 స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులు, అసిస్టెంట్ కేర్‌టేకర్ల తొలగింపుపై 'ఎక్స్'వేదికగా ఆమె ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతీ నెల రూ.40 వేలు కేటాయించగా వీటిని పారిశుద్ధ్యం కోసం ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక పారిశుద్ధ్య ఉద్యోగులు, స్వీపర్లను తొలగించి విద్యార్థులకు పనులు అప్పగించడంపై మండిపడ్డారు. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థల్లో వార్డెన్ల విధులు నిర్వర్తించే అసిస్టెంట్ కేర్ టేకర్లను తొలగించి పిల్లలకు బాధ్యతలు అప్పగించడాన్ని కవిత తప్పుబట్టారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిని తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కులవివక్ష చూపడంతో పాటు వారి శ్రమ దోపిడీ చేయాలనుకోవడం సరికాదన్నారు. పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని కాంగ్రెస్ అవలంబిస్తోందని కవిత ఆరోపించారు.

ఎన్ఐజీఎస్‌టీకి ప్రతిష్టాత్మక అక్రెడిటేషన్ హోదా

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో–ఇన్ఫర్మేటిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐజీఎస్‌టీ) హైదరాబాద్‌కు ప్రతిష్టాత్మక అక్రెడిటేషన్ హోదా దక్కింది. ఈ హోదాను న్యూఢిల్లీలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) మంజూరు చేసింది. ఎన్ఐజీఎస్‌టీ వృత్తిపరమైన విద్య, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. సీబీసీ నిపుణుల బృందం నిర్వహించిన ఆన్‌సైట్ అసెస్‌మెంట్ ద్వారా పలు పరిశీలనలు చేసిన తర్వాత సంస్థకు గుర్తింపు లభించింది. ఎన్ఐజీఎస్‌టీ నిర్వహించిన ఎనిమిది అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. వీటిలో అంచనా, కోర్సు రూపకల్పన, అధ్యాపకుల అభివృద్ధి, వనరులు, శిక్షణ లక్ష్యాలు, శిక్షార్థులకు సహకారం, డిజిటలైజేషన్, శిక్షణా నిర్వహణ, సహకారం, శిక్షణా మూల్యాంకనం, నాణ్యత హామీ, నిర్వహణ, పాలన వంటి అంశాలున్నాయని అడిషనల్ సర్వేయర్ జనరల్ ఎన్ఐజీఎస్‌టీ వరుణ్‌కుమార్ తెలిపారు.


కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

నేడు కిరండోల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం/సాక్షి, పాడేరు: కిరండోల్–కొత్తవలస (కేకే) రైల్వే లైన్‌లోని టైడా రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు బుధవారం పట్టాలు తప్పింది. వర్షాలతో రైలు ట్రాక్‌పై బండరాళ్లు పడ్డాయి. వాటిని గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు. కిరండోల్ నుంచి విశాఖకు ఐరన్‌ఓర్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలుకు సంబంధించి 32 వ్యాగన్లు పట్టాలు తప్పాయి. టన్నెల్‌కు ఇరువైపులా గూడ్స్ రైలు పట్టాలు తప్పి నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో కొత్తవలస–కిరండోల్ లైన్‌లో రైళ్ల రాకపోకలు మధ్యాహ్నం నుంచి నిలిచిపోయాయి. కిరండోల్ నుంచి విశాఖ వెళ్లే జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలును మాత్రం రాత్రికి ఒడిశా రైల్వేలైన్ మీదుగా దారి మళ్లించారు. గూడ్స్ రైలు వ్యాగన్లు బయటకు తీసి ట్రాక్ మరమ్మతు చేయడానికి రెండు రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా గురువారం విశాఖ నుంచి బయల్దేరాల్సిన, విశాఖ చేరుకోవాల్సిన కిరండోల్ పాసింజర్ రైళ్లను రద్దు చేశారు.అలాగే, బుధవారం రాత్రి విశాఖలో బయల్దేరాల్సిన విశాఖ–కిరండోల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

2.50 కోట్ల మంది ఆకలి తీర్చుతాం

మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్... ఢిల్లీలో 'హంగర్ ఫ్రీ' వరల్డ్ ప్రచారం ప్రారంభం



సాక్షి, న్యూఢిల్లీ: 2025–26 ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్ల 50 లక్షల మంది ఆకలిని తీర్చేందుకు తాము సిద్ధమైనట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. ఆకలితో అలమటించే వారి ఆకలి తీర్చేందుకు హంగర్ ఫ్రీ కాన్సెప్ట్‌ను తాము 2022లో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఢిల్లీలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం 'హంగర్ ఫ్రీ వరల్డ్'పేరుతో నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ఎండీ ఆషేర్, వైస్ చైర్మన్ అబ్దుల్ సలాం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషాల్, జీ–20 షెర్పా, నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా అమితాబ్ కాంత్ మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా పేదల ఆకలి తీర్చాలనే ఆలోచన మలబార్‌కు రావడం అభినందనీయమన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద 5 శాతం ఖర్చు చేస్తుండటం గర్వించదగ్గ విషయమని ప్రశంసించారు. ఎన్నో ఏళ్లుగా తాము కస్టమర్ల నమ్మకాన్ని కలిగి ఉన్నట్లు చైర్మన్ అహ్మద్ తెలిపారు. ఆదాయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించడం ఆనందం కలిగిస్తుందన్నారు.

బాస్ లేని బడి!

పాఠశాల విద్య డైరెక్టర్ నియామకంలో జాప్యం



- బదిలీ అయిన మాజీ డైరెక్టరే ఇన్‌చార్జిగా ఉన్న వైనం
- ముఖ్యమైన ఫైళ్లకు మోక్షం కలగడం లేదనే విమర్శలు
- ఇంతవరకు 'బడిబాట'పై సమీక్షే లేదు
- డిజిటల్ పాఠాలు, పుస్తకాలు, దుస్తులు పట్టించుకునేదెవరు?

పాఠశాల విద్య డైరెక్టర్‌ను బదిలీ చేసి నెల రోజులైంది. బదిలీ అయిన డైరెక్టర్ తనకు కేటాయించిన పరిశ్రమల శాఖలో జాయిన్ కూడా అయ్యారు. కానీ ఇప్పటివరకు ఆ స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో, పాఠశాల విద్య డైరెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. దీంతో రెండుచోట్లా పనిచేయడం ఆయనకు కష్టంగా ఉంది. విద్యాశాఖలో కీలకమైన ఫైళ్లు చూసే సమయం ఆయనకు ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. ముఖ్యమైన ఫైళ్లకు కూడా మోక్షం కలగడం లేదని తెలుస్తోంది. పాఠశాల విద్య డైరెక్టర్‌గా వచ్చేందుకు ఎవరూ ఇష్టపడటం లేదని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు చెబుతున్నట్టు సమాచారం. విద్యాశాఖ ముఖ్యమంత్రి పరిధిలో ఉంది. ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో సరిగా సమీక్షలు నిర్వహించలేని పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. **- సాక్షి, హైదరాబాద్**

జూన్ 6 నుంచి బడిబాట

జూన్ 6 నుంచి బడిబాట పెద్ద ఎత్తున చేపట్టాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు రెండేళ్లుగా పడిపోతున్నాయి. దీన్ని గణనీయంగా పెంచాలని పేర్కొంటూ ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ కీలకం. ప్రతిరోజూ ఆన్‌లైన్ రిపోర్టులు పరిశీలించాల్సి ఉంటుంది. బడిబాటలో వెనుకబడుతున్న టీచర్లను గుర్తించి వారు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేలా చూడాలి. మరోవైపు ఇంతవరకూ ఈ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో సమీక్ష జరగలేదు. పర్యవేక్షణ బృందాలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయలేదు. విద్యా శాఖకు డైరెక్టర్ లేకపోవడంతో అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారుల నుంచి ఒత్తిడి లేకపోవడంతో క్షేత్రస్థాయిలో టీచర్లు కూడా బడిబాటకు పెద్దగా సుముఖంగా లేరని జిల్లా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

డిజిటల్ పాఠాల ముచ్చటేదీ?

ప్రైవేటుకు దీటుగా సర్కారీ స్కూళ్లను తీర్చిదిద్దేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ విద్యా విధానం తేవాలనుకున్నారు. ఇందుకు సంబంధించిన స్కూళ్ల ఎంపిక, మౌలిక సదుపాయాలపై ఉన్నత స్థాయి సమీక్ష జరగాల్సి ఉంది. డైరెక్టర్ బదిలీ అయినప్పట్నుంచీ ఇవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏఐ పాఠాల కోసం కొన్ని సంస్థలతోనూ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. అవసరమైన బోధన ప్రణాళిక రూపొందించేందుకు ఆయా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. కానీ డైరెక్టర్ లేకపోవడంతో దీనిపై వివరించేందుకు విద్యాశాఖలో ఎవరిని సంప్రదించాలో తెలియని గందరగోళంలో ఉన్నాయి. అనేక పర్యాయాలు పాఠశాల విద్య కార్యాలయానికి వచ్చినా అధికారులు ఎవరూ స్పందించలేదని ఏఐ కన్సల్టెన్సీ సంస్థలు అంటున్నాయి. డిజిటల్ పాఠాలకు వీలైన కంప్యూటర్లు, స్క్రీన్ల ఏర్పాటుపై అధికారులు సమీక్ష చేపట్టకపోవడంతో ఈ పథకం ముందుకెళ్లే అవకాశం కన్పించడం లేదు.



టీచర్ల శిక్షణా అరకొరే

బోధన నైపుణ్యాలు పెంచేందుకు ప్రభుత్వ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందుకోసం రిసోర్స్ పర్సన్స్ నియామకం చేపట్టి వారికి శిక్షణ పూర్తి చేశారు. జిల్లా, మండల స్థాయిలో శిక్షణ మొదలవుతున్న తరుణంలోనే డైరెక్టర్ బదిలీ జరిగింది. అప్పట్నుంచీ శిక్షణ కార్యక్రమంపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టలేదు. శిక్షణలో టీచర్ల హాజరు ఎంత? అనే నివేదికలు కూడా రాష్ట్ర కార్యాలయం పరిశీలించలేని స్థితి ఉంది. స్కూళ్ళు తెరిచేలోగా పుస్తకాలు, దుస్తులు అందించాల్సి ఉంది. అయితే ఇప్పటికీ దుస్తులు కుట్టడం పూర్తవ్వలేదని జిల్లా అధికారులు అంటున్నారు. పుస్తకాల పంపిణీపై హెచ్ఎంలు అనేక సమస్యలు లేవనెత్తుతున్నారు. వీటిని పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నించడం లేదని వారంటున్నారు. మరోవైపు ఆర్థికపరమైన ప్రతి ఫైలును డైరెక్టర్ పరిశీలించాల్సి ఉంటుంది. అయితే కొన్ని రోజులుగా కుప్పలుగా ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

మీరే నా అంబాసిడర్లు

▶ మొదటి పేజీ తరువాయి

సొసైటీ నిర్వహించిన 2024–25 ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహూకరించారు. గురుకులాల్లో ఇంటర్మీడియట్, పదోతరగతి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులు బహూకరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాలను తయారు చేస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించారు. యంగ్ ఇండియా తన బ్రాండ్ అని, గురుకుల విద్యార్థులే తన బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు.

కులవృత్తుల పేరుతో బీఆర్ఎస్ మోసం

కులం పేరుతో ఎవరికీ అవకాశాలు రావని, కష్టపడి చదువుకున్న వాళ్లకు మాత్రమే అవకాశాలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువు వల్ల వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు కులవృత్తుల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక పేదలు, బడుగుల జీవితాలు మారుతాయని అందరూ భావించారు. కానీ పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ అన్ని వర్గాలను అణచివేసింది. చదువుకుంటే ఉద్యోగాలు వస్తాయని తెలిసినప్పటికీ.. మెరుగైన విద్య అందించకుండా కులవృత్తులు చేసుకోవాలని.. బర్రెలు, గొర్రెలు కాయాలంటూ వాటిని పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. కష్టపడి చదువుకున్న వాళ్లు ప్రభుత్వ కొలువుల కోసం ఏళ్లపాటు నిరీక్షించారు. కానీ, గత పాలకుడి ఇంట్లో ఒక్క మనిషికి ఉద్యోగం లేకపోతే ఆరు నెలల్లోనే ఎన్నికలు పెట్టి మరీ కొలువు ఇప్పించుకున్నారు'అని ధ్వజమెత్తారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, భట్టి, పొన్నం, షబ్బీర్ అలీ తదితరులు

దళితులకు సముచిత స్థానం ఇచ్చాం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంతటి చరిత్రాత్మక నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. 65 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు వెల్లడించారు. గ్రూప్–1 పరీక్షల ఫలితాలు ఇచ్చిన తర్వాత కొందరు ఉద్దేశపూర్వకంగా నియామకాలను ఆపారని విమర్శించారు. గ్రూప్–1 ఉద్యోగాలకు అర్హత సాధించిన వారిలో 89 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందినవారే ఉన్నారని తెలిపారు. 'వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీకి గతంలో ఒక్క దళితుడు కూడా వైస్ చాన్స్‌లర్ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓయూకు వీసీగా దళిత మేధావిని నియమించింది. అంబేడ్కర్ వర్సిటీ వీసీగా, ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం చైర్మన్‌గా, అసెంబ్లీ స్పీకర్‌గా దళిత బిడ్డలకు అవకాశాలు వచ్చాయి. హెచ్‌సీయూలో చదివిన మేధావి భట్టి విక్రమార్క ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పనిచేస్తూ ఆర్థిక వ్యవస్థను క్రమపద్ధతిలో నడుపుతున్నారు'అని పేర్కొన్నారు.

వాళ్లు ఎగ్గొడితే.. మేము ఖర్చు చేస్తున్నాం: భట్టి

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. కానీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించినప్పటికీ ఖర్చు చేయకుండా ఎగ్గొట్టిందని విమర్శించారు. అలా ఎగ్గొట్టిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కించి క్యారీఫార్వర్డ్ చేసి ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఎస్సీలకు రూ.13,223 కోట్లు, ఎస్టీలకు 1,296 కోట్లు క్యారీఫార్వర్డ్ చేసినట్లు వివరించారు. 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం ఏడాది కాలంలోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 102 సమీకృత గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

- బాసర క్యాంపస్‌లో 1,500 సీట్లు
- ఈ ఏడాది కొత్తగా మహబూబ్‌నగర్ సెంటర్ ప్రారంభం
- ఈనెల 31 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

భైంసా: ఆర్జీయూకేటీ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం నిర్మల్ జిల్లా బాసరలో ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధికారులతో కలసి క్యాంపస్‌లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేశారు. బాసర క్యాంపస్‌లో 1,500 సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా, ఈ ఏడాది కొత్తగా మహబూబ్‌నగర్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. 2025–26 విద్యాసంవత్సరంలోనే మహబూబ్‌నగర్ సెంటర్‌లో బోధన ప్రారంభం కానుంది. ఇటీవలే ఎల్కతుర్తి, మహబూబ్‌నగర్‌లలో కొత్త క్యాంపస్‌ల ఏర్పాటు కోసం భూ సేకరణతోపాటు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో నూతనంగా మహబూబ్‌నగర్ సెంటర్‌కు 180 సీట్లు కేటాయించినా ఎల్కతుర్తి సెంటర్‌కు ఈ ఏడాది సీట్లు కేటాయించలేదు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రవేశాల షెడ్యూల్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే దరఖాస్తుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇందులో సీట్లు దక్కనున్నాయి. ఈ నెల 31 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. విద్యార్థులు https://www.rgukt.ac.in అనే వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

కేసీఆర్ 'కాళేశ్వరం' కసరత్తు

▶ మొదటి పేజీ తరువాయి

సూచించినట్లు సమాచారం. కాగా ఇందుకు సంబంధించి కొందరు సాగునీటి రంగ నిపుణులు, సాంకేతిక నిపుణుల నుంచి కూడా వివరాలు కోరినట్లు తెలిసింది.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో లోపాలపైనా చర్చ: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక అశాస్త్రీయంగా ఉందని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ చేసిన ప్రకటనపైనా ఈ భేటీలో లోతుగా చర్చించినట్లు తెలిసింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని డొల్లతనాన్ని కమిషన్ ఎదుట ప్రస్తావించాలని నిర్ణయించినట్లు సమాచారం. కమిషన్‌కు అరకొర సమాచారం ఇవ్వకుండా పూర్తి స్థాయి ఆధారాలతో వివరణ ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు సంబంధించి గోదావరి నదుల విషయంలో పాలకులు చూపిన నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపాలని భావిస్తున్నట్లు తెలిసింది. కాగా తాము అన్ని విషయాలు వివరించేందుకు వీలుగా తగినంత సమయం ఇవ్వాలని కూడా కమిషన్‌ను కోరాలని బీఆర్ఎస్ భావిస్తోంది. రాజకీయ దురుద్దేశంతో విచారణ కమిషన్ ఏర్పాటు చేశారని మొదట్నుంచీ పేర్కొంటున్న నేపథ్యంలో.. తమ వాదన వినిపించేందుకు తగినంత సమయం ఇవ్వకపోతే అనుసరించాల్సిన వైఖరిపైనా చర్చించినట్లు తెలిసింది.

నేడో రేపో పీపీ ప్రజెంటేషన్!: విచారణ కమిషన్ ఎదుట హాజరవడానికి ముందే మీడియాకు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలు, స్థితిగతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని హరీశ్‌రావును కేసీఆర్ ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు అవసరమైన సమాచారాన్ని క్రోడీకరించే పనిలో హరీశ్ ఉన్నట్లు సమాచారం. కాగా ఒకటీ రెండు రోజుల్లోనే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు సంబంధించిన తేదీని బీఆర్ఎస్ ప్రకటించే అవకాశముంది.

బరాజ్‌ల పరీక్షలకు రూ.11.40 కోట్లు

ప్రభుత్వానికి సీడబ్ల్యూపీఆర్ఎస్ అంచనాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన పరీక్షలకు రూ.11.40 కోట్లు ఖర్చవుతుందని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్–పూణే) అంచనా వేసింది. ఇటీవలే ప్రభుత్వం ఈ మూడు బరాజ్‌ల పరీక్షల బాధ్యతను సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అప్పగించింది. దాంతో పరీక్షలకు అవసరమైన అంచనాలను రూపొందించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఒక్కో బరాజ్‌కు రూ.3.80 కోట్లు అవుతాయని లెక్కకట్టింది. బరాజ్‌ల పరిస్థితి ఏ విధంగా ఉందన్న విషయం తెలుసుకోవడానికి భూసాంకేతిక (జియో టెక్నికల్), భూభౌతిక (జియో ఫిజికల్). డ్రోన్ ట్రాక్ మ్యాపింగ్, మోడల్ స్టడీలను చేయాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన విషయం విదితమే. ప్రస్తుతం అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో వరద తక్కువగా ఉండగా, మేడిగడ్డకు 5 వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తోంది. దాంతో కీలకమైన మేడిగడ్డ బరాజ్‌లో డిసెంబర్ తర్వాతే పరీక్షలు చేయడానికి వీలుంటుంది. ఈ పరీక్షల నివేదికలు చేతికి అందాక బరాజ్‌ల పునరుద్ధరణ కోసం డిజైన్లు సిద్ధం చేసి, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది.

సర్వేల సహకారంతో దేశాభివృద్ధి ప్రణాళికలు

- జాతీయ గణాంక మంత్రిత్వ శాఖ అధికారుల వెల్లడి
- ఐఎస్‌బీ సహకారంతో హైదరాబాద్‌లో ఆలిండియా ట్రైనర్స్ వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: ప్రజల జీవన స్థితిగతులు, వారి అభిరుచుల గురించి నిర్వహించే సర్వేలతో దేశాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించవచ్చని జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నేషనల్ హౌజ్‌హోల్డ్ ట్రావెల్ సర్వే, డొమెస్టిక్ టూరిజం ఎక్స్‌పెండించర్ సర్వే, కన్‌స్ట్రక్షన్ సర్వేలలో పాల్గొనే ఆలిండియా ట్రైనర్స్‌కు హైదరాబాద్ రీజియన్ జాతీయ గణాంక కార్యాలయం ఆధ్వర్యంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సహకారంతో మూడురోజుల శిక్షణ తరగతులు గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ప్రారంభమయ్యాయి. గణాంక, కార్యక్రమాల అమలు శాఖ డీజీ గీతాసింగ్ రాథోర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్‌లు సునీతా భాస్కర్, సలీల్ ముఖోపాధ్యాయ, అజయ్ భక్షి, కిశోర్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్‌కుమార్‌లతో పాటు దేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా ట్రైనర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్వేల ఆధారంగా ప్రజల స్థితిగతులకు సంబంధించిన సమాచారం ప్రభుత్వాలకు తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

యూఎస్ కల.. వీసా ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

మన విద్యార్థులు ప్రతి ఏటా రూ.లక్ష కోట్లు చెల్లిస్తున్నారని భారత విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికన్ యూనివర్సిటీలు ఆగస్టు–డిసెంబర్, జనవరి–మే సెమిస్టర్లకు రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తాయి. మనవారు మొదటి సెమిస్టరే ఎంపిక చేసుకుంటారు. దీంతో ఆరు నెలల ముందు నుంచే వీసా కోసం ప్రయత్నిస్తారు. విద్యార్థులకు ఎఫ్1 వీసా ఇస్తారు. దీన్ని నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా అంటారు. అమెరికాలో ఫుల్ టైం విద్యకు ఇది అవకాశం కల్పిస్తుంది. కాగా 2023లో 1.03 లక్షల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు ఇచ్చినట్టు బ్యూరో ఆఫ్ కాన్సులేట్ అఫైర్స్ నెలవారీ నివేదిక పేర్కొంది. అయితే 2023–24లో ఎఫ్1 వీసాలను భారీగా తగ్గించారు. ప్రపంచ వ్యాప్తంగా 6.79 లక్షల మంది దరఖాస్తు చేస్తే ఇందులో 2.79 లక్షలు అప్లికేషన్లను అమెరికన్ కాన్సులేట్‌లు తిరస్కరించాయి. 2024 తొలి 9 నెలల్లోనే భారతీయ విద్యార్థులు 38 శాతం మందికి అమెరికా వీసాలు తిరస్కరించింది. ఈ ఏడాది తొలి సెమిస్టర్ కోసం దాదాపు 78 వేల మంది వీసా కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 24 వేల మందికి ఇంటర్వ్యూ తేదీలు వచ్చాయి. కొందరి ఇంటర్వ్యూలు జరిగాయి. ఇందులో 6 వేల మంది వివిధ కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యారు. ఇక 54 వేలమంది ఇంటర్వ్యూ తేదీల కోసం ఎదురుచూస్తున్నారు.

అలాంటి వారిని అడ్డుకునేందుకే..

అమెరికన్ కాన్సులేట్ వర్గాలు, కన్సల్టెన్సీ సంస్థలు, ప్రవాస భారతీయుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. వీసాల విషయంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నదే అమెరికా ఆలోచన. ఉద్రిక్తతలు, అసాంఘిక కార్యకలాపాలు, సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్న వారిని తమ దేశంలోకి రాకుండా చేయాలని ఆ దేశం భావిస్తోంది. ఈ క్రమంలోనే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను పరిశీలిస్తోంది. అమెరికా వెళ్ళే ముందు వారు ఎవరిని సంప్రదిస్తున్నారు? వారి నేపథ్యం ఏమిటి? ఎక్కడ ఉండాలనుకుంటున్నారు? ఎవరితో ఉండాలనే ఆలోచనలో ఉన్నారు? ఏ కన్సల్టెన్సీని ఎంపిక చేసుకుంటున్నారు? ఆ కన్సల్టెన్సీ ద్వారా గతంలో ఎంతమందిని పంపారు? వాళ్ళ నేపథ్యం ఏమిటి? ఇలాంటి వివరాలు అమెరికా కన్సల్టెన్సీ వర్గాలు సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో ఉన్న తమ స్నేహితులు, బంధువులకు..అనుమానించదగ్గ వ్యక్తులు, రెడ్ లిస్ట్‌లో ఉన్న దేశాల వారితో సంబంధం ఉంటే మరింత లోతుగా పరిశీలించే అవకాశం ఉంది.

భారతీయ విద్యార్థులకు ఇబ్బంది లేదు!

ప్రస్తుతానికి భారతీయ విద్యార్థులకు పెద్దగా ఇబ్బందులెదురయ్యే అవకాశం లేదని కన్సల్టెన్సీల ప్రతినిధులు, విదేశీ విద్యకు సంబంధించిన నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి అమెరికా కొన్ని దేశాలపైనే దృష్టి పెట్టిందని అంటున్నారు. తమ దేశానికి వస్తున్న 41 దేశాల విద్యార్థులను కేటగిరీలుగా విభజించింది. రెడ్ కేటగిరీలో అమెరికాకు అత్యంత ప్రమాదకరంగా భావిస్తున్న దేశాలను చేర్చారు. ఇంకా చెప్పాలంటే ఇస్లాం వాదంతో అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, లిబియాతో పాటు భూటాన్, క్యూబా సహా 11 దేశాలున్నాయి. ఉగ్రవాద ప్రేరేపిత, ఆర్థిక ఆంక్షలు విధించిన దేశాలతో వాణిజ్య మైత్రి కొనసాగిస్తున్న 10 దేశాలను ఆరంజ్ కేటగిరీలో చేర్చారు. ఈ కేటగిరీలో పాకిస్తాన్, రష్యా సహా పది దేశాలున్నాయి. వీటిపై కొంత సమయం తీసుకుని ఆంక్షలు విధిస్తారు. వైరి పక్ష దేశాలతో సంబంధాలున్నప్పటికీ, హెచ్చరికలు, చర్చల ద్వారా దారి కొచ్చే 22 దేశాలను ఎల్లో కేటగిరీలో చేర్చారు. వీటిపై దశలవారీగా ఆంక్షలు పెట్టాలని భావిస్తున్నారు. ఇక భారత్ మిత్రపక్షంలోనే ఉండటం వల్ల..ఇతరత్రా కారణాలతో తప్ప ఇక్కడి విద్యార్థులకు ఈ తరహా ఇబ్బందులేవీ లేనట్టేనని అంటున్నారు.

తప్పుడు సర్టిఫికెట్లు, పార్ట్‌టైమ్ జాబ్స్‌తోనే ఇబ్బంది

వీసాలు పూర్తిగా ఆపేయలేదు. వ్యక్తిగత వివరాలు, వెళ్ళే వర్సిటీ గురించి వాకబు చేయమని మాత్రమే అమెరికా ఆదేశించింది. భారతీయుల పట్ల అమెరికాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కాకపోతే తప్పుడు ధ్రువపత్రాలతో వెళ్ళాలనుకున్నా, అక్కడికెళ్లి పార్ట్‌టైం ఉద్యోగం చేస్తామన్నా, ఆ దిశగా లావాదేవీలున్నా వీసాకు ఇబ్బందులెదురవుతాయి. **- జయవర్థన్ ఏకాటి (కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకుడు)**

అమెరికా స్నేహితులతో జాగ్రత్త

అమెరికా రావాలనుకునే వాళ్లు ముందుగా సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎవరితో అక్కౌంట్స్ ఉన్నాయనేది చూసుకోవాలి. అనుమానం ఉన్న వ్యక్తులతో ఎలాంటి సామాజిక సంబంధం ఉన్నా, వీసా విషయంలో ఇబ్బందులు తప్పవు. సాధారణంగా అమెరికాలో ఉండే స్నేహితులను మనవాళ్ళు నమ్ముతారు. అయితే వాళ్ళ నేపథ్యం, వాళ్ళు అమెరికాలో ఎలా ఉంటున్నారనేది కూడా ముఖ్యమే. **- సిరిమళ్ళ వీరేంద్ర (అమెరికాలో ఎంఎస్ చేస్తున్న భారతీయ విద్యార్థి)**

అమెరికాలో వివిధ కోర్సుల్లో భారతీయులు

కోర్సు	2022-23	2023-24
అండర్ గ్రాడ్యుయేట్	31,954	36,053
ఎంఎస్	1,65,936	1,96,567
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్	69,062	97,556
డిగ్రీయేతర కోర్సులు	1,971	1,426

అమెరికాలో కొన్ని ప్రధాన దేశాల విద్యార్థుల సంఖ్య

	2022-23	2023-24
భారత్	2,68,923	3,31,602
చైనా	2,89,526	2,77,398
దక్షిణ కొరియా	43,847	3,149
కెనడా	27876	23,157

అమెరికాలో 2019 నుంచి మొత్తం విదేశీ విద్యార్థుల సంఖ్య

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2019-20	10,75,496
2020-21	9,14,095
2021-22	9,48,519
2022-23	10,57,188
2023-24	11,26,690

అమెరికాలోని 5 ప్రధాన రాష్ట్రాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య

వర్సిటీ	రాష్ట్రం	విద్యార్థులు
న్యూయార్క్	న్యూయార్క్	27,247
నార్త్ ఈస్టర్న్	బోస్టన్	21,023
కొలంబియా	న్యూయార్క్	20,321
ఆరిజోనా స్టేట్	టెంపే	18,430
సదరన్ కాలిఫోర్నియా	లాస్ ఏంజెల్స్	17,469

రెసిడెన్షియల్ స్కూళ్ల పేరిట కోట్లు దండుకునే కొత్త నాటకం

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట వేల కోట్ల రూపాయలు దండుకునేందుకు కాంగ్రెస్ మరో కొత్త నాటకం ఆడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటివరకు తట్టెడు మట్టి ఎత్తకుండా నిర్మాణ వ్యయాన్ని రూ.కోట్లకు కోట్లు పెంచడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందని ఆయన 'ఎక్స్'వేదికగా ధ్వజమెత్తారు. 2024, జూలై 24న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదిలాబాద్‌లో మాట్లాడుతూ రూ.80–100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తామని ప్రకటిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి 2024, అక్టోబర్ 11న రూ.125 కోట్ల వ్యయంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో స్కూల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారన్నారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసే ఈ స్కూల్స్ కోసం 2025, మే రెండో వారంలో రూ.135–150 కోట్లతో టెండర్లు కూడా ఖరారు చేసినట్లు హరీశ్ పేర్కొన్నారు. 2025, మే 27న 20 పాఠశాలల నిర్మాణానికి సంబంధించి రూ.4 వేల కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నంబర్ 96 విడుదల చేశారని పేర్కొన్నారు. అంటే ఒక్కో స్కూల్ అంచనాలను ఏ పని మొదలు కాకుండానే రూ.200 కోట్లకు పెంచారని వ్యాఖ్యానించారు. జలయజ్ఞం నుంచి రెసిడెన్షియల్ స్కూళ్ల వరకు అంచనాలను పెంచడం, కమీషన్లు దండుకోవడం ఇదేనా కాంగ్రెస్ మార్కు ప్రజాపాలన? అని హరీశ్ ప్రశ్నించారు.

హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2022, డిసెంబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు. 2023, ఏప్రిల్ 17న ప్రధాన న్యాయమూర్తి పదోన్నతితో త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టు సీజేగా విధులు నిర్వహించిన జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బాంబే హైకోర్టుకు బదిలీ అయినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కూడా కలకత్తాకు బదిలీ చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. కాగా, రాజస్తాన్ సీజేగా ఉన్న జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాస్ హైకోర్టుకు, జార్ఖండ్ సీజేగా ఉన్న జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును త్రిపుర హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌ను రాజస్తాన్ హైకోర్టుకు బదిలీ చేశారు.

తెలంగాణ నుంచి మరో జడ్జి బదిలీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు నుంచి మరో న్యాయమూర్తి బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసింది.

క్లుప్తంగా...

పార్టీ ప్రెస్‌మీట్‌లలో ఏది పడితే అది మాట్లాడొద్దు

నేతలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్‌: పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లలో ఏది పడితే అది మాట్లాడవద్దని, పార్టీ నిర్ణయాలు, ఆదేశాలకు అనుగుణంగా మాట్లాడాలే తప్ప వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడవద్దని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నేతలకు వార్నింగ్‌ ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ నాయకులతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. పార్టీ ఎజెండానే నాయకుల ఎజెండాగా ఉండాలే తప్ప వ్యక్తిగత అంశాలను పార్టీ కార్యాలయ వేదికపై మాట్లాడవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పార్టీ ప్రయోజనాలు దెబ్బతీసేలా మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. జూన్‌ 5 నుంచి జూన్‌ 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, జూన్‌ 8 నుంచి 16వ తేదీ వరకు మోదీ 3.0 పాలనపై ప్రజల్లోకి వెళ్లాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జూన్‌ 26న కార్యక్రమం నిర్వహించాలన్నారు. త్వరలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్‌ బన్సల్‌ వర్క్‌షాప్‌ ఉంటుందని చెప్పారు. కాగా, కొందరు నేతలు ఎంపీ ఈటలను వ్యక్తిగతంగా దూషించినట్లు ఢిల్లీకి ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలోనే కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించినట్లు సమాచారం.

నేడు కాంగ్రెస్‌ 'జైహింద్‌ సభ'

- ఆపరేషన్‌ సిందూర్‌ నేపథ్యంలో సైనికులకు సంఘీభావంగా..
- నిజాంపేట–బాచుపల్లి రోడ్డులో సభకు హాజరు కానున్న సీఎం రేవంత్‌

సాక్షి, హైదరాబాద్‌: పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరిగిన ఆపరేషన్‌ సిందూర్‌ నేపథ్యంలో భారత సైనికులకు సంఘీభావంగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం జైహింద్‌ ర్యాలీ, సభ జరగనున్నాయి. ఆపరేషన్‌ సిందూర్‌ను రాజకీయాల కోసం వాడుకుంటున్న బీజేపీ, నరేంద్రమోదీ తీరును ఎండగట్టడమే ఎజెండాగా మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలో నిర్వహించనున్న ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌, సీనియర్‌ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఏఐసీసీ సర్వీస్‌మెన్‌ కమిటీ చైర్మన్‌ కల్నల్‌ రోహిత్‌చౌదరి తదితరులు హాజరు కానున్నారు. దేశం యావత్తూ సైనికులకు అండగా ఉందని తెలిపేందుకు వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్‌ కళాశాల నుంచి మధ్యాహ్నం కేజీఆర్‌ కన్వెన్షన్‌ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం కన్వెన్షన్‌ (నిజాంపేట–బాచుపల్లి రోడ్డు)లో సభ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ, సభ ఏర్పాట్లను బుధవారం మహేశ్‌కుమార్‌గౌడ్‌, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌ కుమార్‌ మేడ్చల్‌ జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు.

సర్పంచుల పెండింగ్‌ బిల్లులు చెల్లించేలా చూడాలి

- కాంగ్రెస్‌ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు మాజీ సర్పంచుల వినతి

సాక్షి, హైదరాబాద్‌: మాజీ సర్పంచ్‌ల పెండింగ్‌ బిల్లులు చెల్లించేలా చూడాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్‌ యాక్షన్‌ కమిటీ కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే నివాస సముదాయంలో కాంగ్రెస్‌ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌ను తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్‌ యాక్షన్‌ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వి యాదయ్యగౌడ్‌, రాంపాక నాగయ్య కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌ బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేదుతోందని ఆరోపించారు. సర్పంచుల పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వానికి అనే దఫాలుగా వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. బిల్లులు రాక అనేక మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు.

ప్రాజెక్టులపై చంద్రబాబు మాటలు హాస్యాస్పదం

- బీఆర్‌ఎస్‌ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌

సాక్షి, హైదరాబాద్‌: గోదావరి నదిపై తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎన్నడూ అడ్డుకోలేదని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్‌ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ అన్నారు. తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గోదావరిపై అన్ని అనుమతులు సాధించిన కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకుంటూ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారని, భక్త రామదాసు ప్రాజెక్ట్‌ పనులు ఆపాలని కూడా లేఖ రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుని.. ఇప్పుడేమో మాట మార్చి నీతులు చెప్పడం ఏమిటని నిలదీశారు. అలాగే రెండుకళ్ల సిద్ధాంతంతో తెలంగాణకు ద్రోహం చేసే కుట్రలకు చంద్రబాబు తెర లేపారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదని మాట్లాడటం విడ్డూరమన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటిని చంద్రబాబు తరలించుకు వెళ్తుంటే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటన్నారు.



కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా ధర్మారంలో పసుపు కొమ్ములు విత్తుతున్న రైతు

మరిన్ని చిత్రాలు సాక్షి ప్లస్‌లో

అన్నదాత.. సాగుబాట

తొలకరి ప్రభావంతో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

సాక్షి, నెట్‌వర్క్‌: రుతుపవనాల ప్రభావంతో వానలు కురుస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు వ్యవసాయ పనులపై దృష్టి సారించారు. తొలకరి వర్షాలు కురియగానే ఉమ్మడి ఆదిలాబాద్‌, ఖమ్మం, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి జిల్లాల్లో విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. చాలాచోట్ల రైతులతో దుకాణాలు కిటకిటలాడాయి. వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల దిగుబడి, ఇతర ప్రత్యేకతలపై ఆరా తీస్తూ రైతులు కొనుగోలు చేయడం కనిపించింది. విత్తనాలు విత్తుకున్న రైతులు కొందరు కలుపునివారణ మందులు కూడా పిచికారీ చేసుకుంటున్నారు. నిజామాబాద్‌ జిల్లాలో కొంత మంది రైతులు పసుపు విత్తడం ప్రారంభించారు. మక్క, సోయా విత్తడానికి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. బోధన్‌, నిజామాబాద్‌ రూరల్‌, ఆర్మూర్‌ డివిజన్లలో రైతులు వరినారు పోశారు.

అందరి అభిప్రాయాలు తీసుకోండి

- పథకాల అమలుకు ముందు చర్చ జరిగాక శ్రీకారం చుట్టాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన విందులో మంత్రుల సూచన
- రాష్ట్ర రాజకీయాలపై మంత్రుల పిచ్చాపాటి
- హాజరైన రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌, పీసీసీ చీఫ్‌



సాక్షి హైదరాబాద్‌: కేబినెట్‌ సహచరులకు సీఎం రేవంత్‌రెడ్డి విందు ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రేవంత్‌ మంత్రులకు విందు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. గురువారం నుంచి మంత్రుల జిల్లాల పర్యటన, ఈ నెల 30న మరోమారు ఢిల్లీ పర్యటన, మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ఊహాగానాలు, రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణ నేపథ్యంతోపాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ అందుబాటులో ఉండటంతో బుధవారం సాయంత్రం తన నివాసంలో రేవంత్‌ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై మంత్రులు ఇష్టాగోష్ఠి మాట్లాడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంచేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ముందుగా చేయాల్సిన కసరత్తు గురించి మంత్రులు మాట్లాడుకున్నట్లు తెలిసింది. పథకం అమలుకు ముందే అందరితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకుంటే మంచిదని, ఫలానా పథకం అమలు చేసే అవకాశం ఉందన్న ఫీలర్‌ను ముందుగా ప్రజల్లోకి పంపి.. విస్తృత చర్చ జరిగిన తర్వాత శ్రీకారం చుడితే బాగుంటుందని మంత్రులు సూచించినట్లు తెలిసింది. అటు పార్టీ, ఇటు ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని, భవిష్యత్తులో కలిసికట్టుగా ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఎదుర్కోవాలనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో పాటు ఆర్థికపరమైన అంశాల విషయంలో మంత్రులందరూ ఆచితూచి మాట్లాడాలని, ఆర్థిక పరిస్థితులను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. జిల్లాల పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క మినహా హైదరాబాద్‌లో ఉన్న అందరు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌ విందుకు హాజరయ్యారు. ఆపరేషన్‌ సిందూర్‌ హడావిడి విరమణ నేపథ్యంలో ప్రధాని మోదీకి తగ్గిన గ్రాఫ్‌, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, మాదిగ ఎమ్మెల్యేల డిమాండ్‌, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతో మీనాక్షి నటరాజన్‌ ముఖాముఖి సమావేశంలో భాగంగా వచ్చిన అంశాలు, బీఆర్‌ఎస్‌ పంచాయతీ ఎపిసోడ్‌, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం వంటి అంశాలపై మంత్రులు తమ తమ అభిప్రాయాలను పంచుకున్నట్టు తెలిసింది.

రెండు రోజులు జిల్లాల్లో మంత్రులు

రాష్ట్ర మంత్రివర్గం గురువారం నుంచి రెండు రోజులపాటు జిల్లాల్లోనే ఉండనుంది. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాలన్న సీఎం ఆదేశాల మేరకు మంత్రులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ అంశంపై కూడా విందు సమావేశంలో చర్చకు వచ్చిందని, జిల్లాల్లో జరిగే సమీక్షలకు సంబంధించి జూన్‌ ఒకటికల్లా తనకు నివేదిక ఇవ్వాలని సీఎం మంత్రులను ఆదేశించినట్లు సమాచారం.

విత్తన మహోత్సవానికి శ్రీకారం

- జూన్‌ 2నుంచి ప్రారంభం.. 3వ తేదీ నుంచి అమలు
- వంగడాలను సిద్ధం చేసిన వ్యవసాయ యూనివర్సిటీ

సాక్షి, యాదాద్రి: సమగ్రమైన విత్తన విధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 2వ తేదీన విత్తన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రానున్న రెండేళ్లలో విత్తన స్వయం సమృద్ధిని సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం రెండేళ్లపాటు ఫౌండేషన్‌ విత్తనాలను అందిస్తారు. ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన విత్తనాలను ఆయా జిల్లాల వారీగా ఉచితంగా రైతులకు అందజేయనున్నారు. పత్తి, పెసర, మొక్కజొన్న, జొన్నకు సంబంధించిన నాణ్యమైన ఫౌండేషన్‌ విత్తనాలను రైతులకు ఇస్తారు. ఒక్కో గ్రామానికి ముగ్గురు చొప్పున రైతులను వ్యవసాయ శాఖ ఎంపిక చేస్తుంది. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీకి చెందిన రైతులు ఉంటారు.

10,888 గ్రామాల ఎంపిక..

రైస్‌ రీసెర్చ్‌ సెంటర్‌ అభివృద్ధి చేసిన వరి విత్తనాలను ఎంపిక చేసిన ఒక్కో రైతుకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 10,888 గ్రామాల్లో ముగ్గురు చొప్పున 32,664 మంది రైతులకు ఉచిత విత్తనాలు అందజేయనున్నారు. ఇందులో ఆయా ప్రాంతాల్లో నేల రకాలకు అనుగుణంగా విత్తనాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించారు. వరిలో జేజీఎం–443, డబ్ల్యూజీఎల్‌ –915, కేఎన్‌ఎం–118, కేఎన్‌ఎం 1638 సన్నరకం, కేఎన్‌ఎం–7715, ఎంటీయూ 1010, ఆర్‌ఎన్‌ఆర్‌ 15048 ఇలా పలు రకాల వరి విత్తనాలను అందిస్తారు. అదేవిధంగా జొన్నలు ఉమ్మడి మహబూబ్‌నగర్‌, రంగారెడ్డి, వరంగల్‌, ఆదిలాబాద్‌ జిల్లాల్లో, కామారెడ్డిలో మక్కల్‌, ఉమ్మడి నల్లగొండ, వరంగల్‌, ఆదిలాబాద్‌, కరీంనగర్‌, ఖమ్మం జిల్లాల్లో పెసర విత్తనాలు అందిస్తారు.

జూన్‌ 6న యాదాద్రి భువనగిరి జిల్లాకు సీఎం

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్‌ 6వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న గంధమల్ల రిజర్వాయర్‌ పనులు, మెడికల్‌ కళాశాల, వేద పాఠశాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే తుర్కపల్లి– వాసాలమర్రి గ్రామాల మధ్యలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో ఆలేరు నియోజకవర్గానికి మంజూరైన రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌ యువ వికాసం పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ అందిస్తారు. పనులన్నింటికీ సభావేదిక పక్కనే ఒకే చోట శిలాఫలకం వేయనున్నారు. ఇందుకు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వ విప్‌, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్‌ ఎం.హనుమంతరావు, అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డిలు సీఎం సభావేదిక ఏర్పాటుచేసే స్థలాన్ని బుధవారం పరిశీలించారు.

సీఎం రేవంత్‌ రైతులకు క్షమాపణ చెప్పాలి

- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌
- మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలి
- ఎన్డీఎస్‌ఏ నివేదిక అశాస్త్రీయం
- దీనిపై ఎల్‌అండ్‌టీ ప్రకటన కాంగ్రెస్‌, బీజేపీకి చెంపపెట్టు



సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌ విషయంలో నేషనల్‌ డ్యామ్‌ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) చేసిన వాదనలు తప్పులతడక అని తేలిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు. పోలవరం ప్రాజెక్టు తరహాలో మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలన్నారు. నాణ్యత లేనిది కాళేశ్వరం ప్రాజెక్టులో కాదని, కాంగ్రెస్‌, బీజేపీలే చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కనీస నాణ్యత పరీక్షలు చేయకుండా, శాస్త్రీయడేటాను సేకరించకుండా ఎన్డీఎస్‌ఏ రూపొందించిన నివేదికను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ తిరస్కరించడమే దీనికి సాక్ష్యమని పేర్కొన్నారు. లండన్‌ పర్యటనలో ఉన్న కేటీఆర్‌ ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్‌ను బదనాం చేసేందుకు, పార్టీని దెబ్బతీసేందుకు ఎన్డీఎస్‌ఏ ఈ నివేదిక ఇచ్చిందని మండిపడ్డారు.

ఎన్డీఎస్‌ఏ నివేదిక బూటకం

ఎల్‌అండ్‌టీ తాజా ప్రకటనతో మేడిగడ్డ బరాజ్‌పై ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక బూటకమని బయట పడిందని కేటీఆర్‌ అన్నారు. ఊహాజనితమైన నివేదికను క్రూర రాజకీయ ఎజెండాతో కాంగ్రెస్‌, బీజేపీ కేంద్ర కార్యాలయాల్లో తయారు చేశారని మండిపడ్డారు. పనికిరాని ఆ నివేదిక తమకు ప్రామాణికమని సీఎం రేవంత్‌ చెప్పడం ప్రభుత్వ అసమర్థ, దివాలాకోరు విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్‌ నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంట ఎండి, 500మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండా ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికను ఎల్‌అండ్‌టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్‌ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని కేటీఆర్‌ అన్నారు.

ఏ మూలకు వెళ్లినా కాంగ్రెస్‌ ప్రభుత్వంపై వ్యతిరేకత

తెలంగాణలో ఏ మూలకు వెళ్లినా కాంగ్రెస్‌ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కేటీఆర్‌ అన్నారు. లండన్‌ పర్యటనలో ఉన్న ఆయన బీఆర్‌ఎస్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ నేతలతో సమావేశమయ్యారు. యునైటెడ్‌ కింగ్‌డమ్‌ (యూకే) లోనూ పార్టీ రజతోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే అమెరికాలోని డాలస్‌ నగరంలో జూన్‌ 1వ తేదీన సిల్వర్‌ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో త్వరలో యూకేలోను సంబరాలు నిర్వహిస్తామని, ఈ సంబరాలకు స్వయంగా తాను హాజరు కావడంతో పాటు పార్టీ సీనియర్‌ నేతలు, తెలంగాణ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వస్తారని కేటీఆర్‌ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ సర్కార్‌ చేస్తున్న దోపిడీ, అరాచకాలు, ప్రజలపై వేధింపులను బాగా ఎండగడుతున్నారని యూకే ఎన్‌ఆర్‌ఐ నేతలను కేటీఆర్‌ ప్రశంసించారు. ఇంగ్లండ్‌లో ఉన్న సోషల్‌ మీడియా వారియర్స్‌పై కూడా అక్రమ కేసులు పెట్టినా ఎక్కడా తగ్గకుండా రేవంత్‌ ప్రభుత్వ దాష్టీకాలను ప్రశ్నిస్తున్నారన్నారు. అలాగే తెలంగాణ ప్రగతికి బ్రాండ్‌ అంబాసిడర్లుగా పనిచేయాలని వారికి విజ్ఞప్తి చేశారు.

అనిల్‌ కూర్మాచలంకు పరామర్శ

గుండెకు సంబంధించిన అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకుని లండన్‌లో కోలుకుంటున్న బీఆర్‌ఎస్‌ నాయకుడు, ఫిలిమ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ అనిల్‌ కూర్మాచలంను కేటీఆర్‌ పరామర్శించారు. ఆయన ఆరోగ్యస్థితిపై వాకబు చేశారు.

చలో ఢిల్లీ..

- అధిష్టానం పెద్దల వద్దకు కాంగ్రెస్‌ మాదిగ ఎమ్మెల్యేలు
- కేబినెట్‌లో స్థానమే ఎజెండా... బుధవారం సాయంత్రం మీనాక్షితో సమావేశం

సాక్షి, హైదరాబాద్‌: కేబినెట్‌లో బెర్తు దక్కించుకోవడమే ధ్యేయంగా కాంగ్రెస్‌ పార్టీలోని మాదిగ ఎమ్మెల్యేలు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. గతంలో ఢిల్లీ వెళ్లి అధిష్టానం పెద్దలను కలిసిన వీరంతా మరోసారి హస్తినకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌ కుమార్‌, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, తోట లక్ష్మీకాంతరావు, మందుల శామేల్‌లు గురువారం ఢిల్లీ బయలుదేరనున్నట్టు తెలిసింది. అందుబాటులో ఉన్న పార్టీ పెద్దలను కలిసి మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని వారు కోరనున్నారు. బుధవారం వీరంతా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. జనాభా ప్రాతిపదికన మాదిగ సామాజిక వర్గానికి కేబినెట్‌లో మరో బెర్తు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మీనాక్షి మాదిగ ఎమ్మెల్యేల వినతిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాదిగ ఎమ్మెల్యేలు లక్ష్మణ్‌, సత్యనారాయణ, లక్ష్మీకాంతరావు, శామేల్‌లు ఎమ్మెల్యే క్వార్టర్స్‌ వద్ద మీడియాతో మాట్లాడుతూ, తమ అభ్యర్థనను మేడమ్‌ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఢిల్లీ వెళ్లి మరోమారు పార్టీ పెద్దలను కలిసి తమ వినతిని తెలియజేస్తామని, ఇందుకోసం పార్టీ పెద్దల అపాయింట్‌మెంట్‌ అడిగామని వెల్లడించారు. ఇప్పటికే సీఎం రేవంత్‌, డిప్యూటీ సీఎం భట్టి, సీనియర్‌ మంత్రి ఉత్తమ్‌లకు విషయాన్ని వివరించామని చెప్పారు. మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో మరో బెర్తు కేటాయించిన తర్వాత 25 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్‌ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తామన్నారు.

బీఆరెస్సా.. బీజేపీనా?

▶ మొదటి పేజీ తరువాయి

ఏమనుకుంటున్నారు? రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ఎలా జరుగుతోంది? ప్రభుత్వం గురించి ప్రజలేమనుకుంటున్నారు? పార్టీ పదవులు ఇచ్చేందుకు పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రాతిపదిక ఏంటి? తెలంగాణలో అసలైన రాజకీయ ప్రత్యర్థిగా బీఆర్‌ఎస్‌ను పరిగణించాలా? బీజేపీని తీసుకోవాలా? ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఓటమికి కారణాలేంటి? ఆదిలాబాద్‌ జిల్లాల్లో పార్టీ పూర్తిగా వెనుకబడటానికి కారణమేంటి? అని నేతలను ప్రశ్నించినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, పార్టీ నేతల జవాబులను ఆమె నోట్‌ చేసుకున్నారని, ఈ సమాచారాన్ని క్రోడీకరించి అధిష్టానానికి నివేదిక అందజేస్తారని గాంధీభవన్‌ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వంతో సమన్వయం ఉండాలి

ఒక్కో నేతకు 10 నిమిషాల సమయం ఇచ్చిన మీనాక్షి.. పలు అంశాలపై సమాచారం రాబట్టారు. సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్‌ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు లాంటి పథకాలు ప్రభుత్వానికి ప్రజల్లో మైలేజీ తెస్తున్నాయని కొందరు ఎమ్మెల్యేలు చెప్పగా.. మరికొందరు పలువురు మంత్రుల వ్యవహారశైలిపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఆపరేషన్‌ సిందూర్‌ను అకస్మాత్తుగా విరమించుకోవటంతో బీజేపీ, ప్రధాని మోదీ గ్రాఫ్‌ పూర్తిగా పడిపోయిందని, బీఆర్‌ఎస్‌లో కుటుంబ కలహాలతో కేడర్‌ నిస్తేజంగా మారిందని కొందరు నేతలు తెలిపారు. ఈ సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే సానుకూల ఫలితాలు వస్తాయని సూచించినట్లు సమాచారం. నేతల మధ్య సమన్వయ లేమితోనే గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కొందరు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌లు తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరినట్టు సమాచారం. సరస్వతి పుష్కరాల సందర్భంగా అధికారులు ప్రొటోకాల్‌ పాటించలేదని పెద్దపల్లి ఎంపీ వంశీ, ఆయన తండ్రి వివేక్‌ ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం ఉండాలని.. అందరూ సర్దుకుపోయి పనిచేయాలని మీనాక్షి నేతలకు సూచించినట్లు సమాచారం. గురువారం మిగిలిన లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో మీనాక్షీ నటరాజన్‌ సమావేశమవుతారని గాంధీభవన్‌ వర్గాలు వెల్లడించాయి.

పార్టీ బలోపేతం గురించి అడిగారు: రేఖా నాయక్‌

మీనాక్షితో భేటీ తర్వాత పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు మీడియాతో మాట్లాడారు. ఖానాపూర్‌ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్‌నాయక్‌ మాట్లాడుతూ.. పార్టీని భవిష్యత్తులో ఎలా బలోపేతం చేయాలన్న అంశంపై మీనాక్షి మాట్లాడారని చెప్పారు. ఇందుకు గల వ్యూహం గురించి, భవిష్యత్తు సవాళ్లను ఎలా అధిగమిస్తారనే విషయాల గురించి మాట్లాడారని వివరించారు. డీసీసీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పినట్లు తెలిపారు.

నేను చెప్పాల్సింది చెప్పా


మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ.. మీనాక్షీ నటరాజన్‌కు తాను చెప్పదల్చుకున్న విషయాలన్నింటినీ చెప్పానన్నారు. తనకు మీడియాలో కనిపించాలన్న తాపత్రయం లేదన్న ఆయన.. అన్ని విషయాలను ఇన్‌చార్జికి వివరించినట్లు వెల్లడించారు. తాను కూడా మంత్రి పదవికి అర్హుడనేనని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌ సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే తన మనసులో మాటను సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని, పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పదవిని కూడా అడిగానని వెల్లడించారు.

మీనాక్షి ఓ డాక్టర్‌

మీనాక్షీ నటరాజన్‌ డాక్టర్‌ పని చేస్తున్నారని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆమె తగిన ట్రీట్‌మెంట్‌ కూడా ఇస్తారని, పార్టీలో అన్నీ సెట్‌ చేస్తారని చెప్పారు. తన నియోజకవర్గ సమస్యలేవైనా ఉంటే లేఖ రూపంలో ఇవ్వాలని మీనాక్షి అడిగారని వెల్లడించారు. కార్యకర్తలపై ఫోకస్‌ పెట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రమంతా నైరుతి!

- తెలంగాణలో చురుకుగా కదులుతున్న రుతుపవనాలు
- జూన్‌లో 111 శాతం వర్షపాతం నమోదు కావచ్చన్న వాతావరణ శాఖ
- రానున్న మూడు రోజులు పలుచోట్ల మోస్తరు వానలు
- ఐదు జిల్లాలకు ఆరెంజ్‌ అలర్ట్‌ జారీ



సాక్షి, హైదరాబాద్‌: నైరుతి రుతుపవనాలు అత్యంత చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 26న రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించగా... బుధవారం సాయంత్రానికి తెలంగాణ అంతటా విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన నాలుగు నుంచి ఆరు రోజుల వ్యవధిలో రాష్ట్ర భూభాగం అంతటా విస్తరించేవి. కానీ ఈసారి కేవలం రెండున్నర రోజుల వ్యవధిలోనే విస్తరించడం గమనార్హం. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు... కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది. ఆదిలాబాద్‌, కుమ్రంభీం ఆసిఫాబాద్‌, మంచిర్యాల, నిర్మల్‌, పెద్దపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించిన వాతావరణ శాఖ... ఆ జిల్లాలకు ఆరెంజ్‌ అలర్ట్‌ జారీ చేసింది.

జూన్‌ నెలలో విస్తారంగా వర్షాలు...

కాగా, జూన్‌ నెలలో రుతుపవనాల గమనానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనాలు విడుదల చేసింది. నైరుతి సీజన్‌లో జూన్‌ నెలలో రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 12.94 సెంటీమీటర్లు. ఐఎండీ అంచనాల ప్రకారం జూన్‌ నెలలో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తాయని.. సగటున 111 శాతం వర్షపాతం నమోదు కావొచ్చని వివరించింది. గతేడాది జూన్‌ నెలలో 15.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణంకంటే 23 శాతం అధికంగా వర్షపాతం నమోదు కాగా... ఈసారి అంతకుమించి వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా నారాయణపేట జిల్లా ఉట్కూర్‌లో 4.88 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా వికారాబాద్‌ జిల్లా బషీరాబాద్‌లో 3.0 సెంటీమీటర్లు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 2.75 సెంటీమీటర్లు, నల్లగొండ జిల్లా గుండ్లపల్లెలో 2.28 సెంటీమీటర్లు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 2 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

వరి నుంచి ఇతర పంటలకు మారతారా?

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్‌, నిజామాబాద్‌, మెదక్‌ , నల్లగొండ జిల్లాల్లో గతంలో పత్తి సాగు చేసిన రైతులు కూడా వరికి మారిపోగా, ఎంఎస్‌పీ పెంపుతో మరింత అధికంగా పత్తి వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలోని ఓ కీలక అధికారి 'సాక్షి'కి చెప్పారు. అలాగే మద్దతు ధర బాగా పెరిగిన ఇతర పంటల సాగు కూడా పెరిగే చాన్స్‌ ఉందని అన్నారు.

వరికి రూ.69తోనే సరి

2025–26 మార్కెటింగ్‌ సీజన్‌లో వానాకాలం (ఖరీఫ్‌) సీజన్‌కు సంబంధించి పలు కీలక పంటల ఎమ్మెస్పీ పెంచుతూ బుధవారం కేంద్ర కేబినెట్‌నిర్ణయం తీసుకుంది. వరి మద్దతు ధరను కేవలం రూ.69 పెంచిన కేంద్రం, పత్తి ఎమ్మెస్పీని ఏకంగా రూ.589 పెంచింది. తాజా పెంపుతో క్వింటాల్‌ ఏ–గ్రేడ్‌ వరి ధాన్యం మద్దతు ధర రూ.2,320 నుంచి రూ.2,389కి పెరిగింది. దేశంలోనే వరిసాగులో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 64 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. ఎకరం పొలంలో 25 క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి వస్తుందనుకుంటే.. పెరిగిన మద్దతు ధరతో ఎకరం భూమిలో పంట వేసిన రైతుకు రూ.1,725 అదనంగా సమకూరనుంది. ఇక ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.7,521గా ఉన్న పొడుగు (లాంగ్‌ స్టేపిల్‌–పొడుగు పింజ) పత్తి ఎమ్మెస్పీ రూ.589 పెంపుతో రూ.8,110కి చేరింది. మీడియం స్టేపిల్‌ ధర రూ.7,121 నుంచి రూ.7,710కి చేరింది. రాష్ట్రంలో గత వానాకాలం సీజన్‌లో 43 లక్షల ఎకరాల్లో పత్తి సాగవగా, సుమారు 28 ఎల్‌ఎంటీల దిగుబడి వచ్చింది. ఈసారి 50 లక్షల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక సిద్ధం చేయగా..తాజాగా పెరిగిన ఎమ్మెస్పీతో ఈసారి పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. పత్తితో పాటు నూనె గింజలు, పప్పులు, తృణ ధాన్యాలకు మద్దతు ధరను కూడా కేంద్రం భారీగా పెంచింది.

వరి సాగు తగ్గింపే లక్ష్యమా?

పప్పు ధాన్యాలు, నూనె గింజలు, పోషక తృణధాన్యాలను కాకుండా ఇతర పంటల సాగును బాగా ప్రోత్సహిస్తున్నామని, ఆ పంటలకు అధిక ఎమ్మెస్పీని అందిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది. వరి సాగును తగ్గించి ఇతర పంటలను పెంచాలని కేంద్రం భావిస్తున్నట్టు దీన్నిబట్టి అర్థమవుతోంది. కేంద్రం నిర్ణయంతో రాష్ట్రంలో మొక్కజొన్న, కంది, మినుము, రాగులు, జొన్న, వేరుశనగ, సోయాబీన్‌, నువ్వుల పంటలతో పాటు తృణధాన్యాల పంటలకు ఈసారి డిమాండ్‌ రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.



తత్వవేత్తలోని వైరుధ్యాన్ని తొలగిస్తే ప్రొఫెసర్ మిగులుతాడు.
– సోరెన్ కీర్కెగార్డ్

సాక్షి
గురువారం, 29 మే 2025

పాశ్చాత్య దేశాల 'ప్రాయశ్చిత్తం'

గాజాలో కళ్లముందు 19 నెలలుగా మారణహోమం సాగుతున్నా గుడ్లప్పగించి చూసిన పాశ్చాత్య దేశాలు ఇప్పటికి తెలివి తెచ్చుకున్నాయి. ఇజ్రాయెల్ సాగిస్తున్న ఊచకోత 'నైతికంగా సమర్థించ లేనిది, పూర్తిగా అసమతౌల్యమైనద'ంటూ కొత్త రాగం అందుకున్నాయి. మొదట బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు ఇజ్రాయెల్ తీరును వ్యతిరేకిస్తూ ప్రకటన చేయగా, కాస్త ఆలస్యంగా అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జర్మనీ శ్రుతి కలపడం కొత్త పరిణామం. ఇన్నాళ్ల పాపానికిది ప్రాయశ్చిత్తం అనుకోవచ్చా? అనుమానమే. గాజాలో ఏణ్ణర్థం నుంచి అదే పనిగా బాంబుల వర్షం కురిపిస్తూ వేలాదిమంది ప్రజలనూ... వారికి తిండి నీళ్లూ ఇచ్చేందుకూ, చికిత్స అందించేందుకూ వచ్చినవారిని సైతం హతమారుస్తుంటే ఈ దేశాల్లో ఎవరికీ నోరు పెగల్లేదు. ఇప్పటికీ వాటి వైఖరి పెద్దగా మారినట్టు కాదు. ఎందుకంటే... ఊచకోత సమర్థనీయం కాదంటూనే ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నదని ఎప్పటిలా మర్కట తర్కానికి దిగుతున్నాయి. 2023 అక్టోబర్ 7న పాలస్తీనాపై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ప్రారంభించింది మొదలు పాశ్చాత్య దేశాలు ఈ వాదనే చేస్తు న్నాయి. హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి 1,200 మంది ఇజ్రాయెల్ పౌరుల్ని కాల్చిచంపి, 251 మందిని అపహరించుకు వెళ్లినప్పటి నుంచీ ఇజ్రాయెల్ ప్రతీకారం మొదలైంది. ఆత్మరక్షణ చేసుకునే హక్కు ప్రతి దేశానికీ వుంటుంది. కానీ దానికుండే పరిమితి మాటేమిటి? ఎన్ని నెలలపాటు బాంబుల వర్షం కురిపిస్తే... ఎన్ని వేలమందిని చంపితే ఆత్మరక్షణ చేకూరుతుంది? 2,000 పౌండ్ల (907 కిలోల) బంకర్ బస్టర్ బాంబులు ఒక చిన్న ప్రాంతమైన గాజాపై ప్రయోగిస్తుంటే, ఆ దాడుల్లో వేలాదిమంది అమాయక పౌరులూ, ముఖ్యంగా పిల్లలూ, స్త్రీలూ చనిపోతుంటే ఎవరూ మాట్లాడలేదు. ఇజ్రాయెల్ దళాలు మూడు నెలలుగా గాజాను పూర్తిగా దిగ్బంధించి అక్కడికి అంతర్జాతీయ సహాయ బృందాలు అడుగుపెట్టకుండా పహారా కాస్తున్నాయి. తామే ఆ సాయాన్ని అందిస్తామంటూ అమెరికా, ఇజ్రాయెల్ ప్రకటించాయి. అదెంత బూటకమో తరచూ మీడియాలో వస్తున్న కథనాలే చెబుతున్నాయి. రోజుల తరబడి ఆహారం, మంచినీరూ లభించక వేలాదిమంది మృత్యుముఖంలో వున్నారని ఆ కథనాలు వివరిస్తున్నాయి. ఆకలికి తాళలేక వాహనాల వెంబడి పరుగులు తీస్తున్నవారిని కూడా నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపిన ఉదంతాలు వెలుగులో కొచ్చాయి. చివరకు అమెరికా–ఇజ్రాయెల్ సహాయ బృందాలను పర్యవేక్షించే చీఫ్ జేక్ ఉడ్ ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ బృందాల సాయమంతా కూడా ఇజ్రాయెల్ అధీనంలోని దక్షిణ గాజాలో నాలుగు శిబిరాల ద్వారా మాత్రమే అందుతోంది. సాయం కావాల్సిన వాళ్లు కిలోమీటర్ల దూరం నడిచిపోవాల్సి వస్తోంది. ఉత్తర గాజాకు ఆ మాత్రం సాయం కూడా లేదు.

నదురూ బెదురూ లేకుండా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండపై సంపన్న రాజ్యాలు ఇప్పుడే ఎందుకు మాట్లాడుతున్నాయి? ఒక నెత్తుటి హోమానికి తాము మౌన సాక్షులుగా మిగిలిపోయామన్న నింద పడకూడదని, తమ చేతులు కూడా నెత్తుట తడిశాయని చరిత్రలో నమోదు కారాదని అవి తహతహలాడుతున్నాయి. ఈ దేశాలన్నీ ఇజ్రాయెల్‌కు ఎడాపెడా సైనిక సామగ్రి తరలించినవే. కోట్లాది డాలర్లు కుమ్మరించినవే. భద్రతా మండలిలో దాన్ని సమర్థించినవే. ఇప్పుడు బ్రిటన్ ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధిస్తామని ప్రకటించింది. కొనసాగుతున్న వాణిజ్య చర్చలను నిలుపుదల చేసింది. పాలస్తీనా ఏర్పాటు అంశంపై వచ్చే నెలలో సౌదీ అరేబియాతో కలిసి సదస్సు నిర్వహించనున్నట్టు ఫ్రాన్స్ ప్రకటించింది. ఇవి నిజానికి కంటి తుడుపు చర్యలు. కానీ ఈమాత్రం చర్యలు కూడా సమ్మతం కాదంటోంది ఇజ్రాయెల్. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు పరోక్షంగా హమాస్ బలపడేందుకు దోహదపడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆరోపించారు.

ఇప్పటికి 594 రోజులుగా ఏకపక్షంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధానికి ఇంతవరకూ 61,700 మంది మరణించగా, అందులో 20,000 మంది పసివాళ్లని అంచనా వేస్తున్నారు. శిథిలాల కింద కన్నుమూసిన వారెందరో ఇంకా తెలియలేదు. వేలాదిమంది పిల్లలు అనాథలుగా మిగిలిపోగా, మరిన్ని వేలమంది పిల్లలు కాళ్లూ చేతులూ పోగొట్టుకుని వైద్యసాయం సక్రమంగా అందక రోదిస్తున్నారు. ఈ మారణహోమానికి ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రోజుల తరబడి ధర్నాలు సాగాయి. పాశ్చాత్య దేశాల్లో పాలస్తీనా ప్రధాన చర్చనీయాంశమైంది. కానీ ఇవేవీ ఇజ్రాయెల్‌నుగానీ, దానికి అండగా వుంటున్న సంపన్న రాజ్యాల పోకడలనుగానీ మార్చలేకపోయాయి. ఇజ్రాయెల్ వాణిజ్యంలో మూడోవంతు వాటా యూరప్ దేశాలదే. ఆ దేశాలు తల్చుకుంటే, చిత్తశుద్ధితో ఆంక్షలు అమలు చేస్తే ఇజ్రాయెల్ మనుగడ ఇబ్బందుల్లో పడుతుంది. మొదటి నుంచీ అండగా ఉంటున్న అమెరికా ఆ దేశాలతో చేతులు కలిపితే దాని పరిస్థితి మరింత దిగజారుతుంది. కనీసం అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఆదేశాలను పాటిస్తే ఇజ్రాయెల్‌కు ఊపిరాడదు. కానీ అవి నిజంగా అంత పని చేస్తాయా? అసలు ఇజ్రాయెల్‌లోనే నెతన్యాహూపై తీవ్ర వ్యతిరేకత బయల్దేరింది. ఇప్పుడు ఆయన్ను సమర్థించేవారు 25 శాతం మించరని చెబుతున్నారు. ఇజ్రాయెల్‌ను ఏమాత్రం తక్కువ చేసినా అది ఇరాన్‌కు బలం చేకూరుస్తుందన్న భయం పాశ్చాత్య దేశాలకుంది. ఆ దేశాల్లో రెండో ప్రపంచ యుద్ధానంతర రాజకీయాలన్నీ ఇజ్రాయెల్‌తో ముడిపడి వున్నాయి. దాన్ని తెంచుకోవటమంటే ఒక కొత్త ఒరవడికి తెరతీయడమే. అంత సాహసం చేయలేక కంటితుడుపు చర్యలు ప్రకటించాయి. కానీ ఇప్పటికే సమయం మించిందని ఆ దేశాలు గ్రహిస్తే మంచిది.

పెరుగుతున్న చైనా ప్రాబల్యం

విశ్లేషణ



హ్యాపీమాన్ జాకబ్

పహల్‌గామ్‌లో ఉగ్రదాడిపై భారత్ స్పందించిన తీరు, తదనంతర పరిణామాలు ప్రాంతీయ భౌగోళిక రాజకీయాల్లో మౌలికంగా తీసుకొచ్చిన మార్పులేమీ లేకపోవచ్చు. కానీ, దక్షిణాసియాలో రూపు దిద్దుకుంటున్న ప్రాబల్య సమతూకానికి సంబంధించి అవి కొన్ని ముఖ్యమైన దృక్కోణాలను బయటపెట్టాయి. ఈసారి భారత్–పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న తాజా సైనిక ప్రతిష్టంభన మునుపటి దృష్టాంతాలకు భిన్నమైంది. భారత్–పాక్‌ల మధ్య సైనిక ఘర్షణ పరస్పరం అణ్వాయుధాలను ప్రయోగించుకోగల స్థితికి చేరుతోందని అమెరికా పొరపడింది. ఘర్షణ తీవ్ర రూపం దాల్చకుండా రెండు దేశాల నాయకులకూ రాత్రికి రాత్రి అమెరికా ఫోన్లు చేసి ఉండవచ్చు. కానీ, ఒకటి మాత్రం స్పష్టం. ఇది ప్రాంతీయ ఆధిపత్య సమతూకపు స్థితిగతులను మార్చి వేసింది. సూటిగా చెప్పాలంటే, దక్షిణాసియాను అత్యంత ప్రభావితం చేయగలిగిన శక్తిగా అమెరికా స్థానాన్ని చైనా ఆక్రమించిందని చెప్పడం సబబు.

ఇండియాకు గట్టి మద్దతివ్వని రష్యా

ప్రపంచవ్యాప్తంగా అత్యంత బలమైన సైనిక శక్తిగా అమెరికా ఇప్పటికీ కొనసాగుతున్నప్పటికీ, భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేయగల అవకాశం సదరు దేశపు శక్తితోపాటు అభిమతంపైన కూడా ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి సంబంధించి స్పష్టమైన వ్యూహాత్మక ప్రయోజనం అమెరికాకు కొరవడినట్లుగా కనిపిస్తోంది. ఫలితంగా, ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని శాసించగల శక్తిగా ఉన్న అమెరికా ఇపుడు నామమాత్రపు పాత్రధారి స్థాయికి కుంచించుకుపోయింది. అటూఇటూగా వాషింగ్టన్ స్థానాన్ని బీజింగ్ ఆక్రమించింది. ఆర్థికంగా బలమైన దేశంగా ఉన్న చైనా దౌత్యపరమైన యుక్తిని ప్రదర్శిస్తూ ఆయుధాల సరఫరాదారుగా, మధ్యవర్తిగా ఈ ప్రాంతపు పరిణామాలను నిర్దేశించగల స్థితిలో ఉంది.

ప్రాంతీయ సైనిక ఘర్షణలు, దౌత్యపరమైన ప్రతిష్టంభనలు, రాజకీయ వాద వివాదాలకు తీర్పరిగా వ్యవహరించాలని చైనా కోరుకుంటోంది. ఇటీవల పాక్‌కు అందించినట్లుగానే హైటెక్ ఆయుధాల సరఫరా ద్వారా, లేదా దౌత్యపరంగా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం, ఆర్థికపరమైన ఒత్తిడిని తీసుకురావడంతో అది ఆ యా పనులను చక్కబెట్టాలని భావిస్తోంది. దక్షిణాసియా, ఇండో–పసిఫిక్‌లో పెరుగుతున్న చైనా ప్రాబల్యం ఇప్పటికే కనిపిస్తోంది. కానీ, అది సైనికపరంగా వత్తాసు ఇస్తానని పాక్‌కు చెప్పడం, తాజా భారత–పాక్ ఘర్షణలో ప్రధానాంశం.

అలాగే, భారతదేశానికి వ్యూహాత్మక భాగస్వామిగా అండగా నిలవడంలో రష్యా సామర్థ్యం తగ్గిన సంగతిని గమనించవలసి ఉంది. ఇటీవలి ప్రతిష్టంభనలో రష్యా వైఖరి సాధారణంగా ఇతర దేశాలు చూపే మాదిరిగానే ఉంది. అది భారతదేశానికి బాహాటంగా మద్దతు ప్రకటించలేదు. పాకిస్తాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు సరికదా, భారత సైనిక చర్యలకు ఆమోదం కూడా తెలుపలేదు. "ఉగ్రవాద చర్యలను రష్యా తీవ్రంగా ఖండిస్తోంది. అవి ఏ రూపంలో వ్యక్తమైనా వ్యతిరేకిస్తోంది. ఈ రాక్షసత్వంపై సమర్థంగా పోరాడటానికి మొత్తం ప్రపంచ దేశాలన్నీ ఏకోన్ముఖంగా ప్రయత్నాలు సాగించవలసిన అవసరం ఉందని భావిస్తోంది" అని రష్యా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఘర్షణలు మరింత ముదరకుండా సంయమనం పాటించవలసిందని రష్యా రెండు పక్షాలనూ కోరింది. ఒక రకంగా, రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య ఘర్షణ సందర్భంలో భారత్ ఏం చెప్పిందో, భారత్–పాక్ ఘర్షణపై రష్యా అదే చెప్పింది. రష్యా–పాశ్చాత్య దేశాల మధ్య భారత్ సమతూకం పాటించినట్లుగానే, భారత్–చైనాల మధ్య సమతూకం పాటించేందుకు రష్యా ప్రయత్నించింది.



◆ మనం బాగా ఆలోచించుకునే ఏ సైనిక కూటమిలోనూ చేరకూడదని నిర్ణయించుకున్నాం. బహుశా, అది సక్రమమైన నిర్ణయమే కావచ్చు. కానీ, దాని పర్యవసానాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. మన యుద్ధాలను మనమే చేయవలసి ఉంటుంది.

దక్షిణాసియాలో రష్యాకున్న ప్రయోజనాలు పరిమితమే కావచ్చు. కానీ, ఇస్లామాబాద్‌తో బీజింగ్ అంటకాగుతోంది. బీజింగ్‌తో సన్నిహితంగా మెలిగే మాస్కో, తీరా చైనా ప్రయోజనాలు పణంగా ఉన్నపుడు భారతదేశానికి వీలైనంత తక్కువ సహాయాన్నే అందిస్తుంది. దానర్థం – భారత్ ప్రాంతీయ ప్రయోజనాలకు భంగం కలిగించాలని రష్యా కోరుకుంటోందని కాదు. చైనా ప్రయోజనాలను తక్కువ చేసేదిగా కనబడటం రష్యాకు ఇష్టం లేదు. ఏమైతేనేం, అది పాకిస్తాన్‌కే ప్రయోజనకారి అవుతుంది. రష్యాతో ఉన్న దోస్తీని ఉపయోగించుకుని చైనా నడవడికలో మార్పు తేగలమని మనం ఒకప్పుడు అనుకున్న రోజులున్నాయి. బహుశా ఇప్పుడు భారత దేశంతో రష్యాకున్న మైత్రిని నిగ్రహించగల శక్తి తనకుందని చైనా చాటుకోవడాన్ని మనం చూస్తున్నాం. రష్యా పట్ల భారత ఆసక్తి సన్నగిల్లుతున్నట్లుగానే, భారత్ పట్ల రష్యా ఆసక్తి కూడా రంగు, రుచి కోల్పోతోంది. ఇది మనం అంగీకరించక తప్పని వాస్తవం. క్షీణిస్తున్న ఈ స్నేహ బంధాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ఉన్న మార్గాలను మనం గుర్తించవలసి ఉంది.

ఒంటరిగానే పోరాడగలగాలి!

ఇక భారతదేశానికున్న బాహ్య సమతూక (అంటే ఇతర దేశాలతో చెప్పించడం లేదా వాటిని పావులుగా వాడుకునేందుకు ఉన్న) అవకాశాలు అంతర్నిహితంగా పరిమితంగానే ఉండటం ఇటీవలి ప్రతిష్టంభనలో వెలుగు చూసిన మరో గణనీయమైన అంశం. దక్షిణాసియాలో అణు యుద్ధం సంభవించవచ్చనే (అటువంటి అవకాశం లేశ మాత్రంగానే ఉన్నప్పటికీ) భయాలు అంతర్జాతీయంగా భారతదేశంతో స్నేహంగా మెలిగే చాలా దేశాలకున్నాయి. ఘర్షణలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని మనం ఉక్రెయిన్ విషయంలో చెబుతూ వస్తున్నాం. పాశ్చాత్య దేశాలు ఇప్పుడు అదే పల్లవి అందుకుంటున్నాయి. ఇతరుల సంక్షోభ సమయాల్లో మనం ఎలా వ్యవహరిస్తామో వారూ మన పట్ల అలానే వ్యవహరిస్తారని ఇటీవలి పరిణామాలు వెల్లడిస్తున్నాయి.

ఎటువంటి సైనిక కూటమిలోనూ చేరకూడదని మనం ఉద్దేశపూర్వకంగానే నిర్ణయించుకుని ఉండవచ్చు. బహుశా, అది సక్రమమైన నిర్ణయమే కావచ్చు కూడా! కానీ, దాని పర్యవసానాలను కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి. మన యుద్ధాలను మనమే చేయాలి. అందుకు అనుసరించవలసిన విధానం స్పష్టమవుతూనే ఉంది. జాతీయ భద్రత సన్నద్ధతకు గణనీయమైన మొత్తాలను వెచ్చించడం ద్వారా మనం మొదట అంతర్గత సమతూకానికి ప్రయత్నించాలి. ప్రైవేటు సంస్థలు రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరింత ప్రోత్సాహం, అనువైన వాతావరణం అవసరం. స్థానిక, అంతర్జాతీయ భాగస్వాముల ద్వారా రక్షణ సామగ్రిని ఉత్పత్తి చేసుకోవాలి.

ఉగ్రవాదంపై మనం స్పందించే తీరు ఇకపై ఇదే మాదిరిగా ఉండబోతోందని లిఖితపూర్వకంగా కాకపోయినా ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది కనుక, ఆపరేషన్ సిందూర్‌ను వివిధ కోణాల నుంచి నిష్పక్షపాతంగా మదింపు చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కర్తవ్య నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. భవిష్యత్తులో పాటించవలసిన రక్షణ సన్నద్ధత, నిఘా, వ్యూహాత్మక కమ్యూనికేషన్లు, ఇతర కీలక అంశాలపై ఈ బృందం అవసరమైన చర్యలను సూచిస్తుంది. ఇటీవలి పరిణామాలను నిష్పాక్షికంగా పరిశీలించి, భవిష్యత్తుకు వ్యూహాత్మక దిశా నిర్దేశాలు చేసేందుకు కార్గిల్ సమీక్షా కమిటీ తరహాలో పహల్‌గామ్ సమీక్షా కమిటీని ఏర్పాటు చేసేందుకు సమయం ఆసన్నమైంది.

చివరగా, ఇంత తీవ్రతతో కూడిన ఈ తరహా సైనిక ప్రతిష్టంభనలు దేశపు విశాల వ్యూహాత్మక లక్ష్యాలను కూడా పక్కనపెట్టే విధంగా మన దృష్టిని మళ్ళించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నేటి భారతదేశం దక్షిణాసియాకు మాత్రమే పరిమితమై ఉండలేదు. కేవలం పాక్ పైనే మన దృష్టినంతటినీ నిలిపి ఉండలేం. ఇప్పటికే పరిమితంగా ఉన్న రాజకీయ, దౌత్య, సైనిక వనరులను ఇతర విశాల లక్ష్యాల వైపు మళ్ళించడానికి లేకుండా సతమతమవుతున్నాం. పాక్‌నే బూచిగా చూస్తూ కూర్చుంటే ఆ సామర్థ్యాలు మరింత పరిమితమవుతాయి. పాక్ నుంచి తరచూ ఎదురుకాగల ఉద్రిక్తతల వలయంలో చిక్కుకుపోకుండా నిలవడమే భారత్ ముందున్న అతి పెద్ద వ్యూహాత్మక సవాల్!

వ్యాసకర్త జేఎన్‌యూలో ఇండియా విదేశాంగ విధాన బోధకులు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఆ నాలుగు...



చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, టర్కీ: రానున్న ఏళ్లలో మనం ఈ దేశాలతో వ్యవహరించాల్సి ఉంటుంది. దీర్ఘకాలిక వ్యూహం అవసరం. యూఎస్‌ఏ మీద మనం ఆధారపడలేం. జపాన్, వియత్నాం, దక్షిణ కొరియా, తైవాన్, ఫిలిప్పీన్స్‌తో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవాలి.

– ప్రకాశ్ సింగ్, మాజీ డీజీపీ

పతనమైతే...

ఇండియా తన హిందూ పండితులు, బౌద్ధ భిక్షువులు, సిక్కు గురువులకు మాండరిన్‌లో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒకవేళ చైనా కమ్యూనిస్ట్ పార్టీ పతనమైతే వారిని చైనా పంపడానికి సిద్ధంగా ఉండాలి. లేదంటే మన ఉత్తరాన భారీ పాశ్చాత్య, వాటికన్ నియంత్రిత దేశం ఉండిపోతుంది.

– అరవింద్, విశ్లేషకుడు

ఎలాంటి వాదన!



షేక్ హసీనాను అధికారంలోకి తెచ్చిన ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగినవి కావని యూనస్ మద్దతుదారులు వాదిస్తారు. వారి దృష్టిలో, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమంటే... యూనస్ ఎప్పటికీ కొనసాగాలి, బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగకూడదు! ఏం తర్కం?

– దీప్ హల్దార్, కాలమిస్ట్

ఎందుకు మోయాలి?



విదేశాంగ విధానాన్ని కాసేపు పక్కన పెడితే, విమానాశ్రయాల నుంచి మన ఎంపీలు తమ చేబరువుల్ని తామే మోసుకెళ్లడం చూస్తే సంతోషం కలుగుతోంది. బ్యాగుల్ని మోయడానికి ఎవరో ఒకరుండే భూస్వామ్య పద్ధతి ఆగిపోవాలి.

– టి.ఎం. కృష్ణ, సంగీత విద్వాంసుడు

పూర్తి శ్రద్ధతో...



మీరు ఆధ్యాత్మిక దారిని ఎన్నుకొంటే, అది సులభమైన దారి కాదనీ, దానికి మీ పూర్తి శ్రద్ధ అవసరమనీ గ్రహించాలి. దాన్నొక హాబీలా స్వీకరిస్తే నడవదు. దాన్నే ప్రధానోద్దేశంగా స్వీకరించి... ఇంక వదలకూడదు!

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక బోధకుడు

రెండింటికీ లాభమే!

ఇటీవలి కాలంలో వస్తువుల తయారీలో చైనా, కంప్యూటర్ రంగ సేవలలో భారత్ ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలు పరిశోధన, కొత్త వస్తువులు కనుగొనడంలో ముందంజలో ఉన్నాయి. అమెరికా అనేక దేశాల నుండి వస్తు–సేవలను విరివిగా దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా గత శతాబ్దం ఆఖరి రెండు దశాబ్దాలలో ప్రపంచ వాణిజ్యం విరివిగా పెరిగింది. ఈ సమయంలో అమెరికా దిగుమతులు పెరగడం వల్ల ఆ దేశ పారిశ్రామిక రంగ అభివృద్ధి కొంతవరకు తగ్గుముఖం పట్టింది. తిరిగి విరివిగా తమ దేశంలోనే వస్తువులను ఉత్పత్తి చేసి ఎగుమతులు పెంచి గత వైభవాన్ని తిరిగి సాధించడానికి చేసే ప్రయత్నంలో భాగంగా దిగుమతి సుంకాలను పెంచడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నడుం బిగించారు. అలాగే పశ్చిమ ఐరోపా దేశాలు కూడా ఈ దిశలోనే అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలలో భాగమే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు.

ఈ మే నెల ఆరవ తేదీన భారత్–బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాలూ లాభం పొందాలని చూస్తున్నాయి. ఒప్పందం ఫలితంగా ఇరు దేశాలలో వస్తుసేవల ఉత్పత్తిపై పడే వ్యతిరేక ప్రభావాన్ని తగ్గించడానికి క్రమక్రమంగా ఉభయ దేశాలూ సుమారు పదేళ్ల కాలంలో దిగుమతి సుంకాలను చాలా వరకు తగ్గించి నామ మాత్రపు సుంకాలనే విధిస్తాయి. దీనివల్ల భారత్ జౌళి ఉత్పత్తులను ఇతోధికంగా బ్రిటన్‌కు ఎగుమతి చేయవచ్చు. మన పౌరులు బ్రిటన్‌లో ప్రస్తుతం కంటే సులభంగా ఉద్యోగాలు పొందవచ్చు. ఇందుకు ప్రతిఫలంగా విస్కీ లాంటి మత్తు పానీయాలపై భారత్ వెంటనే దిగుమతి సుంకాలు తగ్గిస్తుంది. అలాగే కొన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు, మాంసం ఉత్పత్తులపై కూడా భారత్ తక్కువ దిగుమతి సుంకాలు విధిస్తుంది. ఇందువలన భారత్‌లో ఆ వస్తువుల ఉత్పత్తిదారులు కొంత ఇబ్బంది పడే మాట వాస్తవమే. మొత్తం మీద ఈ ఒప్పందం రెండు దేశాలకూ లాభసాటి అనేది నిపుణుల భావన.

అమెరికా, ఐరోపాలతో కూడా ఇటువంటి ఒప్పందాలు చేసుకుని ఎగుమతులు పెంచడానికి భారత్ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలు తగ్గించాలని అమెరికా పట్టుబడుతోంది. అయితే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు మన రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకం. అందువలన భారత్ ఏ దేశంతో అయినా ఆచి తూచి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాలి.

– శ్రీరామ్ చేకూరి, జి.ఎస్. సుధాకరుడు
ఆర్థిక రంగ నిపుణులు

ఒక్కటే గెలుపు ఫార్ములా – 20:80

అభిప్రాయం



డానీ


మనకు తెలిసిన రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల పార్టీలే. కొందరు వాటిని గొప్పగా పార్లమెంటరీ ప్రజాస్వామిక పంథా పార్టీలు అనుకోవచ్చు. అప్పట్లో పీపుల్స్ వార్, ఇప్పట్లో సీపీఐ–మావోయిస్టు పార్టీ ఒక్కటే దీనికి భిన్నంగా ఉంటూ వచ్చింది. అది తన పరిధి పరిమితుల్లో సాయుధపోరాట పంథాను కొనసాగిస్తూ ఉండేది. ప్రస్తుతం దాని భవిష్యత్తు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. మావోయిస్టు పార్టీ కూడా ఎన్నికల పంథాను స్వీకరించవచ్చు అనే ఊహాగానాలు అప్పుడే వినిపిస్తున్నాయి.

స్వాతంత్ర్యానంతర కాలపు తొలి దశ రాజకీయాలు వేరు. అవి ఎంతో కొంత సిద్ధాంతపరంగా ఉండేవి. వాటి ఆర్థిక విధానాలు ఆదర్శవంతంగా ఉండేవి. ఇటు వ్యవసాయ రంగంలోనూ, అటు పారిశ్రామిక రంగంలోనూ ఉత్పత్తిని పెంచడానికి భారీ ప్రాజెక్టుల్ని నిర్మించడం మీద కాంగ్రెస్ దృష్టి పెట్టేది. ఇటు రైతు కూలీలు, అటు శ్రామికుల శ్రేయస్సు దిశగా కమ్యూనిస్టు పార్టీల కృషి సాగుతుండేది.

రాజకీయాల్లో కులమతాలకు ఒక పాత్ర, పెట్టుబడికి ఇంకో పాత్ర ఉంటుంది. మన ఆలోచనాపరులది ఒంటికన్ను వ్యవహారం. కులమతాల్ని చూసేవాళ్లు పెట్టుబడిని చూడలేరు; పెట్టుబడిని చూసేవాళ్లు కులమతాల్ని చూడలేరు. నిజానికి ఎన్నికల్లో కులమతాల కన్నా పెట్టుబడి ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడయినా సరే పెద్ద పెట్టుబడి చిన్న పెట్టుబడుల్ని తనవైపు లాక్కుంటుంది. రాజకీయ కూటములు అలాగే ఏర్పడుతుంటాయి. దేశ తొలి ఎన్నికల్లో ప్రధాని నుండి రాష్ట్రాల ముఖ్యమంత్రుల వరకు దాదాపు అందరూ బ్రాహ్మణ సామాజిక వర్గం నుండే ఎన్నికయ్యారు. ఆ తరువాత వ్యావసాయిక కులాల్లో పెట్టుబడి పెరిగింది. సహజంగానే రాజ్యాధికారం వాళ్ళ చేతుల్లోనికి మారింది. ఆ తరువాత వెనుకబడిన తరగతుల్లోనూ పెట్టుబడి పోగవడం మొదలయింది. వాళ్ళూ కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులయ్యారు.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఒకటుంది. ఎస్సీ, బీసీలకు అధికారం వచ్చిందనడం అర్ధసత్యం మాత్రమే! ఎస్సీ, బీసీ కులాల్లో పెట్టుబడి ఎక్కువగా పోగయిన కులాలకు, కుటుంబాలకు మాత్రమే అధికారం దక్కుతుంది. కులమతాలకూ, పెట్టుబడికీ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోకపోతే వర్తమాన రాజకీయాలు అర్థం కావు.

1991లో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, ఆర్థిక విధానాలు వచ్చాక రాజకీయాలు ఫక్తు వాణిజ్య వ్యవహారంగా మారిపోయాయి. కొంతకాలం ఆశావహులుగా కొనసాగిన ఎస్సీ, బీసీ రాజకీయ పార్టీల్ని వాణిజ్య రాజకీయాలు గట్టిగా దెబ్బతీశాయి. స్వాతంత్ర్యానంతర రాజకీయాల్లో సైడ్ క్యారెక్టర్లు వేసుకుని బతికిన ముస్లిం సమూహానికి ఆర్థిక పునాది బీటలు వారడంతో ప్రేక్షక పాత్రకు పరిమితం కావలసి వచ్చింది.



పైకి ఎంత వైవిధ్యపూరితంగా కనిపించినా సమస్త రాజకీయ పార్టీల గెలుపు మంత్రం ఒక్కటే; 20: 80! శత్రు వర్గం 20; సొంత వర్గం 80. 20 వాళ్ళు; 80 మనం!

ఓటర్లలో 20 శాతంగా ఉండే రాజవంశీకులు, బడా భూస్వాములకు తాను వ్యతిరేకం అని కాంగ్రెస్ చెప్పుకొనేది. మిగిలిన 80 శాతం ఓటర్లను ఎన్నికల్లో ఆకర్షించడానికి ఆ పార్టీ ప్రయత్నించేది. అది క్యాచ్‌మెంట్ ఏరియా; ఆరగాణి ప్రాంతం. అందులో సగం ఓట్లు పడినా విజయం తథ్యం. మరోవైపు కమ్యూనిస్టు పార్టీలు కూడా ఓటర్లలో 20 శాతంగా ఉండే పెట్టుబడిదారులు, భూస్వాములకు తాము వ్యతిరేకులమనీ, 80 శాతంగా ఉండే కార్మికులు, వ్యవసాయకూలీలకు తాము రక్షకులమనీ చెప్పుకొనేవి. 1990వ దశకంలో బహుజన రాజకీయాల్ని ముందుకు తెచ్చిన కాన్షీరామ్ కూడా దేశంలో పెత్తందారీ కులాలు 20 శాతం మాత్రమేననీ, 80 శాతం మంది బహుజనులనీ లెక్కలు కట్టి మరీ చెప్పేవారు.

భారతీయ జనతా పార్టీది కూడా సరిగ్గా అదే వ్యూహం. దేశంలో 20 శాతం మాత్రమే హిందూయేతరులు; 80 శాతం హిందువులు అనేది దాని విభజన. మనుషులకుండే సమస్త భావోద్వేగాల్లో మతం చాలా శక్తిమంతమైనది. ఈ 80 శాతం హిందువుల్లో 36 శాతం ఓట్లు పడినా అధికారం ఖాయం అని గత మూడు ఎన్నికల్లో బీజేపీ నిరూపించింది. మతభావోద్వేగాలనీ, కార్పొరేట్ శక్తుల్నీ, రాజకీయ అధికారాన్నీ మిళితం చేయడంలో బీజేపీ గొప్ప నైపుణ్యాన్ని సాధించింది. ఇప్పుడు బీజేపీని ఎదుర్కోవడానికి కొత్త వ్యూహాల్ని రచించడానికి దాదాపు అన్ని పార్టీలూ తలలు పగలగొట్టుకుంటున్నాయి. కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వాన్ని ఎదుర్కోవడానికి ఓటర్లలో 80 శాతాన్ని ఏకం చేసే బైండింగ్ వైర్‌ను కనిపెట్టడం అంత సులువు కాదు.

కమ్యూనిస్టులు, అంబేడ్కరైట్లు ఏకం అయితే (లాల్– నీల్ మైత్రి) బీజేపీని నిలవరించవచ్చు అనేది ఒక ఆలోచన. 2019 ఎన్నికల్లో దీన్ని ప్రయోగాత్మకంగా తెలంగాణలో అమలు చేశారు. మొత్తం రాష్ట్రంలో ఒక్క అసెంబ్లీ స్థానం కూడా దక్కలేదు. ఓటర్లు తిరస్కరించారు.


మరోవైపు, ఒక వ్యూహం ప్రకారం అంబేడ్కర్‌ను బీజేపీ క్రమంగా హైజాక్ చేసింది. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన బీఎస్పీ అధినేత్రి మాయావతి ఉత్తరప్రదేశ్‌లోనే ఉనికిని కోల్పోయింది. 403 స్థానాలున్న యూపీ అసెంబ్లీలో ఆ పార్టీకి ఒక్క స్థానం మాత్రమే దక్కింది. దాదాపు మూడున్నర దశాబ్దాలు నిరాఘాటంగా పశ్చిమ బెంగాల్‌ను ఏలిన సీపీఎం 2021 ఎన్నికల్లో తనకున్న 26 సీట్లనూ కోల్పోగా బీజేపీ అదనంగా 74 సీట్లు గెలుచుకుంది. కమ్యూనిస్టుల స్పేస్‌ను కూడా బీజేపీ ఆక్రమించుకుంటున్నది అనడానికి ఇదొక ఉదాహరణ.

అంబేడ్కరైట్లు, కమ్యూనిస్టులు కొత్తగా ఆదివాసులు, మైనారిటీలతో (లాల్ – నీల్ – హర్యాలీ) కలిసి నడిస్తే ఏమైనా మెరుగైన ఫలితాలు వస్తాయా? అనేది ఒక కొత్త ఆలోచన. ముందు అలాంటి కూటమి ఏర్పడాలి. అంత పెట్టుబడి సమకూరాలి. ఆ తరువాత అది ఎన్నికల్లో పనిచేయాలి. వచ్చే ఎన్నికల వరకు ఇంకే మార్పులు వస్తాయో చూడాలి.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు | 90107 57776

సాధుత్వానిదే పైచేయి

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సత్వ రజ స్తమో గుణాలు సృష్టిలో ప్రధానంగా కనబడుతుంటాయి. సాధుత్వం సత్వగుణానికీ, రాజసం రజోగుణానికీ, అజ్ఞానం తమోగుణానికీ ప్రతీకలు. అయితే సాధుత్వమే అన్నింటి కన్నా ఉత్తమం. అందుకు ఈ కథ ప్రతీక: ఉత్తర భారత దేశంలో ఒక సాధువు నదీతీరంలో ఆకులూ, అలములూ తింటూ తిరుగుతూ ఉంటాడు. విదేశీయుడైన ఒక రాజు ఆయన్ని చూసి జాలితో తన దేశం వస్తే కూడు, గూడు, గుడ్డతో పాటు సకల సౌకర్యాలూ సమకూర్చుతానని చెబుతాడు. దానికి సాధువు ఏమాత్రం ప్రలోభపడకుండా ప్రశాంతంగా చిరునవ్వుతో ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు.

దీంతో రాజు అహం దెబ్బతిన్నది. అధికారం, ధనం, దర్పం ఉన్నవాడు కనుక క్రోధాంధుడయ్యాడు. తనకు తీరని అవమానం, తిరస్కారం కలిగినట్టు భావించి కోపంతో 'ఇదిగో చంపేస్తా'నంటూ కత్తి పైకెత్తాడు. సాధువు ప్రసన్న వదనంతో 'రాజా! అలాగే చంపుదువులే! కాని ఈ శరీరం నేను కాదే! దీనికి భిన్నంగా ఉన్న ఆత్మను చంపలేవు. అది ఆనంద స్వరూపం, నిత్యం, సత్యం. దాన్ని నేనెప్పుడూ అనుభవిస్తూ అదే నేనుగా అభేదంగా ఉంటున్నా. ఆత్మశక్తి నీవెరుగవు. దాన్ని నీవు జయించలేవు. ఈ శక్తి నీలోను, నీ కత్తిలోను, కనబడే ప్రతి వస్తువులోను అంతటా వ్యాపించి ఉంది. నీవు కూడా అదే అయినప్పుడు, వేరే మరొకటి లేనప్పుడు, నీవు చంపగలిగింది ఏది?' అని ప్రశ్నించాడు. రాజు పశ్చాత్తాపంతో క్షమించవలసిందిగా ప్రాధేయపడ్డాడు. సాధువు వెంటనే అనుగ్రహించాడు. చూచారా! జ్ఞానసంపన్నులయిన సాధువుల ముందు కామక్రోధాల రాజసం ఏమైపోయిందో!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.తదియ రా.2.53 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఆరుద్ర రా.2.18 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.11.19 నుండి 12.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.4.46 నుండి 6.30 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.26.

క్లుప్తంగా...

యాదగిరిగుట్టలో హైకోర్టు జడ్జి



ఆలయంలో జస్టిస్ మధుసూదన్ రావు, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ మధుసూదన్ రావు బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తికి ఆలయ సంప్రదాయరీతిలో అధికారులు స్వాగతం పలికారు.

సొంతూరిని అభివృద్ధి చేసుకుందాం

- హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న జస్టిస్ రాజేశ్వరరావు

కురవి: జన్మభూమిని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన సొంత గ్రామమైన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిని బుధవారం సందర్శించారు. స్వగ్రామంలో రామాలయం, శివాలయంతోపాటు ఇతర దేవతామూర్తుల ఏర్పాటు నిమిత్తం గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను పలకరించారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని జస్టిస్ రాజేశ్వరరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సింగరేణికి విద్యుత్ సంస్థల బాకీ రూ.36,961 కోట్లు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి మనుగడకు తెలంగాణ విద్యుత్ సంస్థలు ప్రమాదకరంగా తయారయ్యాయని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలోని దక్షిణ డిస్కమ్ (టీజీఎస్పీడీసీఎల్), ఉత్తర డిస్కమ్ (టీజీఎన్పీడీసీఎల్)లు సింగరేణి సంస్థకు రూ.23,779.24 కోట్లు బాకీ పడ్డాయి. థర్మల్, సౌర, ఫ్లోటింగ్ సోలార్ కేంద్రాల ద్వారా సింగరేణి సంస్థ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ, డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. అయితే ఈ సంస్థలు డబ్బులు చెల్లించకపోవడంతో బకాయిలు కొండల్లా పెరిగిపోయాయి. అలాగే తెలంగాణ జెన్‌కో కూడా బొగ్గు కొనుగోళ్లకు సంబంధించి సింగరేణికి రూ.13,182.15 కోట్లు బకాయి పడింది. దీనితో విద్యుత్ సంస్థలు మొత్తంగా రూ.36,961 కోట్లను సింగరేణికి చెల్లించాల్సి ఉంది. సింగరేణి సంస్థ 2025 జనవరి నెలకుగాను విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు వెల్లడించింది. ఇదిలా ఉండగా బకాయిల చెల్లింపు విషయాన్ని విద్యుత్ సంస్థలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా బత్తుల రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అట్ల శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా జి.మహేందర్, మీడియా కన్వీనర్లుగా జి.నరేశ్, బి.రాకేశ్, ఉపాధ్యక్షులుగా ఎస్.గౌతమి, జి.శశికళ, రమేశ్, జి.సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.మహేశ్, కె.సంజీవులు, కె.రామకృష్ణ, కె.చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులుగా డి.ప్రభాకర్, ఎ.శివకుమార్, డి.పవన్ కుమార్ ఎన్నికయ్యారు.

సెల్‌ఫోన్ కొనలేదని యువకుడి ఆత్మహత్య




సురేశ్

హవేళిఘణాపూర్ (మెదక్): సెల్‌ఫోన్ కొనలేదని తల్లితో గొడవపడిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు.. మండల పరిధిలోని తొగిట గ్రామానికి చెందిన ఎలబోయిన సురేశ్ (24) తనకు ఫోన్ ఇప్పించాలని మంగళవారం సాయంత్రం తల్లి సత్తమ్మతో గొడవపడ్డాడు. డబ్బులు లేవని, తర్వాత ఇప్పిస్తానని చెప్పిన సత్తమ్మ.. పని మీద తల్లిగారింటికి వెళ్లింది. తల్లి ఫోన్ కొనివ్వలేదని మనస్తాపం చెందిన సురేశ్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం అవుతున్నా తలుపులు తీయకపోవడంతో ఇరుగుపొరుగు వారు కిటికీలోంచి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించాడు. తండ్రి గతంలోనే చనిపోగా సురేశ్ ప్రస్తుతం జులాయిగా తిరుగుతున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వెంటాడి.. వేటాడి...

- ఈనెల 18న సాయంత్రం క్యాంప్ ఖాళీ చేసిన నంబాల బృందం
- దట్టమైన అడవి.. ఎత్తైన కొండలపై నిర్విరామ ప్రయాణం
- ఛత్తీస్‌గఢ్‌లోని గుండెకోట్ అడవిలో కొద్దిసేపు విరామం... అక్కడే ఎన్‌కౌంటర్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రతాదళాలు చుట్టుముట్టడంతో మావోయిస్టు పార్టీ చీఫ్ కమాండర్ నంబాల కేశవరావును కాపాడుకునేందుకు తిండీతిప్పలు లేకుండా 60 గంటలపాటు మావోయిస్టులు పోరాటం సాగించారు. ఎత్తైన కొండలు ఎక్కి దిగారు.. వాగులు, వంకలు దాటారు. చివరకు అలసిపోయి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. విరామం నుంచి తేరుకునేలోగా తీవ్ర నష్టం జరిగిందని.. అదే అబూజ్‌మఢ్ ఎన్‌కౌంటర్‌కు కారణమైనట్లు తాజాగా వెలుగుచూసింది.

ఇద్దరు పారిపోవడంతో...

నంబాల కేశవరావు రక్షణ దళం, అబూజ్‌మఢ్‌లో విప్లవ విస్తరణలో కీలకంగా పనిచేసిన వ్యక్తులు పోలీసులకు లొంగిపోవడంతో నంబాల టీమ్ అడవిలో ఎక్కడ ఉందనే విషయం పోలీసులకు సమాచారం అందింది. దీనికి తోడు ఈనెల 17న రాత్రి నంబాల టీమ్‌లో ఉన్న ఇద్దరు (భార్యాభర్తలు) క్యాంప్‌ను విడిచి పారిపోయారు. దీంతో అప్రమత్తమైన నంబాల టీమ్ అదేరోజు సాయంత్రం క్యాంప్‌ను ఖాళీ చేసి మరో సురక్షిత ప్రాంతానికి కాలినడకన ప్రయాణం మొదలెట్టింది. దీంతో తమ వెంట అత్యవసర వస్తువులు తప్పితే ఆహారం, ఇతర వస్తువులు ఎక్కువగా తెచ్చుకునే వీలు చిక్కలేదు. ఈనెల 18న నాలుగు జిల్లాలకు చెందిన భద్రతా దళాలు ఓర్చా వైపు నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టాయి. ఈనెల 19న ఉదయం 9 గంటల సమయంలో పోలీసులు తమ సమీపానికి వచ్చినట్టుగా గమనించిన నంబాల టీమ్ మరిన్ని జాగ్రత్తలు తీసుకుంది. జట్లూరు–బోటేర్ అటవీ ప్రాంతంలో ఇరువర్గాల నడుమ ఉదయం 10 గంటలకు మొదలైన కాల్పులు ఆ రోజంతా కొనసాగాయి. అయితే ఎలాంటి నష్టం లేకుండా తప్పించుకున్న మావోలు గుండెకోట్ గ్రామం వైపుగా అటవీ మార్గంలో వెళ్లారు.

కొండ దగ్గర విరామం

చివరకు 20వ తేదీ సాయంత్రానికి గుండెకోట్ సమీపంలోని అడవికి చేరుకుంది. కాసేపటికే మరో ఎత్తయిన కొండ ఎదురవడంతో కొంతమేర ఎక్కి వెదురు వనాల మధ్యకు చేరుకున్నాక కాసేపు విరామం తీసుకున్నట్లు తెలుస్తోంది. దట్టంగా ఉండే వనాల్లో ఉంటే పోలీసులకు కనిపించడం అసాధ్యమని.. ఒకవేళ కనిపించినా తప్పించుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేసినట్లు సమాచారం. అప్పటికే 60 గంటలుగా నిద్రాహారాలు లేకుండా అడవుల్లో ప్రయాణిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మావోయిస్టుల మార్గాలపై పట్టున్న డీఆర్‌జీ బలగాలు అదే దిశలో సెర్చ్ ఆపరేషన్ సాగిస్తూ.. గుండెకోట్ గ్రామానికే చేరుకున్నాయి. ఈనెల 20న రాత్రి గుండెకోట్ అడవిలో నంబాల టీమ్, భద్రతా దళాలు కేవలం కిలోమీటరు దూరంలోనే బస చేసినట్టు సమాచారం. చిమ్మచీకటిలో చడీచప్పుడు చేయకుండా రాత్రంతా ఇరువర్గాలు గడిపాయి. తెల్లవారాక గుట్టపైకి చేరుకుని సురక్షిత ప్రాంతంలోకి వెళ్లాలనేది మావోయిస్టుల ఆలోచన. ఇదే సమయాన మావోలను వెంటాడుతూ వారున్న ప్రాంతంలోకి వెళ్తే ఆంబుష్ వలలో చిక్కుకుంటామనే సందేహాలు భద్రతా దళాలను ముసురుకున్నాయి.

వ్యూహం ఫలించక..

గుండెకోట్ అటవీ ప్రాంతంపై మావోలకు పట్టున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకున్న భద్రతా దళాలు.. 21వ తేదీ తెల్లవారుజామునే మరింత ముమ్మరంగా సెర్చ్ ఆపరేషన్ మొదలెట్టాయి. ఉదయం 7 గంటల సమయంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. భద్రతా దళాలకు దారి చూపుతున్న డీఆర్‌జీ జవాన్‌పై దాడి చేయడం ద్వారా ప్రభుత్వ బలగాలను ఆత్మరక్షణలోకి నెట్టాలన్న మావోల వ్యూహం ఫలించలేదు. చివరకు ఈ కాల్పుల్లో పార్టీ చీఫ్ నంబాలతోపాటు 27 మంది మావోయిస్టులు మృతి చెందారు.

పెదనాన్నా.. ఇంటికి రా

- నీకేం అవుతుందోనని భయమేస్తోంది
- రోజూ ఎన్‌కౌంటర్ అంటున్నారు..
- మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతికి అతడి తమ్ముని కూతురు లేఖ



సుమ

కోరుట్ల: 'పెదనాన్నా ఇంటికి రా... ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట ఎన్‌కౌంటర్లు జరుగుతున్నయ్.. నువ్వెట్లున్నవో అని మాకు భయమేస్తోంది. సమసమాజం కోసం అడవులకు వెళ్లావు. ఇక చాలు.. ఇంటికి వచ్చేయ్'.. అని మావోయిస్టు అగ్రనేత, నంబాల కేశవరావు స్థానాన్ని భర్తీచేస్తారని భావిస్తున్న కోరుట్ల వాసి తిప్పిరి తిరుపతి తమ్ముడు గంగాధర్ కూతురు సుమ లేఖ రాసింది. బీటెక్ చదువుతున్న సుమ తన మనోభావాలను లేఖ ద్వారా బయటపెట్టింది.

నేను పుట్టక ముందే..

'పెదనాన్నా.. నేను పుట్టకముందే సమసమాజ స్థాపన కోసం అడవుల బాట పట్టావు. నీ ప్రస్తావన వచ్చిన ప్రతీసారి ఒకింత గర్వంగా ఉంటున్నా.. ఎంతో బాధగా ఉంటోంది. మీ ధైర్యం..ఆలోచన..పట్టుదల నన్ను ఎంతో ఆలోచింపజేస్తాయి. మిమ్మల్ని కలవాలని నాకు ఎప్పుడూ అనిపిస్తుంది. కానీ దురదృష్టవశాత్తు నాకు ఆ అవకాశం దక్కలేదు. మీ గురించి పత్రికల్లో వచ్చే వార్తలు చదివితే మీరు ఎంత గొప్పవారో అని గర్వంగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో జరుగుతున్న ఘటనలు నన్ను కలవరపెడుతున్నాయి. మీకేం అవుతుందోనని మేం బెదిరిపోతున్నాం. మీరు ఇప్పటికే గెలిచారు. ఇప్పుడు పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయి.. మీకు కుటుంబం ఉంది. దయచేసి వారిని మరవద్దు.. మీ కోసం వేచిచూస్తున్నాం. ఇక చాలు.. వచ్చేయండి పెదనాన్నా'అని అభ్యర్థించింది. కగార్ ఆపరేషన్ ఎవరిపై అన్న విషయం అర్థం కావడం లేదని పేర్కొంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చి మన దేశంలో అమాయక పౌరులను చంపుతున్న వారిపై తీసుకుంటున్న చర్యలకన్నా.. మావోయిస్టులపై ఎక్కువ ఆపరేషన్లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేసింది. మావోయిస్టులను దారుణంగా చంపి సంబరాలు చేసుకుంటూ స్వీట్లు పంచుకుంటారా..? అని లేఖలో సుమ పోలీసులను నిలదీసింది.

నకిలీ సీడ్.. అమ్మకాలు స్పీడ్

▶ మొదటి పేజీ తరువాయి

నిషేధిత బీజీ–3, లూజ్ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారు.

ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలే తొలి టార్గెట్..

రాష్ట్రంలో వానకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగు చేసేది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో. ఇక్కడ వానకాలం సీజన్‌లో 11 లక్షల ఎకరాల వరకు పత్తి సాగవుతుంది. 5 లక్షల ఎకరాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగయ్యే ఉమ్మడి జిల్లాల్లో మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, వరంగల్ ఉన్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే దళారులు ఈ జిల్లాలపై దృష్టి పెట్టారు. ఇప్పటివరకు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనే సుమారు 5 టన్నుల నకిలీ విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. నాలుగు రోజుల క్రితం కాగజ్‌నగర్‌లో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల బీజీ–3 విత్తనాలను పోలీసులు సీజ్ చేశారు. కొద్ది రోజుల క్రితం కర్ణాటక నుంచి మంచిర్యాల వెళ్తున్న రూ.98.75 లక్షల విలువైన 3,750 కిలోల (3.7 టన్నులు) విత్తనాలను పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నాగర్‌కర్నూలు, గద్వాలలో కూడా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దళారులు పోలీసులకు చిక్కారు.

నిషేధం మాటున దర్జాగా విక్రయాలు

దేశంలో బీజీ–1, బీజీ–2 హైబ్రిడ్ విత్తనాలను మాత్రమే రైతులు సాగుచేయాలనే ఆంక్షలు ఉన్నాయి. భూసారం తీవ్రంగా దెబ్బ తినడంతోపాటు, వాతావరణ కాలుష్యానికి కారణమవుతుందన్న శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో బీజీ–3 రకాలను నిషేధించారు. అయితే వీటిని అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు.. ఏజెంట్ల ద్వారా నేరుగా రైతులకు సరఫరా చేస్తున్నాయి. బీజీ–2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, బీజీ–3 అయితే పంట దిగుబడి పూర్తయ్యేంతవరకు దోమపోటు, తెగుళ్ల తాకిడి ఉండదని, దిగుబడి సైతం బీజీ–2 కంటే 30 శాతం ఎక్కువగా వస్తుందని రైతులను నమ్మిస్తున్నారు. దీంతో రైతులు వీటివైపు ఆకర్శితులవుతున్నారు. అనేక చోట్ల రైతులు బీజీ–2తో కలిపి బీజీ–3 విత్తనాలను సాగుచేస్తున్నారు. జీబీ–3 సాగును అధికారులు నియంత్రించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

బీజీ–2 హైబ్రిడ్ విత్తన పాకెట్ ధర రూ.901

బీజీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గత సంవత్సరం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.864 ఉండగా, తాజాగా రూ. 37 పెంచి రూ. 901గా నిర్ణయించింది. ఏ కంపెనీకి చెందిన హైబ్రిడ్ విత్తన ప్యాకెట్ అయినా రూ.901లకే రైతుకు విక్రయించాలి. ఈ నేపథ్యంలో లాభాల కోసం డీలర్లు దళారుల ద్వారా అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల పేరుతో నిషేధిత బీజీ–3 లూజ్ విత్తనాలను కిలోకు రూ.2 వేల నుంచి రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. అదే సమయంలో తగిన దిగుబడి సామర్థ్యం లేవని పక్కన బెట్టిన విత్తనాలను తీసుకొచ్చి బీజీ–3 విత్తనాలతో కలిపి విక్రయిస్తున్నట్లు పోలీసుల దాడుల్లో తేలింది.

నాణ్యమైన బీజీ–2 విత్తనాలే నాటాలి: వ్యవసాయ శాఖ

రాష్ట్రంలో ఈసారి 50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకోసం 45 వేల క్వింటాళ్ల బీజీ–2 హైబ్రిడ్ విత్తనాలు అవసరం. అయితే, ఈ సీజన్‌లో రాష్ట్రంలోని అన్ని పత్తి విత్తన కంపెనీల వద్ద కలిపి 1,34,268 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ తెలిపింది.

గుంటూరు టు గుండెపుడి

నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలకు కేరాఫ్

ఏటా రూ.2కోట్లకు పైగా వ్యాపారం

సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

గనుల వేలంతో రూ. 56.74 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చిన్నతరహా ఖనిజ బ్లాకుల వేలం ద్వారా రూ.56.74 కోట్లు సమకూరాయి. రాష్ట్ర వ్యాప్తంగా 56 ఎకరాలకు పైగా విస్తరించిన 19 ఖనిజ బ్లాకులను వేలం వేయడం ద్వారా.. ఈ మేరకు ఆర్జించినట్టు గనుల శాఖ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందులో కలర్ గ్రానైట్ (1) బ్లాక్ వేలం ద్వారా రూ.4.99 కోట్లు, లాటరైట్ (4 బ్లాకులు) వేలం ద్వారా రూ.15.89 కోట్లు, స్టోన్ అండ్ మెటల్ (14 బ్లాకులు) వేలం ద్వారా రూ.35.84 కోట్లు సమకూరాయని ఆ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 57లోని నిబంధనల ప్రకారం ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు వేలం మొదటిదశను విజయవంతంగా నిర్వహించామని వివరించారు.

పంట నష్టపరిహారం రూ. 51.52 కోట్లు విడుదల

- ఎకరాకు రూ. 10 వేల చొప్పున 51,528 ఎకరాలకు..
- 41,361 మంది రైతులకు లబ్ధి: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్ల వాన, అకాలవర్షాలకు జరిగిన పంట నష్టానికి సంబంధించి ప్రభుత్వం రూ. 51.52 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 41,361 మంది రైతులకు సంబంధించి 51,528 ఎకరాలలో పంట నష్టం సంభవించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, పత్తి 4,753 ఎకరాలతో పాటు ఇతర పంటలు 477 ఎకరాలలో నష్టపోయినట్లు అధికారులు తేల్చారు. అధికారులు ఇచ్చిన పంట నష్టం అంచనాలను పరిశీలించిన ప్రభుత్వం దీనికి సంబంధించిన ఎకరా పంట నష్టానికి రూ. 10 వేల చొప్పున రూ. 51.52 కోట్లు మంజూరు చేసింది. కాగా మే నెలలో జరిగిన పంట నష్టానికి సంబంధించి నివేదిక సిద్ధంచేసి ఈ వారమే పంపగా, వాటికి సంబంధించిన నిధులు మంజూరు కావాల్సి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

జిల్లాల వారీగా పంట నష్టం

వివరాలు ఈ పేపర్‌లో..

జన్యుమార్పిడి విత్తనాలు రాకుండా అడ్డుకోవాలి

- కేంద్రానికి తెలంగాణ రైతు సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: జన్యు మార్పిడి విత్తనాలను ఆమోదించడం, ప్రోత్సహించడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని తెలంగాణ రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. జన్యుమార్పిడి విత్తనాలు దేశంలోకి రాకుండా అడ్డుకోవాలని సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ.. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. రైతులు ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న సమయంలో ఖరీదైన, విదేశీ ఆధారిత విత్తనాలను తీసుకురావడం అన్యాయమని లేఖలో పేర్కొన్నారు. రైతుల అభిప్రాయం లేకుండానే ప్రయోగాలు జరపడం, బహిరంగ చర్చ జరగకుండా ఆమోదించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జన్యు మార్పిడి విత్తనాలతో రైతులపై ఆర్థిక భారం పడుతుందని, రైతుల చేతిలో విత్తన నియంత్రణ లేకుండా పోయి సంప్రదాయ విత్తన మార్పిడికి అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా అభివృద్ధి చేసే విత్తనాలకన్నా.. కార్పొరేట్ విత్తనాలను ప్రోత్సహించడం సరికాదని లేఖలో పేర్కొన్నారు.

కాల్మొక్త సారూ.. మా వడ్లు కొనండి

- తహసీల్దార్ కాళ్లు మొక్కిన మహిళా రైతులు
- మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఘటన
- ధాన్యం కొనుగోలు చేయాలని కుమ్మరికుంట్లలో రైతుల ధర్నా
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో పురుగు మందు డబ్బాలతో రైతుల ఆందోళన

నర్సింహులపేట/దంతాలపల్లి/కోనరావుపేట: వానాకాలం తరుముకొచ్చి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలున్న అన్నదాతలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. వారాలతరబడి వేచిచూస్తున్నా అధికారులు ధాన్యం కొనుగోలు చేయకపోవటం, మరోవైపు రోజూ వర్షాలు పడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో వడ్లకు కాంటా వేయాలని అధికారుల కాళ్లావేళ్లా పడుతున్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యం కొనుగోలు చేయాలని ఇద్దరు గిరిజన మహిళా రైతులు తహసీల్దార్ రమేశ్‌బాబు కాళ్లు మొక్కి వేడుకున్నారు. తిర్మాతండాకు చెందిన భూక్య గోరి, భూక్య ఈరి అనే మహిళా రైతులు 40 రోజుల క్రితం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. ఇప్పటివరకు అధికారులు ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. అక్కడ మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసి కొనుగోలు కేంద్రం జలమయమైంది. దీంతో తహసీల్దార్ రమేశ్‌బాబు బుధవారం ఆ కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చారు. వర్షానికి వడ్లు తడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, వెంటనే కాంటా వేసి తరలించాలని వేడుకుంటూ ఆ రైతులు తహసీల్దార్ కాళ్లు మొక్కారు. ఇతర రైతులు ఆగ్రహంతో నిలదీయటంతో రెండు రోజుల్లో కాంటా వేసి ధాన్యం తరలిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



నర్సింహులపేట కొనుగోలు కేంద్రంలో తహసీల్దార్ కాళ్లు మొక్కుతున్న మహిళా రైతులు

ధాన్యం బస్తాలతో రోడ్డుపై నిరసన

ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లలో రైతులు బుధవారం ధాన్యం బస్తాలతో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోకపోవటంతో దంతాలపల్లి – సూర్యాపేట రహదారిపై ధాన్యం బస్తాలు అడ్డుగా పెట్టి సుమారు 45 నిమిషాలు ధర్నా చేశారు. దీంతో ప్రధాన రహదారిపై కిలోమీటర్‌పైగా వాహనాలు నిలిచిపోయాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓ రైతు తమ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోసి 60 రోజులు అవుతోందని, ధర్నాను అడ్డుకోవద్దని పోలీసుల కాళ్లు పట్టుకోబోయాడు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పోలీసులు చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రైతులు బుధవారం స్థానిక వై జంక్షన్ వద్ద పురుగులమందు డబ్బాలు పట్టుకుని తమ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించారు. వెంకట్రావుపేట కేంద్రం పరిధిలో 10 వేల క్వింటాళ్లలోపే ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఇప్పటికే 8,300 క్వింటాళ్లు తూకం వేశామని సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య చెప్పారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే సింగిల్‌విండోను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో కుమారుడితో కలెక్టర్ పాటిల్, పక్కన వైద్యులు, సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రాద్రి కలెక్టర్ సతీమణి ప్రసవం

- మగబిడ్డకు జన్మనిచ్చిన శ్రద్ధా పాటిల్
- అభినందించిన మంత్రులు దామోదర, పొంగులేటి

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆ ఆస్పత్రులపై నమ్మకం పెరిగేలా అడుగు ముందుకేశారు. ఆయన భార్య శ్రద్ధ గర్భం దాల్చినప్పటి నుంచి పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆమెకు నెలలు నిండడంతో ఆస్పత్రిలో చేర్పించగా సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ నేతృత్వాన వైద్యులు సరళ, అనూష, హెడ్ నర్సు రేవతి బుధవారం ఉదయం 10.03 గంటలకు ఆపరేషన్ ద్వారా కాన్పు చేశారు. కలెక్టర్ దంపతులకు ఇప్పటికే కుమారుడు ఉండగా, రెండో కాన్పులోనూ పండంటి మగ బిడ్డ జన్మించాడు. ఈ సందర్భంగా ఆస్పత్రికి చేరుకున్న కలెక్టర్ తన కుమారుడిని ఎత్తుకుని మురిసిపోవడమే కాక వైద్యులు, సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వసతులు, నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభినందనలు తెలిపిన మంత్రులు

కలెక్టర్ జితేష్ పాటిల్ తన భార్యకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ట్విట్టర్‌లో ఆయనను ప్రశంసించారు. ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తమ కుటుంబీకులకు ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స చేయించడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు.

8.30 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- ఏపీ నుంచి ఢిల్లీకి రూ.4.15 కోట్ల విలువైన సరుకు తరలిస్తున్న ముఠా
- ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

జూలూరుపాడు: ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం మండలం తులసిపాక గ్రామం నుంచి ఢిల్లీకి తరలిస్తున్న రూ.4.15 కోట్ల విలువైన 8.30 క్వింటాళ్ల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జూలూరుపాడు స్టేషన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా మండలంలోని పడమట నర్సాపురంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఐచర్ కంటైనర్ వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. వాహనం క్యాబిన్ వెనక భాగంలో ప్రత్యేకంగా అర తయారు చేసి గంజాయి ప్యాకెట్లను భద్రపరిచారు. తనిఖీ చేసిన పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అమ్మిన ఐదుగురు, కొనుగోలు చేసిన ఇద్దరు, రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. రెండు సెల్‌ఫోన్లు కూడా సీజ్ చేశామన్నారు. పట్టుబడిన వారిలో మధ్యప్రదేశ్‌లోని బెండు జిల్లా హతర్‌కరి గ్రామానికి చెందిన జస్రామ్, అదే జిల్లా బర్రై గ్రామానికి చెందిన రామ్‌కుమార్ ఉన్నారు. వారిని విచారించగా మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ రామ్ సేవక్ శర్మ, ఢిల్లీకి చెందిన దీపక్ చౌదరి కొనుగోలు చేశారని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కిలో శంకర్, కిలో సాయిబాబు, వంతల బాబూరావు, రామారావు, రాములు విక్రయించినట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిని రిమాండ్ కోసం కోర్టుకు తరలించామని ఎస్పీ తెలిపారు. కాగా, గంజాయిని పట్టుకున్న సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై బదావత్ రవి, సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సై ప్రవీణ్ తదితరులను ఎస్పీ అభినందించారు.

కాటుక రంగులోకి కడలి!

ఏ మహాసముద్రాన్ని చూసినా ఇదే నలుపు వర్ణం

- ప్రపంచవ్యాప్తంగా అన్ని చోట్ల సాగరజలాలు నల్లగా మారుతున్న వైనం
- పారిశ్రామిక, వ్యవసాయ వ్యర్థాలే అసలు కారణమంటున్న అధ్యయనాలు
- పేరుకుపోతున్న నాచు, శైవలాలు
- సముద్ర జీవావరణంపై పెను ప్రభావం
- మత్స్యసంపదకు విఘాతంగా మారే ముప్పు



ఆ చల్లని సముద్రగర్భం.. అంటూ సాగే దాశరథి పాట వినే ఉంటారు. ఇప్పుడు ఆ నల్లని సముద్రం అని కూడా పాడుకోవాలేమో. ప్రపంచ వ్యాప్తంగా భూమినంతటినీ చుట్టేసిన సాగరజలం నెమ్మదిగా నీలి రంగు నుంచి నలుపు వర్ణంలోకి మారిపోతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ధరణిపై దాదాపు 71 శాతం ఉపరితలాన్ని సముద్ర జలాలే కప్పేస్తున్నాయి. అంటే భూమిపై దాదాపు 36.1 కోట్ల చదరపు కిలోమీటర్ల మేర సముద్రనీరే ఉంది. ఇందులో 21 శాతం అంటే 7 కోట్ల చదరపు కిలోమీటర్ల సముద్రజలాలు గతంలో ఎన్నడూలేనంతగా కొత్తగా నల్లగా మారిపోయాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ మార్పు కేవలం గత 20 సంవత్సరాల్లో జరిగిందని గణాంకాలు స్పష్టంచేశాయి. సంబంధిత వివరాలు గ్లోబల్ చేంజ్ బయోలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సముద్రజలాలు నలుపు రంగులోకి మారడంతో సూర్యరశ్మి సాగర జలాల్లోకి సులభంగా చొచ్చుకెళ్లడం సాధ్యపడట్లేదు. దీంతో సముద్ర ఉపరితల జలాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. కాంతిమయ పరిస్థితులే 90 శాతం సముద్రజీవుల మనుగడకు ప్రాణాధారం. సూర్యరశ్మి సముద్రఉపరితల జలాలపై కొంతమేరకే పరిమితమైతే ఎన్నో రకాల సముద్రజీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన ఇంగ్లండ్‌లోని ప్లైమౌత్ విశ్వవిద్యాలయం, ప్లైమౌత్ మెరైన్ లేబొరేటరీలోని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 2003 ఏడాది నుంచి 2022 ఏడాది దాకా అంతర్జాతీయంగా పలు ఉపగ్రహాల నుంచి సేకరించిన డేటాను సంఖ్యాశాస్త్ర నమూనాలతో సరిపోల్చి ఈ విపరిణామాన్ని కనుగొన్నారు. వేడినిచ్చే సూర్యకాంతితోపాటు చల్లని వెలుతురునిచ్చే చంద్రకాంతి సైతం పరోక్షంగా సముద్రజీవుల జీవవైవిధ్యాన్ని కాపాడుతుంది. లోతైన సముద్రజలాలతోపాటు తీరం వెంట జీవుల ఉనికికీ ఈ రెండు కాంతులూ ముఖ్యమే.

భారీగా తగ్గిన కాంతి లోతు

అలజడులు లేని, ప్రశాంతంగా ఉన్న సముద్రజలాల్లో తేటగా ఉన్న సందర్భాల్లో సూర్యకాంతి చాలాలోతుదాకా వెళ్లగలదు. కానీ గత 20 ఏళ్లలో గమనిస్తే ఆఫ్రికా ఖండం అంత పరిమాణంలో అంటే 9 శాతం సముద్రజలాల్లో సూర్యకాంతి చొచ్చుకెళ్లే ప్రాంతాలు బాగా తగ్గిపోయాయి. ఇక్కడ గతంతో పోలిస్తే సూర్యకాంతి 50 మీటర్లు తక్కువలోతుకే వెళ్లగల్గుతోంది. మరో 2.6 శాతం సముద్రజలాల్లో సూర్యకాంతి వెళ్లగలిగే లోతు ఏకంగా 100 మీటర్లు తగ్గిపోయింది. అయితే ఒక 10 శాతం సముద్రజలాల్లో మాత్రం గతంలో కంటే ఎక్కువ లోతులకు సూర్యకాంతి చొరబడగల్గుతోంది. సూర్యకాంతిలోనే మనగలిగే సముద్రజీవులు చాలా ఉంటాయి. ఎన్నో రకాల జలచరాల ఉనికి, పునరుత్పత్తి, ఆహారానికి ప్రత్యక్షంగా సూర్యకాంతి అత్యావశ్యకం. ''కొన్ని చోట్ల సూర్యకాంతి లభ్యత తగ్గిపోవడంతో వేరే చోట్లకు జీవులు వలసపోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇది ఆయా జీవావరణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది''అని ప్లైమౌత్ విశ్వవిద్యాలయంలోని సముద్ర సంరక్షణ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ థామస్ డెవిస్ చెప్పారు.

నల్లగా ఎందుకు మారుతోంది?

పర్యావరణానికి సంబంధించి ఎన్ని దేశాల్లో ఎన్నెన్నో కఠిన చట్టాలున్నా అవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ఆయా సంస్థలు గుట్టుచప్పుడుకాకుండా నేరుగా నదుల్లో పారబోస్తున్నాయి. గరళంగా మారిన నదీజలాలు నేరుగా సముద్రాల్లో కలుస్తున్నాయి. వీటికి వ్యవసాయ వ్యర్థాలూ తోడవుతున్నాయి. వీటితో పోషణ సంబంధ మూలకాలు సముద్రంలోకి పోటెత్తుతున్నాయి. ఈ పోషకాలను సంగ్రహించిన నాచు వంటి అతిసూక్ష్మ మొక్కలు సముద్ర ఉపరితల జలాలపై ఏపుగా పెరుగుతున్నాయి. గనుల తవ్వకం తర్వాత మిగిలిపోయిన వ్యర్థాలను వర్షపు నీరు నదుల ద్వారా సముద్రాల్లోకి కొట్టుకొచ్చేలా చేస్తోంది. ఇవికాక సూర్యకిరణాలను అడ్డుకునే జీవజాలం సముద్రఉపరితలంపై మరింతగా పేరుకుపోతోంది. ఇవన్నీ కలగలిసి సాగరాలను కాంతిహీనం చేస్తున్నాయి. అలా అవి నల్లరంగులోకి మారిపోతున్నాయి. శైవాల పెరుగుదల, భూతాపోన్నతి కారణంగా అధికమవుతున్న సముద్రజలాల ఉపరితల ఉష్ణోగ్రత సైతం తమ వంతుగా ఈ దుష్ప్రభావానికి ఆజ్యం పోస్తున్నాయి.

మత్స్య పరిశ్రమకూ పెనుముప్పు

లోతైన సముద్రాల వద్ద సూర్యకాంతి తగ్గిపోయి ఆహార లభ్యత కృశించిపోవడంతో దిక్కులేక పలు రకాల జలచరాలు తీరాలకు చేరి అక్కడి జీవులతో కలిసి ఆహారం కోసం పోటీపడుతున్నాయి. దీంతో ఆయా జీవుల ఆహార వనరుల కొరత ఏర్పడుతుంది. సముద్రచేపలు, రొయ్యలు, ఇతర జలచరాల లభ్యత తగ్గిపోయే వీలుంది. దీని ప్రభావం భవిష్యత్తులో అన్ని సముద్రతీర దేశాల మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది. ''లోతైన సముద్ర ప్రాంతాల్లో సూర్యకాంతి చొచ్చుకుపోయే సామర్థ్యం మరో 50 మీటర్లు తగ్గిపోతే అక్కడి జీవులు తమ ఆవాసాలను సముద్రతీరాలకు మార్చుకుంటాయి. అప్పుడు యావత్ సాగర జీవావరణ వ్యవస్థలో శాశ్వత మార్పులు సంభవించే ప్రమాదం దాపురిస్తుంది''అని ప్లైమౌత్ మెరైన్ లేబొరేటరీలో ప్రొఫెసర్ టిమ్ స్మిత్ విశ్లేషించారు. ''సముద్రాల్లో సూర్యకిరణాలు లోపలికి వెళ్లలేకపోతే మనకొచ్చే నష్టమేమీ లేదని నింపాదిగా కూర్చునే కాలం కాదిది. ప్రభుత్వాలు తక్షణం మేల్కొనాలి. సముద్రాల్లోకి చేరే నదీ జలాలు వీలైనంత వరకు పారిశ్రామిక వ్యర్థాలకు ఆవాసంగా మారకుండా చూసుకోవాలి. మురుగునీటి శుద్ధి కర్మాగారాల వ్యవస్థను మరింత పటిష్టంగా అమలుచేయాలి. వ్యర్థాల పారబోతపై పరిశ్రమలపై భారీ జరిమానాలు విధించాలి''అని ఆయన అభిప్రాయపడ్డారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రైతన్నలకు 'మద్దతు'

ఖరీఫ్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు

- వరిధాన్యం క్వింటాల్‌పై రూ. 69
- జొన్నలపై రూ. 328, కందులపై రూ. 450, పత్తిపై రూ. 589
- ఎంఎస్పీ కోసం రూ. 2.70 లక్షల కోట్ల కేటాయింపులు
- కేంద్ర కేబినెట్ కమిటీ కీలక నిర్ణయం
- కేంద్ర వ్యవసాయ శాఖ సిఫార్సులకు ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: రైతన్నలకు శుభవార్త. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ చేసిన సిఫార్సులకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. గత సంవత్సరం కంటే వరిధాన్యంపై ఎంఎస్పీని క్వింటాల్‌కు 3 శాతం, తృణధాన్యాలపై 5.9 శాతం, నూనె గింజలపై 9 శాతం పెంచారు. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడం, ఇప్పటికే వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ఖరీఫ్‌లో పంటల ఉత్పత్తిని భారీగా పెంచే దిశగా అన్నదాతలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కనీస మద్దతు ధరను కేంద్రం పెంచినట్లు తెలుస్తోంది. దేశీయంగా ఉత్పత్తిని పెంచాలని, విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే లక్ష్యంగా నిర్దేశించుకుంది. కేబినెట్ కమిటీ సమావేశం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచడంతోపాటు రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సుల మేరకు గత 11 ఏళ్లలో పంటలకు ఎంఎస్పీని భారీగా పెంచినట్లు గుర్తుచేశారు. ఈ ఖరీఫ్‌లో వరిధాన్యం(గ్రేడ్‌-ఏ) మద్దతు ధరను రూ.69 పెంచినట్లు చెప్పారు. ఈ పెంపుతో క్వింటాల్ వరిధాన్యం ధర రూ.2,389కు చేరినట్లు వెల్లడించారు. ఎంఎస్పీ కోసం కేంద్ర ప్రభుత్వం ఈసారి రూ.2.70 లక్షల కోట్లు కేటాయించినట్లు స్పష్టంచేశారు. పంటల సగటు ఉత్పత్తి వ్యయంపై ఒకటిన్నర రెట్లు మద్దతు ధర నిర్ణయించినట్లు అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

ఖరీఫ్‌లో పెరిగిన కనీస మద్దతు ధర (క్వింటాకు రూ.లలో)

పంట	పెరిగిన ధర	ఎంఎస్పీ
వరి(సాధారణ)	69	2,369
వరి(గ్రేడ్‌-ఏ)	69	2,389
మినుములు	400	7,400
కందులు	450	8,000
పెసలు	86	8,768
జొన్న(హైబ్రిడ్)	328	3,699
జొన్న(మల్దాని)	328	3,749
మొక్కజొన్న	175	2,400
సజ్జలు	150	2,775
రాగులు	596	4,886
నువ్వులు	579	9,846
వేరుశనగ	480	7,263
సోయాబీన్	436	5,329
పొద్దుతిరుగుడు	441	7,721
పత్తి(మధ్యస్థ పింజ)	589	7,710
పత్తి(పొడుగు పింజ)	589	8,110
నైజర్ సీడ్(ఒలిసెలు)	820	9,537

రైతులకు రుణ పథకం పొడిగింపు

న్యూఢిల్లీ: కిసాన్ క్రెడిట్ కార్డుల(కేసీసీ) ద్వారా తక్కువ కాలవ్యవధికి రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేసేందుకు ఉద్దేశించిన మాడిఫైడ్ ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్(ఎంఐఎస్ఎస్)ను 2025–26లోనూ కొనసాగించాలని కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయించింది. ఈ పథకం కింద 7 శాతం వడ్డీకే రుణాలు అందజేస్తారు. ఇందులో 1.5 శాతం వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది. సకాలంలో రుణాలు తిరిగి చెల్లిస్తే వడ్డీపై 3 శాతం వరకు రాయితీ లభిస్తుంది. అంటే రైతులకు దాదాపు 4 శాతం వడ్డీకే రుణం లభిస్తుందని చెప్పొచ్చు. ఈ పథకం కొనసాగింపు వల్ల ఖజానాపై రూ.15,640 కోట్ల భారం పడుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంఐఎస్ఎస్ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పథకం. కేసీసీ ద్వారా రైతులు రూ.3 లక్షల దాకా రుణం పొందవచ్చు. పాడి పశువులు, చేపల పెంపకం కోసం ఈ సొమ్ము ఖర్చు చేయాల్సి ఉంటుంది. దేశంలో 7.75 కోట్లకుపైగా కేసీసీ ఖాతాలు ఉన్నాయి.

భారత్‌-పాక్ సరిహద్దుల్లో నేడు మాక్ డ్రిల్స్

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో తాజా పరిణామాలను దృష్టిలో పెట్టుకొని భారత్‌-పాకిస్తాన్ సరిహద్దులతోపాటు ఇతర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుజరాత్, రాజస్తాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, చండీగఢ్‌లో ఈ డ్రిల్స్ జరుగుతాయి. పంజాబ్‌లో వచ్చే నెల 3న మాక్ డ్రిల్స్ నిర్వహిస్తారు. కంట్రోల్ రూమ్‌లతోపాటు ఎయిర్ రైడ్ హెచ్చరికల వ్యవస్థ పనితీరును పరిశీలించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. అలాగే రక్షణ దళాల సన్నద్ధతను సైతం అంచనా వేస్తారు. వార్డెన్ సర్వీసులు, ఫైర్‌ఫైటింగ్, రెస్క్యూ ఆపరేషన్లు, డిపో మేనేజ్‌మెంట్ వంటివి పరీక్షిస్తారు. మాక్ డ్రిల్స్ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఆపరేషన్ అభ్యాస్ పేరిట ఈ నెల 7వ తేదీన దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

అన్నదాతల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం: మోదీ



న్యూఢిల్లీ: దేశంలో రైతాంగం సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతన్నల ఆదాయంతోపాటు పంటల ఉత్పత్తి పెరుగుతుందని వెల్లడించారు. నాలుగు లేన్ల బద్వేల్‌–నెల్లూరు కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపామని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణం వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు సంబంధించిన ప్రాజెక్టులను సైతం ఆమోదించినట్లు ప్రధాని మోదీ వివరించారు.

రాజ్యసభకు కమల్ హాసన్

ఎన్నికల ఒప్పందం మేరకు డీఎంకే నిర్ణయం



చెన్నై: ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ (70) రాజ్యసభలోకి అడుగు పెట్టనున్నారు. గత లోక్‌సభ ఎన్నికల వేళ కుదిరిన ఒప్పందం మేరకు ఒక రాజ్యసభ స్థానాన్ని ఎంఎన్ఎంకు కేటాయిస్తున్నట్టు అధికార డీఎంకే బుధవారం ప్రకటించింది. ఆ స్థానంలో కమల్ బరిలోకి దిగుతారని ఎంఎన్ఎం వెల్లడించింది. తమిళనాడులో ఆరు రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో కమల్ స్థానంతో సహా మరో మూడింటిని డీఎంకే, మిగతా రెండింటిని అన్నాడీఎంకే–బీజేపీ కూటమి గెలుచుకోనున్నాయి. కమల్‌కు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు కమల్ కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికన్లపై ఆంక్షలు పెట్టే వాళ్లకు వీసాలివ్వబోం

విదేశీయులపై నిషేధ నిబంధనలను విధించిన ట్రంప్‌ప్రభుత్వం

న్యూయార్క్: విదేశాల్లోని అమెరికన్లపై ఆంక్షలు విధిస్తున్న ఆయా దేశాల ఉన్నతాధికారులు, వ్యక్తులకు వీసాలు ఇవ్వబోమని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ప్రకటన విడుదలచేశారు. '' విదేశాల్లో ఉంటున్న మా అమెరికన్ పౌరుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను నొక్కేస్తున్న ఆయా దేశాల ఉన్నతాధికారులను ఇకపై అమెరికా గడ్డపై కాలుమోపనివ్వం. వాళ్లకు వీసాలను ఇవ్వబోం. అమెరికన్లపై జరిమానాలు విధిస్తూ, వేధింపులకు గురిచేస్తూ, నేరాభియోగాలు మోపే, అరెస్ట్ వారెంట్లతో బెదిరించే ఉన్నతాధికారులు, వ్యక్తులకు ఇకపై వీసా జారీపై నిషేధం విధిస్తున్నాం. అమెరికాకు చెందిన టెక్నాలజీ సంస్థల్లో సమాచారం, డేటాను తొలగించాలని, సవరణ చేయాలని కోరే సంస్థల ఉన్నతాధికారులకూ వీసాలను ఇవ్వబోం'' అని రూబియో స్పష్టంచేశారు.

చర్చించుకుందాం రండి

ట్రంప్, పుతిన్‌లకు జెలెన్‌స్కీ పిలుపు

కీవ్: యుద్ధానికి తెర దించేందుకు అవసరమైతే త్రైపాక్షిక చర్చలకైనా సిద్ధమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం ప్రకటించారు. అమెరికా, రష్యాలతో చర్చల్లో పాల్గొంటానని స్పష్టం చేశారు. అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ అందుకు ముందుకు రావాలని కోరారు. ట్రంప్ ఎంత చెబుతున్నా శాంతి చర్చలకు రష్యా ముందుకు రావడం లేదంటూ ఆయన మండిపడ్డారు. ఆ దేశంపై మరిన్ని కఠిన ఆంక్షలు విధించాలని అమెరికాకు సూచించారు.

1.5 అడుగుల ఎత్తులో గది నిండా నోట్లకట్టలే

న్యూఢిల్లీ: అడుగున్నర ఎత్తున. ఈ మూల నుంచి ఆ మూల దాకా. స్టోర్ రూమ్ నిండా నోట్ల కట్టలే. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నగదు వెలుగు చూసిన ఉదంతంపై సుప్రీంకోర్టు కమిటీ పేర్కొన్న అంశాలివి! గత మార్చి 14న ఢిల్లీలోని ఆయన అధికార నివాసంలో అగ్నిప్రమాదం సంభవించడం, పోలీసులకు, మంటలార్పుతున్న సిబ్బందికి స్టోర్ రూమ్‌లో భారీ సంఖ్యలో కాలిపోయిన నోట్లకట్టలు కనిపించడం తెలిసిందే. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో జస్టిస్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు సుప్రీంకోర్టు బదిలీ చేసింది. ఆయన్ను విధులకు దూరం పెట్టడమే గాక ఆరోపణలపై విచారణకు ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక న్యాయమూర్తితో నాటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కమిటీ నియమించారు. అనంతరం కమిటీ సమర్పించిన నివేదికను రాష్ట్రపతికి, ప్రధానికి పంపారు. జస్టిస్ వర్మ వివరణను కూడా జతచేశారు. కమిటీ నివేదికలోని అంశాలను ఇండియాటుడే వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవాలేనని కమిటీ నిర్ధారించింది. స్టోర్ రూములో భారీ సంఖ్యలో లెక్కచూపని నోట్ల కట్టలు బయటపడటం నిజమేనని పేర్కొంది. ''అదంతా లెక్కచూపని డబ్బే. అదెక్కడిదో చెప్పాల్సిన బాధ్యత పూర్తిగా జస్టిస్ వర్మదే. కానీ ఆ డబ్బుకు ఆధారాలు చూపడంలో ఆయన విఫలమయ్యారు. పైగా నోట్ల కట్టలతో తనకు ఏ సంబంధమూ లేదని, అదంతా ఎవరో కుట్రపూరితంగా చేసిన పని అని చెప్పుకొచ్చారు'' అని కమిటీ పేర్కొంది. ''జస్టిస్ వర్మపై అభియోగాలు నిజమే అనేందుకు సరిపడా ఆధారాలు లభించాయి. ఈ అభియోగాలు ఆయన్ను అభిశంసించాల్సినంత తీవ్రమైనవి'' అని స్పష్టం చేసింది. నివేదిక నేపథ్యంలో రాజీనామా చేయాల్సిందిగా కోరగా జస్టిస్ వర్మ నిరాకరించడం, దాంతో ఆయనను అభిశంసించాలంటూ కేంద్రానికి జస్టిస్ ఖన్నా సిఫార్సు చేయడం తెలిసిందే. అందు కోసం చట్టపరమైన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మొదలు పెట్టినట్టు తెలుస్తోంది.

జస్టిస్ వర్మపై ఆరోపణలు నిజమే

- నిర్ధారించిన సుప్రీంకోర్టు కమిటీ
- వాటికి లెక్క చూపలేకపోయారు
- సరైన వివరణ కూడా ఇవ్వలేదు
- సీజేఐకి సమర్పించిన నివేదికలో వెల్లడి
- పదవి నుంచి తొలగించాలని సిఫార్సు
- అభిశంసన ప్రక్రియకు కేంద్రం శ్రీకారం!



జస్టిస్ యశ్వంత్ వర్మ



ఆయన ఇంట్లో సగం కాలిన నోట్ల కట్టలు (ఫైల్)

నివేదిక ఏం చెప్పిందంటే...

''అగ్నిప్రమాదం జరిగిన రాత్రి జస్టిస్ వర్మ నివాసంలో ఆయన కూతురితో పాటు మొత్తం 17 మంది ఉన్నారు. డబ్బు దొరికిన స్టోర్ రూమ్ పూర్తిగా జస్టిస్ వర్మ, ఆయన కుటుంబం నియంత్రణలోనే ఉంది. ప్రమాద సమయంలో దానికి లాక్ చేసి ఉంది. జస్టిస్ వర్మ, ఆయన కుటుంబానికి తప్ప ఇంకెవరూ దాన్ని తెరిచే అవకాశమే లేదు. పైగా ఆయన ఆరోపిస్తున్నట్టుగా ఎవరో బయటినుంచి స్టోర్ రూమ్‌లోకి ప్రవేశించే అవకాశం కూడా లేదు. నోట్ల కట్టలు స్టోర్ రూమ్ నిండా చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అవి గది పొడవునా కనీసం అడుగున్నర ఎత్తున పరుచుకుని ఉన్నట్టు తుగ్లక్ నగర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. గదిలోని షెల్ఫ్ మీద సగం కాలిపోయిన నోట్లు కూడా అడుగున్నర ఎత్తున ఉన్నాయని చెప్పారు. గదిలో స్విచ్‌బోర్డు సమీపంలో ఉన్న మద్యం సీసాలకు మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత బాగా పెరిగింది. కాలిపోయిన నోట్ల కట్టలను వెంటనే గది నుంచి తొలగించేందుకు సిబ్బంది ప్రయత్నించారు. అగ్నిప్రమాదం గురించి జస్టిస్ వర్మకు ఆయన పీఏ రాజేందర్‌సింగ్ కర్కీ తొలుత సమాచారమిచ్చారు. ఆ రాత్రంతా ఆయనకు కాల్స్ చేస్తూ, ఎప్పటికప్పుడూ సమాచారమిస్తూనే ఉన్నారు. ఇంత జరిగినా నేరం జరిగినట్టు రుజువుల్లేవనే, జస్టిస్ వర్మ అందుబాటులో లేరనే కారణంతో ఈ ఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అందుబాటులో ఉన్న ప్రత్యక్ష, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ఆధారంగా జస్టిస్ వర్మపై అభియోగాలు నిజమేనని కమిటీ నిర్ధారణకు వచ్చింది.''

ఇప్పుడేం జరుగుతుంది?

జస్టిస్ వర్మ అభిశంసనకు కేంద్రం సిద్ధమవుతోంది. ఆ మేరకు సీజేఐ ఖన్నా చేసిన సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇటీవలే రాజ్యసభ చైర్మన్‌కు, లోక్‌సభ స్పీకర్‌కు పంపినట్టు తెలుస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఉభయ సభల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఓ కమిటీ వేస్తారు. దాని నివేదికను ఉభయ సభల్లో ప్రవేశపెట్టి చర్చిస్తారు. అనంతరం ఓటింగ్ జరుగుతుంది. ఓటింగ్‌లో అభిశంసన తీర్మానం నెగ్గితే జస్టిస్ వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు.

మరోసారి పేలిపోయిన స్పేస్‌ఎక్స్ రాకెట్

టెక్సాస్: అత్యంత భారీ వ్యోమనౌకలను మోసుకెళ్లే సామర్థ్యంతో అభివృద్ధిచేసిన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన మెగా 'స్టార్‌షిప్'రాకెట్ మరోసారి విఫలమైంది. అమెరికాలో స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 6.36 గంటలకు టెక్సాస్ రాష్ట్ర దక్షిణకొన అయిన బోకాచికా గ్రామ శివారులోని స్పేస్‌ఎక్స్ ప్రయోగకేంద్రం 'స్టార్‌బేస్' నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించారు. 403 అడుగుల ఎత్తయిన ఈ రాకెట్ తొలుత నింగిలోకి సవ్యంగా దూసుకెళ్లినా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయింది. రాకెట్‌కు అమర్చిన బూస్టర్‌ను పునర్వినియోగానికి వీలుగా రూపొందించారు. ఇది క్షేమంగా గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో దిగాల్సి ఉండగా మార్గమధ్యలోనే పేలిపోయింది. కానీ రాకెట్ ముందుభాగం మాత్రం 60 నిమిషాల ప్రయాణకాలంలో 45 నిమిషాల వరకు సవ్యంగానే నింగిలోకి దూసుకెళ్లింది. అయితే తర్వాత రాకెట్‌లో అమర్చిన ఎనిమిది స్టార్‌లింగ్ నమూనా ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో విఫలమైంది. సంబంధిత తలుపు తెరుచుకోలేదు. తర్వాత రాకెట్‌తో భూమి మీద 'మిషన్ కంట్రోల్ సెంటర్'కు సంబంధాలు తెగిపోయాయి. దీంతో రాకెట్ నియంత్రణ కోల్పోయి గింగిరాలు తిరుగుతూ కిందకు దూసుకొచ్చింది. తర్వాత మార్గమధ్యంలోనే పేలిపోయి శకలాలు హిందూ మహాసముద్రంలో పడ్డాయి.

ట్రంప్‌పై మస్క్ అసమ్మతి గళం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయన సన్నిహిత మిత్రుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) చీఫ్, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రంప్ తాజాగా తీసుకొచ్చిన పన్నులు, వ్యయాల బిల్లును తీవ్రంగా తప్పుపట్టారు. ట్రిలియన్ డాలర్ల మేర పన్నులు చేయకుండా నిలిపివేయడం, రక్షణ రంగంపై వ్యయాన్ని భారీగా పెంచాలని ట్రంప్ నిర్ణయించడం సరైంది కాదని కుండబద్దలు కొట్టారు. మంగళవారం రాత్రి ఓ ఇంటర్వ్యూలో ఎలాన్ మస్క్ మాట్లాడారు. 'బిగ్, బ్యూటిఫుల్'అంటూ ట్రంప్ చెబుతున్న బిల్లు గొప్ప బిల్లుగా తాను భావించడం లేదన్నారు. అది చాలా పెద్దది లేదా అందమైనది అని తాను ఎంతమాత్రం అనుకోవడం లేదని తేల్చిచెప్పారు. గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు ఎలాన్ మస్క్ బహిరంగంగా మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా భారీగా ఆర్థిక సాయం సైతం అందజేశారు. ఇద్దరూ కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఎలాన్ మస్క్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ ఖర్చులను, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి ఉద్దేశించిన డోజ్ చీఫ్ పదవిని కట్టబెట్టారు. అలాంటి తన మిత్రుడు ట్రంప్‌పై ఎలాన్ మస్క్ అసమ్మతి గళం విప్పడం చర్చనీయాంశంగా మారింది. పన్నుల్లో కోతలకు, రక్షణ వ్యయం పెంపునకు తాను వ్యతిరేకం అని పరోక్షంగా ఎలాన్ మస్క్ స్పష్టంచేశారు.

ఇరాన్‌లో ముగ్గురు భారతీయుల కిడ్నాప్!



కిడ్నాపైన భారత యువకులు

న్యూఢిల్లీ: ఇండియా నుంచి ఇరాన్ వెళ్లిన ముగ్గురు భారతీయులు అదృశ్యమయ్యారు. వారు అపహరణకు గురైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీకి సమాచారం చేరవేశారు. ఆ ముగ్గురి ఆచూకీ కనిపెట్టాలని కోరారు. దీనిపై ఇండియన్ ఎంబసీ వెంటనే స్పందించింది. ముగ్గురు భారతీయులు జాడ తెలియకుండా పోయారని, వారు ఎక్కడున్నారో గుర్తించాలని, వారి భద్రతకోసం చర్యలు తీసుకోవాలని ఇరాన్ ప్రభుత్వానికి బుధవారం విజ్ఞప్తి చేసింది. అలాగే గాలింపు చర్యలపై బాధితుల కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తోంది. ఇరాన్‌లో అదృశ్యమైన పంజాబ్ యువకుడి తల్లి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీన తన కుమారుడిని దుండగులు కిడ్నాప్ చేశారని, అతడిని ప్రాణాలతో వదిలేయాలంటే డబ్బులు ఆవ్వాలని డిమాండ్ చేశారని చెప్పారు. ఇరాన్‌లో కనిపించకుండా పోయిన ముగ్గురు యువకులు పంజాబ్‌కు చెందినవారే. వర్క్ పర్మిట్‌పై ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరారు. ఆస్ట్రేలియాకు చేరుకోవాల్సి ఉండగా, ఏజెంట్లు వారిని ఇరాన్‌కు చేర్చినట్లు తెలుస్తోంది. అక్కడే వారు కిడ్నాప్ అయినట్లు సమాచారం. ట్రావెల్ ఏజెంట్లు తమవద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని, తన కుమారుడిని డంకీ రూట్‌లో ఇరాన్‌కు తీసుకెళ్లారని యువకుడి తల్లి హసన్‌ప్రీత్ చెప్పారు. కిడ్నాపర్లు ఫొటోలు, వీడియోలు పంపించారని, అందులో ముగ్గురు యువకుల చేతులను తాళ్లతో కట్టేసినట్లు కనిపిస్తోందని అన్నారు. అంతేకాకుండా వారి శరీరాలపై గాయాలు ఉన్నాయని తెలిపారు. కిడ్నాప్ అయిన తర్వాత కొన్నిరోజులపాటు యువకులతో వారి కుటుంబ సభ్యులు మాట్లాడారు. ఈ నెల 11 నుంచి ఫోన్‌కాల్స్ ఆగిపోయాయి.

హమాస్ నేత సిన్వార్ హతం

ప్రకటించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ



డెయిర్ అల్ బాలాహ్ (గాజా స్ట్రిప్): గాజాలో హమాస్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. హమాస్ సాయుధ సంస్థ సీనియర్ నాయకుడు మొహమ్మద్ సిన్వార్ ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమయ్యారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ బుధవారం పార్లమెంట్‌లో ఈ మేరకు ప్రకటించారు. హమాస్‌కు గతంలో అత్యంత కీలక నేతగా నిలిచిన యాహ్యా సిన్వార్ తమ్ముడే మొహమ్మద్. యాహ్యా గతేడాది ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించారు. 2023 అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ శివారు గ్రామాలపై హమాస్ మెరుపుదాడి ఘటన సూత్రధారుల్లో యాహ్యా ఒకరని ఇజ్రాయెల్ ఆరోపించడం తెల్సిందే. యాహ్యా అనంతరం ఆయన బాధ్యతలను మొహమ్మదే చూసుకుంటున్నారు. సిన్వార్ సొంతపట్టణమైన ఖాన్ యూనిస్‌పై మే 13న ఇజ్రాయెల్ భారీగా బాంబు దాడులు చేసింది. ''వాటి ధాటికి స్థానిక యూరోపియన్ ఆస్పత్రి భూగర్భంలోని హమాస్ కమాండ్ సెంటర్ నాశనమైంది. అందులో ఉన్న సిన్వార్ చనిపోయాడు'' అని సైన్యం చెబుతోంది. సిన్వార్ మరణాన్ని హమాస్ ధ్రువీకరించలేదు. అయితే మే 13 నాటి దాడిలో ఆరుగురు చనిపోయారని, 40 మంది గాయపడ్డారని గాజా ప్రభుత్వం అప్పుడే ప్రకటించింది.

సాక్షి హైదరాబాద్

గురువారం, 29, మే, 2025



ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.1.25 లక్షలు లంచం డిమాండ్ చేసిన ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. -8లో



క'రెంట్' ట్రెండ్.. అద్దెకు అడ్రెస్
నగరంలో 'అద్దె దుస్తుల' విపణి విస్తరిస్తోంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ నుంచి రీల్స్ దాకా అద్దె దుస్తుల వినియోగం పెరిగింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0/23.0
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

5వ తేదీలోగా యూనిఫాంలు, పుస్తకాలు అందివ్వాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలకు జూన్ 5వ తేదీలోగా యూనిఫాంలు, టెస్టు, నోట్, వర్క్ బుక్స్ సరఫరా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్ నుండి డీఈఓతో కలిసి డిప్యూటీ ఈవోలు, అధికారులు, మండలాల ఆర్పీఓలు, డీఐఓలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి పాఠశాలకు నిర్దేశించిన గడువులోగా పుస్తకాలను పంపిణీ చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మెటీరియల్ వివరాలు, ఆన్‌లైన్‌లో ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ ఐఓఎస్‌లు బాధ్యత తీసుకొని పీఆర్పీలు, ఎమ్ఐఎస్‌లతో ఎంట్రీలు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ లతో పాటు పాఠశాలకు ఇప్పటి వరకు ఎంత మెటీరియల్ వచ్చింది, ఎంత శాతం పంపిణీ చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా పంపిణీ చేస్తున్న వివరాలను పాఠశాల లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు పంపిణీ చేయని వారిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థినీ విద్యార్థులకు తప్పక పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఇండెంట్‌కు తగిన మెటీరియల్ రాకుంటే రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి వచ్చే విధంగా కృషి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. స్కూళ్లలో పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు.

ఐసీసీసీతో ఆర్టీఏ డేటా అనుసంధానం

కీలక నిర్ణయం తీసుకున్న ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ అధికారుల వద్ద అందుబాటులో ఉన్న వాహనాలు, వాహనచోదకుల డేటాబేస్‌ను ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో (ఐసీసీసీ) అనుసంధానం చేయనున్నారు. బుధవారం ఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, సంయుక్త రవాణా కమిషనర్లు శివలింగయ్య, చంద్రశేఖర్ గౌడ్ మధ్య జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ అనుసంధానాన్ని పూర్తి చేయడానికి ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే వాహనాలు రిజిస్టరై ఉన్న, వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్సుల్లో పొందుపరిచిన చిరునామాలతో పాటు ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లకు సంబంధించిన వివరాలూ ఐసీసీసీ వద్ద అందుబాటులోకి వస్తాయి. దీంతో ఉల్లంఘనలకు చలాన్లు విధించడంలో సాంకేతికతకు ఆస్కారం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఐసీసీసీ ఆధీనంలో ఉన్న కెమెరాల్లో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐటీఎంఎస్), ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిజేషన్, పబ్లిక్ అవేర్‌నెస్ సిస్టం (పీఏఎస్), వేరియబుల్ మెసేజ్ సైన్ బోర్డ్స్ (బీఎంబీఎస్) తదితరా అనుసంధానం పైనా చర్చించారు.

వరద ముప్పు ప్రాంతాలకు హైడ్రా కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో నగరవాసులకు ఎలాంటి ముంపు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు కూడా దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాలను కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం నాటి వర్షానికి నీట మునిగిన రామచంద్రాపురంతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. అక్కడ ఉన్న వరద కాలువలను పరిశీలించిన ఆయన నీరు నిలవడానికి కారణాలు తెలుసుకున్నారు. పూడుకుపోయిన కాలువల అభివృద్ధితో పాటు బైపాస్‌గా వరదకాలువ తవ్వకాలను పరిశీలించారు. ఆ రోడ్డుపై మరోసారి నీరు నిలబడకుండా ప్రతి చుక్కా వరద కాలువల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్కడ ముంపునకు కారణాలను జీహెచ్ఎంసీ, నేషనల్ హైవేస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చందానగర్-లింగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న సురభి కాలనీ ఆర్‌యూబీ వద్ద నీరు నిలిచే ప్రాంతాన్నీ రంగనాథ్ పరిశీలించారు. గోపి చెరువు, చాకలి చెరువుల నుంచి వచ్చే వరదతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటి వల్ల ఈ పరిస్థితి వస్తోందని జీహెచ్ఎంసీ అధికారులు హైడ్రా కమిషనర్‌కు వివరించారు. అక్కడ ఉన్న బాక్స్ డ్రైన్‌ను విస్తరించడంతో కొంత వరకు సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని రంగనాథ్‌కు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న డ్రైన్లలో చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

'హై సిటీ' దిశగా మరో అడుగు

మూడు పనులకు టెండర్లు పిలిచిన జీహెచ్ఎంసీ

- రెండు ఫ్లైఓవర్లు.. ఒక అండర్‌పాస్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- అంచనా వ్యయం రూ.368 కోట్లు





సాక్షి, సిటీబ్యూరో:

హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద ఇప్పటికే దాదాపు రూ.1740 కోట్ల మేర ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, రహదారుల అభివృద్ధి పనుల కోసం టెండర్లు పిలిచిన జీహెచ్ఎంసీ..తాజాగా రెండు ఫ్లై ఓవర్లు, ఒక అండర్‌పాస్ పనుల కోసం టెండర్లు పిలిచింది. ఒకే ప్యాకేజీగా ఈ మూడు పనులకు టెండర్లు ఆహ్వానించింది. అంచనా వ్యయం రూ.368 కోట్లు. జూన్ 18న టెండర్ల దాఖలుకు చివరి తేదీగా ప్రకటించారు. దీంతో హైసిటీ పనుల్లో మరో అడుగుపడినట్టయింది.

- బంజారాహిల్స్ ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద జీవీకే వైపు రెండు లేన్లతో ఫ్లై ఓవర్, టీవీ 9 జంక్షన్ వద్ద రెండు లేన్ల అండర్‌పాస్, మూడు లేన్లతో ఫ్లై ఓవర్ పనులకు ఈ టెండర్లు ఆహ్వానించింది. ఎంపికయ్యే ఏజెన్సీయే సర్వే, డిజైన్‌తో సహ మొత్తం పనులు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే చేయాల్సి ఉంటుంది.
- ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్‌వద్ద నిర్మించే ఫ్లై ఓవర్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 వైపు నుంచి జీవీకే మాల్‌వైపు వెళ్తుంది. 8.5 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ ఫ్లై ఓవర్ క్యారేజ్‌వే 7.5 మీటర్లు ఉండేలా నిర్మించాల్సిందిగా టెండరు నోటిఫికేషన్‌లో పేర్కొంది.
- టీవీ9 జంక్షన్ వద్ద రెండు లేన్లతో ఒక అండర్ పాస్ నిర్మిస్తారు. ఇది ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి శ్రీనగర్ కాలనీవైపు వెళ్లే వారికి ఉపకరిస్తుంది. పది మీటర్ల వెడల్పుతో నిర్మించే దీంట్లో క్యారేజ్‌వే 7.5 మీటర్లుగా ఉండనుంది. ఫుట్‌పాత్‌లతో పాటు రెండు లక్షల నీటి సామర్థ్యంతో భూగర్భ సంప్ కూడా ఉంటుంది. టీవీ9 జంక్షన్ వద్దే బంజారాహిల్స్ ముగ్ధ జంక్షన్‌నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వైపు మూడులేన్లతో మరో ఫ్లై ఓవర్‌ను కూడా నిర్మిస్తారు. ఈ ఫ్లైఓవర్ వెడల్పు 12 మీటర్లు కాగా, క్యారేజ్‌వే 11 మీటర్లు. ఈ ప్యాకేజీలోని మూడు పనుల్లోనూ ప్రయాణ మార్గం ఒకేవైపు ఉంటుంది.

రీ టెండర్..
విరించి హాస్పిటల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే పిలిచిన టెండర్లకు స్పందన లేకపోవడంతో జీహెచ్ఎంసీ తాజాగా రెండో సారి టెండర్లు పిలిచింది. ఈ పని అంచనా వ్యయం రూ. 150 కోట్లు. జూన్ 11 ఈ టెండర్ల దాఖలుకు చివరితేదీగా పేర్కొన్నారు.

రూ. 5,942 కోట్ల పనులకు అనుమతులు..
రాష్ట్ర ప్రభుత్వం హై సిటీ కింద వివిధ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రహదారుల అభివృద్ధి, తదితర పనుల కోసం రూ. 5,942 కోట్ల పనులకు గత డిసెంబర్‌లో పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఐదు ప్యాకేజీల్లో 32 పనుల్ని 23 ప్రాజెక్టుల కింద టెండర్లు పిలిచేందుకు జీహెచ్ఎంసీకి అనుమతినిచ్చింది. రద్దీ ఎక్కువ ఉండే ఈ ప్రాంతాల్లో పనులు త్వరితంగా పూర్తయ్యేందుకు స్టీల్ ఫ్లై ఓవర్లు నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

గతంలో టెండర్లు పిలిచినవి..
- ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద ఐఎస్‌బీ నుంచి డీఎల్ఎఫ్ రోడ్ వరకు మొదటి వరుస ఫ్లై ఓవర్.
- ఐఎస్‌బీ నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు రెండో వరుసలో మరో ఫ్లై ఓవర్.
- డీఎల్ఎఫ్ నుంచి బీహెచ్ఈఎల్ రోడ్ వైపు వెళ్లేందుకు రెండో వరుసలో ఫ్లై ఓవర్.
- గచ్చిబౌలి నుంచి బీహెచ్ఈఎల్ వరకు ఆరులేన్లతో అండర్‌పాస్.

ఖాజాగూడ జంక్షన్ వద్ద..
- నానక్‌రామ్‌గూడ - టోలిచౌకి రోడ్ వరకు ఫ్లై ఓవర్. టోలిచౌకి రోడ్- బయోడైవర్సిటీ వరకు అండర్‌పాస్.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్‌వద్ద ఒక అండర్ పాస్. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్ వరకు మొదటి వరుస ఫ్లై ఓవర్.
- యూసుఫ్‌గూడ రోడ్ నుంచి రోడ్‌నెంబర్ 45 వరకు రెండో వరుస ఫ్లై ఓవర్. కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్ జంక్షన్ వద్ద జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి క్యాన్సర్ హాస్పిటల్ రోడ్ వరకు అండర్‌పాస్.
- బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు ఫ్లై ఓవర్. ముగ్ధ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రెన్స్ రోడ్ నుంచి పంజగుట్ట రోడ్ వరకు అండర్‌పాస్.
- రోడ్ నెంబర్-45 జంక్షన్ వద్ద ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ వరకు అండర్‌పాస్. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ నుంచి రోడ్ నెంబర్ 45 వరకు ఫ్లై ఓవర్. ఫిల్మ్‌నగర్ జంక్షన్ వద్ద మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్‌నెంబర్ 45 జంక్షన్ వరకు అండర్‌పాస్.
- ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు ఫ్లై ఓవర్. మహారాజా అగ్రసేన్ జంక్షన్ వద్ద క్యాన్సర్ హాస్పిటల్ రోడ్ నుంచి ఫిల్మ్‌నగర్ రోడ్ వరకు అండర్‌పాస్. ఫిల్మ్‌నగర్ రోడ్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వరకు ఫ్లై ఓవర్. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద కేబీఆర్ ఎంట్రెన్స్ నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ రోడ్ వరకు అండర్‌పాస్. మహారాజా అగ్రసేన్ జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వరకు ఫ్లై ఓవర్.

మాన్సూన్ ప్లాన్ రెడీ

వరద సమస్యల నివారణకు జలమండలి సిద్ధం

- డీప్ మ్యాన్ హోల్స్‌పై సేఫ్టీగ్రిల్స్, రెడ్ కలర్
- 146 వాటర్ లాగింగ్ పాయింట్ల గుర్తింపు
- రంగంలోకి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్



జలమండలి పరిధిలో సీవరేజీ నెట్‌వర్క్ ఇలా..
కోర్‌సిటీలో పైప్‌లైన్ : 5,570 కిలో మీటర్లు
జీహెచ్ఎంసీ పరిధిలోపైప్‌లైన్ : 4,199 కిలో మీటర్లు
ట్రంక్ లైన్ : 612 కిలో మీటర్లు
మ్యాన్‌హోళ్లు (కోర్ సిటీ) : 2,70,679
మ్యాన్‌హోళ్లు (శివార్లలో) : 3,60,700
మొత్తం మీద డీప్ మ్యాన్‌హోల్స్ : 63,221
పారిశుధ్య సిబ్బంది : 1327
జెట్టింగ్, ఎయిర్‌టెక్ మిషన్లు : 212

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో వర్షాకాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక-2025 అమలుకు సిద్ధమైంది. చిన్నపాటి వర్షాలకు మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడం, మూత తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రమాదాలకు దారితీయడం, కార్మికులు సైతం మృత్యువాతపడటం లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు మాన్సూన్ పనులకు సిద్ధమైంది. కోర్ సిటీ, శివారు పరిధిలోని అన్ని డీప్ మ్యాన్ హోల్స్‌లను గుర్తించి సేఫ్టీ గ్రిల్స్ బిగింపు, ప్రమాదకర మ్యాన్ హోల్స్ వద్ద రెడ్ ఫ్లాగ్స్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది.

ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్
వర్షాకాలంలో సహాయ చర్యల కోసం ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధం చేశారు. విపత్కర సమయాల్లో ఈ బృందం సహాయక చర్యలు అందిస్తుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అక్కడికి చేరుకుని రక్షణ చర్యలు చేపడుతుంది. ఇది జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్ మెంట్ టీమ్‌తో కలిసి సమన్వయంగా పనిచేయనుంది. మరోవైపు మాన్సూన్ పనుల నేపథ్యంలో కార్మికుల భద్రతకు చర్యల చేపట్టారు. పని జరిగే ప్రదేశాల్లో సూచికలు ఏర్పాటు మొదలు..జియో ట్యాగింగ్ వరకు పనులు చేస్తారు. డివిజన్‌కు ఒక బృందాన్ని కేటాయించారు.

వరద నిలిచే చోట..
నగరం మొత్తం మీద 146 వాటర్ లాగింగ్ పాయింట్స్ గుర్తించారు. వాటర్ లాగింగ్ పాయింట్ దగ్గర సిబ్బంది ఒకరిని నియమించి..పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. సీజీఎం స్థాయిలో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి.. ఎప్పటికప్పుడు ఎంఎంపీ-డీఎస్ఆర్ కు సంబంధించి సమాచారం అందులో పంచుకునే విధంగా చర్యలు చేపట్టారు. మ్యాన్ హోల్స్ తదితర అంశాలతో క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు. వర్షాకాల నిర్వహణ ప్రణాళిక రూపొందించి మేనేజర్లకు బాధ్యతలు అప్పగించనున్నారు. స్థానికంగా రోజూవారిగా పర్యటించి రోజువారీ పరిస్థితులపై నివేదిక (డీఎస్ఆర్) తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించే విధంగా చర్యలు చేపట్టారు.

3,261 కిలో మీటర్ల పైప్‌లైన్ క్లీనింగ్
ఇప్పటికే జలమండలి సుమారు 180 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 3,261 కిలో మీటర్ల మేర పైసా ఖర్చు లేకుండా సీవరేజ్ పైపులైన్ మార్గంలో మ్యాన్‌హోల్ టూ మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ నిర్వహించింది. సుమారు 24,650ప్రాంతాల్లో దాదాపు 2.54 లక్షల మ్యాన్‌హోళ్ల ద్వారా పూడికతీత పనులు పూర్తి చేసింది. వాటినుంచి టన్నుల కొద్దీ పూడిక తీసింది. ఈ కార్యాచరణ అమలుకు 227 ఎయిర్‌టెక్ మిషన్లు, 144 సిల్ట్ కార్ట్ మిషన్లు వినియోగించింది. ప్రస్తుతం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తోంది.

ఇక కరెంటు స్తంభాలుండవ్!



ఓహెచ్ లైన్స్ రహిత నగరంగా గ్రేటర్

- భూగర్భ కేబుళ్ల ఏర్పాటుకు సన్నాహాలు
- బెంగళూరులో ఇటీవల అధ్యయనం..
- ఫీడర్ల వారీగా సర్వే షురూ
- తొలుత ప్రధాన రోడ్లు..ఆ తర్వాత బస్తీల్లోనూ..
- ఆగస్టు నుంచి అన్ని శాఖల సమన్వయంతో పనులు

జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్ ఇలా..	
33/11కేవీ సబ్‌స్టేషన్లు	498
33కేవీ యూజీ కేబుల్	1,280 కిలోమీటర్లు
33కేవీ ఓవర్‌హెడ్‌లైన్స్	3,725 కిలోమీటర్లు
11 కేవీ ఓవర్‌హెడ్‌లైన్స్	21,643 కిలోమీటర్లు
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,022
11కేవీ యూజీ కేబుల్	957
డిటీఆర్‌లు	1,50,992
ఇంటర్మీడియట్ స్తంభాలు	58,271

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: ఈదురు గాలులతో కూడిన వర్షానికి తరచూ విద్యుత్ వైర్లు తెగిపడుతుంటాయి. స్తంభాలు కూలుతుంటాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా దారిలో వచ్చిపోయే వాహనదారులు, పాదచారులు మృత్యువాతపడుతున్నారు. అంతేకాదు గంటల తరబడి సరఫరా నిలిచిపోవడంతో పాటు దెబ్బతిన్న లైన్ల పునరుద్ధరణకు సంస్థ ఏటా భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంట్లో కరెంట్ లేక వినియోగదారులు ప్రత్యక్షంగా ఇబ్బంది పడుతుంటే..పరోక్షంగా సంస్థ ఆర్థిక సంక్షోభానికి కారణమవుతోంది. తరచూ వెలుగు చూస్తున్న విద్యుత్ ప్రమాదాలను నియంత్రించి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా గ్రేటర్ వ్యాపంగా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లు (యూజీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధ్యయనం కోసం ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో పర్యటించింది. అక్కడి భూగర్భ కేబుళ్ల పని తీరును పరిశీలించింది. బెంగళూరు తరహాలో నగరాన్ని కూడా ఓవర్ హెడ్ (ఓహెచ్) లైన్స్ రహిత సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రైవేటు ఏజెన్సీలతో ఓ సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను కూడా తయారు చేయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇది అమలైతే..ఇక గ్రేటర్‌లో రహదారులకు ఇరు పక్కలా విద్యుత్ స్తంభాలు కన్పించవు.

తొలిదశలో ప్రధాన రోడ్ల వెంట..
గ్రేటర్‌లో ప్రస్తుతం 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు రోజు సగటు విద్యుత్ డిమాండ్ 85 మిలియన్ యూనిట్లకుపైగా నమోదైంది. అదే సాధారణ రోజుల్లో 60 ఎంయూలకు తగ్గడం లేదు. పాతబస్తీ సహా ప్రధాన కాలనీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలా వస్థకు చేరుకున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవనాలు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, గాలిపటాలను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్‌హెడ్ లైన్‌కు ఆనుకుని కరెంట్ షాక్‌తో మృతిచెందుతున్న ఘటనలూ తరచూ వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రమాదాలను నివారించి, సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చొచ్చని డిస్కం భావిస్తోంది. దీనిలో భాగంగానే సర్కిళ్ల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులను నియమించింది. తొలి దశలో ప్రధాన మార్గాల్లో ఉన్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ఓహెచ్ లైన్లు, డీటీఆర్‌లు, విద్యుత్ స్తంభాలను గుర్తిస్తున్నారు. మలి దశలో బస్తీలు/కాలనీల్లో లైన్లను గుర్తించి, అంచనాలు రూపొందించనున్నారు. అన్ని సవ్యంగా జరిగితే ఆగస్టు చివరిలో పనులు ప్రారంభించే అవకాశం లేకపోలేదు. భూగర్భ కేబుళ్ల ఏర్పాటు ద్వారా చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం బడ్జెట్ కేటాయించాల్సిన అవసరం కూడా లేదు. హరితహారంలో భాగంగా నాటిన చెట్లు కూడా ఏపుగా పెరిగి, ఆయా కాలనీల్లోని వాతావరణం మరింత ఆహ్లాదంగా మారనుంది.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో సర్వే చేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ అధికారుల బృందం

జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

- అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్, వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉబ్బస వ్యాధిగ్రస్తుల కోసం బత్తిని కుటుంబం నగరంలో ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తున్న చేప ప్రసాదం కార్యక్రమం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా పెద్ద ఎత్తున జనం వచ్చే అవకాశం ఉండడంతో వారికి సరిపడా తాగునీరు, వసతి, భోజనం, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కల్పించేలా జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ట్రాఫిక్, భద్రత వంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ చుట్టూ పది పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కి రావడం కోసం ఆర్టీసీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ, చర్లపల్లి నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. చేప ప్రసాదం పంపిణీ కోసం 1.5 లక్షల చేప పిల్లలను ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు మంత్రి వెల్లడించారు. చేప పిల్లల ఖర్చును నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ భరించాలని సూచించారు. సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బత్తిని అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్, చంద్రశేఖర్, శివశంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కాగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో బత్తిని కుటుంబ సభ్యులు జూన్ 8వ తేదీన చేప ప్రసాదానికి సర్వం సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహిళా అధికారిపై 'దానం' అనుచరుడి వీరంగం!

పోలీసులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..
- ఆక్రమణల తొలగింపు విషయంలో వివాదమే కారణం

సనత్‌నగర్: ఆక్రమణల తొలగింపు విషయంలో ఓ మహిళా అధికారి తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడు కల్పించుకుని..తీవ్రంగా దూషించిన సంఘటన బేగంపేట సర్కిల్‌లో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు.. బాధితురాలు పోలీసులకు, జీహెచ్ఎంసీ జెడ్సీకి, డీసీకి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇలా ఉన్నాయి..బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని వెల్కిన్ పార్క్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుష్మిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 17న వాటిని కూల్చివేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోగా వాటిపై కోర్టు ఆర్డర్స్ ఉన్నాయంటూ ముందు రోజు రాత్రి తెలియడంతో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (ఎంఎస్‌సీ) ఆదేశాల మేరకు కూల్చివేతల నిర్ణయాన్ని విరమించుకున్నారు. దీంతో కూల్చివేతలు చేపట్టకపోవడంపై ఆగ్రహించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అనుచరుడు సుదీప్ పటేల్ ఈ నెల 21న బేగంపేట డిప్యూటీ కమిషనర్ ఛాంబర్‌కు వచ్చాడు. అదే సమయంలో డీసీ తన ఛాంబర్‌కు సుష్మితను పిలిపించారు. కూల్చివేతల విరమణపై ఆమె వివరణతో కూడిన లెటర్ ఇచ్చే లోగానే సుదీప్ పటేల్ చెలరేగిపోయాడు. టౌన్‌ప్లానింగ్ డీసీపీతో పాటు ఎంఎస్‌సీపై నోటికొచ్చినట్లు మాట్లాడాడు. 'నువ్వు నాకేంది లెటర్ ఇచ్చేది..రెండు రోజులు ఆగు నీ పని చెబుతా' అంటూ అమర్యాదగా, అసభ్య పదజాలంతో దూషించాడు. పక్కనే ఉన్న డీసీ సైతం మిన్నకుండిపోయారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సుష్మిత తనను దూషించిన సుదీప్ పటేల్‌పై చర్యలు తీసుకునేలా పోలీసులకు లేఖ రాయాలంటూ డిప్యూటీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు ఆయన జరిగిన సంఘటనపై నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్‌కు లేఖ రాసి సుదీప్ పటేల్‌పై చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న సుష్మిత వెస్ట్‌మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనతో ఆమె తీవ్ర మనోవేదనకు గురై డిప్రెషన్‌లోకి వెళ్లిపోగా ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిసింది.

ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

- ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రూ. 1.25 లక్షలు డిమాండ్
- అడ్వాన్స్‌గా రూ. 25 వేలు
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన స్పెషల్ ఆర్ఐ భూపాల మహేష్
- కొంపల్లిలోని ఆయన నివాసంలోనూ ఏసీబీ సోదాలు



ఏసీబీకి పట్టుబడిన స్పెషల్ ఆర్ఐ మహేష్

కవాడిగూడ: ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.1.25 లక్షలు డిమాండ్ చేసి అడ్వాన్స్‌గా రూ. 25 వేలు లంచం తీసుకుంటున్న ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీటీ రేంజ్– 2 ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతాఫల్‌మండీ ప్రాంతానికి చెందిన రామకృష్ణ ఓ క్యాంటీన్‌లో పని చేసేవాడు. అతడి కుటుంబ సభ్యుల్లో ఒకరు మృతి చెందడంతో ఆమె పేరున తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించేందుకు బ్యాంక్ అధికారులు ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని సూచించారు. దీంతో అతను ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న స్పెషల్ ఆర్ఐ భూపాల మహేష్‌ను సంప్రదించాడు. ఇందుకు అతను రూ.1.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే తాను క్యాంటిన్‌లో పనిచేస్తున్నానని అంత ఇచ్చుకోలేనని చెప్పినా ఆర్ఐ వినిపించుకోకుండా రూ.1.10 లక్షలు ఇస్తేనే ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇస్తానని చెప్పాడు. దీంతో రామకృష్ణ నాలుగు రోజుల క్రితం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన సిటీ రేంజ్ 2 ఏసీపీ, డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మహేష్‌కు రామకృష్ణకు రూ.25 వేల నగదు ఇస్తుండగా రెడ్ హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహేష్‌పై అవినీతి ఆరోపణలు ఉండటంతో ఇటీవల అతను జారీ చేసిన సర్టిఫికెట్లపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా మరో బృందం కొంపల్లిలోని మహేష్ నివాసంలోనూ సోదాలు నిర్వహించింది. ఈ దాడిలో ఏసీబీ సిఐలు గౌస్ అజాద్, జగన్‌మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 3వ నెంబర్ ప్లాట్‌ఫామ్ ట్రాలీ పాత్ వే రైల్వే ట్రాక్ ప్రక్కన బుధవారం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 25 ఏళ్ల యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్యహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నలుపు గళ్ల చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

'రివర్స్ రూట్'లో గంజాయి స్మగ్లింగ్!

విశాఖ, ఒడిశా నుంచి సిటీకి అక్రమరవాణా

- ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు
- ఆయా మార్గాల్లో అనేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- దీన్ని పసిగట్టిన ఘరానా దొంగ లాంబా హుస్సేన్
- నాగ్‌పూర్ నుంచి కారులో తీసుకువచ్చి విక్రయం
- విచారణలో గుర్తించిన సిటీ సీసీఎస్ స్పెషల్ టీమ్



లాంబా హుస్సేన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆధీనంలోని స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ అధికారులు ఇటీవల అరెస్టు చేసిన ఘరానా నేరగాడు సయ్యద్ సయీద్ హుస్సేన్ అలియాస్ లాంబా హుస్సేన్ విచారణలో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. సొత్తు సంబంధం నేరాల నుంచి గంజాయి దందాలోకి దిగిన అతను ఈ స్మగ్లింగ్‌లో 'రివర్స్ రూట్' విధానం అవలంభిస్తున్నట్లు బయటపడింది. మరోపక్క లాంబ ఐదు కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నట్లు గుర్తించిన స్పెషల్ క్రైమ్ టీమ్ పోలీసులు ఆయా ఠాణాలకు సమాచారం ఇచ్చి పీటీ వారెంట్లు దాఖలు చేయిస్తున్నారు.

ఇప్పటి వరకు 300 కేసుల పైనే...

జహనుమకు చెందిన లాంబా హుస్సేన్ ఒకప్పుడు వరుస స్నాచింగ్స్‌తో నగరవాసులను హడలెత్తించాడు. వాటిలో కొన్ని దోపిడీలుగానూ నమోదు కాగా ఇతడిపై ఇప్పటి వరకు 300కు పైగా కేసులు ఉన్నాయి. 2014లో పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు కొన్ని కేసుల్లో శిక్షలు పూర్తి చేసుకుని 2017లో బయటకు వచ్చాడు. ఆపై తన పంథా మార్చిన లాంబా మరి కొందరితో కలిసి బందిపోటు దొంగతనాలు, దోపిడీలు ప్రారంభించాడు. బంగారు వ్యాపారుల లావాదేవీలపై సమాచారం తెలుసుకుని, కాపుకాసి రెక్కీలు నిర్వహించాడు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడిన వారు బైక్‌లపై తిరుగుతూ బంగారం దుకాణాల నుంచి పసిడి, వెండితో వెళ్తున్న వారిని గుర్తించేవారు. వారిని కొంత దూరం వెంబడించిన తర్వాత దృష్టి మళ్లించడం/కారం చల్లడం/కత్తితో దాడి చేయడం చేసి సొత్తు దోచుకుని ఉడాయించేవారు. ఇలా 2022 అక్టోబర్ 3న బషీర్‌బాగ్, నవంబర్ 22న జూబ్లీహిల్స్, నవంబర్ 24న హిమాయత్‌నగర్, డిసెంబర్ 5న మహంకాళి పరిధుల్లో ఈ ముఠా పంజా విసిరింది. మొత్తం 30 కేజీల వెండి, వజ్రాభరణాలు, బంగారం, నగలు దోచేశారు.

జైలు నుంచి వచ్చి స్టైల్ మార్చేసి...

ఆయా కేసుల్లో పోలీసులు 2022 డిసెంబర్‌లో అరెస్టు చేశారు. ఈ కేసులో జైలు నుంచి విడుదలైన తరవాత అబిడ్స్, జూబ్లీహిల్స్, మహంకాళి, నారాయణగూడ, మహంకాళి ఠాణాల పరిధిలో సొత్తు సంబంధ నేరాలు చేశాడు. చైన్ స్నాచింగ్, దోపిడీ, బందిపోటు దొంగతనాలు చేస్తే కేసులు, పోలీసుల వేట, అరెస్టు, పీడీ యాక్ట్ తప్పడం లేదని భావించిన లాంబా గంజాయి దందా మొదలెట్టాడు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువకులను ఎంపిక చేసుకున్నాడు. సాధారణంగా నగరానికి ఒడిశా , ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి స్మగ్లింగ్ అవుతుంది. సిటీ మీదుగానే మహారాష్ట్రకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలు ఉంటాయి. దీనిని గమనించిన లాంబా కొత్త ఎత్తు వేశాడు. నాగ్‌పూర్‌లో గంజాయి కొని, అక్కడి నుంచి కారులో సిటీకి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. నాగ్‌పూర్ టు హైదరాబాద్ రూట్‌లో గంజాయి కోసం తనిఖీలు ఉండకపోవడం ఇతడికి కలిసి వచ్చింది. సిటీకి వచ్చిన తర్వాత ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి నలుగురు అనుచరుల ద్వారా అమ్మించేవాడు.

ముమ్మరంగా గాలించి పట్టుకున్న టీమ్...

సుదీర్ఘ కాలంగా పరారీలో ఉన్న లాంబాతో పాటు అతడి అనుచరులను పట్టుకోవడానికి సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ రంగంలోకి దిగింది. దాదాపు ఆరు నెలలుగా అతడి కదలికలపై నిఘా ఉంచింది. ఇంటికి సైతం వెళ్లకుండా కారులోనే ఉంటూ పోలీసుల నిఘాను తప్పించుకుంటూ వచ్చాడు. లోతుగా ఆరా తీసిన సీసీఎస్ పోలీసులు దీనిని గుర్తించారు. తన కారులో నాగ్‌పూర్ నుంచి 21 కేజీల గంజాయి తీసుకువస్తుండగా గత మంగళవారం పట్టుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో నలుగురు అనుచరులనూ కటకటాల్లోకి పంపారు. లాంబా పై పీడీ యాక్ట్ ప్రయోగానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ సైఫాబాద్ ఠాణాలో పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇతడిని అబిడ్స్ పోలీసులకు అప్పగించగా... జూబ్లీహిల్స్, మహంకాళి, నారాయణగూడ, పోలీసులు పీటీ వారెంట్లు దాఖలు చేయనున్నారు. ఇతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయా? అనే అంశాన్నీ ఆరా తీస్తున్నారు.

సెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొ.నవీన్ బుధవారం తెలిపారు. 10 ఆపై విద్యార్హత గల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులతో పాటు ఇతరులు ప్రవేశానికి అర్హులు. ఆసక్తి గల వారు జూన్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 9 నుంచి తరగతులు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7989903001 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ శర్మ కన్నుమూత



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ దిగ్గజం ప్రొ.రామకృష్ణ కన్నుమూశారు. ఓయూలో ఎంకాం పూర్తి చేసి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకున్న మొదటి విద్యార్థిగా గుర్తింపు పొందారు. అధ్యాపకుడిగా బోధనతో పాటు పరిశోధనలు, పాలన పదవులు నిర్వహించారు. గురువారం ఆయన అంత్యక్రియలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎర్తింగ్ తప్పని సరి

ఇన్‌చార్జ్ సీఈఐజీ కాంతారావు

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఇంట్లోనూ ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టి.కాంతారావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తుండటం, కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరవాసులకు కరెంట్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టి.కాంతారావు విద్యుత్ వినియోగదారులకు పలు కీలక సూచనలు చేశారు.

- గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల్లో విధిగా రెండు ఎర్త్‌పిట్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ 3043 ప్రకారం కనీసం ఒక ఎర్త్ పిట్ అయినా ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్‌కు 30 మిల్లీ యామ్స్ ఆర్సీసీబీ/ఈఎల్‌సీబీలను ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా సర్క్యూట్‌లో ఏదైనా కరెంట్ లీకేజీ ఏర్పడినప్పుడు ఆర్సీసీబీ/ ఈఎల్‌సీబీలు ఆటోమెటిగ్గా ట్రిప్ అవుతోంది.
- అధిక వేడి, విద్యుత్ హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు సరైన కేబుల్ పరిమాణాలను ఎంచుకోవాలి. లైట్ పాయింట్ కోసం 1.5 ఎంఎం, అదే పవర్ పాయింట్లకు, సాకేట్‌కు 2.5 స్కైర్ ఎంఎం, ఏసీ కోసం 4 స్కైర్ ఎంఎం వైర్లను ఎంపిక చేసుకోవాలి. లోడ్‌ను బట్టి వైరు పరిణామాలను ఫాల్ట్ కరెంట్ ఓల్టేజ్ డ్రాప్‌ను ఎంచుకోవాలి.
- ప్రతి భవనం ఐఈసీ 62305 ప్రకారం లైటింగ్ కండక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేక ఎర్త్‌పీట్ ఉండేలా చూసుకోవాలి.
- విద్యుత్ సరఫరాకు ముందే విద్యుత్ కాంట్రాక్టర్ సంతకం చేసిన స్వీయ ధృవీకరణ పత్రాన్ని పొంది, విద్యుత్ సంస్థకు సమర్పించాలి.
- ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాలి.

కేరళ లాటరీ పేరుతో రూ.7.55 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగినికి కేరళ లాటరీ పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.7.55 లక్షలు స్వాహా చేశారు. దీనిపై బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదైంది. బాధితురాలికి (54) గత నెల 7న 'కేరళ లాటరీ' ప్రతినిధి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మధ్యాహ్నం 2 గంటలకు తమ లాటరీ ఫలితాలు ప్రకటిస్తున్నామని చెప్పాడు. దీంతో ఆమె ఓ టికెట్ ఖరీదు చేశారు. అదే రోజు సాయంత్రం రూ.5 లక్షల లాటరీ గెల్చుకున్నట్లు ఆమెకు సమాచారం ఇచ్చాడు. ఆ మొత్తం తీసుకోవాలంటే ముందుగా కొన్ని పన్నులు చెల్లించాలంటూ ఓ లింకు పంపాడు. బాధితురాలు దానిని క్లిక్ చేయగా... లాటరీ గెల్చినట్లు, వివిధ పన్నులు చెల్లించాలని ఉంది. బాధితురాలు చెల్లించిన మొత్తం నామ మాత్రమే నాన్ రిఫండబుల్ అని, మిగిలింది లాటరీ నగదుతో పాటు రిఫండ్ చేస్తామని నమ్మించారు. ఇలా ఆమె నుంచి రూ.7, 55,220 డిపాజిట్ చేయించుకుని మోసం చేశారు.

అప్పులు తీర్చేందుకు సూడో నక్సల్ అవతారమెత్తి..

- తన ఇంటి ఓనర్‌ను టార్గెట్ చేసి బెదిరింపులు
- నిందితుల అరెస్ట్
- రవీందర్ గౌడ్‌ను బెదిరించిన కేసులో వీడిన మిస్టరీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

జీడిమెట్ల: పారిశ్రామిక వేత్త కూన రవీందర్ గౌడ్‌ను బెదిరించి రూ. 50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో జీడిమెట్ల పోలీసులు ఇద్దరు సూడో నక్సలైట్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాడు. బుధవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి వివరాలు వెల్లడించారు. విజయవాడ, గన్నవరానికి చెందిన యర్రంశెట్టి రాజు అక్కడ చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చాడు. వ్యసనాలకు బానిసైన అతను అప్పులు చేసి జల్సా చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండటంతో ఎలాగైనా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో షాపూర్‌నగర్‌లో తాను నివాసం ఉంటున్న ఇంటి యజమాని కూన రవీందర్‌గౌడ్‌ను బెదిరించి డబ్బు లాగాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా గన్నవరానికి చెందిన తన స్నేహితుడు కందురెల్లి రాజు(24)ను నగరానికి రప్పించుకున్నాడు. ఈనెల 21న రాత్రి పథకం ప్రకారం కందురెల్లి రాజును కూన రవీందర్‌గౌడ్ ఇంటికి పంపించాడు. స్నేహితుడు చెప్పినట్లుగానే అతను మెయిన్ గేట్‌లోనుంచి ఇంట్లోకి ప్రవేశించాడు. మొదటి అంతస్తులోకి వెళ్లి కిందికి వచ్చాడు. అక్కడ ఉన్న తులసి మొక్కను పీకేశాడు. అనంతరం ఎర్రరంగు టవల్‌లో ఓ లేఖను ఉంచి కారుపై పెట్టి వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం రవీందర్‌గౌడ్ కారుపై ఉన్న లేఖను చదివిన రవీందర్ గౌడ్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సవాల్ తీసుకున్న పోలీసులు ఏసీపీ నరేష్‌రెడ్డి నేతృత్వంలో జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్సై ప్రేమ్‌సాగర్ రంగంలోకి దిగారు. దాదాపు 500 సీసీ కెమరాలను పరిశీలించి రవాందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న యర్రంశెట్టి రాజును నిందితుడిగా గుర్తించారు. దీంతో యర్రంశెట్టి రాజు, అతని స్నేహితుడు కందురెల్లి రాజులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి 13నాటు బాంబులు, 4 సెల్‌ఫోన్‌లు, ఒక బెదిరింపు ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసును చేదించిన ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్సై ప్రేమ్‌సాగర్, పీసీలు నరేష్, రవి నాయక్, వెంకటేష్‌లను ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. కాగా నాటు బాంబులు ఎలా వచ్చాయనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

మైత్రేయినగర్‌లో పార్కు స్థలానికి విముక్తి

ఘట్‌కేసర్‌లో రహదారులపై ఆక్రమణల తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెడుతున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం చందానగర్‌లోని మైత్రేయినగర్‌లో రూ.40 కోట్ల విలువైన ఎకరం పార్కును కబ్జాల చెర విడిపించిన అధికారులు ఘట్‌కేసర్ జయపురి కాలనీలో రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. మైత్రేయినగర్ పార్కు స్థలాన్ని ప్లాట్లుగా చేసి కబ్జాదారుడు విక్రయించడంతో దీనిపై వివాదం రేగి విషయం కోర్టుకు వెళ్లింది. న్యాయస్థానాలు సైతం ఆ స్థలం పార్కుదే అని నిర్ధారించినా... లిటిగేషన్లతో వివాదం పరిష్కారం కాకుండా కబ్జాదారుడు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై స్థానికులు ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అనుమతి పొందిన లే ఔట్‌ను అనుసరించి అక్కడ పార్కు ఉండడంతో హైడ్రా చర్యలు తీసుకుంది. స్థలంలో ఉన్న ముళ్ల పొదలతో పాటు ఎవరూ నివాసం లేని చిన్న షెడ్డులను తొలగించి పార్కును అందుబాటులోకి తీసుకువచ్చింది.

రహదారులపై ఆక్రమణల తొలగింపు

ఘట్‌కేసర్‌లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు ఆనుకుని సర్వే నంబర్లు 559, 563, 566ల్లో జయపురి కాలనీ పేరిట 1968లో లే-అవుట్ వేశారు. ఇందులో ఇరవై ఏళ్ల క్రితం కొందరు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆ భూమిని వ్యవసాయ భూమిగా చూపించిన కొందరు పాసు పుస్తకాలు తీసుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు ఆ పాస్ పుస్తకాలను రద్దు చేయించారు. అయినా కబ్జా దారులు ఆ భూమి తమదే అంటూ లే ఔట్‌లోని రహదారిని కబ్జా చేసి గోడలు నిర్మించారు. దీనిపై ప్లాట్ల యజమానులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు రహదారులకు అడ్డుగా నిర్మించిన ప్రహరీలను బుధవారం తొలగించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- నాణ్యమైన నీటి సరఫరాకు చర్యలు
- హాట్ స్పాట్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- బోర్డు ఆర్థిక పరిస్థితిపై ఆరా..
- అండగా ఉంటామని హామీ
- జలమండలి సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం..



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి,సిటీబ్యూరో: ముందస్తు వర్షాల నేపథ్యంలో నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన జలమండలి కార్యాలయంలో వర్షాకాల ప్రణాళిక 90 రోజుల కార్యాచరణ, పురోగతిలో ఉన్న పలు ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరా , మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలన్నారు. రహదారులపై సీవరేజ్ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జలమండలి, జీహెచ్‌ఎంసీ గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్లపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

ప్రతి ఇంటా ఇంకుడుగుంత..

మహానగరంలో భూగర్భజలాల పెంపు కోసం 300 గజాల పైన ఉన్న ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేయాలన్నారు. లేని పక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఇటీవల 90 రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వేసవిలో 40 వేల మంది వినియోగదారులు అధికంగా ట్యాంకర్లు బుక్ చేయడంతో ఆయా ప్రాంతంలో సర్వే చేసి ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామని జలమండలి అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని నోటీసులు జారీచేసి చేసినట్లు తెలిపారు.

జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరా...

జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరా తీసిన మంత్రి రెవెన్యూ పెంచుకోవడానికి, నీటి వృధా, లీకేజీలను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ నల్లా కనెక్షన్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం, వివిధ శాఖలనుంచి జలమండలికి రావాల్సిన బకాయిలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. బోర్డు తన కాళ్లమీద తాను నిలబడేలాగా చేయూత అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే స్కీమ్‌లను వినియోగించుకోవాలన్నారు.

జలమండలికి మంత్రి అభినందనలు

సీవరేజీ ఓవర్ ఫ్లో స్పెషల్ డ్రైవ్ విజయవంతంపై మంత్రి పొన్న ప్రభాకర్ ప్రశంసించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులను 30 శాతం తగ్గించడంపై ఎండీతో సహా అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న మురుగునీటి సమస్యలతో పాటు రోజువారీగా వచ్చే ఫిర్యాదులను సైతం తగ్గించడం, భూగర్భ జలాల పెరుగుదలకు ఇంకుడు గుంతలు నిర్మించడమే లక్ష్యంగా స్పెషల్‌డ్రైవ్‌లో ఉన్న వనరులనే వినియోగిస్తూ సత్ఫలితాలను సాధించామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వివరించారు. అమలు పర్యవేక్షణ కోసం ఆధునిక సాంకేతికతను ఉపయోగించామన్నారు. అంతకుముందు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జలమండలిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు.. పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ట్రాన్స్మిషన్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త టెండర్లతోనే వీధిదీపాల నిర్వహణ

స్టాండింగ్‌కమిటీ సభ్యుల నిర్ణయం



సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధిదీపాల నిర్వహణకు కొత్త కాంట్రాక్టు ఏజెన్సీలను టెండర్ల ద్వారా ఎంపిక చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత ఏప్రిల్ వరకు వీధిదీపాల నిర్వహణ ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు ఉండేది. దాని గడువు ముగిసి పోవడంతో కొత్త నిబంధనలతో, లోపాల్లేకుండా నిర్వహించేందుకు మళ్లీ అదే సంస్థకు బాధ్యతలు అప్పగించడమా లేక కొత్త ఏజెన్సీని పిలవడమా అనే అంశంపై చర్చించేందుకు గత వారం జరిగిన స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదించినా చర్చ జరగలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఈ అంశంపై చర్చించేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు, కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. గతంలోని ఈఈఎస్ఎల్ మాదిరిగా లోపాల్లేకుండా సవ్యంగా నిర్వహించేందుకు కొత్త టెండర్లే పిలవాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కొత్త ఏజెన్సీ ఎంపిక పూర్తయ్యేంతవరకు అవసరమైన వీధిదీపాల కొనుగోళ్లు, నిర్వహణ పనులను జోనల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారని మేయర్ తెలిపారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రాజేందర్‌కు డాక్టరేట్



సాక్షి,సిటీబ్యూరో: జేఎన్టీయూ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఎఫెక్ట్ ఆఫ్ అక్యూట్ మారథాన్ రన్నింగ్ ఆన్ ది అప్పర్ రెస్పిరేటరీ –ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ స్టేటస్ అండ్ లంగ్ ఫంక్షన్ స్టేటస్ అమాంగ్ ది రిక్రియేషనల్ రన్నర్స్ ' అనే పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ రాజశేఖర్, జేఎన్టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ యార్లగడ్డ గోపికష్ణ పర్యవేక్షణలో, ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ డాక్టర్ వాసంతి (సెంట్రల్ యూనివర్సిటీ పుదుచ్చేరి) సమక్షంలో గ్రంథాన్ని సమర్పించడంతో జేఎన్టీయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్ రావు రాజేందర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. రాజేందర్ మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం బాలుర ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా పనిచేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



అనసూయ (ఫైల్)

మోతీనగర్: భవన నిర్మాణ పని చేస్తున్న మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సఫ్దార్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో గుంపు అనసూయ (45) అనే మహిళ కూలీ పని చేస్తోంది. బధవారం ఆమె మెటీరియల్ లిఫ్ట్ వద్ద పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. తోటి కూలీలు ఆమెను ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బిల్డింగ్ యజమాని, బిల్డర్ నిర్లక్ష్యం కారణంగానే అనసూయ మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అహల్యాబాయికి నివాళి



ఫిలింనగర్: అహల్యాబాయి జయంతి వేడుకలను జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్రానగర్‌లో బుధవారం నిర్వహించారు. కొత్త నీరజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు హాజరై నివాళి అర్పించారు. అనంతరం స్థానిక రామాలయంలో హారతి, వేద పండితులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాణి అహల్యాబాయిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువతరం ముందుకు సాగాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిలారి మనోహర్, అనంతలక్ష్మి, భోజిరెడ్డి, శ్రీనివాస్, అనిల్‌కుమార్, దండుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత ఎదుగుదల



మిల్క్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: యువత స్వయం ఉపాధి మార్గాల ద్వారా ముందుకెళ్తే అభివృద్ధి చెందుతారని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. బోరబండ డివిజన్ సైట్–1 కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లన్న మిల్క్ పాయింట్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎంతోమంది యువకులు తమ నైపుణ్యంతో ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు.మిల్క్ యాజమాని అశోక్ యాదవ్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు కాసుల మహేష్ కుమార్ గౌడ్,బస్తీ వాసులు పాల్గొన్నారు.

సీడీఎస్ భవనానికి తుది మెరుగులు



రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్‌లోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ భవనంలో మిగిలి ఉన్న పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఇటీవల రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తొలిసారి సీడీఎస్ భవనాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే భవనంలో మిగిలి ఉన్న పనులు పూర్తి చేస్తున్నారు. ఫ్లోరింగ్, సీలింగ్, కప్‌బోర్డులు ఏర్పాటుతోపాటు రంగులు వేస్తున్నారు.గత 15 రోజులుగా పనులు నిరంతరంగా కొనసాగుతుండటంతో త్వరలోనే సీడీఎస్ భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

బిల్లు ఎక్కువ వేశారన్నందుకు

- లైట్లు ఆర్పి మహిళలపై దాడి
- జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో ఘటన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌లో తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని ప్రశ్నించినందుకు సిబ్బంది కస్టమర్లపై దాడికి పాల్పడ్డారు. పబ్‌లో లైట్లు ఆర్పి తన తల్లి, చెల్లిపై దాడి చేశారని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మీనల్ మీను ఆరోపిస్తోంది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ మీనల్ మీను మంగళవారం రాత్రి తన తల్లి, చెల్లితో కలిసి జూబ్లీహిల్స్‌లోని బేబీలాన్ పబ్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా తాము తాగని డ్రింక్స్‌కు కూడా బిల్లు వేసినట్లు గుర్తించిన ఆమె పబ్ సిబ్బందిని ప్రశ్నించింది. దీంతో వారితో వాగ్వాదానికి దిగిన పబ్ నిర్వాహకులు సిబ్బందితో కలిసి పబ్‌లో లైట్లు ఆపేసి ఆమె తల్లి, చెల్లిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిపై ఆమె సోషల్ మీడియా వేదికగా వివరించింది. తాము ఆర్డర్ చేయని డ్రింక్స్‌కు బిల్ వేశారని అడిగినందుకు కొట్టారని, వీడియో తీస్తుంటే బెదిరించి లైట్లు ఆర్పేసి దాడి చేశారని పేర్కొంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలువురు సిబ్బందిని విచారించారు. దాడికి పాల్పడింది బౌన్సర్లా..? సిబ్బందా అన్న దానిపై విచారణ కొనసాగుతోంది.

ధైర్యంగా ముందుకు రండి..

మేముంటాం అండగా!

- మహిళా సమాఖ్యలకు 'షీ' టీమ్స్ భరోసా
- చట్టాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ ప్రసన్న లక్ష్మి

బంజారాహిల్స్: మహిళలు, చిన్నారుల కోసం బీఎన్ఎస్‌లో ఓ బలమైన చట్టాలను ఏర్పాటు చేశారని వాటి పట్ల మహిళలకు అవగాహన ఉండాలని షీ టీమ్స్, భరోసా ఏసీపీ ప్రసన్న లక్ష్మి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నం. 12లోని సీఎంటీసీ భవన్‌లో జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని మహిళా సమాఖ్యలకు షీటీమ్స్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, భరోసా సెంటర్ అడ్మిన్ మేరీతో కలిసి మహిళలు, చిన్నారుల చట్టాలతో పాటు పోష్ యాక్ట్, పోక్సో యాక్ట్, వరకట్న వేధింపు చట్టం, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నో సార్లు ఏదైనా ఘటన జరిగినప్పుడు అది ఎవరికి చెప్పాల..., ఎలా చెప్పాలి, అసలు అది తప్పా కాదా అనే మహిళలకు అవగాహన ఉండటం లేదని వారు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, డీసీపీ ఉమెన్ సేఫ్టీ లావణ్య సూచనల మేరకు అన్ని నియోజకవర్గాల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో మహిళా సమాఖ్యలు, అనుబంధంగా పని చేసే రిసోర్స్ పర్సన్లకు ఈ చట్టాల పట్ల అవగాహన ఉండటంతో బాధితులకు న్యాయం చేసేందుకు సరైన మార్గంలో వెళ్తారని వారు సూచించారు. నగరవ్యాప్తంగా 13 మహిళా పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, షీ టీమ్స్ ఉన్నాయని ప్రత్యేకంగా భరోసా సెంటర్ కూడా ఉందని వారు తెలిపారు.

భరోసాతో కౌన్సెలింగ్ ...

ఏదేని క్రైం వల్ల బాధితులయ్యే మహిళలకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని అన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారికి ఒక్కోసారి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా భరోసా అండగా ఉంటుందని అన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు బయటికి వెళ్లినప్పుడు వారిని గమనిస్తూ ఉండాలని సూచించారు. పని చేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులు ఎదురైతే పోష్ యాక్ట్ ప్రకారం వారు శిక్షార్హులు అవుతారని ఈ చట్టం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయని అలాగని వాటిని దుర్వినియోగం చేయవద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో తిరిగే మహిళా సమాఖ్యల ప్రతినిధులు బాల్య వివాహాలు ఎక్కడ, ఎవరు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారికి సరైన విద్యతో పాటు కౌన్సెలింగ్ అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

చిన్నారులను వేధిస్తే...	1090
షీటీమ్	9490616555, 040–27852355

మహిళలందరికీ అవగాహన కలిస్తాం



చాలా మంది మహిళలకు చట్టాలపై అవగాహన లేదు. చట్టాలపై అవగాహన అనేది ఎంతో అవసరం. ఏ సమస్య వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి.. ఏ తప్పు చేస్తే ఏ శిక్ష పడుతుందో అనే విషయాలను మహిళలకు వివరిస్తున్నాం. త్వరలోనే నగర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– ప్రసన్నలక్ష్మి, షీటీమ్స్, భరోసా ఏసీపీ

క్షేత్ర స్థాయిలో వివరిస్తాం



పోలీసు అధికారులు చెప్పిన ఎన్నో చట్టాలను మహిళా సమాఖ్యల ప్రతినిధులు తెలుసుకున్నారు. వీటిపై మేం కూడా క్షేత్ర స్థాయిలో మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేసి అందరికీ అవగాహన కల్పిస్తాం. మా సర్కిల్ పరిధిలో మహిళా సమాఖ్యలతో అనుసంధానమైన 8 వేల మందికిపైగా మహిళలు ఉన్నారు. వారందరికీ చట్టాలపై అవగాహన కల్పిస్తాం.

– ఆషా విరానిక, డీపీవో, సర్కిల్ –18

బస్తీల్లోనూ అవగాహన కల్పిస్తాం



చట్టాలపై అధికారులు పెట్టిన ఈ సమావేశంతో ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాం. బస్తీల్లో చాలా మంది మహిళలు జరిగిన విషయాలను మా వద్దకు వచ్చి చెప్తుంటారు. ఈ చట్టాలను వినియోగించి వారికి న్యాయం జరిగేందుకు సహకరిస్తాం.

– పద్మ, మహిళా సమాఖ్య ప్రతినిధి

నేడు విద్యార్థుల సురక్షిత రవాణాపై సమావేశం

హిమాయత్‌నగర్ : పాఠశాలల పిల్లల సురక్షిత రవాణా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తగు చర్యలపై ఈ నెల 29(నేడు) ఖైరతాబాద్ క్రాస్ రోడ్స్‌లోని విశ్వేశ్వరయ్య భవన్(ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్)లో అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ఫౌండర్స్ ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.అనిల్ కుమార్, కోశాధికారి కే.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ హాజరవుతారన్నారు. స్కూల్ బస్సులు ఉన్న యాజమాన్యాలతో పిల్లల సురక్షిత రవాణా తదితర విషయాలపై చర్చించి తగు సూచనలు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

సురవరం ప్రతాపరెడ్డి సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: నిజాం సర్కార్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధులు సురవరం ప్రతాపరెడ్డి అని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. గోల్కొండ పత్రిక స్థాపించి అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని నిజాంపై నిప్పులు చెరిగారని పేర్కొన్నారు. బుధవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు పార్టీ కార్యాలయంలో నిర్వహించి మాట్లాడారు. రచయిత, పరిశోధకుడు , సంపాదకుడు, ఉద్యమకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా తెలంగాణ ప్రతాపరెడ్డి పేరు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సౌభాగ్యవతి, పి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ

పంజగుట్ట: తెలంగాణ సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం పాత్ర కీలకమైందని మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. ఈ నెల 31న నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో నిర్వహిస్తున్న టీజేఎఫ్ 25 సంవత్సరాల రజతోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ ఇచ్చిన ప్రతీ పిలుపులో ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు, ఇటు రాజకీయ నాయకులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులను ఐక్యం చెయ్యడంలో టీజేఎఫ్ పాత్ర కీలకమైనదన్నారు. ప్రపంచ చరిత్రలో ఎక్కడా జర్నలిస్టులు స్వయంగా ఉద్యమాల్లో పాల్గొన్నది లేదని అది తెలంగాణ ఉద్యమానికే సాధ్యమైందన్నారు. ఉద్యమాన్ని మరోమారు గుర్తు చేసుకునేందుకు అప్పుడు టీజేఎఫ్‌తో కలిసి వచ్చిన ప్రతీ ఒక్కరిని పిలిచి వారి అనుభవాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ బాబు, జూలూరి గౌరీశంకర్, ఆస్కాని మారుతీ సాగర్, యోగి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

భూకబ్జాదారుడిపై కేసు

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని ప్రభుత్వ స్థలంలో బ్లూ షీట్స్ ఏర్పాటు చేసిన అధికారులు ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటుచేశారు. అయితే షేక్ మహ్మద్ జహంగీర్ అనే వ్యక్తి ప్రభుత్వ హెచ్చరిక బోర్డును తొలగించి సదరు స్థలం తనదిగా పేర్కొంటూ పోస్టర్లు అంటించాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు నిందితుడిపై ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 403/పి లో ఉన్న ఈ స్థలంపై ఇప్పటికే సయ్యద్ అబ్దుల్ ఖాలిద్ అనే కబ్జాదారుడు ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగించి తన పేరు రాసుకోగా ఇటీవల ఆయనపై కూడా కేసు నమోదైంది. తాజాగా షేక్ మహ్మద్ జహంగీర్‌పై కేసు నమోదు చేశారు.

తెలుగు ప్రజల గౌరవం ఎన్టీఆర్



నివాళి అర్పిస్తున్న పరుచూరి గోపాలకృష్ణ

బంజారాహిల్స్: తెలుగు ప్రజల గౌరవం దివంగత ఎన్టీఆర్ అని సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో బుధవారం ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి నందమూరి హరికృష్ణ, పరుచూరి గోపాలకృష్ణ, నిర్మాత మాదాల రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. మన దేశం సినిమాతో సినీ రంగంలో అడుగుపెట్టి అనేక చిత్రాలు నిర్మించడంతో పాటు రాజకీయాలకు వచ్చి పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. నందమూరి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ.. తన తండ్రి జయంతి అంటే అది తన కుటుంబానికి పండుగ రోజని సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన ప్రపంచంలో ప్రతి ఒక్కరూ గుర్తించే స్థాయికి ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో మాదాల రవి, నందమూరి సీమ, నందమూరి రూప, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యశ్రీ చిన్న పిల్లల వార్డులో పండ్లను పంపిణీ చేశారు. అంతకముందు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ టీఎస్‌రావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ సెంథిల్ రాజప్ప, డాక్టర్ కల్పనారఘునాథ్ పాల్గొన్నారు.

ప్రతి సర్కిల్‌కూ ఒక హైడ్రా బైక్



బంజారాహిల్స్: ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో చెట్ల కొమ్మలు, వైర్లు తెగిపడినప్పుడు, ఇతరత్రా రోడ్డు బ్లాక్‌లు ఏర్పడినప్పుడు వాటిని తొలగించేందుకు, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి జీహెచ్ఎంసీ సర్కిళ్ల వారీగా హైడ్రా డీఆర్ఎఫ్ వ్యాన్లు, సిబ్బందిని కేటాయించింది. అయితే బస్తీల్లో చిన్న చిన్న గల్లీల్లో ఏదైనా చెట్లు కూలినా, కొమ్మలు విరిగిపడినా వైర్లు కిందపడినా వాటిని తొలగించడానికి హైడ్రా వ్యాన్లు ఘటనా స్థలంలోకి వెళ్లలేకపోతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని హైడ్రా తన సేవలను గల్లీల్లోకి విస్తరించడం తలపెట్టింది. ఈ నేపథ్యంలోనే ప్రతి సర్కిల్‌కూ ఒక హైడ్రా బైక్‌ను కేటాయించి సిబ్బందిని కూడా నియమించింది. ఈ బైక్ వెనుక చెట్ల కొమ్మలు తొలగించే పరికరాలతో కూడిన డబ్బాను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఎన్టీఆర్ మార్గ్, కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45తో పాటు సర్కిల్–19లో కృష్ణకాంత్ పార్కు వద్ద ఈ బైక్‌లను అందుబాటులో ఉంచారు.

మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం, పిడమర్తి రవి

పంజగుట్ట: మాదిగ కులానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గజ్జల కాంతం కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతూ నేడు మాదిగ ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్తున్నారన్నారు. తాము కూడా ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ మంత్రికి వ్యతిరేకంగా మాట్లాడిస్తూ, ధర్నాలు చేయిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే వివేక్ నమ్మక ద్రోహం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు 10 రోజుల ముందు పార్టీలోకి వచ్చినా ఇంట్లో ఇద్దరికి ఎమ్మెల్యే, ఒకరికి ఎంపీ టికెట్ ఇచ్చి ఆదరించిన పార్టీకే వ్యతిరేకంగా మాట్లాడుతూ, పార్టీ నాయకులను విమర్శిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం మాదిగల జనాభా 33 లక్షలు ఉందని, అది ఇప్పుడు 50 లక్షలు అయ్యిందని ఇంత పెద్ద జనాభా ఉన్న మాదిగ జాతికి మంత్రివర్గంలో తగిన స్థానం లేదన్న భావన మాదిగ జాతిలో ఉందన్నారు. ఈ సమావేశంలో బోదాల బాబురావు, మొగిలయ్య, బూరెల్లి సురేష్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. బాధితుల నగదు మాయం

వెంగళరావునగర్ : ఆన్‌లైన్‌లో వచ్చిన వాట్సాప్‌కు నగదు పంపి ఓ బ్యాంకు ఉద్యోగిని మోసపోయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ సాయిరాం గార్డెన్స్‌లో నివసిస్తున్న సత్విందర్‌కౌర్ ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తుంది. ఈ నెల 17న ఆమెకు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్‌లోని తమ వీడియోలు, పేజీలు, స్నాప్‌షాట్స్ లైక్ చేస్తే నగదు పంపుతామన్నారు. దాంతో ఆమె తొలుత 10 పేజీలు లైక్ చేయగా ఆమెకు రూ.900 పంపారు. తర్వాత 7 పేజీలు లైక్ చేయడానికి రూ.వెయ్యి పంపమన్నారు. ఆమె పంపగా తిరిగి రూ.1300 వచ్చాయి. ఈ విధంగా ఆమె రూ.50 వేలు వరకు ఆన్‌లైన్‌లో పంపింది. రూ.7 వేలు వరకు వచ్చి ఆగిపోయాయి. మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో..

దేవిక అనే మహిళ రీల్స్ చూస్తుండగా పార్ట్‌టైం జాబ్స్ ద్వారా అధిక రాబడి సంపాదించవచ్చని యాడ్ చూసింది. వివరాలు ఆన్‌లైన్‌లో అడగ్గా చిన్న టాస్క్‌లు చేయాలని ఇందుకోసం నగదు పంపాలని చెప్పారు. దాంతో తొలుత రూ.2800 నుంచి ప్రారంభమై రూ.72,500 వరకు ఆన్‌లైన్‌లో దోచుకున్నారు. తొలుత చిన్న చిన్న రిటర్న్ ఆమెకు వచ్చినప్పటికీ తర్వాత ఆగిపోయాయి. మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జాబ్ పేరుతో..

వెంగళరావునగర్ : ఆన్‌లైన్ జాబ్ పేరుతో మహిళ నుంచి నగదు దోచుకున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. సనియాబేగం అనే మహిళ కార్మికనగర్‌లో ఉంటుంది. ఈ నెల 18న ఆమెకు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అందులో ఆమె వివరాల అడగ్గా గూగుల్ హెచ్‌ఆర్ అలీషా పేరుతో ఉంది. ఆన్‌లైన్‌లో వివిధ రెస్టారెంట్స్‌కు గూగుల్ మ్యాప్స్ పంపడం ద్వారా నగదు సంపాదించవచ్చని తెలిపింది. ఇందుకోసం మొదట రూ.5వేలు పంపాలని కోరగా సనియాబేగం ట్రాన్స్‌ఫర్ చేసింది. మరో రూ.23,500 పంపితే రూ.48 వేలు తిరిగి ఇస్తామని చేస్తామని చెప్పింది. ఈ విధంగా రూ.61,500 వరకు చెల్లించింది. ఎంతకీ తిరిగి డబ్బులు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రౌండప్ చేసి బంగారు గొలుసు కొట్టేశారు

బంజారాహిల్స్: బస్సు దిగుతున్న ప్రయాణికుడి మెడలోని బంగారు లాక్కొని పరారైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని నూర్‌నగర్‌బస్తీలో నివసించే వి.ఓం సాయిప్రకాష్ అనే విద్యార్థి మెహిదీపట్నంలో 19కే బస్సు ఎక్కాడు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7లోని జీవీకే బస్టాప్‌లో దిగుతుండగా అంతకముందే విరించి బస్టాపులో ఎక్కిన నలుగురు వ్యక్తులు పథకం ప్రకారం తాము కూడా దిగుతున్నట్లు నటించి సాయిప్రకాష్ మెడలో నుంచి గొలుసు తస్కరించి ఆయనకు కిందకు తోసేసి పరారయ్యారు. గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించి అదే బస్సు ఎక్కి నిందితుల కోసం గాలించాడు. అయితే అప్పటికే వారంతా దిగిపోయినట్లు కండక్టర్ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మైనర్‌పై లైంగికదాడి

యువకుడి రిమాండ్

ఫిలింనగర్: ప్రేమ పేరుతో మైనర్ బాలికను బలవంతంగా తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.ఫిలింనగర్‌లోని ఓ బస్తీలో నివసించే బాలిక (17)ను అదే ప్రాంతానికి చెందిన యువకుడు (19) ప్రేమిస్తున్నానంటూ గత కొంతకాలంగా వెంటపడుతున్నాడు. సదరు బాలికను ప్రేమ పేరుతో ఇంట్లో చెప్పకుండా రెండు రోజుల క్రితం బలవంతంగా తీసుకువెళ్లాడు. బాలిక తల్లి తన కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడి ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు గాలించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రిమాండ్‌కు తరలించారు.

బైక్‌తో మెట్రో పిల్లర్‌ను ఢీకొన్న యువకుడికి గాయాలు

వెంగళరావునగర్ : మద్యంమత్తులో మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టగా యువకుడికి గాయాలలైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తణుకు ప్రాంతానికి చెందిన ఎం.తేజ మణికొండలో ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం మధురానగర్‌లోని తన స్నేహితుడి ఇంటికి వచ్చి మద్యం తాగి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మధురానగర్ వద్ద మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్ : ఉద్యోగం పేరుతో ఓ యువకుడిని మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మాయిగూడెం ప్రాంతానికి చెందిన ఎం.నాని ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఐదు నెలల కిందట సంధ్య, సంజయ్ అనే వ్యక్తులు అతనికి పరిచయమయ్యారు. తనకు మంచిజీతం ఇచ్చే జాబ్ కావాలని వారితో చెప్పడంతో రూ.1.40 లక్షలు చెల్లిస్తే జాబ్ ఇప్పిస్తామని చెప్పారు. దాంతో నాని వారు అడిగిన నగదును అందజేశాడు. అమీర్‌పేటలోని వాసవీ ఎంపీఎం మాల్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం ఇప్పించారు గాని జీతం మాత్రం ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా తప్పించుకుని తిరుగుతున్నారు. నాని వారి వివరాలు ఆరా తీయగా యువతీ యువకుడి అసలు పేర్లు షేక్ నాగూర్‌బీ, షేక్ సుభానీలుగా తెలిసింది. తనను మోసం చేసి నగదు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోజూ 70 వేల మందికి ఉచిత భోజనం



లోగోను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పంజగుట్ట: హంగర్ ఫ్రీ వరల్డ్ పథకం ప్రారంభించినప్పటి నుండి గత మూడేళ్లలో 2.5 కోట్ల మంది నిరుపేదలకు భోజనాలు అందించామని దాన్ని మరింత రెట్టింపు చేస్తూ 2025–2026 సంవత్సరంలో ప్రతీ రోజు దేశవ్యాప్తంగా 70 వేల మందికి భోజనాలు పంపిణీ చేసి ఒక్క సంవత్సరంలోనే 2.5 కోట్ల మందికి ఉచితంగా భోజనం అందిస్తామని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ సీఎస్ఆర్ ఫండ్ కింద ఈ సంవత్సరానికి 150 కోట్లతో విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆకలి తీర్చడం, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, పేదలకు గృహ నిర్మాణం కోసం ఖర్చు పెడుతున్నామన్నారు. బుధవారం సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో హంగర్ ఫ్రీ వరల్డ్ లోగోను సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్, సంస్థ జోనల్ హెడ్ శీరజ్‌తో ఆవిష్కరించి మాట్లాడారు. ఏ సంస్థ అయినా సీఎస్ఆర్ ఫండ్ వారి లాభాల్లో రెండు శాతం కేటాయించాల్సి వస్తుందని కాని తమ సంస్థ ఐదు శాతం సేవా కార్యక్రమాలకు కేటాయిస్తుందన్నారు.

అక్రమ వలసదారులను తరిమివేయాలి

ఇందిరాపార్కు వద్ద భారత సోషలిస్టు ఫోరం ధర్నా



మాట్లాడుతున్న బీజేపీ నేత శేఖర్‌రావు

కవాడిగూడ: భారతదేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న చొరబాటు దారులను వెంటనే వెనక్కి పంపేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భారత సోషలిస్టు ఫోరం, జాతీయ వాదుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నేత పేరాల చంద్ర శేఖర్‌రావు, నటుడు వైభవ్ సూర్య, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, సినీనటి కరాటే కళ్యాణి, యమునా పాటక్‌తోపాటు హిందూ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముస్లిం దేశాల నుంచి భారత్‌లోకి ఎక్కువ సంఖ్యలో వలసదారులు, రోహింగ్యాలు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, సామ కృష్ణారెడ్డి, రాంబాబు, కొత్తకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం



సాక్షి,సిటీబ్యూరో: అమెచ్యూర్ తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్ 2025–2029 కాల పరిమితికి కొత్త కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు బుధవారం బేగంపేటలోని ఒక హోటల్‌లో అసోసియేషన్ వార్షిక సాధారణ సభ జరిగింది. అధ్యక్షుడిగా ఐపీఎస్ అధికారి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టి.దశరథ రామారెడ్డి, సుచరిత ఠాకూర్, డాక్టర్ రాజారావు, ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్ గౌడ్, సహ కార్యదర్శులుగా కోము వెంకట్, పీబీ చక్రపాణి, కోశాధికారిగా కలీమ్ అహ్మద్, నిర్వానిర్వాహక సభ్యులుగా మారి సుధాకర్, కిరణ్ చారి, రజని, ఎస్.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది ప్రవీణ్‌వ్యవహరించారు. కార్యక్రమంలో చేతన్ సునీల్(అఖిల భారత పికిల్‌బాల్ అసోసియేషన్), నిఖిల్ మాథురే, (అఖిల భారత పికిల్‌బాల్ అసోసియేషన్), అలెగ్జాండర్ ఫ్రాన్సిస్(క్రీడా శాఖ), మల్లారెడ్డి(తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్) పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి ప్రతీక 'ఆదిధ్వని'



చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మిస్తున్న ఆది ధ్వని మ్యూజియం జీవ వైవిధ్యానికి ప్రతీక అని టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ స్కాలర్ చనగాని దయాకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓయూ అధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, దీన్ని కొన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకించడం అవివేకమని అన్నారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఓయూ భూములను బార్లు, హోటళ్లు, సినిమా హాళ్లు, పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపార సముదాయాలకు లీజుకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వాటిని వ్యతిరేకించని విద్యార్థి సంఘాలు పరిశోధనకు ఉపయోగపడే ఆదిధ్వని మ్యూజియాన్ని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. విశ్రాంత ఆచార్యులు ప్రొ.జయధీర్ తిరుమలరావు 15 ఏళ్లు ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలపై శోధించారని వివరించారు. ఎంతో కృషి చేసి తాళపత్ర గ్రంథాలను అధ్యయనం చేశారని, సంగీత పనిముట్లను సేకరించారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఓయూలో ఏర్పాటు చేస్తున్న ఆది ధ్వని మ్యూజియం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీనాట్య శిల్పి ఆర్ట్స్ అకాడమీ 35వ ఉచిత నాట్య శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు రవీంద్ర భారతిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయి.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఫౌండర్స్(ట్రస్మా) ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఉదయం 9 గంటలకు పాఠశాలల నుంచి పిల్లల సురక్షిత రవాణాపై అవగాహన కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

మట్టి పోసి.. మూసి వేసి..!

- మూసీని మట్టితో పూడుస్తోందని హైడ్రాపై వదంతులు
- అంబర్‌పేట మండల పరిధిలో పెద్ద ఎత్తున కబ్జాలు
- తహసీల్దార్ బదిలీ గ్యాప్‌లో ఊపందుకున్న ఆక్రమణలు
- కబ్జాలను పరిశీలించాలన్న అడిషనల్ కలెక్టర్



కబ్జా చేసిన మూసీ పరీవాహక ప్రాంతం

అంబర్‌పేట: మూసీ నదిని హైడ్రా పేరుతో అడ్డగోలుగా మట్టిపోసి మూసివేస్తున్నారు కొందరు కబ్జాదారులు. వందలాది లారీలతో మట్టిని తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. చీకటి పడగానే మట్టిని చదును చేసి కబ్జా చేస్తున్నారు. వారం రోజుల్లో సుమారు మూడు ఎకరాల మేరకు మూసీని పూడ్చేసి చదును చేశారు. ఈ తతంగం అంబర్‌పేట మండల పరిధిలోని అలీ కేఫ్ చౌరస్తా నుంచి నాగోల్‌కు వెళ్లే కొత్త రోడ్డు మార్గంలో జరుగుతోంది. ఇప్పటికే కబ్జాల బారిన పడిన మూసీ మరింత కబ్జాకు గురవుతోంది. బహిరంగంగా మట్టితో నింపి చదును చేశారు. బఫర్ జోన్, వాటర్‌బాడీ వంటి వాటిని లెక్క చేయకుండా మట్టిని పోస్తున్నారు. ఇప్పటికైనా ఇక్కడ జరుగుతున్న మూసీ కబ్జాపై అధికార యంత్రాంగం కళ్లు తెరవాలని స్థానికులు కోరుతున్నారు. జాప్యం చేస్తే ఇక్కడ మూసీ ఆనవాళ్లు కూడా ఉండవని అంటున్నారు.



ముసారాంబాగ్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి

కబ్జారాయుళ్లకు కలిసి వచ్చిన బదిలీ

ఇటీవల తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి చౌటుప్పల్‌కు బదిలీపై వెళ్లింది. అయితే ఆమె స్థానంలో మరొకరిని నియమించడంలో 10 రోజులు జాప్యం జరిగింది. ఆ తర్వాత అంబర్‌పేట తహసీల్దార్‌గా అన్వర్ హుస్సేన్ బాధ్యతలు తీసుకున్నారు. ఇంతలో మూసీలో భారీ ఎత్తున కబ్జాలకు ఆక్రమణదారులు తెరలేపారు.

ఉన్నతాధికారులకు తెలియడంతో...

అంబర్‌పేట– నాగోలు కొత్త రోడ్డులో మూసీ కబ్జాల విషయం రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. కబ్జాల నిరోధానికి పలు సూచనలు చేశారు. బఫర్ జోన్ పరిధిని సిబ్బందికి వివరించి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

కబ్జా కథ పెద్దది: అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి

మూసీ పరీవాహక ప్రాంతంతోపాటు మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. జాప్యానికి కారణాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూసీ కబ్జాపై అడిషనల్ కలెక్టర్‌ను తీసులుకునే ప్రయత్నం చేయగా కబ్జా కథ పెద్దదీ దానిని నివారిస్తామంటూ తెలిపారు.

తప్పుడు సమాచారం

మూసీ పరీవాహక ప్రాంతంలో పెద్ద ఎత్తున మట్టి ఎలా పోస్తున్నారని ప్రశ్నిస్తే హైడ్రా వాహనాలు ఇక్కడ మట్టిపోస్తున్నాయని కొంతమంది వ్యక్తులు రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. అంబర్‌పేట బతుకమ్మకుంట పునరుద్ధరణలో భాగంగా అక్కడ తీస్తున్న మట్టిని ఇక్కడ పోస్తున్నారని బుకాయిస్తున్నారు. దీనిపై హైడ్రాను సంప్రదించగా తమ సంస్థ ఎక్కడా మట్టిపోయడం లేదని చెప్పారు. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తున్న అంశంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం: కొండా సురేఖ



ప్రారంభోత్సవంలో మంత్రి కొండా సురేఖ

గన్ ఫౌండ్రి: ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ లేక్ వద్ద 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ చాంపియన్ షిప్ పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి అధిక బడ్జెట్‌ను కేటాయించామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించడమే కాకుండా, గ్రామస్థాయిలోని క్రీడాకారులను ప్రోత్సహించేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ ఫెడరేషన్లు జాతీయస్థాయి టోర్నమెంట్లను తెలంగాణలో నిర్వహించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి సింగ్ దేవ్, స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్ సోనీ బాలాదేవి, తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ మిథున్‌రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇస్మాయిల్ బేగ్, రోయింగ్ ఫెడరేషన్ ప్రతినిధులు నయీముద్దీన్, బాలాజీ, డ్రాయింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలు



రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావుతో ఉస్మాన్ ఆజీరి తదితరులు

గోల్కొండ: తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా గోల్కొండ బోనాలు నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు అన్నారు. కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ ఆజీరి బుధవారం ఆయనను కలిశారు. గోల్కొండ కోట బోనాల నిర్వహణ కమిటీ సభ్యులను ఆయనకు పరిచయం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం బోనాల పండుగను ప్రభుత్వ పండుగగా ప్రటించిన అనంతరం బోనాలకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. మొదటి బోనం వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని అమ్మవారికి మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని అన్నారు. లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు భద్రత కల్పించడం, తాగునీరు అందించడం, తొక్కిసలాట జరగకుండా చేయడం లాంటి చర్యలు అందరి సహకారంతోనే చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు కృష్ణవేణి, శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, కార్యనిర్వహణ అధికారి సి.వసంత, బోనాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కె.చంటిబాబు, సభ్యులు ఎం.శ్రీకాంత్, ఎ.సంతోష్‌గౌడ్, ఆకుల ప్రదీప్‌కుమార్, అనిత, ఎస్.ఎస్.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్



బోర్డు సమావేశంలో పాల్గొన్న నవీన్ మిట్టల్, అర్చక జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: అర్చకులందరికీ రూ.5 లక్షల మేర ఇన్సూరెన్స్ కల్పిస్తూ అర్చక వెల్ఫేర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. బుధవారం అర్చక వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో బోర్డు సమావేశం జరిగింది. సమావేశంలో సభ్యులు కందూరి కృష్ణమాచార్యులు, చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు, జక్కాపురాం నారాయణ స్వామి, దేవాదాయ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బోర్డు నిర్ణయంపై తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అర్చకుల గ్రాట్యుటీని నాలుగు లక్షల రూపాయల నుంచి రూ.8 లక్షల వరకు పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. పదవీ విరమణ పొందే అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.20 వేల పెన్షన్ సదుపాయం కల్పించాలని సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ అంశాలను బోర్డు ముందు ఉంచగా ఆమోదం లభించిందన్నారు.

అర్హులకు 'యువ వికాసం' అందేలా చర్యలు

– మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. అర్హుల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఆయన మాట్లాడారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో భట్టి విక్రమార్క మాట్లాడుతూ నిరుద్యోగులు కుటుంబాన్ని పోషించుకుని, ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. జూన్‌లో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉన్న దరఖాస్తులు, జూలైలో రూ.లక్ష నుంచి రూ 2 లక్షల వరకు, ఆగస్టు, సెప్టెంబర్‌లలో రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు గల దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. చిన్న గ్రామాల్లో ఒకేరకమైన యూనిట్లను గ్రౌండింగ్ చేయకుండా, భవిష్యత్తులో కూడా కొనసాగించే యూనిట్లను ఎంచుకునేలా అభ్యర్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్డీఓ సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో ఫ్యాషన్ టెక్నాలజీ అడ్మిషన్లు షురూ

– మెరిట్ ఆధారంగా ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు 'మనూ'స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బుధవారం తెలిపారు. ఈ రంగంలో సర్టిఫికెట్లు కలిగి ఉన్న విద్యార్థులకు ఫ్యాషన్ ప్రపంచంలో అధిక డిమాండ్ ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో మెరిట్ ఆధారంగా ప్రవేశాలను అందిస్తోందన్నారు. దరఖాస్తు ఫారాలను సమర్పించడానికి జూన్ 4 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. ఏదైనా స్ట్రీమ్‌లో ప్లస్ టూలో కనీసం 55 శాతం మార్కులతో లేదా దానికి సమానమైన సీజీపీఏలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. దీంతోపాటు ఉర్దూ విశ్వవిద్యాలయ మోడల్ స్కూల్స్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, లక్నో, కడపలలో సర్టిఫికెట్ ఇన్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సు అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 81065 28786లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కిచెన్ గార్డెన్‌పై అవగాహన సదస్సు

నాంపల్లి: తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ), ఆగ్రో అండ్ ప్రాసెసింగ్ కమిటీ ఆధ్వర్యంలో 'గ్రో యువర్ ఓన్ ఫుడ్– ఎ స్టెప్ టువార్డ్స్ బెటర్ లివింగ్'పేరుతో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో సదస్సు జరిగింది. ఉద్యానవన శాఖ అర్బన్ ఫార్మింగ్ విభాగం అధికారిణి బి.మంగా, గార్డెన్ కన్సల్టెంట్ జయలక్ష్మి కొంపెల్ల, గార్డెన్ సొల్యూషన్స్ ఓనిమాల మాట్లాడారు. కిచెన్ గార్డెన్ అనేది కేవలం ఆహార పంట మాత్రమే కాదని, ఇది ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, స్వీయ సాధికారతను సూచిస్తుందని మంగా పేర్కొన్నారు. గార్డెనింగ్ మన మనసుకు ప్రశాంతతను ఇస్తుందని, ఇది మట్టి అనుసంధానంతోపాటు మనల్ని మనతో అనుసంధానిస్తుందని జయలక్ష్మీ వివరించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం 38 శాతం మంది భారతీయులు తరచూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం లేదన్నారు. 50 శాతానికిపైగా వ్యాధులు చెడు ఆహారపు అలవాట్ల కారణంగానే వస్తున్నాయని, దీనికి సరళ పరిష్కారం కిచెన్ గార్డెనింగ్ అని తెలిపారు. ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు కె.కె.మహేశ్వరి మాట్లాడుతూఇంట్లో ఆహారాన్ని పండించడాన్ని ప్రోత్సహించడమే కాదని, జీవనశైలి మార్పుకు నాంది పలకడమని తెలిపారు.

ఎన్ఐజీఎస్‌టీ హైదరాబాద్‌కు అక్రిడిటేషన్ హోదా

ఉప్పల్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫార్మటిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎన్ఐజీఎస్‌టీ) హైదరాబాద్‌కు ప్రతిష్ఠాత్మకమైన అక్రిడిటేషన్ హోదాను న్యూఢిల్లీలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్(సీబీసీ) మంజూరు చేసినట్లు అడిషనల్ సర్వేయర్ జనరల్ జి.వరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తిపరమైన విద్యా, శిక్షణా కార్యక్రమాలను అందించడంలో ఎన్ఐజీఎస్‌టీ ప్రదర్శించిన నిబద్ధతకుగాను ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో సీబీసీ నిపుణులుపలు అంశాలను పరిశీలించారని పేర్కొన్నారు. భౌగోళిక సమాచార శాస్త్రం, సాంకేతికతలో వృత్తిపరమైన శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎన్ఐజీఎస్‌టీని తీర్చిదిద్దాలని సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియాను కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేందర్ సింగ్ కోరినట్లు తెలిపారు.

సురవరం గొప్ప సంఘ సంస్కర్త: చిన్నారెడ్డి



తెలుగు వర్సిటీ లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జి.చిన్నారెడ్డి, చిత్రంలో ఆచార్య బాలకిష్టారెడ్డి

నాంపల్లి: తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప సంఘ సంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి అని, ఆయన పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితంగా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. గోల్కొండ పత్రిక ద్వారా ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించారని కొనియాడారు. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి వేడుకలను బుధవారం తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు డాక్టర్ కృష్ణవర్ధన్ రెడ్డి, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమక్షంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అధికారిక చిహ్నాన్ని ఆవిష్కరించారు. బాలకృష్టారెడ్డి మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని ఉన్నత విద్యా వ్యవస్థను సంస్కరించనున్నట్లు తెలిపారు. సంగిశెట్టి మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 180 గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు.

సురవరం ప్రతాపరెడ్డికి నివాళి

కవాడిగూడ: రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణను మేల్కొల్పిన బహుముఖ ప్రజ్ఞానిధి సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. సురవరం 129వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం శివారెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య, సభ్యులు, సురవరం కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, సురవరం రఘువర్ధన్ రెడ్డి, సురవరం విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ సురవరం రంగారెడ్డి, కుటుంబ సభ్యులు సురవరం అనిల్ కుమార్ రెడ్డి, సురవరం కపిల్ పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి 8 వరకు పేపర్ ఎక్స్‌పో

దేశంలో తొలిసారిగా హైటెక్స్‌లో నిర్వహణ..



పేపర్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: దేశంలో మొట్టమొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పోను జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు పేప్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పీ సీఈఓ నిర్మల్ కుహాద్ తెలిపారు. బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఎక్స్‌పో వివరాలను ఆయన వెల్లడించారు. ఇది పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి ఎక్స్‌పో అని అన్నారు. దేశవ్యాప్తంగా కాగిత వినియోగాన్ని ప్రోత్సహించడం , అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. ఇది దేశంలోని అతిపెద్ద, సమగ్ర పేపర పరిశ్రమ సమావేశంగా నిలవనున్నదని పేర్కొన్నారు. కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ఈ రంగంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బాలాన్ని ఇవ్వనున్నదన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు గల్ఫ్ దేశాలు, ఇతర దేశాల సందర్శకులు వస్తుండటంతో దీనికి అంతర్జాతీయ ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. ఈ మూడు రోజుల ఎక్స్‌పోలో 10 వేలకుపైగా సందర్శకులు రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పేపర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, పేప్‌ఎక్స్‌పో ఎల్ఎల్‌పీ డైరెక్టర్లు బీఆర్ రావు, అర్వింద్ శర్మ, సీఓఓ దయాకర్‌రెడ్డి, మూల్‌చంద్ ఫరేఖ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న చాకలి శ్రీలక్ష్మి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు చాకలి శ్రీలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చాకలి ఎస్సీ సాధన సమితి 8వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా చాకలి కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థలు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఆలిండియా సర్వీసుల్లో రజకులు లేరని పేర్కొన్నారు. ఎస్సీల్లో చేరిస్తే చాకలి కులస్తుల్లో కొంత మెరుగైన జీవన స్థితిగతులు సాధ్యమవుతాయని అన్నారు. తమ పోరాటం వల్లే ప్రభుత్వం అధికారికంగా చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతులను నిర్వహిస్తోందని, కోఠి ఉమెన్స్ కాలేజీని వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా మార్చారని గుర్తు చేశారు. లక్ష మందితో త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ప్రొఫెసర్ అక్కినపల్లి పున్నయ్య మాట్లాడుతూ దేశంలోని 18 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో చాకలి కులస్తులు కొనసాగుతుండగా, దక్షిణ భారతదేశంలోని 11 రాష్ట్రాల్లో మాత్రం బీసీలుగా కొనసాగుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ చాకలి కులస్తుల డిమాండ్‌లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, ఉపాధ్యక్షులు సట్టు నాగయ్య, డాక్టర్ సీహెచ్ రాజయ్య, సట్టు వెంకటేశ్వర్లు, రాచకొండ కొమురయ్య, నగునూరి ఎల్లయ్య, దుప్పటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: 2025–26 సంవత్సరంలో న్యాయశాస్త్ర శిక్షణ కోసం అర్హులైన బీసీ న్యాయవాదుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి టి.ఝాన్సీరాణి తెలిపారు. దరఖాస్తుదారుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాలవారికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారు న్యాయపాలనలో మూడేళ్లు శిక్షణ పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో నెలకు రూ.1,000 భృతి, అడ్వకేట్ జాబితాలో చేర్చేందుకు రూ.585, లా బుక్, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి లా కోర్సు పాసై ఉండాలని, బార్ కౌన్సిల్‌లో కూడా పేరు నమోదు చేసుకొని ఉండాలని పేర్కొన్నారు. ఈ పథకం కింద మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నలుగురికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు మేడ్చల్ కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వారి కార్యాలయం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా కేన్సర్ పరీక్షలు



అల్వాల్‌లోని కేన్సర్ నిర్ధారణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరీ

అల్వాల్: సమాజాన్ని పట్టి పీడిస్తున్న కేన్సర్ మహమ్మారిని పారదోలడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందుకు స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు సైతం చేయూతనందిస్తున్నాయి. ఇందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్ నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, మహిత స్వచ్ఛంద సంస్థ సంయుక్తాధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేన్సర్ నిర్ధారణ పరికరాలను అందజేసింది. కేన్సర్ నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన కలిగించడమెలా అనే విషయమై అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు రోజులపాటు క్షేత్రస్థాయి సిబ్బంది, ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి ఉమాగౌరీ సిబ్బందికి పలు సూచలు చేశారు. 35 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. ప్రజల్లో కేన్సర్ పట్ల అవగాహన తీసుకురావడంతో పాటు వ్యాధి లక్షణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించగలిగితే పెద్ద ప్రమాదం నుంచి తప్పించినట్లు అవుతుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు కేన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం వెళ్తే వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని, ప్రభుత్వాస్పత్రులలో అందిస్తున్న ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శోభారాణి, డాక్టర్ శ్వేత, డాక్టర్ రమాదేవి, స్వర్ణలత, అరుణ, రాణి, ఎన్‌జీవో ప్రతినిధి బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 29, మే, 2025



నగరంలో ఫ్యాషన్ ట్రెండ్స్ ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. దీంతో అత్యాధునిక స్టైలిష్ పర్సన్‌గా కనిపించాలంటే.. కొనడం కన్నా అద్దెకు తీసుకోవడం మిన్న అంటున్నారు నగరంలోని ఫ్యాషన్ ప్రియులు.. అత్యాధునిక ఫ్యాషన్లను అనుసరించడంతో పాటు మరికొన్ని ఇతర కారణాల వల్ల కూడా సిటీలో అద్దెకు దుస్తుల విపణి అంతకంతకూ విస్తరిస్తోంది.
- సాక్షి, సిటీబ్యూరో



కరెంట్ ట్రెండ్.. అద్దెకు అడ్రెస్

నగరంలో విస్తరిస్తున్న అద్దెకు దుస్తుల విపణి

- ఆల్టరేషన్స్ సహా వినియోగదారులకు అందిస్తున్న వైనం
- పార్టీవేర్, వెస్టర్న్ ఫ్యాషన్స్‌కి ఫుల్ డిమాండ్
- సోషల్ మీడియా ప్రభావంతో పుంజుకున్న మార్కెట్
- ప్రీ వెడ్డింగ్ షూట్స్ నుంచి రీల్స్ దాకా అవే వినియోగం

ఒకప్పుడు షూటింగుల్లో పాల్గొనడం అంటే అది నటీనటులకు మాత్రమే అనుకునేవారు. ఇప్పుడు షూట్స్ అంటే పలువురికి రోజువారీ వ్యాపకం కూడా అంటే అతిశయోక్తి కాదు. సోషల్ మీడియా వేదికగా పాపులారిటీ పెంచుకోవాలనుకుంటున్న అనేక మందికి తమ ఫాలోవర్లను మెప్పించే క్రమంలో తరచూ కొత్త గెటప్స్‌లో కనిపించాల్సి వస్తోంది. అలాంటి వారికి ఈ అద్దె దుస్తులు బాగా అక్కరకొస్తున్నాయి. మరోవైపు పెళ్లికి ముందు సర్వసాధారణంగా మారిన ప్రీ వెడ్డింగ్ షూట్స్‌తో పాటు అనేక రకాల స్వీయ చిత్రీకరణలు కూడా బాగా పెరిగాయి. ఇవి కూడా అద్దె దుస్తుల డిమాండ్‌ను పెంచేస్తున్నాయి.

పార్టీల జోరు.. ధరల బేజారు..

నగరంలో పార్టీ కల్చర్ విపరీతంగా పెరిగింది. వారానికి కనీసం రెండు మూడు పార్టీలకు అటెండ్ అవ్వాల్సిన పరిస్థితి సిటీలో బిగ్ సర్కిల్ ఉన్న ప్రతీ వ్యక్తికీ సర్వసాధారణంగా మారింది. అయితే పార్టీకి వెళ్లే ప్రతిసారి కొత్త డ్రెస్ కొనడం అనేది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు కొంతమంది ప్రస్తుతం రెంటల్ వార్డ్‌రోబ్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. వీటి వల్ల బ్రాండెడ్‌వి, అత్యంత ఖరీదైన దుస్తుల్ని ధరించే అవకాశం కూడా ఉంటుంది. గత కొన్నేళ్లలో 'నేను రెంట్ డ్రెస్ వేశాను' అని చెప్పడం కొంతమందికి ఇబ్బంది, సిగ్గు కలిగించేది. కానీ ఇప్పుడు అది 'కూల్' ట్రెండ్‌గా మారిపోయింది.

ట్రెండ్ వయసు టెన్ ఇయర్స్..

నగరంలో ఈ ట్రెండ్‌కి శ్రీకారం చుట్టింది 'ర్యాప్డ్' అనే రెంటల్ సర్వీస్ అని చెప్పొచ్చు. 'నేను ఈ వ్యాపారాన్ని మొదలు పెట్టినప్పుడు చాలామంది ఇది మంచి ఐడియా కాదు, ఎవరూ డ్రెస్‌లను రెంట్‌కు తీసుకోరని వారించారు. కానీ ఇప్పుడు అన్ని వర్గాల వారిని మా స్టోర్లో చూడవచ్చు' అంటూ చెప్పారు ర్యాప్డ్ నిర్వాహకులు రితూ మల్హోత్రా. 'నేటి ఫ్యాషన్ వేగంగా మారుతుంది ప్రతి కొత్త ట్రెండ్‌ను కొనుగోలు చేయడం ఖరీదైనదే కాక, వాటిని ఉంచడానికి అవసరమైన ప్రదేశం కూడా పెద్ద సమస్య అవుతుంది. అందుకే.. రెంటల్ సర్వీసు ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. ఈ ట్రెండ్‌ను ప్రోత్సహించడం అంటే కేవలం మన జేబుకు మాత్రమే కాదు.. పర్యావరణానికి కూడా మంచిది' అన్నారామె. కొన్ని సంవత్సరాలుగా రెంట్ డ్రెస్‌లు వేసుకుంటున్నాను. చాలా గొప్ప డిజైన్లు, ఎంపికలు ఉన్నాయి. పైగా, చాలా మంచి క్వాలిటీని కూడా అందిస్తున్నారు' అంటున్నారు సైకాలజీ విద్యార్థిని వైష్ణవి.



సూచనలు..

అడ్వాన్స్ బుకింగ్: ప్రత్యేక సందర్భాలకు ముందుగానే బుకింగ్ చేయడం మంచిది.

- పలు సంస్థలు ఫ్రీ ఆల్టరేషన్లు అందిస్తాయి.
- దుస్తులు డబుల్ డ్రైక్లీన్ చేస్తున్నారా లేదా అని తనిఖీ చేసుకోవాలి.
- ఒక రోజు, 36 గంటలు.. ఇలా విభిన్న కాలవ్యవధులు ఉన్నాయి కాబట్టి సరిగా ధ్రువీకరించుకోవాలి.



సందర్భోచితంగా.. అందుబాటు ధరల్లో..

నగరంలో అద్దెకు తీసుకునేందుకు పార్టీ వేర్‌కి ఒక రోజుకు అద్దె సుమారు రూ.1,500 నుంచి రూ.3,500 వరకూ.. సంప్రదాయ దుస్తులైతే రూ.2,500 నుంచి రూ.6,000 వరకూ, వెస్టర్న్ ఫ్యాషన్ (డ్రెసెస్, సూట్స్) రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు(ఒక రోజు అద్దె) వరకూ మగవాళ్ల దుస్తులు(షర్ట్స్, టీ–షర్ట్స్, బ్లేజర్స్): రూ.800 నుంచి రూ.2 వేల వరకూ ఉన్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. మహిళల లెహంగాలు, షేర్వానీలు, గౌన్లు, పాశ్చాత్య దుస్తులు అందించేందుకు ర్యాప్డ్ మదాపూర్ – బేగంపేట్ పరిసరాల్లో సేవలు అందిస్తుండగా, వీరి దగ్గర దుస్తుల అద్దెలు రూ.3 వేల నుంచి, రూ.16,500 వరకు లభిస్తున్నాయి. అలాగే ఈసీఐఎల్ ప్రాంతంలోని తారా డిజైనర్స్ సంస్థ ప్రీ–వెడ్డింగ్ గౌన్లు, మ్యాటర్నిటీ ఫొటోషూట్ దుస్తులు, కపుల్ అవుట్‌ఫిట్స్‌కు పేరొందింది. కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లోని స్టైలీజింగ్ అనే సంస్థ లాంగ్ ట్రెయిల్ గౌన్లు, లెహంగాలు, మ్యాటర్నిటీ గౌన్లకు పేరొందింది. అమీర్‌పేట్‌లోని ప్రీ వెడ్డింగ్ గౌన్స్ రెంటల్ బాల్ గౌన్లు, లెహంగాలు, శెర్వానీలు అందిస్తుంది. ఇక మగవాళ్ల దుస్తులకు ప్రత్యేకించిన కేపీహెచ్‌బీ ప్రాంతంలోని స్టైల్ హిమ్‌లో బ్లేజర్లు, శెర్వానీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే షైరోబ్ సంస్థ శెర్వానీలు, జోధ్‌పురి సూట్లు, నెహ్రూ జాకెట్లు, పాశ్చాత్య దుస్తులు అందిస్తోంది. ఆన్‌లైన్ బుకింగ్ నుంచి ఆల్టరేషన్స్ దాకా ఈ సంస్థలు సేవలు అందిస్తున్నాయి. అలాగే కస్టమ్ ఫిట్టింగ్, హోమ్ డెలివరీ. హైజీన్ గ్యారెంటీ, డిపాజిట్ రిఫండబుల్.. ఆఫర్ చేస్తున్నాయి.



అందాల తారలు.. అందమైన హృదయాలు..

బాలసదన్ అనాథ చిన్నారులకు ఆత్మీయత పంచిన ప్రపంచ సుందరీమణులు

ఈ పాటకు ఇలా.. స్టెప్పులు వేయాలంటూ చిన్నారుల సందడి





సాక్షి, సిటీబ్యూరో: అందాన్ని దాటి అద్భుతమైన హృదయాన్ని చూడగలిగితే స్ఫూర్తినిచ్చే మనసులెన్నో, మనుషులెందరో..! దీనికి నిదర్శనంగా నిలిచింది నగరంలో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ వేదిక. రాష్ట్ర ప్రభుత్వం, మిస్ వరల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిర్వహించిన హార్ట్ ఆఫ్ గోల్డ్ చారిటీ ఈవెంట్ దీనికి నిదర్శనంగా నిలిచింది. ప్రభుత్వ బాలసదన్ అనాథ పిల్లలకు సహకారం అందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు ఈ అనాథ చిన్నారులకు మేమున్నామంటూ పలకరించారు. ఒడిలో కూర్చోబెట్టుకుని ఆ చిన్నారుల చిట్టి పొట్టి పలుకులను ఆస్వాదించారు. వారితో ఆడారు, పాడారు, గుండెకు హత్తుకుని ఆత్మీయత పంచారు. తారలు దిగివచ్చిన వేళ అంటూ సాగిన ఈ కార్యక్రమంలో దృష్టి లోపం ఉన్న, హెచ్‌ఐవీతో జీవిస్తున్న పలువురు చిన్నారులు కష్టాలను మర్చిపోయి మధుర స్మృతులను పొందారు. సిస్టర్ సిస్టర్ ఈ తెలుగు పాటకు అలా స్టెప్ వేయొద్దు, నన్ను చూడు ఇలా వెయ్యి అంటూ పసితనాన్ని, స్వచ్ఛతను మిస్ తారలకు చూపించారు. కార్యక్రమంలో మాజీ మిస్ వరల్డ్ క్రిస్టీనాతో పాటు మిస్ ఇండియా నందిని గుప్తా, వివిధ దేశాలకు చెందిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు పాల్గొన్నారు.

లైఫ్‌స్టైల్ ఉత్పత్తులు అందించే వెబ్‌సైట్ షురూ


సాక్షి, సిటీబ్యూరో: లైఫ్‌స్టైల్ ఉత్పత్తులకు వెరైటీ యాక్సెసరీస్‌కు పేరొందిన బాగ్‌జోన్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నగరంలోని వినియోగదారుల కోసం డిజిటల్ సేవల్ని విస్తరిస్తోంది. ఈ విషయాన్ని సంస్థకు చెందిన డిజిటల్ – కమ్యూనికేషన్స్ హెడ్ నిశాంత్ బక్లివాల్ తెలిపారు. విలాసవంతమైన ఉత్పత్తుల విశేషాలతో అకికి లండన్(https:// www. akikilondon. com) పేరిట వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నామని, అకికి లండన్ తొలి కలెక్షన్‌గా లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామని వివరించారు.





ఏఐ ఆధారిత కళ్లద్దాల షో..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ప్రీమియం ఐవేర్ రిటైల్ చైన్ రే–బాన్ మెటా ఏఐ గ్లాసెస్‌ను రూపొందించింది. రే–బాన్ మెటా పరస్పర సహకారంతో తయారైన ఈ అత్యాధునిక ఏఐ–ఆధారిత సాంకేతిక ఆవిష్కరణలను ఇప్పుడు నగరంలోని జీకెబి ఆప్టికల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాన్ని జీకెబి డైరెక్టర్ ప్రియాంక గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. ఫొటోలు వీడియోలను రిసీవ్ చేసుకోవడానికి, సంగీతాన్ని వినడానికి, కాల్స్ చేయడంతో పాటు వినియోగదారులు నేరుగా మెటా ఏఐతో సంభాషించడానికి వీలు కల్పించే గ్లాసెస్ ప్రదర్శనకు హాజరై వీటి విశేషాలు ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చన్నారు.



నందిని గెలిస్తే.. నెంబర్ వన్ మనమే..

- మిస్ వరల్డ్ టైటిల్స్ వేటలో భారత్ ముందంజ
- నెంబర్ వన్ కావడానికి ఇంకా ఒక్క టైటిల్ దూరంలో..
- మరో దేశంతో కలిసి నెం.1 స్థానం పంచుకుంటున్న వైనం
- అత్యధిక టైటిల్స్ గెలిచిన ఏకైక దేశంగా రికార్డ్
- ఇందుకు మనసిటీ వేదిక కావాలని పలువురి ఆకాంక్ష

మిస్ వరల్డ్ 2025 పోటీల్లో కీలక ఘట్టాలకు తెరలేచింది. మరో వారం రోజుల్లో ప్రపంచ సుందరి ఎవరో తేలనుంది. నగరంలో తొలిసారి జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో ఈ సారి భారతీయ సుందరి నందిని గుప్తా గెలిస్తే.. అది మరో కిరీటాన్ని భారత్‌కు అందించడం మాత్రమే కాదు అత్యధిక టైటిల్స్ గెలుచుకున్న దేశం అనే రికార్డ్‌ని కూడా అందిస్తుంది. - సాక్షి, సిటీబ్యూరో

ప్రస్తుతం నెం.1 స్థానంలో ఉన్నా..

మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమైన 15ఏళ్ల తర్వాత తొలిసారిగా మన దేశం నుంచి 1966లో రీటా ఫరియా టైటిల్ గెలిచారు. ఆ తర్వాత 1994లో ఐశ్వర్యారాయ్, 1997లో డయానా హేడెన్, 1999లో యుక్తాముఖి, 2000లో ప్రియాంకా చోప్రా, 2017లో మానుషి చిల్లర్ ఈ టైటిల్స్‌ను సాధించి దేశాన్ని అగ్రస్థానంలో నిలిపారు. అదే విధంగా వెనిజులా 1955, 1981, 1984, 1991, 1995, 2011లలో ప్రపంచ సుందరి కిరీటాల్ని దక్కించుకుంది. తద్వారా ఇండియా, వెనిజులా – రెండూ సమానంగా 6 టైటిల్స్ గెలుచుకుని నెంబర్ వన్ స్థానాన్ని పంచుకుంటున్నాయి. మన తర్వాత యునైటెడ్ కింగ్డమ్ (యుకె) 5 టైటిల్స్, జమైకా, ఐస్లాండ్ – రెండూ చెరో 3 టైటిల్స్ గెలుచుకున్నాయి.

నగరంపై నజర్

ఈ నేపథ్యంలో ప్రస్తుతం గ్లామర్ ప్రపంచం దృష్టి మొత్తం నందిని గుప్తాపైనా, హైదరాబాద్ నగరంపైనే ఉంది. ఈ దఫా టైటిల్‌ను నందిని గెలిస్తే అది భారత్‌ను ప్రపంచ సుందరి పోటీల్లో నెం.1 స్థానానికి చేరుస్తుంది. కాబట్టి ఆ ఘనత నగరం వేదికగా సాకారం కావాలని గ్లామర్ రంగ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

పాడ్‌కాస్టింగ్.. ట్రెండింగ్

శ్రీనగర్‌కాలనీ: ఓ వ్యక్తి అనుభవాలు.. ఎదుర్కొన్న కష్టాలు.. సాధించిన విజయాలు.. పలువురికి ఉపయోగపడే సంఘటనలు.. ఇలా ఎన్నో అంశాలను తెలుసుకోవడానికి పేపర్ చదవడం, రేడియోలో వినడం, టీవీలో చూడటం చేసేవాళ్లం. ఆయా అంశాల గురించి తెలుసుకునేవారం.. ఇప్పుడంతా ఫోనే.. తింటున్నా.. నడుస్తున్నా.. జర్నీ చేస్తున్నా.. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా ఫోన్.. ఒక్కసారి యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర యాప్స్ ఓపెన్ చేస్తే చాలు వేలు, లక్షల సంఖ్యలో వీడియోలు అందుబాటులో ఉంటున్నాయి. అయితే.. ప్రస్తుతం పాడ్‌కాస్టింగ్ ట్రెండ్ కొనసాగుతోంది. ఇది కొన్నేళ్ల క్రితమే మొదలైనా ప్రస్తుతం పాడ్‌కాస్టింగ్ అంటే అందరికీ తెలుస్తోంది. ఇంటర్వ్యూ ట్రెండ్ అవ్వాలంటే పాడ్‌కాస్టింగ్‌తోనే అన్నట్లుగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏడాది కాలంగా మరింత ట్రెండింగ్‌గా మారి సెలెబ్రిటీస్‌తో పాడ్‌కాస్టింగ్ కోట్లలో వ్యూస్‌ని తెచ్చిపెడుతోంది.



పాడ్‌కాస్టింగ్..

పాడ్‌కాస్టింగ్ అంటే ఒక వ్యక్తి తన విజ్ఞానాన్ని, పలు విషయాలను పూర్తిగా వివరించే ప్రక్రియే పాడ్‌కాస్టింగ్.. ఆడియో, వీడియో, మోనో, గ్రూప్ పాడ్‌కాస్టింగ్ చాలా రూపాల్లో ఉంటుంది. ఒకప్పుడు రేడియోలో ఒక వ్యక్తి తన రంగానికి సంబంధించిన విషయాలను వెల్లడించడమే ఇప్పుడు రికార్డింగ్ రూపంలో ఒక క్లారిటీ ఆడియో, వీడియోను చేయడమే.. ఆడియో పాడ్‌కాస్టింగ్ చాలా తక్కువ టైంలో అవుతుంది. అదే గ్రూప్, ఇద్దరు వ్యక్తుల పాడ్‌కాస్టింగ్ వీడియో పాడ్‌కాస్టింగ్ చేయాలంటే మైక్స్, మ్యూజిక్, ఎడిటింగ్ ఖచ్చితంగా చేయాలి.

యూట్యూబ్‌లో కోట్లలో వ్యూస్..


భారత్‌లో పాడ్‌కాస్టింగ్‌కు డిమాండ్ పెరిగింది. ఫుడ్, బిజినెస్, పొలిటికల్, ఎంటర్‌టైన్‌మెంట్, సైన్స్, టెక్నాలజీ ఇలా అన్ని రంగాల్లో రాణించిన వారు తమ అనుభవాలను పాడ్‌కాస్టింగ్‌లో వెల్లడిస్తున్నారు. ఇందులో వీడియో పాడ్‌కాస్టింగ్ చాలా పాపులర్ అయ్యింది. ఒక యూట్యూబర్ లేక ఒక వ్యక్తి ఫేమస్ పర్సన్‌ను వారి అనుభవాలను విశ్లేషణాత్మకంగా, పూర్తిగా వారి అనుభవాలను నెటిజన్లను తెలియజేయడం ట్రెండింగ్‌గా మారింది. ఫేమస్ పర్సనాలిటీస్ వారి జీవిత విషయాలను పాడ్‌కాస్టింగ్‌లో వెల్లడించడంతో యూట్యూబ్, ఇతర సోషల్ మీడియాల్లో కోట్లలో వ్యూస్ వస్తున్నాయి. అంతేకాకుండా చానల్స్‌కి కూడా రూ.లక్షల ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది.

న్యూట్రిహబ్.. 'చిరు' ప్రయత్నం

తొలి భారతీయ మిల్లెట్ బ్రాండ్ 'ఈట్‌రైట్' • రెడీ టు ఈట్ చిరుధాన్య ఆహారోత్పత్తులు

500కు పైగా స్టార్టప్‌లకు మార్గదర్శనం • తెలుగువాళ్లు ఏర్పాటు చేసినవే 200

సాక్షితో ఐసీఏఆర్-ఐఐఎంఆర్ సీఈవో డాక్టర్ బి.దయాకర్‌రావు



చిరుధాన్యాలు.. మరుగున పడిపోయిన పోషక ధాన్యాలు. కానీ జీవనశైలి వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని 'భారతీయ చిరుధాన్య పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-ఐఐఎంఆర్)'చిరుధాన్యాలను తిరిగి ప్రజల ఆహారంలోకి చేర్చేందుకు కృషి చేస్తోంది. ఆధునికులు ఇష్టపడే రెడీ టు ఈట్ ఆహారోత్పత్తులను అందుబాటులోకి తేవటానికి 9 ఏళ్ల క్రితం 'న్యూట్రిహబ్'పేరిట టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను నెలకొల్పింది. చిరుధాన్యాలతో చిరుతిళ్లు, అల్పాహార ఉత్పత్తులను తయారు చేసి, విక్రయించటంలో 500కు పైగా స్టార్టప్‌లకు న్యూట్రిహబ్ మార్గదర్శనం చేసింది. న్యూట్రిహబ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో), ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.దయాకర్ రావు విశేష కృషి చేస్తూ చిరుధాన్యాలతో 110 రకాల ఆధునిక ఆహారోత్పత్తులను తయారు చేసే సాంకేతికతలను ప్రామాణీకరించారు. 'ఈట్‌రైట్' పేరిట తొలి భారతీయ చిరుధాన్య ఉత్పత్తుల బ్రాండ్‌ను నెలకొల్పారు. ఈ నేపథ్యంలో డా.దయాకర్ రావుతో ముఖాముఖి.

- సాక్షి, సాగుబడి

ప్రశ్న: 'న్యూట్రిహబ్'సీఈవోగా మీ ఆధ్వర్యంలో చిరుధాన్యాలను ఆహార మార్కెట్‌లోకి ప్రవేశపెట్టేందుకు బహుముఖ కృషి జరిగింది. ఏకంగా 110 రకాల చిరుధాన్యాల ఆధునిక ఆహారోత్పత్తుల తయారీ సాంకేతికతలను ప్రామాణీకరించటం ప్రపంచంలోనే ఒక అపూర్వమైన విషయం. ఇది ఎలా సాధ్యమైంది?

జవాబు: మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వినియోగం పెరగాలంటే మార్కెట్ సృష్టించాలి. చిరుధాన్యాల్లో పోషకాలు, విలువ జోడింపు, శుద్ధి, యంత్రాల అభివృద్ధి, బ్రాండింగ్, ప్రాచుర్యం కల్పించటం, విధాన నిర్ణేతలకు మౌలిక నివేదికలు అందించటం వంటి విషయాల్లో సమగ్ర దృష్టితో చేసిన కృషి ఫలించటం వల్లనే స్టార్టప్‌లు, ఆహార కంపెనీలు సైతం చిరుధాన్యాల ఉత్పత్తులను పెద్దఎత్తున మార్కెట్‌లోకి తేగలిగాయి.

ప్ర: తొలి భారతీయ మిల్లెట్ బ్రాండ్ 'ఈట్‌రైట్'గురించి చెబుతారా?

జ: 2010లో ప్రపంచబ్యాంకు ప్రాజెక్టులో భాగంగా ఐఐఎంఆర్ సొంత బ్రాండ్ 'ఈట్‌రైట్'ను ప్రారంభించి, ప్రజలకు చిరుధాన్య ఆధునిక ఆహారాలను అందుబాటులోకి తెచ్చాం. రైతులు పశుగ్రాసం కోసమే చిరుధాన్యాలు సాగు చేసే పరిస్థితుల్లో చిరుధాన్యాలకు విలువ జోడించి ఉత్పత్తులు తయారు చేసే వ్యాల్యూ చెయిన్‌ను రూపొందించేందుకు కృషి చేశాం. ఐటీసీతో కలసి రైతుల నుంచి చిరుధాన్యాలు కొనుగోలు చేయించి, ప్రాసెసర్లకు సరఫరా చేయించాం. మిల్లెట్ సైన్స్‌ను బిల్డ్ చేసే క్రమంలో ఎన్ఐఎన్‌తో కలసి షుగర్‌పై క్లినికల్ ట్రయల్స్ చేశాం.

ప్ర: జాతీయ, అంతర్జాతీయంగా ప్రజలకు వందలాది ఆధునిక చిరుధాన్య ఆహారోత్పత్తులను పరిచయం చేసిన తొలి శాస్త్రవేత్తగా మీ అనుభవాలేమిటి?

జ: ఉత్తరాదిలో చిరుధాన్యాలంటే సజ్జలు మాత్రమే. మిగతా చిరుధాన్యాలను, వాటిలో పోషకాలను వారికి అవగాహన కల్పించి 500 వరకు వంటకాలను పరిచయం చేశాం. అంతర్జాతీయంగా 250 మిల్లెట్ రెసిపీలను అందించాం. జీ-20 సభల కాలంలో 150 దేశాల ఎంబసీలకు ఈ రెసిపీలను అందించాం. అమెరికన్ కాన్సులేట్ వాళ్లు ఈ రెసిపీ బుక్స్‌ను తిరిగి పబ్లిష్ చేసి పంపిణీ చేశారు. దుబాయ్, జర్మన్ ఎక్స్‌పోలలో ప్రమోషన్ చేశాం. భవిష్యత్తులో చిరుధాన్యాల ఆహార పరిశ్రమ భేషుగ్గా ఉంటుంది. ఆన్‌లైన్ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి.

ప్ర: ఏయే టెక్నాలజీలకు ఆదరణ ఎక్కువగా ఉంది?

జ: రెడీ టు ఈట్ మిల్లెట్ ఉత్పత్తులు తయారు చేసే టెక్నాలజీలకు ఆదరణ బాగుంది. వాటిలో కొన్ని: న్యూట్రిబార్, చీజ్ బాల్స్, బ్రేక్‌ఫాస్ట్ సీరియల్స్ (ఫ్లేక్స్, మిస్లీ), మఫిన్స్, కుకీస్, బ్రెడ్, వర్మిసెల్లి, పాస్తా, వరి బియ్యంలా కనిపించే చిరుధాన్యాల అనలాగ్ బియ్యం, మిల్లెట్ మిల్క్ (నాన్ డెయిరీ మిల్క్).

ప్ర: ఈ టెక్నాలజీలలో మీకు అత్యంత కష్టం అనిపించిన, సంతృప్తినిచ్చినవి ఏవి?

జ: ఉదయపు అల్పాహారంలోకి వాడే మిల్లెట్ ఫ్లేక్స్, నూడుల్స్, బ్రెడ్, మిల్లెట్ (ప్లాంట్ బేస్డ్) మిల్క్ వంటి సాంకేతికతలను అభివృద్ధి చేయటానికి అదనంగా కష్టపడ్డాం. చిరుధాన్యాలతో గ్లుటెన్ ఫ్రీగా మిల్లెట్ ప్రొడక్ట్స్ చెయ్యాలంటే బంక కోసం మైదాకు బదులు ఏమి వాడాలి.. దాని రుచి, రూపం ఎలా ఉండాలి అని పరిశోధించాం. కర్రపెండలం వాడాం. ప్లాంట్ బేస్డ్ మిల్క్ తయారు చేశాం. కర్డ్, పన్నీర్‌పై పనిచెయ్యాల్సి ఉంది. 'కంపోజిట్ ఫుడ్స్'తయారీపై పరిశోధన చేస్తున్నాం. ఉదాహరణకు.. విటమిన్ డితో కూడిన మిల్లెట్ ఉత్పత్తుల కోసం మష్రూమ్స్ కలుపుతున్నాం. మిల్లెట్ ఫిష్ సాసేజ్‌లు తయారు చేశాం. ఇప్పటివరకు 110 టెక్నాలజీలను ప్రామాణీకరించి, వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకొని ఉత్పత్తులు తయారు చేయటానికి 500 స్టార్టప్‌లకు, 200కుపైగా పెద్ద ఆహార కంపెనీలకు లైసెన్స్‌లు ఇచ్చాం. ఫ్లేకింగ్ ప్రాసెస్, పెద్ద రోటీ మిషన్, చిన్న రోటీ మిషన్.. ఈ మూడు టెక్నాలజీలకు పేటెంట్లు వచ్చాయి.

ఆయన మార్గదర్శకత్వంలో...

వ్యవసాయ ఆర్థికవేత్తగా 32 ఏళ్ల సర్వీసులో జాతీయ, అంతర్జాతీయ సమాజానికి పలు వైవిధ్యభరితమైన చిరుధాన్య ఆహార సాంకేతికతలను అందించిన శాస్త్రవేత్త డా.దయాకర్‌రావు. 200కు పైగా పెద్ద ఆహార పరిశ్రమలకు మిల్లెట్ ఫుడ్ టెక్నాలజీలను అందించటం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానం చేయటం ద్వారా మిల్లెట్ వాల్యూ చెయిన్‌ను అభివృద్ధి చేయటంలో ఆయన కీలకపాత్ర నిర్వహించారు. దయాకర్‌రావు మార్గదర్శకత్వంలో చిరుధాన్యాలతో చేసిన చిరుతిళ్లు, అల్పాహార ఉత్పత్తులను తయారు చేసి, విక్రయించటంలో 500కు పైగా స్టార్టప్‌లకు న్యూట్రిహబ్ మార్గదర్శనం చేసింది.



ప్ర: తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని మిల్లెట్ స్టార్టప్‌లు వచ్చాయి? విజయపథంలో పయనిస్తున్న స్టార్టప్‌లు ఎన్ని? వాటికి కలిసొచ్చిన అంశాలేమిటి?

జ: స్టార్టప్‌లలో మనవాళ్లవే ఎక్కువ. 200 వరకు ఉంటాయి. ఇందులో సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్నవి 50 వరకు ఉంటాయి. ఐఐఎంఆర్ హైదరాబాద్‌లో ఉండటం, ప్రభుత్వాల ప్రోత్సాహం, ప్రజల్లో షుగర్ సమస్య పెరగడంతో ఆహార చైతన్యం ఎక్కువగా ఉండటం, స్టార్టప్ నిర్వాహకుల్లో ప్యాషన్ వంటివి కలిసొచ్చాయి.

ప్ర: మీ ఆధ్వర్యంలో 500కు పైగా స్టార్టప్‌లకు న్యూట్రిహబ్ ఇంక్యుబేషన్ సేవలు అందించింది. వీటిలో ఎన్నిటికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు అందింది? వాటిలో ఎన్ని విజయం సాధించాయి? అందుకు కారణాలేమిటి?


జ: చిరుధాన్యాలతో చేసిన చిరుతిళ్లు, అల్పాహార ఉత్పత్తులను తయారు చేసి, విక్రయించటంలో 500కు పైగా స్టార్టప్‌లకు న్యూట్రిహబ్ మార్గదర్శనం చేసింది. మొత్తంగా రూ.1,000 కోట్ల వరకు ఈ స్టార్టప్‌లు పెట్టుబడి పెట్టాయి. అర్హులైన 110 స్టార్టప్‌లకు ఆర్‌కేవీవై రఫ్తార్ పథకం కింద రూ.10.5 కోట్ల నిధులను సమకూర్చాం. 200కు పైగా ప్రముఖ కంపెనీలు కూడా న్యూట్రిహబ్ నుంచి టెక్నాలజీలను తీసుకున్నాయి. సాధారణంగా ఏ రంగంలోనైనా 90% స్టార్టప్‌లు లాభాల్లోకి రాకముందే మూలనపడతాయి. కానీ మిల్లెట్ స్టార్టప్‌లు 40-50% వరకు దేశవ్యాప్తంగా వ్యాపారం చేస్తూ చక్కగా పనిచేస్తున్నాయి. ఎఫ్ఎంసీజీ మార్కెట్‌లో రెడీ టు ఈట్/ రెడీ టు కుక్ జంక్ ఫుడ్స్‌కు ఉన్న మార్కెట్‌లో 2-5 శాతం వరకు మిల్లెట్ స్టార్టప్స్ చేజిక్కించుకోగలిగాయి. ఈ ఉత్పత్తులన్నీ అతి తక్కువ ప్రాసెసింగ్‌తో చేసినవి కాబట్టి ఆరోగ్యానికి చాలా మంచివి.

బాగా నడుస్తున్న స్టార్టప్‌లలో కొన్ని: ట్రూగుడ్, స్లర్ప్ ఫామ్స్, మిల్లెట్ అమ్మ, మిల్లెట్ మార్వెల్స్, మెబ్బిల్స్, దేశీ న్యూట్రి, బ్లిస్ ట్రీ, నౌరిష్ యు, మిల్లెట్ బ్యాంక్.

క్లుప్తంగా...

రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



సాక్షి, న్యూఢిల్లీ: తాను రాజకీయాల్లోకి వచ్చినా.. ఉద్యమాలకు సంబంధించిన కండువా మాత్రం మారదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. చట్టసభల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు అనేకం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం.. తన భవిష్యత్ ప్రయాణం ఉంటుందని వెల్లడించారు. ఆయన బుధవారం ఢిల్లీలోని ఏపీ/తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ తోనే మాదిగలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. వ్యక్తిగతంగా తన పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఉద్యమకారుల ఉద్యమం వల్లే అందుకున్నట్లు చెప్పారు. తాను 1994లో ఉద్యమాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఉధృతస్థాయికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ఉద్యమానికి సమాజంలోని అన్ని వర్గాల వారు అండదండలు అందించారని చెప్పారు.

టీచర్ల సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయి నివేదిక

పీఆర్టీయూటీఎస్ నేతలతో శ్రీపాల్‌రెడ్డి టెలి కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సమగ్ర నివేదిక రూపొందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి నిర్ణయించారు. ఈ అంశంపై పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డితో కలిసి బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలలు తెరిచేలోగా క్షేత్రస్థాయిలో టీచర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సమన్వయం చేయాలని నిర్ణయించారు. జిల్లా, మండలాల వారీగా టీచర్ల సమస్యలను గుర్తించేందుకు, వారికి అండగా ఉండేందుకు సమగ్ర సమాచారం సేకరించాలని పీఆర్టీయూటీఎస్ నేతలకు శ్రీపాల్‌రెడ్డి సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, పదోన్నతులు, బదిలీల వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. తెలంగాణలో ఏఐఎఫ్‌టీవో నిర్ణయాలకు ప్రచారం కల్పించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించేందుకు క్షేత్రస్థాయిలో చేస్తున్న కృషిపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి: కొమరయ్య

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన బుధవారం సీఎంకు లేఖ రాశారు. టీచర్లకు పదోన్నతులు కల్పించాలని, సకాలంలో బదిలీలు చేపట్టాలని, ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయాలని కోరారు. విద్యాశాఖ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఆయన స్వాగతించారు.

ఎన్నికల హామీలు.. మేనిఫెస్టో అమలే హీరోయిజం

కడపలో మహానాడు నిర్వహించడం హీరోయిజం కాదు

వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీలో వైఎస్ జగన్

జగన్‌ను తిట్టడం హీరోయిజం కాదు.. హీరోయిజం, సత్తా అంటే హామీలను అమలు చేయడం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం

- ఇదిగో మా మేనిఫెస్టో.. వీటిని నెరవేర్చామని రాష్ట్రంలో ఏ ఇంటికైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలను పంపి ఆశీర్వాదం కోరే ధైర్యం ఉందా బాబూ?
- వాళ్లు ఏ ఇంటికి వెళ్లినా చిన్న పిల్లలు, చిన్నమ్మలు, అత్తమ్మలు, రైతన్నలు, నిరుద్యోగులు నిలదీస్తారు
- మా పాలనలో ప్రతి ఇంటికీ మంచి చేశాం.. అది ప్రతి ఇంట్లో ఇంకా బతికే ఉంది
- ప్రశ్నించే గొంతులను నొక్కేసేందుకే రెడ్‌బుక్ బెదిరింపులు.. జగన్ 2.0లో కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం



బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మహానాడు కార్యక్రమం ఒక పెద్ద డ్రామా అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. తెలుగు డ్రామా పార్టీ (టీడీపీ) కడప జిల్లాలో నిర్వహిస్తున్న మహానాడులో సీఎం చంద్రబాబు ఫోజులిస్తూ.. బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. హీరోయిజం అంటే.. కడప జిల్లాలో మహానాడు నిర్వహించడం కాదు..! హీరోయిజం అంటే.. ఇచ్చిన హామీలను నెరవేర్చడం అని చంద్రబాబుకు చురకలంటించారు. ''సత్తా అంటే కడపలో మహానాడు నిర్వహించడం కాదు.. ఆ కార్యక్రమంలో జగన్‌ను తిట్టడం హీరోయిజం ఎలా అవుతుంది?''అని నిలదీశారు. 'ఇదిగో మా మేనిఫెస్టో.. వీటిని నెరవేర్చామని రాష్ట్రంలో ఏ ఇంటికైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలను పంపి ఆశీర్వాదం కోరే ధైర్యం ఉందా చంద్రబాబూ? గడప గడపకూ తిరిగే సాహసం చేయగలరా?'అని సూటిగా ప్రశ్నించారు. ఇవాళ టీడీపీ నేతలు, కార్యకర్తలు ఏ ఇంటికి వెళ్లినా మాకు ఇవ్వాల్సిన తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్లు, అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని చిన్న పిల్లలు, చిన్నమ్మలు, అత్తమ్మలు, రైతన్నలు, నిరుద్యోగులు నిలదీస్తారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ సాకులు వెతుక్కోకుండా చిత్తశుద్ధితో 99 శాతం హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. ఇవాళ్టికీ తమ పార్టీ కార్యకర్తలకు రాష్ట్రంలో ఏ ఇంటికైనా వెళ్లి మేం వైఎస్సార్‌సీపీ వాళ్లం అని తలెత్తుకుని గర్వంగా చెప్పే ధైర్యం ఉందని స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట, అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీలు, కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు నగర పంచాయతీ, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే..

మనం చేసిన మంచి ప్రతి ఇంట్లోనూ బతికే ఉంది..

ప్రజలకు మనం చేసిన మంచి ఎక్కడకూ పోలేదు. ప్రతి ఇంట్లోనూ మనం చేసిన మంచి బతికే ఉంది. చంద్రబాబు పాలనకు, మన పాలనకు తేడా స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రి తర్వాత పగలు రాక తప్పదు. రెండు ప్రభుత్వాల మధ్య తేడాను ఇప్పుడు ప్రజలు గమనిస్తున్నారు. ఇవాళ టీడీపీ కార్యకర్తలు ఏ ఇంటికి వెళ్లినా వాళ్లు ఇచ్చిన మేనిఫెస్టోలు, బాండ్లు, కరపత్రాలు ఇప్పటికీ ఉన్నాయి. అందుకే వాళ్లు ఏ ఇంటికైనా వెళ్లి ఆశీర్వదించమని కోరితే.. చిన్న పిల్లల నుంచి ప్రశ్నించడం మొదలవుతుంది. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికొదిలేశారు. 143 హామీలను పూర్తిగా పక్కన పెట్టారు. చిన్న హామీ అయిన ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయడం లేదు. మరో చిన్న హామీ ఉచిత గ్యాస్. కనీసం ఆ గ్యాస్ సిలిండర్లు కూడా సరిగా ఇవ్వలేకపోయారు.

ప్రశ్నించే గొంతులు నొక్కేందుకే అక్రమ కేసులు..

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. చంద్రబాబు పాలనా వైఫల్యాలు, అన్యాయాలను ప్రశ్నిస్తే చాలు.. ఆ గొంతు వినపడకుండా భయోత్పాతం సృష్టిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. చట్టం, రాజ్యాంగం దారుణ ఉల్లంఘనకు గురవుతోంది. గతంలో జరిగిన ఘటనల్లో మనవాళ్లను ఇరికించి జైల్లో పెట్టే కార్యక్రమం రెడ్ బుక్ రాజ్యాంగంలో జరుగుతోంది.

వడ్డీతో సహా చెల్లిస్తాం...

మన హయాంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా సమస్యలు చెప్పి ఎక్కువ పరిష్కారాలు పొందిన వాళ్లు టీడీపీ వారే! నాడు ఎమ్మెల్యేలు వద్దన్నా.. వారికి మనం మంచి చేశాం. స్పందనలో అత్యధికంగా ఫిర్యాదులు చేసిందీ వాళ్లే. కానీ ఈరోజు చంద్రబాబు అన్యాయాలు చేస్తున్నారు. దీనికి వడ్డీతో సహా చెల్లిస్తాం. అప్పుడే మరోసారి ఇలాంటి తప్పులు చేయడానికి భయపడతారు. రాష్ట్రం కూడా బాగు పడుతుంది.

మీ అందరికీ హ్యాట్సాఫ్..

ఇవాళ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచే చంద్రబాబు అరాచకాలు చేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిచోటా ఇదే చేయమని తన ఎమ్మెల్యేలను ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో.. విలువలు, విశ్వసనీయత అనే పదానికి అర్థం చెబుతూ మన పార్టీలో చిన్న పదవుల్లో ఉన్నవారైనా.. ఏకంగా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు లాంటి వ్యక్తికి గట్టి గుణపాఠం నేర్పారు. రాజకీయాలంటే నీ మాదిరిగా కాదు.. మమ్మల్ని చూసి నేర్చుకో..! అని చంద్రబాబుకు గుణపాఠం చెప్పారు. అందుకు మీ అందరికీ నా హ్యాట్సాఫ్.

ఆరు శాసనాలతో చరిత్ర సృష్టిస్తాం

రాబోయే 40 ఏళ్లకు రోడ్ మ్యాప్: సీఎం చంద్రబాబు • జూన్ 12న తల్లికి వందనం ఇస్తామని వెల్లడి



సాక్షి, అమరావతి: మహానాడు వేదికగా చేసిన ఆరు శాసనాలు తెలుగువారి చరిత్రను తిరగరాయనున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయాలన్నదే తన సంకల్పమని, రాబోయే 40 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నామని చెప్పారు. ఆరు శాసనాలు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్‌ని అభినందిస్తున్నానన్నారు. కడపలో బుధవారం రెండో రోజు మహానాడులో చంద్రబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో, పాలనా విధానాల్లో నూతనత్వం కోసం ఆరు శాసనాలను తెచ్చామన్నారు. పార్టీలోకి వలస పక్షులు వస్తాయి, పోతాయని.. అవకాశవాదుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సీల వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నామన్నారు. లక్ష మంది డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. జూన్ 12న తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలతో రైతుల జీవితాలు మారుస్తామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి బాబు

మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లపాటు ఆయన పదవిలో ఉంటారు. చంద్రబాబు అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత పార్టీ నేత వర్ల రామయ్య ఆయనతో ప్రమాణం చేయించారు. మహానాడు రెండో రోజు 15 అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు.

తెనాలి ఘటనపై డీజీపీకి జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు

విదసం ఫిర్యాదు నేపథ్యం

మహారాణిపేట: తెనాలిలో దళిత యువకులను పోలీసు అధికారులు నడిరోడ్డుపై దారుణంగా కొట్టిన ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబుకు విదసం ఫిర్యాదు చేసింది. దీనిపై కమిషన్ ఏపీ డీజీపీకి నోటీసు జారీ చేసింది. విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయం తెలిపారు. నేరస్తులు, రౌడీ షీటర్లు అంటూ విచక్షణా రహితంగా, చట్ట విరుద్ధంగా పోలీసు అధికారులు నడిరోడ్డుపై దళితులను కొట్టడం క్రిమినల్ చర్యని, ఇది సర్వీసు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడటమేనని ప్రకటన ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనకు పాల్పడిన పోలీసులపై క్రిమినల్ చర్యలతోపాటు ఉద్యోగం నుంచి తొలగించే దిశగా గుంటూరు ఎస్పీ చర్యలు తీసుకోవాలని విదసం నేతలు ఓంకార్, సోడదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్, కస్తూరి వెంకటరావు ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాచరిక పాలనను కలంతో ఎదురొడ్డిన ధీరుడు

సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు



పురస్కారాలను అందజేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో వరప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడు తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. తెలంగాణ భాష, యాస, గుర్తింపు కోసం ప్రతాపరెడ్డి చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతిని పురస్కరించుకుని 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం 2025'ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో జరిగింది. శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథులుగా శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌కు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం సురవరం పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం ద్వారా ఆ మహనీయుడిని సముచితంగా గౌరవించిందన్నారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, నిజాం కాలంలో తెలుగును ఉచ్చరించే పరిస్థితి కూడా లేని పరిస్థితుల్లో తెలుగు భాష కోసం పోరాటం చేసిన మహాయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణహిత'పై ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సవాళ్లు

కోనప్ప, పాల్వాయిలను అడ్డుకున్న పోలీసులు



కాగజ్‌నగర్‌లోని ఇంటి వద్ద హరీశ్‌బాబును అడ్డుకుంటున్న పోలీసులు

కాగజ్‌నగర్ టౌన్: ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంపై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. నాయకులిద్దరూ బుధవారం బహిరంగ చర్చకు సిద్ధం కావడంతో ఉద్రిక్తత నెలకొంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో ఇటీవల నిర్వహించిన కోనేరు ఆత్మీయ సమ్మేళనం సభలో కోనేరు కోనప్ప ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై విమర్శలు చేశారు. దీనికి ప్రతి సవాలుగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాణహిత ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం వద్దే తేల్చుకుందాం రమ్మంటూ సవాల్ విసిరారు. కాగజ్‌నగర్ పట్టణం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బహిరంగ చర్చకు వెళ్లేందుకు ఇద్దరు నేతలూ సిద్ధమయ్యారు. దీంతో ఎమ్మెల్యే హరీశ్‌బాబును ఇంటి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు కోనేరు కోనప్ప, అతని అనుచరులను కూడా అడ్డుకుని గృహ నిర్బంధం చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా సిద్దిపేటకు సాగునీరు తరలిపోతుంటే కోనప్ప చూస్తూ ఊరుకున్నారని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టొద్దని గతంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు తల్లి, ఆయన కుటుంబ సభ్యులు ధర్నాలు చేశారని కోనప్ప ఆరోపించారు. మరోవైపు జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావును కౌటాల వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

● న్యూస్‌మేకర్



ఎనిమిది నెలలు
ఒక సెయిలింగ్ వెసెల్.
ఇద్దరే నావికులు...
మూడు మహా సముద్రాలను
నాలుగు ఖండాలను
50,000 కిలోమీటర్ల దూరాన్ని
భీకర వాతావరణాన్ని
దాటి విజేతలుగా
నేడు (మే 29)న గోవాకు
చేరుకోనున్నారు.
వీరికి ఘన స్వాగతం చెప్పడానికి
కేంద్రమంత్రి రాజ్‌నాథ్ రానున్నారు.
ఇండియన్ నేవీ ఆఫీసర్లు
దిల్‌నా, రూపాలకు హర్షధ్వానాలతో
స్వాగతం చెప్పాల్సిన సమయం ఇది.



● దిల్‌నా, రూపా

ప్రపంచం చుట్టిన
సాగర ధీరలకు స్వాగతం

భారత నౌకాయాన చరిత్రలో గతంలో స్త్రీల సాహసం ఎటువంటిదో నమోదు చేసే వివరాలు అంతగా తెలియదు. కాని వర్తమానంలో మన నారీశక్తి ఎంత గొప్పదో నిరూపించే ఘనయాత్రలను నావికా దళ మహిళా ఆఫీసర్లు పదే పదే నిరూపిస్తున్నారు. నావికాదళంలోని మహిళా నావికులు తమకు తాముగా సముద్రం మీద ప్రపంచ యాత్ర చేయగలరు అని చాటడానికి 2017-18లో ఆరుగురు మహిళా సిబ్బందితో 'నావికా సాగర్ పరిక్రమ - 1' జరిగింది. 40 వేల కిలోమీటర్లు ఐ.ఎన్.ఎస్.వి. తారిణిపై చుట్టివచ్చారు. ఆరుగురు సిబ్బంది అంటే ఒకరికొకరు సాయం చేసుకోవడంలో ఉండే వెసులుబాటు ఎక్కువ. అయితే మనవాళ్లు అక్కడే ఆగిపోలేదు. కేవలం ఇద్దరు మహిళా ఆఫీసర్లతో 'నావికా సాగర్ పరిక్రమ-2' చేయ సంకల్పించారు. ఇందుకు తగిన ఆఫీసర్ల ఎంపికకే సంవత్సర కాలం పట్టింది. అనేక వడపోతల తర్వాత ఇద్దరు ఆఫీసర్లు ఈ సాహసయాత్రకు యోగ్యత పొందారు. వారే లెఫ్టినెంట్ రూపా, లెఫ్టినెంట్ దిల్‌నా. కేవలం ఇద్దరు ఆఫీసర్లు అనంత జలరాశిపై సెయిలింగ్ బోట్ మీద 50 వేల కిలోమీటర్లు చుట్టి రావాలంటే ఎంత ధైర్యం... సాహసం ఉండాలి? ఎన్ని సవాళ్లను ఎదుర్కోవాలి? అసలు తిరిగి వస్తారో రారో అనే భయం అయినవాళ్లను పీడించకుండా ఉంటుందా? అయినప్పటికీ అవన్నీ దాటి ఆ ఇద్దరు ధీరవనితలు తమ సాగర పరిక్రమను దిగ్విజయంగా ముగించారు. ఎనిమిది సుదీర్ఘ నెలలు సముద్రంతో చెలిమి, చెలగాటం చేసి తిరిగి మన జలాలలోకి చేరుకున్నారు. నేడు వారికి ఘనస్వాగతం గోవాలో లభించనుంది.

అక్టోబర్ 2, 2024న ప్రారంభం

నావికా సాగర్ పరిక్రమ-2 అక్టోబర్ 2, 2024న గోవాలో మొదలైంది. ఇద్దరు నావికా ఆఫీసర్లు దిల్‌నా, రూపాలు అంతకుముందే ఐ.ఎన్.ఎస్.వి.తారణిలో చిన్న చిన్న దూరాలున్న సముద్ర యాత్రలు చేసి ఆ రిహార్సల్స్‌తో సర్వసన్నద్ధం అయ్యారు. వీరు ఎనిమిది నెలల పాటు తారణిలో ఉండాలి. 50 వేల కిలోమీటర్లు పడవ నడపాలి. మూడు మహా సముద్రాలు- ఇండియన్, పసిఫిక్, అట్లాంటిక్ గుండా ప్రయాణించాలి. నాలుగు ఖండాలు ఆసియా, ఆస్ట్రేలియా, సౌత్ అమెరికా, ఆఫ్రికాలను చుట్టాలి. కేవలం నాలుగు చోట్ల వీరు బ్రేక్ తీసుకునే ఏర్పాటు చేశారు. అవి- ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫాక్‌ల్యాండ్, కేప్‌టౌన్. తారిణిలో అత్యాధునిక సిగ్నెలింగ్ వ్యవస్థ ఉంటుంది. తీరం నుంచి నావికాదళం వీరితో అనుసంధానమై ఉండి వీరి యాత్రను గమనిస్తూ ఉంటుంది. అయినా సరే నడిసముద్రంలో నావ ఉన్నప్పుడు వీరు ఇరువురు మాత్రమే ఉంటారు. వీరితోపాటు నావ. ఎదురుగా అనంత జలరాశి.

గాలే కీలకం

లెఫ్టినెంట్ దిల్‌నా, రూపా ప్రయాణిస్తున్న తారిణి ఒక సెయిలింగ్ వెస్సెల్. అంటే గాలి వాటుతో ప్రయాణించాల్సిన తెరచాప పడవ. దీనికి 25 మీటర్ల ఎత్తు తెరచాపలు ఉన్నాయి. గాలి అదుపులో ఉంటే పడవ దూసుకెళుతుంది. 'ఒక్కోసారి సముద్రం మీద రోజుల తరబడి గాలి ఉండదు. నావ కదలదు. మన సహనం పరీక్షకు గురవుతుంది' అన్నారు దిల్‌నా, రూపా. అదే సమయంలో కేప్ హార్న్స్, కేప్ టౌన్, డ్రేక్ పాసేజ్ వంటి చోట ఇదే గాలి గంటకు 90 కిలోమీటర్ల వేగంతో వీస్తే పడవను అదుపు చేయడం ప్రాణాంతకం అవుతుంది. డ్రేక్ పాసేజ్ దగ్గర అలలు ఐదు మీటర్ల ఎత్తుకు ఎగిరిపడుతూ పడవను ముంచెత్తుతాయి. కాగితం పడవను ఊపినట్టు ఊపేస్తాయి. అంతేకాదు కొన్నిచోట్ల అతి శీతల గాలులు... వణికించే చలి... గడ్డకట్టినంత చల్లగా ఉండే సముద్రనీరు ఉంటాయి... వీటన్నింటిని తట్టుకోవడం వల్లే దిల్‌నా, రూపాలను ధీరలని, సాహస నావికులని అనాలి. ముఖ్యంగా 'కేప్ హార్న్'ను జయించే అదృష్టం అందరికీ దక్కదు. అది దాటిన వారికి 'కేప్ హార్నర్స్' అనే బిరుదును ఇస్తారు. ఇప్పుడు దిల్‌నా, రూపాలకు కూడా ఆ బిరుదు దక్కింది.

నీమో పాయింట్

సముద్ర ధ్రువంగా భావించే నీమో పాయింట్‌ను లెఫ్టినెంట్ దిల్‌నా, లెఫ్టినెంట్ రూపాలు ఈ సాగర పరిక్రమలో టచ్ చేయడం పెద్ద విశేషంగా చెప్పాలి. దాదాపుగా ఈ పాయింట్ దగ్గరకు నావికులు వెళ్లరు. దీనికి దగ్గరి భూభాగమే 2,688 కిలోమీటర్ల దూరంలో ఉంటుందంటే ఆలోచించుకోవచ్చు. ఈ పాయింట్‌కు భూమిపై ఉండే మనుషుల కంటే ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో ఉండే మనుషులే దగ్గర. ఆ పాయింట్‌ను దాటిన క్షణం చారిత్రాత్మకంగా దిల్‌నా, రూపా భావిస్తున్నారు. ఆ పాయింట్ దగ్గర ఇద్దరూ సంబరం జరుపుకున్నారు.

ఆకాశమూ, అగాధాలూ

గడప లోపలే ఉండిపోయినా స్త్రీ ఆకాశాలనూ అగాధాలనూ అందుకుంటూ ప్రయాణం సాగిస్తున్నది. సునీతా విలియమ్స్ ఆకాశానికి ఉన్న హద్దును చెరిపేస్తే దిల్‌నా, రూపాలు అగాధాల పట్ల ఉన్న భయాలను తొలగించారు.

సాహస వనితలు, చరిత్రలో నిలిచిపోయిన మహిళా నావికులు దిల్‌నా, రూపాలు గోవాకు నేడు చేరుకుంటున్న సందర్భంగా అందరూ ఉత్సవాలు జరపాలి. వీరి గాథను పాఠాలుగా చెప్పాలి.

బులియన్ 28న ముగింపు
(బంగారం 10 గ్రా.; వెండి కిలో: రూ.లలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,510
బంగారం (22 క్యారెట్లు)	89,229
వెండి	99,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,700
బంగారం (22 క్యారెట్లు)	89,350
వెండి	1,00,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,480
బంగారం (22 క్యారెట్లు)	89,350
వెండి	1,11,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,700
బంగారం (22 క్యారెట్లు)	92,030
వెండి	1,00,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	95,700
బంగారం (22 క్యారెట్లు)	88,040
వెండి	99,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,470
బంగారం (22 క్యారెట్లు)	89,350
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



72వ మిస్ వరల్డ్ కాంటెస్ట్‌కు హాజరైన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిస్కోవా బుధవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో బ్యూటీ విత్ ఎ పర్పస్ చారిటీ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్టినా యువతకు స్ఫూర్తినిచ్చేలా మాట్లాడారు.

ఫుల్‌స్టాప్ ఉండకూడదు

కిందటేడాది మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న క్రిస్టినా బ్యూటీ విత్ ఎ పర్పస్ అంబాసిడర్‌గా ప్రపంచమంతా పర్యటించింది. క్రిస్టినా పిస్కోవా ఫౌండేషన్ స్థాపించి దానిద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు చదువు దూరం కాకూడదన్న సంకల్పంతో టాంజానియాలో స్కూల్‌ను ప్రారంభించింది. సోంటా ఫౌండేషన్ ద్వారా చెక్ రిపబ్లిక్‌లోని వికలాంగులకు మద్దతు ఇస్తుంది.

చెక్ రిపబ్లిక్ దేశంలోని ట్రినెక్ నగరంలో పుట్టింది క్రిస్టినా. ఆ తర్వాత వారి కుటుంబం దేశ రాజధాని ప్రాగ్‌లో స్థిరపడింది. న్యాయశాస్త్రంలో, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన క్రిస్టినా మోడలింగ్‌పై ఆసక్తి ఉండటంతో అటుగా అడుగులు వేసింది. స్థానిక భాషతోపాటు ఇంగ్లిష్, పోలిష్, స్లోవాక్, జర్మనీ భాషల్లో ప్రావీణ్యం సాధించింది. లండన్‌లోని ఎలైట్ మోడల్ మేనేజ్‌మెంట్‌లో చేరి, అందాల పోటీలో పాల్గొనడానికి శిక్షణ తీసుకుంది. మిస్ చెక్ రిపబ్లిక్ పోటీల్లో పాల్గొని, తొలిప్రయత్నంలోనే కిరీటం దక్కించుకుంది.

సాధించగలం అనే నమ్మకం

మ్యూజిక్, ఫ్యాషన్, ఆర్ట్ అంటే ఇష్టపడే క్రిస్టినా తన సక్సెస్ గురించి వివరిస్తూ –"జీవితంలో ఫుల్‌స్టాప్ అనేది ఎప్పుడూ ఉండకూడదు. అన్నీ కామాలే ఉంచాలి. నేను మ్యూజిక్ నేర్చుకున్నా, ఆర్ట్ ఫామ్స్ నేర్చుకున్నా, మోడలింగ్ చేసినా... ఏ లక్ష్యం కోసం పనిచేసినా దానికి సంబంధించి సమస్యలు, ఒత్తిళ్లు వస్తూనే ఉండేవి. ఆర్థిక సవాళ్లను కూడా ఎదుర్కొన్నాను. నేను ఈ స్టేజీకి రావడం వెనకాల పెద్ద పోరాటమే చేశాను. కానీ, కలలను సాధించే క్రమంలో చేసే ప్రయత్నాలు, ఆ తర్వాత పొందిన ఫలితాలతో చాలా ఆనందాన్ని పొందాను. మార్పు అనేది ఒక్కరోజులో వచ్చేది కాదు. ఏడాది పొడవునా శ్రమిస్తూనే ఉండాలి. ఏ లక్ష్యం కోసం పాటు పడుతున్నామో దానిని వదిలి పెట్టకూడదు. ఇతర భాషల్లపైనా పట్టు సాధించాలి.

మంచి మార్పుకు ఉదాహరణగా!

అందాల పోటీ అత్యుత్తమమైనది. ప్రపంచవ్యాప్తంగా అవసరంలో ఉన్న పిల్లలకు ఆశను, ఆనందాన్ని కలిగించే శక్తిని ఇస్తుంది. ఇది ఎంత ఛాలెంజింగో అంత పెద్ద బాధ్యత కూడా. మంచి మార్పుకు ఉదాహరణగా, ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా, ముఖ్యమైన అంశాలపై అవగాహన తీసుకువచ్చేలా ఉండాలి. ఏదైనా సాధించాలంటే ముందు మన మీద మనకు నమ్మకం ఉండాలి.

మరచిపోలేని అద్భుతం

తెలంగాణలో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలతో పాటు ఉత్సాహభరితమైన సంస్కృతి ఎంతో ఆకట్టుకుంది. యాదగిరిగుట్ట టెంపుల్ ఆర్కిటెక్చర్, రాజరికపు వారసత్వానికి ఆభరణంగా నిలిచిన చౌమహల్లా ప్యాలెస్, తెలంగాణ వంటకాలు, ఇక్కడి సంప్రదాయం.. ఇదంతా ఒక అద్భుత ప్రయాణంగా మారిపోయింది. విక్టోరియా మెమోరియల్ హోమ్‌ను సందర్శించి లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించాం. ముఖ్యంగా పిల్లలతో సమయం గడపడం, వారి కథలు వినడంతో వారితో కలిసి ఆనంద క్షణాలను పంచుకున్నాం" అని తెలిపారు క్రిస్టినా.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: ఎస్. ఎస్. ఠాకూర్

1st టైమ్

ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ టాలెంట్ షో... బ్రిటన్స్ గాట్ టాలెంట్ షో (బీజీటీ)లో పాల్గొనే అవకాశం బినిత చెత్రికి వచ్చినప్పుడు.... 'ఔరా' అన్నారు. ఇప్పుడు 'ఔరౌరా' అంటున్నారు. బ్రిటన్స్ గాట్ టాలెంట్ (బీజీటీ)లో ఈశాన్య భారత్ నుంచి గ్రాండ్ ఫైనల్‌కు చేరిన తొలి కంటెస్టెంట్‌గా చరిత్ర సృష్టించింది అస్సాంకు చెందిన బినిత చెత్రి...



బ్రిటన్స్ గాట్ టాలెంట్ షోలో అద్భుత నృత్యప్రదర్శనతో ఆకట్టుకుంది బినిత చెత్రి. 'ఫైనల్‌కు చేరినందుకు సంతోషంగా ఉంది. నా కల నిజమైంది. సెమీఫైనల్ కోసం చాలా కష్టపడ్డాను. ఫైనల్ కోసం మరింత కష్టపడతాను' అంటోంది అస్సాంకు చెందిన తొమ్మిది సంవత్సరాల బినిత చెత్రి. అంతర్జాతీయ వేదికపై తన కలను నెరవేర్చుకునేందుకు తండ్రితో కలిసి బ్రిటన్‌కు వెళ్లింది చెత్రి.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ బినిత చెత్రి నృత్య ప్రదర్శన వీడియోను షేర్ చేశారు. 'అస్సాం నుంచి బ్రిటన్ వరకు... అద్భుత ప్రతిభ' అని తన వీడియోకు కాప్షన్ ఇచ్చారు. డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్‌లో అద్భుత ప్రతిభ ఉన్న చెత్రీని 'బీజీటీ' షో జడ్జీలు ప్రశంసించారు. 'టైగర్‌లోని బలం, పైథాన్‌లోని పట్టూ నీలో ఉన్నాయి' అన్నారు జడ్జీలలో ఒకరైన బ్రూనో.

ఫైనల్‌కి చేరిన షైనింగ్ స్టార్



'ఇలాంటి అద్భుత నృత్యప్రతిభను ఎప్పుడూ చూడలేదు' అన్నారు మరో జడ్జి అలేష డిక్సన్. 'బ్రిటన్స్ గాట్ టాలెంట్' షో పుణ్యమా అని బినితకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఏర్పడ్డారు.

బినిత చెత్రి తొమ్మిదిమంది ఇతర ఫైనలిస్ట్‌లతో పోటీ పడనుంది. విజేతకు నగదు బహుమతితో పాటు ప్రతిష్ఠాత్మకమైన 'రాయల్ వెరైటీ పెర్‌ఫార్‌మెన్స్'లో పాడే అవకాశం వస్తుంది. ఫైనల్ శనివారం కావడంతో అస్సామ్‌తో పాటు ఇండియా నలుమూలల నుంచి 'బినిత గెలవాలి. చరిత్ర సృష్టించాలి' అని కోరుకుంటున్నారు.

ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే...

బినితలోని అద్భుత నృత్యప్రతిభను చూసి అబ్బురపడిన డ్యాన్స్ ట్రైనర్ హార్థిక్ రావత్....

'మీ అమ్మాయిని బ్రిటన్స్ గాట్ టాలెంట్ షోకు పంపాల్సిందే' అని బినిత తల్లి దండ్రులతో చెప్పాడు. అయితే అదేమీ ఆషామాషీ టీవీ షో కాదు. అయినా సరే, బినిత మీద ఉన్న నమ్మకంతో 'తప్పకుండా బ్రిటన్స్ గాట్ టాలెంట్ షోలో రాణిస్తుంది' అనే వాడు. ఆయన నమ్మకం నిజం అయింది.

'ఆరు సంవత్సరాల వయసులో బినిత మా అకాడమీలో చేరింది. ఈ అమ్మాయిలో ఫైర్ ఉంది అనుకున్నాను. ఆ తరువాత కాలంలో బినిత ప్రతిభ ప్రపంచ వేదికకు వెళ్లాలి అని ఆశించాను. నేను కోరుకున్నట్లే జరిగింది' అంటున్నాడు రావత్.

అరుదైన నృత్యప్రతిభ, ఆత్మవిశ్వాసం కనిపించే బినితకు 'బీజీటి' ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. 'ఇది ప్రారంభం మాత్రమే' అని తన ముద్దుల కూతురు గురించి చెబుతున్నాడు బినిత తండ్రి.

నిజమే... ఈ చిన్నారి సాధించాల్సిన విజయాలెన్నో ఉన్నాయి.



సహజ ప్రతిభ... తన గురువు

యూట్యూబ్‌లో డ్యాన్స్ వీడియోలు చూస్తూ అక్షరాలా అలానే చేసి 'అద్భుతం' అనిపించేది బినిత. ఆ తరువాత తనదైన స్టైల్ సృష్టించుకుంది. మెరుపు వేగంతో నృత్యం చేయడం మొదలుపెట్టింది. 'మూడు సంవత్సరాల వయసులోనే టీవీలో వస్తున్న డ్యాన్స్ ప్రోగ్రామ్‌ను చూస్తూ అచ్చం అలాగే చేసింది. మాకు ఉన్న పరిమితమైన వనరుల వల్ల బినితకు నృత్యంలో పెద్దగా శిక్షణ ఇప్పించలేదు. అయితే తన సహజ ప్రతిభే తన గురువు' అంటున్నాడు బినిత తండ్రి అమర్ చెత్రి. ఆంటీ అమృతదేవి, డ్యాన్స్ ట్రైనర్ హర్థిక్ రావత్‌ల ద్వారా తన నృత్యనైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకుంది బినిత.

● ట్రెండ్



కాన్షియస్ టూరిజం

టూరిజం ద్వారా ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, ప్రజలు కొత్త సంస్కృతుల గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు... టూరిజం వల్ల పర్యావరణం మీద ఒత్తిడి పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే వచ్చిందే... కాన్షియస్ టూరిజం. **'కాన్షియస్ టూరిజం' అంటే... బాధ్యతతో కూడిన ప్రయాణం.** 'మన ఆనందమే కాదు పర్యావరణం కూడా ముఖ్యం' అనుకోవడం ● ఏ ప్రదేశానికి వెళ్లినా 'ఇది మన ఏరియా కాదు కదా' అనే దృష్టితో కాకుండా నీరు వృథా కాకుండా చూడాలి. ఎనర్జీ సేవ్ చేయాలి ● పెద్ద హోటల్స్‌లో కాకుండా ఎకో-రిసార్ట్‌కు, లోకల్ ఫ్యామిలీస్‌తో హోమ్ స్టేకు ప్రాధాన్యత ఇవ్వాలి ● చిన్న చిన్న దూరాలకు కూడా వెహికిల్‌ను ఉపయోగించకుండా నడకకు ప్రాధాన్యత ఇవ్వాలి ● రీయూజబుల్ బాటిల్స్, బ్యాగులను ఉపయోగించాలి ● వెళ్లినచోట మొక్కలు నాటే కార్యక్రమాలు... లాంటివి ఉంటే వాటిలో పాల్గొనాలి.

● ఆర్ట్ అండ్ కల్చర్



ఆబాలగోపాలం... ఆనంద తరంగం

పిల్లల సాహిత్యంలో బొమ్మలే ప్రధానం. బొమ్మలే వారిని పుస్తకాలు చదివించేలా చేస్తాయి. వెనక్కి తిరిగి చూస్తే బాలసాహిత్యానికి సంబంధించి అద్భుత చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ఆ చిత్రాలను ఈ తరానికి పరిచయం చేయడానికి, ఆ తరాన్ని జ్ఞాపకాల్లోకి తీసుకువెళ్లడానికి రచయిత్రి, ఎడిటర్ రీచా ఝా 'బికమింగ్' పేరుతో న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించింది.

ఈ ఎగ్జిబిషన్‌లో 130 సంవత్సరాల నాటి పిల్లల పుస్తకాల ముఖచిత్రాలను, కథా చిత్రాలను ప్రదర్శించారు.

ఎగ్జిబిషన్‌లో చిత్రాలను కాలక్రమంలో ప్రదర్శించలేదు.

అయితే ప్రతి చిత్రానికి సంబంధించిన మ్యాజిక్‌ను అర్థం చేసుకోవడానికి విజిటర్‌కు కాలమే తెలియదు. ఒక రకంగా చెప్పాలంటే ఈ చిత్రాలు వారిని మరో లోకంలోకి తీసుకువెళతాయి.

'ఎగ్జిబిషన్‌కు వచ్చిన వారిలో ఎందరో రచయితలు, చిత్రకారులు ఉన్నారు. వయసు తేడా లేకుండా వారు పిల్లలు అయ్యారు. వారి ఆసక్తి, ఉత్సాహం చూస్తుంటే ఇలాంటి ఎగ్జిబిషన్‌లు మరెన్నో నిర్వహించాలనిపించింది' అంటోంది రీచా.

● మన(సు)లో మాట

నన్ను వేరే పెళ్ళి చేసుకోమని అంటున్నారు!

నమస్తే డాక్టరు గారు. నాకు సంవత్సరం క్రితం పెళ్ళయింది. నా భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వర్క్ ఫ్రం హోం చేస్తారు. చాలామంచి వ్యక్తి. మా అత్తయ్య వాళ్లకి ఒక్కడే కొడుకు, పెళ్ళికి ముందు ఎలాంటి ప్రేమ వ్యవహారాలు లేవు. ఎలాంటి చెడు అలవాట్లు కూడా లేవు. ఎంతో ఇష్టపడి నన్ను పెళ్ళి చేసుకున్నారు. కానీ ఒకటే సమస్య మా మధ్య ఎలాంటి శారీరక సంబంధం లేదు. మొదట్లో ప్రయత్నం చేశారు. కానీ ఫెయిల్ అయ్యారు. అప్పటి నుండి ఆత్మన్యూనతా భావంతో ఉంటున్నారు. నాతో ఫ్రీగా ఉండరు. సరదాగా మాట్లాడరు. నేను ప్రేమగా దగ్గరికి వెళ్తే ముడుచుకుపోతారు. తాను సంసారానికి పనికిరానని, నన్ను వేరే పెళ్ళి చేసుకోమని అంటున్నారు. మా అత్త మామలకు చేప్తే హైదరాబాద్ వెళ్ళి యూరాలజిస్ట్‌కి చూపించారు. ఆయన అన్ని పరీక్షలు చేసి అంతా బాగానే ఉంది. మందులు కూడా అవసరం లేదు. సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళమని చెప్పారు. భార్యాభర్తల మధ్య మామూలుగా జరగాల్సిన సంసారానికి కూడా ట్రీట్మెంట్ ఉంటుందంటారా? కౌన్సిలింగ్‌తో ఇలాంటి సమస్యలు తగ్గించవచ్చా? అసలు మా వారికి ఎలాంటి సమస్య ఉందంటారు? ఆయనంటే నాకు చాలా ఇష్టం. తనని నేను వదులుకోలేను. నన్నేం చేయమంటారో చెప్పండి.

– ఓ సోదరి, గుడివాడ

మీ ఉత్తరాన్ని చదివాక మీ భర్త ఎంతో మంచి వ్యక్తి, కానీ ఒక సున్నితమైన సమస్యను ఎదుర్కొంటున్నారు అని అర్థమైంది. ఇది చాలామంది పురుషుల్లో కనిపించే ఒక సాధారణ సమస్య. దీన్ని 'సైకోజెనిక్ ఎరెక్టయిల్ డిస్‌ఫంక్షన్' అంటారు. మనస్సులో ఉండే ఒత్తిడి, భయం, ఆత్మవిశ్వాసం లోపించడం వల్ల సమస్య కలగొచ్చు. ఒకటి రెండుసార్లు ఫెయిల్యూర్ జరిగిన తర్వాత, భయంతో... బిడియంతో దూరంగా ఉండటం మొదలవుతుంది. తర్వాత డిప్రెషన్‌కి గురి అవుతారు. తాము ఇక సంసార జీవితానికి పనికిరామని అనుకుంటారు. యురాలజిస్ట్ చెప్పినట్లు ఒక మంచి సైకియాట్రిస్ట్‌ని కలవండి. అతని ఒత్తిడికి కారణం కనుక్కుంటారు. ముందు తనలో ఆత్మవిశ్వాసం పెరిగేలా కౌన్సెలింగ్ చేస్తారు. ఆ తర్వాత 'డ్యూయల్ సెక్స్ థెరపీ' అనే ఒక మానసిక చికిత్స ద్వారా మీ ఇద్దరి మధ్య మానసిక, శారీరక ఆకర్షణ పెరిగేలా కొన్ని ప్రత్యేకమైన పద్ధతుల్లో చికిత్స చేస్తారు. దీంట్లో అనుభవం ఉన్న మానసిక వైద్యుడు లేదా క్లినికల్ సైకాలజిస్ట్ ద్వారా మాత్రమే ఈ థెరపీ చేయించండి. ఈ చికిత్స కోసం భార్య భర్తలిద్దరూ అటెండ్ కావాల్సి ఉంటుంది. ఈ చికిత్స ఆయనలోని ఒత్తిడిని తగ్గించేందుకు క్రమంగా మానసికంగా దగ్గర అవుతూ, తర్వాత శారీరకంగా దగ్గర అవడానికి సహాయపడుతుంది. అవసరమైతే కోరిక, పటిష్ఠత పెరిగేందుకు కొన్ని మంచి మందులు కూడా సైకియాట్రిస్టులు మీ వారికి ఇస్తారు. ప్రతిరోజు కొద్ది సేపు వాకింగ్, వ్యాయామం, బ్రీతింగ్ ఎక్సర్ సైజులు, యోగా కూడా చేస్తే మానసిక ఒత్తిడి త్వరగా తగ్గుతుంది. మీరు ప్రేమగా ఓపికగా వేచి ఉండండి. అదే ఆయనకి పెద్ద ఔషధంలా పని చేసి ఆయనకి మానసికంగా ఎంతో బలాన్ని ఇస్తుంది. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com




రిషభ్ పంత్‌కు 30 లక్షల జరిమానా

ఐపీఎల్ చివరి లీగ్ మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్'కు పాల్పడినందుకు లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌పై భారీ జరిమానా పడింది. మంగళవారం బెంగళూరుతో జరిగిన పోరులో లక్నో నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేకపోయింది. ఈ సీజన్‌లో లక్నో ఇలా 'స్లో ఓవర్ రేట్'కు పాల్పడటం ఇది మూడోసారి కావడంతో సారథి రిషభ్ పంత్‌పై రూ. 30 లక్షలు, తుది జట్టులో **మిగిలిన అందరు ఆటగాళ్లకు రూ. 12 లక్షల చొప్పున జరిమానా విధించారు.**

'నేను సెలక్టర్‌ను కాదు'

ఇంగ్లండ్ పర్యటన కోసం ఎంపిక చేసిన భారత జట్టులో మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. రంజీ ట్రోఫీ సహా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కూడా చక్కటి రికార్డు ఉన్న అయ్యర్ పేరును పరిశీలించకపోవడం ఆశ్చర్యపర్చింది. క్రికెటేతర కారణాలతో అతడిని పక్కన పెడుతున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ప్రశ్నించగా అతను సూటిగా సమాధానం **ఇవ్వలేదు. 'నేను సెలక్టర్‌ను కాదు' అంటూ ఒక్క ముక్కలో గంభీర్ స్పందించాడు.**



మూడో రౌండ్‌కు పావొలిని



- అల్‌కరాజ్ ముందంజ
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల విభాగం గత ఏడాది రన్నరప్ జాస్మిన్ పావొలిని ఈ సారి కూడా చక్కటి ప్రదర్శనతో దూసుకుపోతోంది. నాలుగో సీడ్ పావొలిని (ఇటలీ) టోర్నమెంట్ మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఆమె 6–3, 6–3 స్కోరుతో అజ్లా టాంజానొవిక్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించింది. ఒక గంటా 21 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో 24 విన్నర్స్ కొట్టిన పావొలిని 3 ఏస్‌లు బాదింది. పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ కూడా ముందంజ వేశాడు. అయితే అతనికి రెండో రౌండ్‌లో కాస్త పోటీ ఎదురైంది. ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ (స్పెయిన్) 6–1, 4–6, 6–1, 6–2 స్కోరుతో ఫాబియాన్ మారోజాన్ (హంగేరీ)ని ఓడించాడు. ప్రపంచ 56వ ర్యాంకర్ మారోజాన్ అనూహ్యంగా ఒక సెట్ నెగ్గినా...వెంటనే కోలుకున్న అల్‌కరాజ్ పైచేయి సాధించాడు. 2 గంటల 9 నిమిషాల పాటు ఈ మ్యాచ్ సాగింది. వరల్డ్ నంబర్‌వన్, టాప్ సీడ్ అరైనా సబలెంకా (బెలారస్) కూడా మూడో రౌండ్‌కు చేరింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో సబలెంకా 6–3, 6–1తో జిల్ టీక్‌మన్ (స్విట్జర్లాండ్)ను ఓడించింది.

పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ కాస్పర్ రూడ్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అన్‌సీడెడ్ నూనో బోర్జెస్ (పోర్చుగల్) 2–6, 6–4, 6–1, 6–0తో రూడ్ (నార్వే)ని ఓడించాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6–4, 6–0, 6–4తో డేనియల్ గలాన్ (కొలంబియా)పై గెలిచి ముందంజ వేశాడు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, నాలుగు సార్లు విజేత ఇగా స్వియాటెక్ మరో టైటిల్ దిశగా ముందడుగు వేసింది. రెండో రౌండ్‌లో స్వియాటెక్ 6–1, 6–2తో ఎమా రాడుకాను (బ్రిటన్)ను చిత్తు చేసింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌లలో ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6–2, 6–3తో ఎమీలియా అరాంగో (కొలంబియా)పై, 13వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 7–6 (7/4), 7–5తో అనా బొండర్ (హంగేరీ)పై గెలుపొందారు.

రిత్విక్ జోడి పరాజయం...

గ్రాండ్‌స్లామ్ ఈవెంట్‌లో తొలి విజయం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరికి మరోసారి నిరాశే ఎదురైంది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే రిత్విక్ (భారత్) – నికొలస్ బరింటోస్ (కొలంబియా) జోడి ఓటమిపాలైంది. జాకబ్ ఫియర్లీ (బ్రిటన్) – గాబ్రియెల్ డియాలో (కెనడా) ద్వయం 6–0, 6–2తో రిత్విక్–నికొలస్ జంటను చిత్తు చేసింది. 56 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసింది. మరో వైపు ఇద్దరు భారత ఆటగాళ్లు రోహన్ బొపన్న, యూకీ బాంబ్రీ తమ భాగస్వాములతో కలిసి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. బోపన్న – ఆడమ్ పావ్‌లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడి 7–6 (8/6), 5–7, 6–1 స్కోరుతో రాబర్ట్ క్యాష్ (అమెరికా) – జె ట్రేసీ (అమెరికా)ను ఓడించారు. మరో మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్) – రాబర్ట్ గాలొవే (అమెరికా) జంట తొలి రౌండ్‌లో 6–3, 6–7 (8/10), 6–3 స్కోరుతో రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) – హెన్‌డ్రిక్ జెబెన్స్ (జర్మనీ)పై గెలుపొంది ముందంజ వేసింది.

ఫైనల్ వేటలో...



కోహ్లి
శ్రేయస్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ట్రోఫీ కోసం చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్న రెండు జట్లు... 18వ సీజన్ ఫైనల్ చేరేందుకు పోటీపడుతున్నాయి. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) గురువారం క్వాలిఫయర్–1లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. లీగ్ ఆరంభం నుంచి ఆడుతున్న ఇప్పటివరకు ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయిన ఇరు జట్లు... ఈ సారి నిలకడైన ప్రదర్శనతో 'ప్లే ఆఫ్స్'కు చేరాయి. లీగ్ దశలో 14 మ్యాచ్‌లాడిన పంజాబ్ కింగ్స్ 9 విజయాలు, 4 పరాజయాలు, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 19 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో అగ్రస్థానం దక్కించుకుంది. 2014 తర్వాత పంజాబ్ జట్టు 'ప్లే ఆఫ్స్'కు చేరడం ఇదే తొలిసారి కాగా... అప్పుడు కూడా పట్టికలో అగ్ర స్థానంలో నిలిచిన పంజాబ్... తుదిపోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇక మరోవైపు 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, 4 పరాజయాలు ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 19 పాయింట్లు సాధించిన బెంగళూరు రన్‌రేట్‌లో కాస్త వెనుకబడి రెండో స్థానంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లు జరగగా... చెరొకటి గెలిచాయి. బెంగళూరులో జరిగిన పోరులో పంజాబ్ గెలవగా... ముల్లాన్‌పూర్‌లో జరిగిన పోరులో బెంగళూరు పైచేయి సాధించింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరనుండగా... ఓడిన జట్టుకు క్వాలిఫయర్–2 రూపంలో మరో అవకాశం ఉండనుంది.

టాప్–3పైనే ఆశలు...

ఇప్పటికే మూడు వేర్వేరు జట్లను ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్'కు చేర్చిన కెప్టెన్‌గా ఘనత సాధించిన శ్రేయస్ అయ్యర్... పంజాబ్‌కు ప్రధాన బలం కానున్నాడు. మైదానం బయటి నుంచి రికీ పాంటింగ్ సలహాలు... లోపల శ్రేయస్ వ్యూహాలతో ఇప్పటికే పంజాబ్ కింగ్స్ అభిమానుల మనసులు గెలుచుకుంది. ముందుండి నడిపించే వాడే నాయకుడు అనే విధంగా శ్రేయస్ బ్యాట్‌తోనూ దుమ్మురేపుతున్నాడు. 14 మ్యాచ్‌ల్లో 51.40 సగటుతో అతడు 514 పరుగులు చేసి జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ వస్తున్న శ్రేయస్ 171.90 స్ట్రయిక్‌రేట్‌తో ఈ పరుగులు చేయడం విశేషం. ఇక యువ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ 499 పరుగులు, ప్రియాన్ష్ ఆర్య 424 పరుగులతో సత్తా చాటారు. ఈ ఇద్దరు అందిస్తున్న శుభారంభాలతోనే పంజాబ్ భారీ స్కోర్లు చేయగలిగింది. ఈ సీజన్‌లో పంజాబ్ నిలకడైన విజయాలకు ఈ ముగ్గురి ఫామే ప్రధాన కారణం. ఇన్‌గ్లిస్ మంచి టచ్‌లో ఉండగా... నేహల్ వధేరా, శశాంక్, స్టొయినిస్ అవసరమైన సమయంలో సత్తా చాటుతున్నారు. బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్, కైల్ జేమీసన్, అజ్మతుల్లా కీలకం కానున్నారు. జాతీయ జట్టు అవసరాల నేపథ్యంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ స్వదేశానికి తిరిగి వెళ్లడం జట్టుకు కాస్త ఇబ్బంది కాగా... గాయం కారణంగా గత రెండు మ్యాచ్‌లకు అందుబాటులో లేని చాహల్ రాకతో స్పిన్ విభాగం పటిష్టమైంది.

విరాట్‌పై పెను భారం

లీగ్ ఆరంభమైనప్పటి నుంచి ఒకే ఫ్రాంచైజీకి ఆడుతున్న ఏకైక ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కిన విరాట్ కోహ్లి... 18వ సీజన్‌లో అయినా ట్రోఫీని ముద్దాడాలని తహతహలాడుతున్నాడు. సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నా... అనధికారిక కెప్టెన్‌గా కోహ్లిపైనే జట్టు అధికంగా ఆధారపడుతోంది. అందుకు తగ్గట్లే ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన విరాట్... 13 మ్యాచ్‌ల్లో 60.20 సగటుతో 602 పరుగులు చేశాడు. 147.91 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టిన కోహ్లి... 8 అర్ధ శతకాలు తన ఖాతాలో వేసుకున్నాడు. తన వికెట్ విలువ అర్థం చేసుకొని ఆడుతున్న కోహ్లి... ఈ సీజన్‌లో అత్యధిక స్కోరు ముల్లాన్‌పూర్‌లోనే పంజాబ్‌పై నమోదు చేసుకోవడం అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచే అంశం. కోహ్లి, సాల్ట్ జట్టుకు శుభారంభాలు అందిస్తుండగా... మయాంక్ అగర్వాల్, రజత్ పాటీదార్, జితేశ్ శర్మ చక్కటి ఫామ్‌లో ఉన్నారు. గత మ్యాచ్‌లో ఆశలే లేని స్థితిలో అద్భుత ప్రదర్శన చేసిన జితేశ్ శర్మ నుంచి ఫ్రాంచైజీ అలాంటి ప్రదర్శనే ఆశిస్తోంది. గాయం కారణంగా టిమ్ డేవిడ్ అందుబాటులో లేకపోవడం జట్టుకు ఇబ్బందికరంగా మారగా... అతడి స్థానంలో లియామ్ లివింగ్‌స్టోన్ ఫినిషర్ పాత్ర పోషించనున్నాడు. ఫిట్‌నెస్ సాధించిన జోష్ హాజల్‌వుడ్ తిరిగి రావడం జట్టుకు కొండంత బలాన్నిస్తోంది. తన వైవిధ్యమైన బౌలింగ్‌తో ఎలాంటి బ్యాటర్‌నైనా ఇబ్బంది పెట్టగల హాజల్‌వుడ్ ఈ మ్యాచ్‌లో కీలకం కానున్నాడు. భువనేశ్వర్, యశ్ దయాళ్‌తో కలిసి అతడు పేస్ భారాన్ని మోయనుండగా... సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.

నేడు ఐపీఎల్ క్వాలిఫయర్–1

- **పంజాబ్‌తో తలపడనున్న బెంగళూరు**
- **కోహ్లి, శ్రేయస్‌పైనే అందరి దృష్టి**

తుది జట్లు (అంచనా)

పంజాబ్ కింగ్స్: శ్రేయస్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, శశాంక్, స్టొయినిస్, అజ్మతుల్లా, జెమీసన్, హర్‌ప్రీత్, అర్ష్‌దీప్, చాహల్.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, మయాంక్ అగర్వాల్, జితేశ్, కృనాల్ పాండ్యా, లివింగ్‌స్టోన్, షెఫర్డ్, భువనేశ్వర్, యశ్ దయాళ్, హాజల్‌వుడ్, సుయాశ్ శర్మ.

పిచ్, వాతావరణం

ముల్లాన్‌పూర్ మైదానంలో ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు జరగగా... అందులో మూడు ఇన్నింగ్స్‌ల్లో స్కోర్లు 200 దాటాయి. మిగిలిన ఐదు ఇన్నింగ్స్‌ల్లో స్వల్ప స్కోర్లు నమోదయ్యాయి. బుధవారం పిచ్ ఎలా స్పందిస్తుందనేది కీలకం. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

ఐపీఎల్‌లో నేడు (క్వాలిఫయర్ -1)

పంజాబ్ X బెంగళూరు
వేదిక: ముల్లాన్‌పూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఆ మూడు సినిమాలు తీసుంటే రిటైర్ అయ్యేవాడిని

- దర్శకుడు సుకుమార్



అనూప్, అర్జున్, ఐశ్వర్యా అర్జున్, నిరంజన్, సుకుమార్, ఉపేంద్ర, చంద్రబోస్

''ఈ వేదికపై ఇద్దరు (అర్జున్, ఉపేంద్ర) లెజెండ్స్ ఉన్నారు. ఈ ఇద్దరూ యాక్టర్స్ మాత్రమే కాదు.. దర్శకులు కూడా. 'ఓం, ఏ, ఉపేంద్ర... ఇలాంటి కల్ట్ సినిమాలు తీసిన తర్వాత ఏ దర్శకుడైనా రిటైర్ అయిపోవచ్చు. నేను ఆ మూడు చిత్రాలు తీసి ఉంటే రిటైర్ అయిపోయేవాడిని. ఈ రోజు నా స్క్రీన్‌ప్లే ఇలా ఉందంటే కారణం ఆ మూడు సినిమాలే'' అని అన్నారు దర్శకుడు సుకుమార్. హీరోయిన్ ఐశ్వర్యా అర్జున్ ప్రధాన పాత్రలో, అర్జున్, ధ్రువ సర్జా, నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ టీజర్‌లో ఐశ్వర్య, నిరంజన్ బ్యూటిఫుల్‌గా కనిపించారు. అలాగే ఈ చిత్రంలో చంద్రబోస్ గారు రాసిన ఓ పాట విన్నాను. చాలా నచ్చింది. అనూప్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''నేను కాలేజీలో చదివిన రోజుల్లోనే అర్జున్ గారు నాకు డైలాగ్ రైటర్‌గా అవకాశం ఇచ్చారు. అప్పుడు నాకు అవకాశం కల్పించిన అర్జున్‌గారు, ఇప్పుడు నా అన్న కొడుకుకి అవకాశం ఇచ్చారు. 'సీతాపయనం' టీజర్ బ్యూటిఫుల్‌గా ఉంది'' అన్నారు మరో ముఖ్య అతిథి ఉపేంద్ర. ''నా హనుమాన్ జంక్షన్' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా చేసిన సుకుమార్ ఇప్పుడు ఇండియాలోని టాప్ టెన్ దర్శకుల్లో ఒకరని చెప్పడం గర్వంగా ఉంది. ఉపేంద్రగారికి పెద్ద పెద్ద దర్శకులే అభిమానులుగా ఉంటారు. మా అమ్మాయి కోసం ఈ సినిమాను మొదలుపెట్టాను. నాపై తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమను మా అమ్మాయిపై కూడా చూపిస్తారని ఆశిస్తున్నాను. నిరంజన్‌లో మంచి అంకితభావం ఉంది'' అన్నారు. ''సీతా పయనం'తో తెలుగు పరిశ్రమకు వస్తున్నందుకు, నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు ఐశ్వర్యా అర్జున్. ''తెలుగులో నాకిది తొలి సినిమా'' అన్నారు నిరంజన్.


బిగ్ బ్యాంగ్ బిగిన్స్



హృతిక్ రోషన్

బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కొత్త చిత్రం ఖరారైంది. 'సలార్, కేజీఎఫ్, కాంతార' వంటి చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ సంస్థలో హృతిక్ రోషన్ హీరోగా ఓ సినిమా రూపొందనుంది. బుధవారం ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. ''హృతిక్ రోషన్‌తో అసోసియేట్ కావడం చాలా సంతోషంగా ఉంది. ది బిగ్ బ్యాంగ్ బిగిన్స్'' అంటూ తమ 'ఎక్స్' ఖాతాలో ఓ నోట్‌ను షేర్ చేసింది హోంబలే ఫిల్మ్స్. అయితే ఈ సినిమాకు దర్శకుడు ఎవరు? చిత్రీకరణ ఎప్పుడు ఆరంభం అవుతుంది? విడుదల ఎప్పుడు? అనే వివరాలను వెల్లడించ లేదు. ఇదిలా ఉంటే... హృతిక్ రోషన్ తాజా చిత్రం 'వార్ 2' ఆగస్టు 14న రిలీజ్ కానుంది. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకుడు.

జైలర్‌తో విద్య?



రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన 'జైలర్ '(2023) చిత్రం సూపర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. జైలర్, రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీకాంత్ నటనకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రజనీ–నెల్సన్ కాంబినేషన్‌లోనే 'జైలర్'కి సీక్వెల్‌గా 'జైలర్ 2' చిత్రం రూపొందుతోంది. సన్ పిక్చర్స్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కథాంశం ప్రధానంగా గోవా నేపథ్యంలో ఉంటుందట. ఇదిలా ఉంటే.. 'జైలర్ 2'లో విద్యా బాలన్ నటించనున్నారని తమిళ ఇండస్ట్రీ టాక్. ఇటీవల విద్యా బాలన్‌ని కలిసి, 'జైలర్ 2' కథ చెప్పారట నెల్సన్. చిత్ర కథతో పాటు తన పాత్ర కూడా నచ్చడంతో ఆమె నటించేందుకు పచ్చజెండా ఊపారని సమాచారం. 'జైలర్' సినిమాలో రజనీకాంత్ భార్య పాత్రలో రమ్యకృష్ణ నటించారు. 'జైలర్ 2'లోనూ ఆమె అదే పాత్రలో కనిపిస్తారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. దాంతో విద్యా బాలన్ పాత్ర ఏంటి? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ విషయంపై స్పష్టత రావాలంటే యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడక తప్పదు. ఇదిలా ఉంటే... 'జైలర్ 2'లో హీరో బాలకృష్ణ నటించనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. తాజాగా హీరో నాగార్జున కూడా ఈ చిత్రంలో నటించనున్నారనే టాక్ నడుస్తోంది. ఇప్పటికే రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో నాగార్జున ఓ కీలక పాత్ర పోషించారు. మరి... 'జైలర్ 2'లో కూడా నటిస్తారా? లేదా అనేది తెలియాల్సి ఉంది.



విద్యా బాలన్

వినరారా శ్రీకాళ హస్తి గాథ



అరియానా, వివియానా

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ సినిమా జూన్ 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో మోహన్‌బాబు మనవరాళ్లు, మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా నటించడంతో పాటు ఓ పాటని పాడారు. వాళ్లు పాడిన 'జనులారా వినరారా కాళహస్తి గాథ, శ్రీకాళ హస్తి గాథ...' అంటూ సాగే పాటని కాశీ విశ్వనాథ ఆలయంలో బుధవారం ఆవిష్కరించారు. స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించిన ఈ పాటకు శ్రీ కాళహస్తి దైవిక వారసత్వాన్ని వివరించే విధంగా సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించారు. ఈ పాట విడుదల కార్యక్రమంలో మోహన్‌బాబు, ముఖేష్ కుమార్ సింగ్, రచయితలు తోట ప్రసాద్, ఆకుల శివ, అర్పిత్ రాంకా పాల్గొన్నారు.

ఆఫీసర్ జయదేవ్ నాయర్



గౌతమ్ మీనన్

లేట్ నైట్ కల్చర్, డ్రగ్స్, నేటి యువత ఆలోచనలు... వంటి అంశాల నేపథ్యంలో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. ఈ చిత్రంలో భూమికా చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా విఘ్నేష్ గవిరెడ్డి, సారా అర్జున్, నాజర్, రోహిత్, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జయదేవ్ నాయర్ పాత్రలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.

కామెడీ రాసేవారు తగ్గిపోయారు

- రాజేంద్రప్రసాద్



''నన్ను ఎవరైనా కమేడియన్ అంటే బాధపడతాను. ఎందుకంటే కామెడీ చేసే హీరోని నేను. అప్పట్లో హెల్దీ కామెడీతో నేను అందరినీ నవ్వించాను. 'అహ నా పెళ్ళంట' వంటి బ్లాక్ బస్టర్ తరువాత నాకు ఎక్కువ భయం వేసింది. మళ్లీ అలాంటి సినిమా వస్తుందా? అనుకున్నాను. ప్రస్తుతం ఉన్న కామెడీ ఇంకా బెటర్ అవ్వాలని కోరుకుంటున్నాను. కామెడీ రాసే రచయితలు తక్కువైపోయారు'' అని అన్నారు రాజేంద్రప్రసాద్. రూపేశ్, ఆకాంక్షా సింగ్ జంటగా, రాజేంద్రప్రసాద్, అర్చన ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''షష్టిపూర్తి' ప్రతి ఇంటి సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు వారి తల్లి దండ్రులతో ప్రేమగా మాట్లాడి, వారి బాగోగులను తెలుసుకుంటారని చెప్పగలను. ఇక గతంలో నేను చేసిన 'క్విక్ గన్ మురుగన్' సినిమాకి సీక్వెల్ చేయబోతున్నాను. ఏఐతో కొన్ని సీన్స్ తీస్తాం'' అన్నారు. ''షష్టిపూర్తి' ప్రేక్షకులను అలరిస్తుంది'' అని అన్నారు రూపేశ్, చైతన్యప్రసాద్, పవన్ ప్రభ.

ఏ శక్తీ ఆపలేదు

'జరగబోయేది మారణహోమం... శిథిలం కాబోతోంది అశోకుడి ఆశయం...', 'కలియుగంలో పుట్టిన ఏ శక్తీ దీన్ని ఆపలేదు' అంటూ సాధువు వేషంలో ఉన్న నటుడు జయరామ్ వాయిస్‌తో 'మిరాయ్' టీజర్ మొదలైంది. తేజ సజ్జా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మనోజ్ మంచు, జగపతిబాబు, శ్రియ, జయరామ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. 'ఇలాంటి రాయితోనే ప్రొఫెసర్ చిన్నప్పుడు నన్ను కొట్టింది.. నౌ ఇట్స్ మై టైమ్' (మంచు మనోజ్), 'నైన్ బుక్స్... హండ్రెడ్ క్వశ్చన్స్... వన్ స్టిక్... బిగ్ అడ్వెంచర్' అంటూ సూపర్ యోధగా తేజ సజ్జా చెప్పే డైలాగులు ఉన్నాయి. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్‌లలో రిలీజ్ కానుంది.



తేజ సజ్జా

మార్గన్ మంచి థ్రిల్లర్

- విజయ్ ఆంటోని



లియో, విజయ్, రామాంజనేయులు, అజయ్ ధీశన్

''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మార్గన్'. ఇదొక సీట్ ఎడ్జ్ ఇంటెన్స్ థ్రిల్లర్‌గా ఉంటుంది. సినిమా చాలా గొప్పగా వచ్చింది. 'మార్గన్'ని తెలుగు ప్రేక్షకులందరూ చూసి, ఆదరించాలి'' అని విజయ్ ఆంటోని కోరారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీశన్ విలన్‌గా పరిచయమవుతున్నారు. జె. రామాంజనేయులు సమర్పణలో విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'నకిలీ'ని రామ్ సార్ తెలుగులో రిలీజ్ చేశారు. ఇప్పుడు 'మార్గన్'ను రిలీజ్ చేస్తున్నారు. త్వరలోనే 'భద్రకాళి' సినిమా కూడా రానుంది. నా మూవీ తెలుగులో రిలీజ్ అవుతోందంటే మొత్తం బాధ్యతను భాష్య శ్రీ గారు చూసుకుంటారు'' అన్నారు. లియో జాన్ పాల్ మాట్లాడుతూ– ''ఎడిటర్‌గా ఎన్నో చిత్రాలు చేశాను. దర్శకుడిగా 'మార్గన్' నాకు ఫస్ట్ మూవీ'' అని చెప్పారు. ''విజయ్ ఆంటోనిగారు అందరికీ సాయం చేస్తుంటారు. అలాంటి మంచి వ్యక్తికి సపోర్ట్ చేయాలి. 'మార్గన్'ని అందరూ ఆదరించాలి'' అన్నారు జె. రామాంజనేయులు. ఈ కార్యక్రమంలో దీప్శిక, బ్రిగిడా, భాష్యశ్రీ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, కెమెరా: యువ ఎస్.

స్టాక్ మార్కెట్లు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 239	నిఫ్టీ ▽ 74
81,312	24,752

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,188	▽	11
డోజోన్స్	42,207	▽	136
ఎఫ్‌టీఎస్ఈ 100	8,726	▽	52
డాక్స్	24,039	▽	188
షాంఘై	3,340	▽	1
నికాయ్	37,722	△	2

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.10	117.03
€	యూరో	ఎస్‌బీఐ	95.60	98.30
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.60	60.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.29	56.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.85	68.54
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.86	23.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.35	24.13
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.99	12.81

సెయిల్ లాభం అప్

క్యూ4లో రూ. 1,251 కోట్లు • షేరుకి రూ. 1.6 డివిడెండ్

ముంబై: ప్రభుత్వ రంగ మెటల్ దిగ్గజం సెయిల్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 1,251 కోట్లకు చేరింది.



అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,126 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1.6 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 27,959 కోట్ల నుంచి రూ. 29,316 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 26,474 కోట్ల నుంచి రూ. 28,021 కోట్లకు పెరిగాయి. పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 3,067 కోట్ల నుంచి రూ. 2,372 కోట్లకు క్షీణించింది.

ఫలితాల నేపథ్యంలో సెయిల్ షేరు బీఎస్ఈలో 0.2 శాతం బలపడి రూ. 129 వద్ద ముగిసింది.

భారత్‌కు బై చెప్పం..!

- మరో 3 కొత్త కార్లు తెస్తున్నాం
- నిస్సాన్ ఇండియా ఎండీ వత్స

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మోటార్స్ భారత మార్కెట్ నుంచి నిష్క్రమిస్తోందంటూ వస్తున్న వార్తలను కంపెనీ ఇండియా ఎండీ సౌరభ్ వత్స ఖండించారు. అలాంటి యోచనేదీ లేదని స్పష్టం చేశారు. అంతేగాకుండా 2027 నాటికి మరో మూడు కొత్త కార్లను ప్రవేశపెట్టబోతున్నామని, ఈ ఏడాది ఇంకో 20 డీలర్లను నియమించుకోబోతున్నామని వత్స తెలిపారు. భారత్‌లో జాయింట్ వెంచర్ సంస్థ రెనో నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా (ఆర్ఎన్ఏఐపీఎల్)లో నిస్సాన్‌కి ఉన్న 51 శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు రెనో మార్చి 31న ప్రకటించింది. దీంతో నిస్సాన్ భారత



మార్కెట్ నుంచి నిష్క్రమించేస్తోందంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వత్స వివరణ ఇచ్చారు. గత 60 ఏళ్లుగా తాము దేశీ మార్కెట్లో కార్యకలాపాలు సాగిస్తున్నామని, తమ తయారీ, కార్యకలాపాల విస్తరణ ప్రణాళికలు మొదలైనవన్నీ యథాప్రకారంగానే అమలవుతాయని తెప్పారు. 2026 మొదటి త్రైమాసికంలో సెవెన్ సీటర్ బీ–సెగ్మెంట్ ఎంపీవీని, ఆ తర్వాత 2027 తొలి నాళ్లలో ఫైవ్.. సెవెన్ సీటర్ సీ–ఎస్‌యూవీని ప్రవేశపెట్టనున్నట్లు వత్స తెలిపారు. కొందరు డీలర్లు తప్పుకోవడంతో ప్రస్తుతం డీలర్‌షిప్‌ల సంఖ్య 160కి పరిమితమైందని, ఈ ఏడాది ఆఖరు నాటికి దీన్ని 180కి పెంచుకోనున్నామని వత్స వివరించారు. మరోవైపు, ప్రభుత్వ ఆమోదం పొందిన సీఎన్‌జీ రెట్రోఫిట్‌మెంట్ కిట్‌తో కూడా తమ మాగ్నైట్ ఎస్‌యూవీ లభిస్తుందని చెప్పారు. అదనంగా రూ. 74,999 చెల్లిస్తే ఈ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. తొలి దశలో ఢిల్లీ–ఎన్‌సీఆర్, మహారాష్ట్ర, కేరళ తదితర 7 రాష్ట్రాల్లోని ఆథరైజ్డ్ డీలర్‌షిప్‌ల ద్వారా సీఎన్‌జీ కిట్ ఇన్‌స్టాలేషన్‌ను ఆర్డరు చేయొచ్చని, రెండో దశలో దీన్ని మిగతా రాష్ట్రాలకు విస్తరిస్తామని ఆయన తెలిపారు.

ఐటీసీలో బీఏటీ వాటా విక్రయం

- డీల్ విలువ రూ. 12,941 కోట్లు



న్యూఢిల్లీ: మాతృ సంస్థ, బ్రిటిష్ దిగ్గజం బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ) తాజాగా దేశీ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీలో మైనారిటీ వాటా విక్రయించింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో బ్లాక్‌డీల్స్ ద్వారా 2.5 శాతం వాటా అమ్మివేసింది. షేరుకి రూ. 413కుపైగా సగటు ధరలో 31.3 కోట్ల షేర్లను విక్రయించింది. వీటి విలువ రూ. 12,941 కోట్లు(1.51 బిలియన్ డాలర్లు)కాగా.. ఎన్ఎస్ఈలో మంగళవారం ధర రూ. 434తో పోలిస్తే 4.8 శాతం డిస్కౌంట్‌లో వాటాను ఆఫర్ చేసింది. కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. ఈ లావాదేవీకి ముందు కంపెనీలో బీఏటీ వాటా 25.44 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థల ద్వారా ప్రస్తుతం 22.94 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. ఐటీసీలో 1900 సంవత్సరం ప్రారంభంలోనే బీఏటీ పెట్టుబడులకు తెరతీసింది. తద్వారా దీర్ఘకాలంగా రెండు దిగ్గజాలూ లబ్ధి పొందుతూ వస్తున్నాయి. అయితే 2024 మార్చిలోనూ ఐటీసీలో 3.5 శాతం వాటాను రూ. 17,485 కోట్లకు బీఏటీ విక్రయించడం గమనార్హం!

బ్లాక్‌డీల్ నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో బుధవారం 3.2 శాతం క్షీణించి రూ. 420 వద్ద ముగిసింది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ కథ్వాలియాపై సెబీ నిషేధం



న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసిన ఆరోపణలపై సంస్థ మాజీ సీఈవో సుమంత్ కథ్వాలియాతో పాటు మరో నలుగురికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రూ. 19.78 కోట్ల జరిమానా విధించింది. అలాగే వారు సెక్యూరిటీస్ మార్కెట్లో లావాదేవీలు జరపకుండా నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సెక్యూరిటీస్‌ను కొనడం, అమ్మడం లేదా ఇతరత్రా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని స్పష్టం చేసింది. నిషేధం ఎదుర్కొంటున్న మిగతావారిలో అప్పటి డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా, ట్రెజరీ ఆపరేషన్స్ హెడ్ సుశాంత్ సౌరవ్, జీఎంజీ ఆపరేషన్స్ హెడ్ రోహన్ జథన్న, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిల్ మార్కో రావు ఉన్నారు. కీలక హోదాల్లో ఉన్న ఈ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకి, సంస్థకు సంబంధించిన ముఖ్యమైన వివరాలు, బైటికి రావడానికి ముందే తెలుస్తాయి. ఆ వివరాలను ఉపయోగించుకుని వీరు బ్యాంక్ షేర్లలో ట్రేడింగ్ చేసి లబ్ధి పొందారని సెబీ విచారణలో వెల్లడైంది.

రూ. 3,668 కోట్ల ఐపీవోకు హీరో ఫిన్‌కార్ప్ రెడీ

సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్




న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ఫైనాన్షియల్ సర్వీసుల విభాగం హీరో ఫిన్‌కార్ప్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 2,100 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,568 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా కంపెనీ రూ. 3,668 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. లిస్టింగ్‌కు వీలుగా 2024 ఆగస్ట్‌లో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ మూలధన అవసరాలకు ఎన్‌బీఎఫ్‌సీ హీరో ఫిన్‌కార్ప్ వినియోగించనుంది. తద్వారా రుణ కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. 2024 మార్చికల్లా కంపెనీ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) రూ. 51,281 కోట్లుగా నమోదయ్యాయి.

పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు డౌన్

ఏప్రిల్‌లో 2.7 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: తయారీ, విద్యుత్, మైనింగ్ రంగాల పేలవ పనితీరు కారణంగా దేశీయంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు ఏప్రిల్‌లో నెమ్మదించింది. 2.7 శాతానికి పరిమితమైంది. ఫిబ్రవరిలో కూడా ఇది 2.7 శాతంగానే ఉండటం గమనార్హం.



పరిశ్రమల పనితీరును సూచించే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గతేడాది ఏప్రిల్‌లో 5.2 శాతంగా నమోదైంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన డేటాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మార్చి గణాంకాలను గతంలో ప్రకటించిన 3 శాతం నుంచి 3.9 శాతానికి ఎన్ఎస్ఓ పెంచింది. తాజా గణాంకాల ప్రకారం గతేడాది ఏప్రిల్‌లో మైనింగ్ కార్యకలాపాలు 6.8 శాతం వృద్ధి చెందగా తాజాగా మైనస్‌లో 0.2 శాతానికి పడిపోయాయి. ఇక తయారీ రంగం వృద్ధి రేటు 4.2 శాతం నుంచి 3.4 శాతానికి, విద్యుదుత్పత్తి 10.2 శాతం నుంచి 1 శాతానికి నెమ్మదించింది.

ఐటీసీలో అమ్మకాల సెగ... సూచీలు డీలా

- పరిమిత శ్రేణిలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- సెన్సెక్స్ 239 పాయింట్ల పతనం
- 24,800 దిగువకు నిఫ్టీ

ముంబై: పరిమిత శ్రేణి ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు బుధవారం నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ షేరు 3% పడి సూచీల పతనానికి ప్రధాన కారణమైంది. సెన్సెక్స్ 239 పాయింట్లు నష్టపోయి 81,312 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74 పాయింట్లు పతనమై 24,752 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. మే నెల వారీ ఎక్స్‌పైరీ గడువు ముగింపు(నేడు), దేశీయ క్యూ4 జీడీపీ, ఏప్రిల్ పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించారు. ఒకదశలో 308 పాయింట్లు కోల్పోయి 81,244 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు పతనమై 24,737 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మీడియా, ఇంధన షేర్లు రాణించాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ అరశాతం పెరిగింది. మిడ్‌క్యాప్ ఇండెక్సు 0.25% నష్టపోయింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

సగం నష్టాలు ఐటీసీ ద్వారానే...

బ్రిటన్ మల్టీనేషనల్ బ్రిటిష్ అమెరిన్ టొబాకో



(బీఏటీ) పీఎల్‌సీ బ్లాక్‌డీల్ ద్వారా ఐటీసీలో 2.50% వాటాను రూ.12,927 కోట్లకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో బీఎస్ఈలో ఐటీసీ షేరు 3% నష్టపోయి రూ.420 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 4.33% క్షీణించి రూ.415 వద్ద కనిష్టాన్ని తాకింది. సెన్సెక్స్ కోల్పోయిన మొత్తం పాయింట్లలో ఈ షేరు వాటాయే 110 పాయింట్లు కావడం గమనార్హం. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,269 కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.5.26 లక్షల కోట్లకు దిగివచ్చింది.

- మార్చి క్వార్టర్ నికరలాభం 38% వృద్ధితో బీమా సంస్థ ఎల్ఐసీ షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్ఈలో షేరు 8% లాభపడి రూ.943 వద్ద స్థిరపడింది. ఒకదశలో 9% ఎగసి రూ.948 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.45,224 కోట్లు జతయ్యి రూ.5.96 లక్షల కోట్లకు చేరింది.

బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ లిస్టింగ్ భళా...

ఆటోమోటివ్ విడిభాగాల తయారీ సంస్థ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర (రూ.90)తో పోలిస్తే బీఎస్ఈలో 9.44% ప్రీమియంతో రూ.98.50 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ అనిశ్చితుల్లోనూ షేరు రాణించింది. ఇంట్రాడేలో 15% బలపడి రూ.103 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 8% లాభంతో రూ.97 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,665 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇండో-యూఎస్ వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు | ఎఫ్‌డీఐలు పెరిగాయ్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

డీఆర్‌డీవోలో సైంటిస్ట్ కొలువు.. నెలకు రూ.లక్ష వేతనం

జాబ్స్ ఇన్ఫో

కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డీఆర్‌డీవో(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఏడీఏ(ఏరోనాటికల్ డవలప్‌మెంట్ ఏజెన్సీ), ఇతర రక్షణ రంగ సంస్థల్లో 148 సైంటిస్ట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గేట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామక ప్రక్రియ చేపడతారు. ఈ కొలువులకు ఎంపికైతే నెలకు రూ.లక్ష వరకూ వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. డీఆర్‌డీవో సైంటిస్ట్ ఉద్యోగాల వివరాలు..

148 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- మొత్తం పోస్టుల సంఖ్య: 148
- పోస్టుల వివరాలు: డీఆర్‌డీవోలో సైంటిస్ట్ బీ 127 పోస్టులు, ఏడీఏలో సైంటిస్ట్/ఇంజనీర్ బీ 9 పోస్టులు, ఇతర రక్షణ రంగ సంస్థల్లో సైంటిస్ట్ బీ 12 పోస్టులు.

అర్హతలు

- ఆయా విభాగాలను అనుసరించి కొన్ని పోస్టులకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోర్ ఉండాలి.
- మరికొన్ని పోస్టులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఎంటమాలజీ, బయో స్టాటిస్టిక్స్, క్లినికల్ సైకాలజీ, సైకాలజీల్లో ప్రథమ శ్రేణిలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోర్ ఉండాలి.
- అర్హత కోర్సు చివరి సంవత్సరం పరీక్షలకు హాజరైన లేదా హాజరవుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే వీరు 31.07.2025 నాటికి సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది.
- వయసు: దరఖాస్తు ప్రక్రియ ముగిసే నాటికి అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 35 ఏళ్లు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు 40 ఏళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్)కు 38 ఏళ్లకు మించరాదు.

వేతనం

ఎంపికైన అభ్యర్థులకు మూల వేతనం నెలకు రూ. 56,100 ఉంటుంది. దీంతోపాటు హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు అన్నీ కలుపుకొని ప్రారంభంలోనే నెలకు రూ.లక్ష వరకూ వేతనం అందుతుంది.

ఎంపిక ప్రక్రియ

- వచ్చిన దరఖాస్తుల నుంచి గేట్ స్కోర్ ఆధారంగా విభాగం వారీగా, కేటగిరీ వారీగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున(1: 10) పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు.
- ఇలా షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు వెబ్‌సైట్‌లో తమ సమ్మతిని తెలపాల్సి ఉంటుంది.
- ఆ తర్వాత ఇంటర్వ్యూ తేదీని, వేదికను నిర్ణయించి అభ్యర్థులకు తెలియజేస్తారు.
- ఎంపికైన అభ్యర్థులు ఢిల్లీ లేదా డీఆర్‌డీవో, ఆర్ఏసీ నిర్ణయించిన ప్రాంతంలో–ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- గేట్‌లో స్కోర్‌కు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తుది నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- నోటిఫికేషన్ వెలువడిన తేదీ: 20.05.2025
- వెబ్‌సైట్: https://rac.gov.in

ఈసీఐఎల్‌లో ఇంజనీర్ కొలువులు

- ఉద్యోగాల భర్తీకి ఈసీఐఎల్ నోటిఫికేషన్లు
- ఇంజనీర్ 80 పోస్టులు, టెక్నీషియన్ 45 పోస్టులు
- రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ట్రేడ్‌టెస్ట్ ఆధారంగా ఎంపిక

బీటెక్, ఐటీఐ ఉత్తీర్ణులకు శుభవార్త. హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) నుంచి రెండు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల అయ్యాయి. బీటెక్ ఉత్తీర్ణుల కోసం 80 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైయినీ(జీఈటీ) నోటిఫికేషన్ విడుదలైంది. అదేవిధంగా ఐటీఐ పాసైన వారికోసం 45 పోస్టులతో టెక్నీషియన్ గ్రేడ్-2 నోటిఫికేషన్ సైతం విడుదలైంది. ఈ నేపథ్యంలో ఈసీఐఎల్‌లో ఉద్యోగాల వివరాలు..

పోస్టుల వివరాలు

ఈసీఐఎల్ విడుదల చేసిన గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైయినీ(జీఈటీ) నోటిఫికేషన్‌లో 80 పోస్టులున్నాయి. వీటిని రిజర్వేషన్ల వారీగా భర్తీ చేస్తారు. ఇందులో ఈసీఈ/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ బ్రాంచ్‌ల్లో బీటెక్ పూర్తి చేసిన వారికి 34 పోస్టులు ఉన్నాయి.ఈఅండ్ఐ/ ఇన్‌స్ట్రుమెంటేషన్–02, సీఎస్ఈ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–18, మెకానికల్–16, ఈఈఈ /ఎలక్ట్రికల్–05, సివిల్–03, కెమికల్–02 పోస్టులు ఉన్నాయి.

అదేవిధంగా 45 పోస్టుల టెక్నీషియన్ గ్రేడ్–2 నోటిఫికేషన్లో విభాగాల వారీగా.. ఎలక్ట్రానిక్స్ మెకానిక్ పోస్టులు–11, ఫిట్టర్–07, మెషినిస్ట్–07, ఎలక్ట్రీషియన్–7, టర్నర్–5, షీట్ మెటల్–2, వెల్డర్–2,కార్పెంటర్–2,పెయింటర్–2 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

జీఈటీ కోసం అభ్యర్థులు నాలుగేళ్ల బీటెక్/ బీఈ కోర్సులో 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. టెక్నీషియన్ కోసం పోస్టును అనుసరించి పదో తరగతి/తత్సమాన పరీక్షలో పాసవ్వాలి. దీంతోపాటు ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఏడాది అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

వయసు

రెండు రకాల పోస్టులకు కూడా అభ్యర్థుల గరిష్ట వయసు 27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీఈటీ ఎంపిక ప్రక్రియ

జీఈటీలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ సీబీటీ పరీక్ష 100 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో ఇంజనీరింగ్ కోర్సులోని కోర్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలే అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి పావుమార్కు (0.25 శాతం)ను తగ్గిస్తారు.

ఇంటర్వ్యూ

సీబీటీలో మార్కుల ఆధారంగా 1:4 నిష్పత్తిలో జీఈటీ అభ్యర్థులను పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. సీబీటీ, ఇంటర్వ్యూలలో సాధించిన మార్కులకు 85 : 15 నిష్పత్తిలో వెయిటేజీ ఇస్తారు. అభ్యర్థులు రెండు విభాగాల్లో కలిపి వేర్వేరుగా 50 శాతం, ఓవరాల్‌గా 60 శాతం మార్కులు సాధించాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు స్లీపర్ క్లాస్ రైలు చార్జీలను చెల్లిస్తారు.

టెక్నీషియన్ ఎంపిక

టెక్నీషియన్ గ్రేడ్–2 అభ్యర్థులను రాత పరీక్ష, ట్రేడ్ టెస్టుతో ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో మొత్తం 100 మార్కులకు మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కును తగ్గిస్తారు. సీబీటీలో మార్కుల ఆధారంగా ట్రేడ్ టెస్ట్‌కు 1:4 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీబీటీ, ట్రేడ్ టెస్ట్‌లకు 85:15 నిష్పత్తిలో వెయిటేజీ ఉంటుంది. ప్రతి విభాగంలో 50 శాతంతో మొత్తంగా 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఐటీఐలోని సిలబస్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. టెక్నీషియన్ గ్రేడ్–2 అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉండదు.

వేతనం

విజేతలుగా నిలిచి గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైయినీగా ఉద్యోగం పొందిన వారికి నెలకు రూ.40 వేల మూల వేతనంతో కెరీర్ ప్రారంభం అవుతుంది. టెక్నీషియన్లకు నెలకు రూ.20,480



వేతనం ఉంటుంది. మూల వేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, గ్రాట్యుటీ, ఫ్రింజ్ బెనిఫిట్స్, వైద్య సౌకర్యాలు, సెలవులు ఇతర ప్రోత్సాహకాలు ఉంటాయి.

కెరీర్

రాత పరీక్ష, ఇంటర్వ్యూలో విజేతలుగా నిలిచి జీఈటీగా ఎంపికైన వారు నాలుగేళ్లు ఈసీఐఎల్‌లో పని చేస్తామని నాన్ జ్యుడీషియల్ బాండ్ సమర్పించాలి. ఏడాది పాటు ట్రెయినీగా పని చేయాలి. ట్రైయినీ సమయంలో 3 శాతం వార్షిక ఇంక్రిమెంట్ ఉంటుంది. ఏడాది తర్వాత ఆఫీసర్‌గా పదోన్నతి పొందుతారు. అనంతరం కంపెనీ నిబంధనలకు అనుగుణంగా డీఏ, హెచ్ఆర్ఏ మొదలైనవి అందుతాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 05.06.2025
- పరీక్ష కేంద్రాలు: బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా.
- వెబ్‌సైట్: https://www.ecil.co.in

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐవోఆర్, కేరళలో 22 టెక్నికల్ స్టాఫ్ పోస్టులు

కేరళలోని సెంట్రల్ కాయర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అలప్పుజ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాయర్ టెక్నాలజీ బెంగళూరు కర్ణాటకలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ /టెక్నికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
- **పోస్టుల వివరాలు:** టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, డిజైన్ అసిస్టెంట్, ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్–అనలిటికల్ కెమిస్ట్, ప్రాజెక్ట్ హెల్పర్, ట్రైనర్, ఇన్‌స్ట్రక్టర్, బాయిలర్ ఆపరేటర్, స్టోర్ అసిస్టెంట్, లైబ్రేరియన్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగం/ట్రేడులో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, డిజైన్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు రూ.28,000, బాయిలర్ ఆపరేటర్, స్టోర్స్ అసిస్టెంట్, లైబ్రేరియన్‌కు రూ.25,000, ఇతర పోస్టులకు రూ.20,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025.
- **వెబ్‌సైట్:** http://coirboard.gov.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 25 ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన కొచ్చిలోని వర్క్‌మెన్ కేటగిరిలో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 25.
- **పోస్టుల వివరాలు:** ఫైర్‌మ్యాన్–15, సెమీ స్కిల్డ్ రిగ్గర్–09, కుక్–01.
- **అర్హత:** ఎస్ఎస్ఎల్‌సీ, ఆరో తరగతి, ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం, భాషా నైపుణ్యాలు కలిగి ఉండాలి. **వయసు:** 20.06.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **స్టైపెండ్:** నెలకు రూ.21,300 నుంచి 69,840.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫేజ్1, ఫేజ్2 పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025.
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

సీఎస్ఐఆర్–ఎన్ఈఐఎస్‌టీలో 17 పోస్టులు

అసోం రాష్ట్రంలోని సీఎస్ఐఆర్–నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎన్ఈఐఎస్‌టీ).. టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
- **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్–07, టెక్నికల్ అసిస్టెంట్–10.
- **అర్హత:** టెక్నీషియన్ పోస్టుకు కనీసం 55 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.35,400 నుంచి రూ.1,12,400, టెక్నీషియన్ పోస్టుకు రూ.19,900 నుంచి 63,200.
- **వయసు:** 16.06.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష (స్టేజ్–1, స్టేజ్–2) ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025.
- **వెబ్‌సైట్:** https://neist.res.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

తేజస్ యుద్ధ విమానంలో హైదరాబాద్ 'మార్క్'1ఏ

పూర్తి దేశీయ పరిజ్ఞానంతో తయారుచేసిన వెమ్ టెక్నాలజీ సంస్థ

యుద్ధ విమానంలోని ప్రధాన భాగం తయారీ

రేపు హెచ్ఏఎల్‌కు అప్పగింత

శంషాబాద్: భారతదేశం అభివృద్ధి చేసిన తేజస్ యుద్ధ విమానంలో ప్రధాన భాగాన్ని (సెంట్రల్ ఫ్యూస్‌లేజ్) పూర్తి దేశీయ పరిజ్ఞానంతో వెమ్ టెక్నాలజీ సంస్థ తయారు చేసింది. దీనికి 'మార్క్1ఏ'గా నామకరణం చేసింది. రక్షణ రంగంలోని వివిధ పరికరాల తయారీలో పేరుగాంచిన ఈ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో తొలుత అభివృద్ధి భాగస్వామిగా సెంట్రల్ ఫ్యూస్‌లేజ్ (సీఎఫ్)ను తయారు చేసి సక్సెస్ కావడంతో ఉత్పత్తి భాగస్వామిగా మారింది. 3 నెలల్లో తొలి సీఎఫ్ విజయవంతంగా పూర్తి చేసి హెచ్ఏఎల్‌కు అందించేందుకు సిద్ధమైంది. యుద్ధవిమానంలోని సీఎఫ్‌ను తయారుచేసిన దేశీయ మొదటి ప్రైవేటు సంస్థగా ఇది నిలిచింది.

ఏమిటి సీఎఫ్?

డెల్టావింగ్ కలిగి ఒకే ఇంజిన్‌తో పని చేసే తేజస్ మల్టిరోల్ లైట్ కాంబాట్ యుద్ధవిమానాన్ని హెచ్ఏఎల్ రూపొందించిన సంగతి తెలిసిందే. విమానంలో ఫ్రంట్ ఫ్యూస్‌లేజ్ అంటే పైలట్ కూర్చునే భాగం, రియర్ ఫ్యూస్‌లేజ్ అంటే విమానంలోని వెనుక భాగం, కింద ఉండే ల్యాండింగ్ విభాగాలను అనుసంధానించుకునే ప్రధాన భాగాన్నే (విమానం మధ్యలో ఉండే) సెంట్రల్ ఫ్యూస్‌లేజ్ అంటారు. ఇది మానవ శరీరంలోని మధ్యభాగంలాంటిదన్నమాట. మిగతా అన్ని భాగాలను దీనితో అనుసంధానిస్తారు. ఇందులోనే ప్రధానమైన ఇంజిన్ కూడా ఉంటుంది.



వెమ్‌టెక్నాలజీ సంస్థ తయారు చేసిన సెంట్రల్ ఫ్యూస్‌లేజ్ ఇదే...

నెలకు ఒకటి తయారీ

హెచ్ఏఎల్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన బృందంతో 3 నెలల్లో తొలి సీఎఫ్ తయారు చేశాం. వివిధ దశల్లో హెచ్ఏఎల్ క్లియరెన్స్‌తో దీనిని పూర్తి చేశాం. ఇకపై నెలకొకటి చొప్పున అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాం. హెచ్ఏఎల్ పర్యవేక్షణతో వారి క్లియరెన్స్‌తో వీటి తయారీ జరుగుతుంది. ప్రస్తుతం 20 సీఎఫ్‌ల తయారీకి హెచ్ఏఎల్ అనుమతినిచ్చింది.

– సీహెచ్‌వీ రామారావు, జీఎం, వెమ్ టెక్నాలజీ

హైదరాబాద్‌లో...

హైదరాబాద్‌లోని వెమ్ టెక్నాలజీ సంస్థ రూపొందించిన ఈ సీఎఫ్ తయారీలో 25 మంది ఇంజనీర్లు, 35 మంది టెక్నీషియన్ల బృందం పాల్గొంది. దీనికోసం మొత్తం 1,595 కాంపోనెంట్స్ వాడారు. వివిధ భాగాలను అనుసంధానించేందుకు సంస్థలో జిగ్ (పరికరాలను బిగించే ప్రాంతం) ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం సంస్థలో రెండు జిగ్‌లున్నాయి. వెమ్ టెక్నాలజీ సంస్థ తన తొలి సీఎఫ్ మార్క్1ఏ ను శుక్రవారం హెచ్ఏఎల్‌కు అప్పగించనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి సంజీవ్‌కుమార్, హెచ్ఏఎల్ సీఎండీ డాక్టర్ డీకే సునీల్, హెచ్ఏఎల్ డైరెక్టర్ కె.రవి హాజరు కానున్నారు.

'రెరా' అమలులో తెలంగాణకు ఐదో స్థానం

అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో ప్రధాని మోదీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థ (టీజీ రెరా) ప్రజలకు సేవలందించడంలో దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో మహారాష్ట్ర, గుజరాత్ (ద్వితీయ), తమిళనాడు (తృతీయ), కర్ణాటక (నాల్గవ) స్థానంలో నిలిచాయి. గృహాలు, ప్లాట్ల కొనుగోలుదారులకు అండగా నిలవడమేకాక, నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కొరడా ఝుళిపించడం, అనుమతులు లేకుండా ప్రచారం చేస్తే జరిమానాలు విధిస్తూ టీజీ రెరా చర్యలు తీసుకుంటోంది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర నిధులతో అమలవుతున్న ప్రధాన ప్రాజెక్టులపై సమీక్షించారు. తెలంగాణ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి టీకే శ్రీదేవి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో రహదారులు, వైద్యారోగ్య మౌలిక సదుపాయాలు, పురపాలక శాఖ, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ కార్యకలాపాలపై కూడా ప్రధాని సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ప్రజెంటేషన్ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ సంస్థలు విధిగా రెరా దగ్గర రిజిస్టర్ చేసుకునే సంఖ్య బాగా పెరగడం ప్రాధాన్యంగా తెలిపారు. ఫ్లాట్లు, ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్య ప్రజానీకానికి అవసరమైన రక్షణ కల్పించడం రెరా బాధ్యత అని ప్రధాని సూచించినట్లు సమాచారం.

వేడుకగా బ్యూటీ విత్ చారిటీ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి అంటే అత్యంత అందమైన అమ్మాయనే కాదు.. అంతకు మించిన మానవీయ విలువలున్న హృదయం, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం అని మిస్ వరల్డ్ వేదిక నినదిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్ వేదికగా నిర్వహించిన 'హార్ట్ ఆఫ్ గోల్డ్'చారిటీ ఈవెంట్ అలాంటి వ్యక్తిత్వాలను, మనస్సులను ప్రతిబింబించింది. మిస్ వరల్డ్ పోటీదారులతో నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా.. ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ, సుదీక్ష ఎస్టేట్స్ సంస్థల సహకారంతో ప్రభుత్వ బాలసదన్‌లకు చెందిన 200 మంది అనాథ పిల్లలకు ఏడాది పాటు సహాయం చేసేందుకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక్కో చిన్నారికి పాఠ్య పుస్తకాలు, పోషకాహారం, ప్రోటీన్ పౌడర్, సప్లిమెంట్లు, నెలవారీ రేషన్ సరఫరా, దుస్తులు, స్వెటర్లు, రెయిన్ కోట్లు, డ్రెస్సులు, స్కూల్ కిట్లు (స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్స్‌లు), టాయిలెట్రీలు, డిజిటల్ వాచ్‌లు, విద్యా సంబంధిత ఆట బొమ్మలు, వ్యక్తిగత వస్తువుల కోసం ట్రాలీ బ్యాగ్‌లతో కూడిన ఒక్కొక్కటి దాదాపు రూ.25 వేల విలువైన 200 కిట్లను చిన్నారులకు అందించి సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. ఐసీడీఎస్ బాలసదన్‌ల చిన్నారులకు మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు కిట్‌లు అందించడంతో పాటు ఆ చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఆ పసి హృదయాల సంతోషాన్ని, బాధను పంచుకున్నారు. కష్టాలను అధిగమించి తమలాగే ప్రపంచ వేదికలపై ప్రత్యేకతను చాటుకునేలా ఎదగాలంటే చదువొక్కటే మార్గమని, ఆ దారిలో విశ్వాన్ని చదివేయొచ్చనే సందేశాన్ని తెలియజేశారు. పిల్లలు అడిగిన పలు ప్రశ్నలకు 'థింక్ బిగ్, థింక్ డిఫరెంట్.. అచీవ్ గోల్స్'అంటూ స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చారు. కాగా 200 మంది విద్యార్థులకు కిట్లతో పాటు ఏడాది పాటు అన్ని విధాలా సహకరించేందుకువీలుగా రూ.2 కోట్ల చెక్కును మిస్ వరల్డ్ క్రిస్టీనా చేతుల మీదుగా దాతలు అందజేశారు. విక్టోరియా మెమోరియల్ పాఠశాల పూర్తిస్థాయి పునరుద్ధరణకు కూడా దాతలు ముందుకు వచ్చారు.



మిస్ వరల్డ్ క్రిస్టీనా చేతుల మీదుగా చెక్కును అందజేస్తున్న దృశ్యం



పిల్లలతో కలిసి నృత్యం చేస్తున్న మిస్ సోమాలియా

మిస్ వరల్డ్ వేదికపై వినూత్న కార్యక్రమం

200 మంది అనాథ పిల్లల కోసం 'హార్ట్ ఆఫ్ గోల్డ్'ఈవెంట్

రూ.2 కోట్ల చెక్కు, పిల్లలకు 200 కిట్లు అందజేసిన దాతలు

పిల్లలతో ఆడి, పాడిన సుందరీమణులు.. సెల్ఫీలు, వీడియోలు

తెలుగు పాటలకు స్టెప్పులేస్తూ..

వికారాబాద్, నారాయణపేట జిల్లాల ప్రభుత్వ ఐసీడీఎస్ బాలసదన్‌లలోని అనాథ చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను కలిసే అవకాశం చిన్నారులకు కల్పించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా 'హార్ట్ ఆఫ్ గోల్డ్'పేరిట ఈ చారిటీ కార్యక్రమాన్ని చేపట్టింది. కాగా మిస్ వరల్డ్ పోటీదారులు చిన్నారులతో ముచ్చటిస్తూ, వారితో కలిసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. చిన్నారులను తమ ఒడిలో కూర్చోబెట్టుకొని సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీదారుల్లో చాలవరకు సామాజిక సేవలో ఉన్నవారు కాబట్టి ఈ పసి హృదయాలతో ఆత్మీయంగా ముచ్చటించారు. లైవ్ బ్యాండ్ అందించిన సంగీతానికి, తెలుగు పాటలకు వారు చిన్నారులతో కలిసి నృత్యం చేయడం హైలెట్‌గా నిలిచింది. కొందరైతే చిన్నారుల దగ్గర స్టెప్స్ నేర్చుకుని మరీ నర్తించారు.

నేటి చారిటీ కార్యక్రమం బ్యూటీ విత్ పర్పస్ సారాన్ని ప్రతిబింబించింది. మిస్ వరల్డ్ పోటీదారులు చిన్నారులతో మమేకమైన తీరు వారి సేవా నిబద్ధతను చాటింది. ఈ పోటీల్లో భాగంగా ఇంతటి ప్రభావవంతమైన సేవా కార్యక్రమం జరగడం చాలా సంతోషంగా ఉంది.

– జూలియా మోర్లే, మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్, సీఈఓ.

మిస్ వరల్డ్ సంస్థతో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉంది. రూ.2 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలకు మేం కట్టుబడి ఉన్నాం. దశల వారీగా ఈ సేవా కార్యక్రమాలను విస్తరిస్తాం.

– డాక్టర్ రామకృష్ణ, ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ చైర్మన్

యువ వికాసంతో రాష్ట్ర జీడీపీ పెరుగుతుంది

పథకం పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు

రాజీవ్ యువ వికాసం అమలుపై కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపుతుందని, దీంతో రాష్ట్ర జీడీపీ పెరుగుతుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. యువ వికాసం పథకం అమలుపై బుధవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత శక్తిసామర్థ్యాలపై నమ్మకంతో ప్రభుత్వం రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజాప్రభుత్వం రూ.8 వేల కోట్లతో 5 లక్షల మంది యువతకు రాయితీలు అందించి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున మానవ వనరుల వినియోగం జరుగుతుందని, వ్యాపార కార్యకలాపాలు విస్తృతమవుతాయన్నారు. ఆర్థిక సహాయం అందించడంతో పని పూర్తయిందనే భావన వద్దని, పథకం అమలు, యూనిట్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని భట్టి సూచించారు. యువ వికాసం యూనిట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు, సహాయం అందించేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. జూన్ 2న సాయంత్రం 4 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా యువ వికాసం లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందిస్తామని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అక్షరాస్యతకు ఎన్ఎస్ఈ అవగాహన

రాష్ట్ర ప్రభుత్వంతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎంఓయూ

సాక్షి, హైదరాబాద్: మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడంతో పాటు మహిళా వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడం, ఎంఎస్ఎంఈల నిధుల సేకరణను సులభతరం చేయడం, విద్యార్థుల్లో నైపుణ్య కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చేపట్టనుంది. ఈ మేరకు బుధవారం వీ–హబ్ ఫౌండేషన్‌తో ఎన్ఎస్ఈ ఎంఓయూపై సంతకం చేశాయి. మదుపరుల అవగాహన కార్యక్రమాల ద్వారా ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి ఐపీఓ విధానం ద్వారా నిధుల సేకరణ కోసం మహిళల నేతృత్వంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో అవగాహనను వ్యాప్తి చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా బీఎఫ్ఎస్ఐ రంగంలో స్టూడెంట్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేయడానికి, మహిళలు, మహిళల నేతృత్వంలోని సంస్థలకు సాధికారత కల్పించడానికి ఈ ఒప్పందం కీలకం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క సమక్షంలో ఎన్ఎస్ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్, వీ–హబ్ ఫౌండేషన్ సీఈఓ సీతా పల్లచోళ్ల మధ్య జరిగింది. ఇందులో భాగంగా వీ–హబ్ ఫౌండేషన్‌తో కలిసి ఎన్ఎస్ఇ ఆర్థిక అక్షరాస్యత, మదుపరుల అవగాహనను వ్యాప్తి చేయడానికి సెమినార్లు, శిబిరాలు, నాలెడ్జ్ సెషన్లు, రోడ్ షోలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది.

'భూమి' నమోదుకు రూ.12 లక్షలు డిమాండ్

ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు



ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంపై బుధవారం ఏసీబీ అధికారులు దాడులు చేపట్టారు. ఓ వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేశాడనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.కృష్ణను విచారించి అరెస్ట్ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదిబట్ల రెవెన్యూ పరిధిలోని 355 సర్వే నంబర్‌లో ఏడుగుంటల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. దీంతో నిషేధిత జాబితా నుంచి ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆర్ఐ కృష్ణ రూ.12 లక్షలు డిమాండ్ చేయగా రూ.9 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే డబ్బులు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. అయితే అంత డబ్బు ఒకేసారి ఇవ్వలేనని బాధితుడు తెలపడంతో పని పూర్తి చేసిన ఉన్నతాధికారులకు వెంటనే డబ్బు ఇవ్వాల్సి ఉంటుందని, ముందుగా రూ.4 లక్షలు ఇవ్వాలని ఆర్ఐ బాధితుడిపై ఒత్తిడి పెంచాడు. దీంతో బాధితుడి కుమారుడు ఏసీబీని ఆశ్రయించాడు. పక్కా ఆధారాలను సేకరించిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాలయంపై దాడులు చేసి ఆర్ఐ కృష్ణను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులు ఆర్‌డీఓ అనంతరెడ్డిని తహసీల్ కార్యాలయానికి పిలిపించి తహసీల్దార్ సునీతారెడ్డి, డీటీ శ్రీనివాస్‌గౌడ్‌ల సమక్షంలో విచారించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ముగిసిన సిరాజ్, సమీర్ పోలీస్ కస్టడీ

విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పోలీస్ కస్టడీలో ఉన్న నిందితులు సిరాజ్, సమీర్‌లను పోలీసులు బుధవారం విజయనగరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వీరిద్దరినీ విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈనెల 16న అరెస్టైన వీరిని వారం రోజులపాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. ఈనెల 23 నుంచి విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ), స్థానిక పోలీసు అధికారులు నిందితులను విచారించారు. గడువు ముగియడంతో బుధవారం సా.4.45కు కోర్టులో హాజరుపర్చారు. ఇక నిందితులిద్దరికీ ఐఎస్ఐతో సంబంధాలున్నట్లు ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం.

'మిస్ వరల్డ్' మళ్లీ భారత్‌లోనే..?

హైదరాబాద్ సహా మరో పది నగరాలపై మిస్ వరల్డ్ సంస్థ ఆసక్తి

అన్ని విధాలా అనుకూలంగా ఉండటమే కారణం

నిర్వహణ వ్యయం తక్కువ, ఆదాయం, స్థానిక ప్రభుత్వాల సహకారం

పోటీలను అంతగా పట్టించుకోని అమెరికా, యూరప్ దేశాలు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలను వరసగా మూడోసారి భారత్‌లోనే అందునా మళ్లీ హైదరాబాద్‌లోనే నిర్వహించాలన్న దిశలో మిస్‌వరల్డ్ సంస్థ యోచిస్తోంది. గతేడాది జరిగిన 71వ ఎడిషన్‌కు ముంబై వేదిక కాగా, ఈ ఏడాది 72వ ఎడిషన్ హైదరాబాద్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా ప్రపంచ సుందరి పోటీల నిర్వహణకు భారత్ అనువుగా ఉందనే ఉద్దేశంతో 73వ ఎడిషన్‌కు కూడా భారత్‌నే ఎంచుకోవాలని మిస్ట్ వరల్డ్ సంస్థ భావిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటినుంచే సన్నాహాలు ప్రారంభిస్తోంది. మరోసారి హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించనుందని సమాచారం. అదే సమయంలో హైదరాబాద్ సహా దేశంలోని పది నగరాలను పరిశీలించాలని నిర్ణయించిందని తెలుస్తోంది. ఈ మేరకు తన మనసులోని మాటను మిస్ వరల్డ్ సంస్థ చైర్ పర్సన్ జూలియా మోర్లే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న 72వ ఎడిషన్ కోసం దేశంలోని మరో పది రాష్ట్రాలు పోటీలో నిలిచాయి. ఇప్పుడు కూడా ఆయా రాష్ట్రాలు తదుపరి ఎడిషన్ నిర్వహణ కోసం అడుగుతున్నాయని మిస్ వరల్డ్ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని ఇతర దేశాలు కూడా రేసులో చేస్తున్నప్పటికీ, మరోసారి భారత్‌లోనే నిర్వహిస్తే మంచిదన్న అభిప్రాయంతో నిర్వాహకులు ఉన్నట్టు సమాచారం.

భారత్‌లోనే ఎందుకు..?

→ యూరప్, అమెరికా దేశాలు, చైనాతో పోలిస్తే నిర్వహణ వ్యయం భారత్‌లో చాలా తక్కువ. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల నిర్వహణ వ్యయం రూ.57 కోట్లుగా అంచనా వేసినట్టు ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఇందులో మిస్ వరల్డ్ భరించే మొత్తం రూ.28.5 కోట్లు మాత్రమే. అంటే దాదాపుగా సగం మాత్రమే. మిగతా దాదాపు సగం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఇలా భారత్‌లోని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సగం మొత్తాన్ని భరిస్తున్నాయి. చాలా విదేశాల్లో ఈ వెసులుబాటు లేదు. మొత్తం ఖర్చు మిస్ వరల్డ్ సంస్థనే భరించాల్సి వస్తోంది. ఇక యూకే సహా యూరప్ అమెరికాల్లో ఈ వ్యయం మూడు నాలుగు రెట్లు ఎక్కువ.

→ స్పాన్సర్‌షిప్ రూపంలో మిస్ వరల్డ్ సంస్థకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఈ లెక్కలను ఆ సంస్థ పూర్తి గోప్యంగా ఉంచుతున్నప్పటికీ, ఆ మొత్తం రూ.వందల కోట్లలో ఉంటుందనే అభిప్రాయం ఉంది. స్థానికంగా చారిటీ కార్యక్రమాలు, కొన్ని వితరణలు మినహా మిగతా మొత్తం ఆ సంస్థనే తీసుకుంటుంది. కానీ కొన్ని దేశాల్లో అయితే, స్థానిక ప్రభుత్వాలకు ఇందులో వాటా ఇవ్వాల్సి వస్తోంది. భారత్‌లో ఈ సమస్య లేకపోవటంతో ఆ సంస్థకు బాగా కలిసి వస్తోంది.

→ గత ఎడిషన్ పోటీలప్పుడు స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణంగా సహకరించాయి. ఆ పోటీల నిర్వహణకు గౌరవంగా భావించాయి. పోటీదారులు పర్యటించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చుతో చేపట్టాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరిస్థితి లేదు. అవి మిస్ వరల్డ్ పోటీలను వ్యాపార కార్యక్రమంగానే పరిగణిస్తున్నాయి. ఈ పోటీల రూపంలో అయ్యే ఖర్చును మిస్ వరల్డ్ సంస్థే భరించాల్సిన పరిస్థితి ఉంది.

→ యూరప్, అమెరికా, యూకేలాంటి చోట్ల పర్యాటక రంగం ఇప్పటికే బాగా అభివృద్ధి చెందింది. దీంతో ఆ దేశాలు ఈ పోటీల కోసం పెద్దగా పాకులాడటం లేదు. కానీ భారత్.. ఈ పోటీల నిర్వహణ ద్వారా లభించే ప్రచారంతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవచ్చనే ఆలోచనతో ఉంది. ఈ కారణంగానే రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలో ఉంటున్నాయి.

→ మిస్ వరల్డ్ పోటీలకు కావాల్సిన మౌలిక వసతులు మన దేశంలోని చాలా నగరాల్లో ఉన్నాయి. పోటీలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకుని పని చేస్తున్నాయి. ఇది ఆ సంస్థకు బాగా కలిసొచ్చే అంశం. అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఫైవ్/సెవన్ స్టార్ హోటళ్లు, ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు సరిపడా వేదికలు, పోటీదారులు పర్యటించేందుకు అనువైన ప్రాంతాలకు కొదవ లేదు. హోటళ్లు, వేదికల అద్దెలు అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా తక్కువ.

→ ముఖ్యంగా వరసగా రెండు పర్యాయాలు నిర్వహించినప్పటికీ, ఇండియాలో పోటీలపై పెద్దగా నిరసనలు వ్యక్తం కాలేదు. కొన్ని దేశాల్లో నిరసనల వల్ల అప్పటికప్పుడు పోటీలను వేరే చోటకు మార్చుకున్న సందర్భాలున్నాయి.

బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకుంటా

హైకోర్టుకు శ్రవణ్‌రావు వినతి.. అనుమతించిన ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: తనపై దాఖలైన చీటింగ్ కేసులో బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటానని ఎ.శ్రవణ్‌కుమార్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీంతో పిటిషనర్ విజ్ఞప్తిని న్యాయస్థానం అంగీకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌కుమార్‌పై ఇటీవల సీసీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. చీటింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసి సీసీఎస్ అధికారులు మూడు వారాల క్రితం ఆయనను అరెస్టు చేశారు. గతంలో శ్రవణ్‌రావు రూ.6 కోట్ల మేర మోసం చేశాడని అఖండ ఎంటర్‌ప్రైజెస్ ఫిర్యాదు చేసింది. కాగా, తనపై వృద్ధురాలైన తల్లి, భార్య, పిల్లలు ఆధారపడి ఉన్నారని.. పోలీసులు, సీసీఎస్‌తో కుమ్మక్కై ఎలాంటి సంబంధం లేని కేసును తనపై పెట్టారని శ్రవణ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇనుప ఖనిజం కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలు బీఎన్ఎస్ సెక్షన్ 316(5) పరిధిలోకి రావన్నారు. తన అరెస్టు చట్టవిరుద్ధమని, రాజకీయ కారణాలతో కేసులో ఇరికించారని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ కె.శరత్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోరడంతో న్యాయమూర్తి అంగీకరించారు.

దత్తత పేరుతో శిశువుల విక్రయం

సూర్యాపేటలో 13 మంది ముఠా అరెస్టు

ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి స్థానికంగా విక్రయం.. ఒక్కో శిశువుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు

నల్లగొండ బాలల సంరక్షణ కేంద్రానికి శిశువుల తరలింపు

సూర్యాపేట టౌన్: ఇతర రాష్ట్రాల నుంచి శిశువులను అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేటకు చెందిన భార్యాభర్తలు నక్క యాదగిరి, ఉమారాణితోపాటు మరో 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ మీడియాకు వెల్లడించారు. ముంబై, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్ తదితర ప్రాంతాల నుంచి కొన్ని ముఠాల ద్వారా శిశువులను తీసుకొచ్చి ఒక్కో శిశువును రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరు ఇప్పటివరకు టేకుమట్లలో ముగ్గురు మగశిశువులను, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు ఆడ శిశువులను, పెన్‌పహాడ్‌లో ఒక మగ శిశువు, ఉప్పలపహాడ్‌లో ఇద్దరు మగ శిశువులు, తిప్పర్తి మండలం చిన్న సూరారం గ్రామంలో ఒక ఆడశిశువు, హైదరాబాద్‌లో ఒక మగ శిశువును విక్రయించినట్టు గుర్తించారు. పిల్లలందరినీ రక్షించి నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. అరెస్టయినవారిలో నక్క యాదగిరి, ఉమారాణి, కోరె నాగేంద్రకుమార్, కొట్టె రామలక్ష్మి, పిల్ల పావని, గరికముక్కు విజయలక్ష్మి, ఆముదాలపల్లి సత్యమణి, నాగర్‌కర్నూల్‌కు చెందిన ముడావత్ రాజు, హైదరాబాద్‌కు చెందిన ఎండి.షాహానా, ఇస్తారి శోభారాణి, సబావత్ శ్రీనివాస్, ఏర్పుల సునీత, రాజస్తాన్‌కు చెందిన ఖాన్ షాహీనా ఉన్నారు. ఈ ముఠాపై గతంలో మేడిపల్లి, మునగాల, మంగళగిరి, జనగామ, ముంబైలో కేసులు ఉన్నాయని ఎస్పీ చెప్పారు.



శిశువులను దత్తత తీసుకున్న మహిళలు పోలీస్ స్టేషన్ ఎదుట విలపిస్తున్న దృశ్యం

శిశువుల విక్రయం ఇలా..

యాదగిరి, ఉమారాణి దంపతులు వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఇతర రాష్ట్రాల నుంచి శిశువులను తీసుకొచ్చి విజయవాడకు చెందిన కోరె నాగేంద్రకుమార్ మధ్యవర్తిత్వంతో దత్తత పేరుతో విక్రయిస్తున్నారు. సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన అంజయ్య, నాగయ్య పిల్లల కోసం నక్క యాదగిరిని సంప్రదించారు. వారికి 15 రోజుల మగ శిశువును విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. వీరిపై నిఘా పెట్టిన సీసీఎస్ పోలీసులు శిశువును అప్పగించే సమయంలో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో మరో 11 మంది ముఠా ఉన్నట్టు తేలింది. దీంతో వెంటనే వారిని అరెస్టు చేశారు. కొనుగోలుచేసిన వారినుంచి శిశువులను పోలీసులు తీసుకురావటంతో వారంతా సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. పిల్లలను ఇవ్వకపోతే స్టేషన్ ముందు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

బెయిల్‌కు అనుమతించండి

హైకోర్టులో లంచ్‌మోషన్ కోరిన హీరాగోల్డ్ ఎండీ నౌహీరా షేక్

నిరాకరించిన న్యాయమూర్తి.. కింది కోర్టులో పిటిషన్



సాక్షి, హైదరాబాద్: లంచ్‌మోషన్ రూపంలో బెయిల్ పిటిషన్ వేసేందుకు అనుమతించాలని హీరాగోల్డ్ సంస్థల ఎండీ నౌహీరా షేక్ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు న్యాయమూర్తి నిరాకరించడంతో.. కింది కోర్టులో దాఖలు చేశారు. హీరా గోల్డ్ స్కామ్‌లో ప్రధాన నిందితురాలిగా పేర్కొంటూ సీసీఎస్ ఆమెపై కేసు నమోదు చేసింది. ట్రయల్ కోర్టులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో.. న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ నౌహీరా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వయసును, ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని.. కింది కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్ విచారణకు రాకమునుపే ఆమెను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఖాజా శరత్ బుధవారం విచారణ చేపట్టారు. ఇప్పటికే పిటిషనర్‌ను అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినందున.. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అయితే, మధ్యంతర అప్లికేషన్ లేదా అత్యవసర బెయిల్ పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది సామల రవీందర్ విజ్ఞప్తి చేశారు. లంచ్ మోషన్‌పై బెయిల్ పిటి షన్‌లను విచారించడానికి న్యాయమూర్తి నిరాకరించారు. దీంతో రవీందర్ ట్రయల్ కోర్టును ఆశ్రయించి రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రవీందర్‌రెడ్డి వాదనలు విన్న ట్రయల్‌కోర్టు.. పోలీసుల వాదనల కోసం విచారణను గురువారానికి వాయిదా వేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

విజ్ఞాన భాండాగారం... సమతా గ్రంథాలయం


గ్రంథాలయంలోని పుస్తకాలు

అందుబాటులో విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల పుస్తకాలు

సొంత ఖర్చులతో లైబ్రరీని నిర్వహిస్తున్న దుర్గం ప్రమీల

ఆదర్శంగా నిలుస్తున్న సమతా ఫౌండేషన్, గ్రంథాలయం


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న మహిళలు

జ్యోతినగర్ (రామగుండం): స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయోద్యమం కీలక భూమిక పోషించింది. విజ్ఞాన భాండాగారాలుగా నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయి. అయితే పౌర గ్రంథాలయాలను సమస్యలు వెంటాడుతున్నాయి. వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో పాఠకులు ఆదరించడం లేదు. విజ్ఞానాన్ని పంచేవాటిపై పాలకులు, పాఠకుల్లో ఆదరణ కొరవడింది.

పూర్వవైభవం కోసం..

రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థకు పూర్వవైభవం లభిస్తుందని మేధావులు, విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేసినా ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. స్వాతంత్ర్యోద్యమం, సహకారోద్యమం, స్వదేశీ ఉద్యమం, వయోజన విద్య తదితర ప్రచారోద్యమాలకు గ్రంథాలయోద్యమం పునాదులు వేసింది. ఈ క్రమంలోనే మే 12న బుద్ధ పూర్ణిమని పురస్కరించుకుని ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గం ప్రమీల తన ఇంట్లోనే సొంత ఖర్చులతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రంథాలయాల ఆవశ్యకతపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

పోటీ, పరీక్షార్థులకు ఊతం

విజ్ఞానం, వికాసాలను పెంచడంలో లైబ్రరీలు కీలకభూమిక పోషిస్తాయి. చదువుకున్న ప్రతీవ్యక్తి రోజూ కొంత సమయం పుస్తక పఠనం చేస్తే ప్రయోజనం కలుగుతుంది. ఏదోఒక కొత్త విషయాన్ని నేర్చుకొని జీవన విధానాన్ని మెరుగు పర్చుకోవడానికి దోహదపడుతుంది. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల్లోనూ విద్యార్థులు, ఉద్యోగార్థులు సత్తా చాటేందుకు ఉపయోగపడుతున్నాయి. పోటీపరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ఇందులో లభిస్తాయి. చారిత్రక అంశాలు, వర్తమానాంశాలు, ఇతర అన్నిరంగాల సమగ్ర సమాచారం గ్రంథాలయాల పుస్తకాల్లో లభ్యమవుతుంది.

వార్తాపత్రికలు.. పుస్తకాలు

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలో దుర్గం ప్రమీల ఏర్పాటు చేసిన సమతా గ్రంథాలయంలో వార్తా పత్రికలతోపాటు, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, చిన్నారులు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే పుస్తకాలను ఉంచారు. పరిశోధనలకు సమాచారం లభించే రెఫరెన్స్ గ్రంథాలు కూడా ఉన్నాయి. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల దినపత్రికలు, వివిధ వార, పక్ష, మాసపత్రికలు పాఠకులకు అందుబాటులో ఉంచారు. చారిత్రక, భౌగోళిక, రాజకీయ, సామాజిక, విజ్ఞాన, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, సాహిత్య కళారంగాల వివరాలతో కూడిన పుస్తకాలు సమత గ్రంథాలయంలో ఉన్నాయి.

చరిత్రను తెలుసుకోవాలి



తెలంగాణ, భారతదేశ, ప్రపంచ, స్వాతంత్ర్యోద్యమం, ప్ర పంచ యుద్ధాలు, సామాజిక, రాజకీయ ఉద్యమాలు, భారత రా జ్యాంగం, ఆర్థికవ్యవస్థ, దేశ నేతలు, శాస్త్రవేత్తల జీవిత చరి త్రలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, క్రీడలు, ప్రాచీన, ఆధునిక సాహిత్యం సమతా గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రచయితలు, కవులు, కళాకారులు, సాహిత్యకారులు, వైద్యం, ఆరోగ్యం, ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషా నిఘంటువులు, మనోవైజ్ఞానిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుకుని జ్ఞానం పెంపొందించుకోవాలి.

– ముడిమడుగుల మల్లన్న, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి

ప్రసిద్ధ క్షేత్రాల వివరాలు ఉన్నాయి

సమతా గ్రంథాలయంలో ప్రసిద్ధ క్షేత్రాలు, పర్యాటక స్థలాలు, చట్టాలపై అవగాహన కల్పించే పుస్తకాలూ ఉన్నాయి. రోజూ పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞాన, ప్రతిభాపాటవాలు పెరుగుతాయి. పద సంపద, విషయ పరిజ్ఞానం, భాషపై పట్టు ఒనగూరుతాయి.

– లవన్‌కుమార్,
జిల్లా కన్వీనర్,
మేరు కుల సంఘం, పెద్దపల్లి

సద్వినియోగం చేసుకోండి



ప్రజల కోసం ఏర్పాటు చేసిన సమతా ఫౌండేషన్ సమతా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి. వర్తమాన రాజకీయాంశాలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలను తెలుసుకునేందుకు దినపత్రికలు, పోటీ పరీక్షల మ్యాగజీన్లు, జర్నల్స్ లైబ్రరీలో ఉన్నాయి. గ్రంథాలయానికి పుస్తకాలు అందించేవారు 94943 33899 ఫోన్‌నంబర్‌లో సంప్రదించండి.

– దుర్గం ప్రమీల– నగేష్,
సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు

న్యూజిలాండ్‌కు ఎమ్మెల్సీ దేశపతి



సాక్షి, హైదరాబాద్: న్యూజిలాండ్‌లోని తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో పాల్గొనేందుకు కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ బుధవారం రాత్రి న్యూజిలాండ్ బయల్దేరి వెళ్లారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరగనున్న ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని తెలంగాణ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ రావు కాసుగంటి ఆహ్వానం మేరకు.. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ జూన్ 9వ తేదీ వరకు ఆ దేశంలో పర్యటించనున్నారు. న్యూజిలాండ్‌లోని వివిధ ప్రదేశాల్లో జరగనున్న ఇతర సమావేశాల్లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొంటారు. అక్కడ నివసిస్తున్న ప్రవాస తెలంగాణ వాసులను కలుసుకోనున్నారు.

రాష్ట్రం వాటా ఇవ్వకనే ఆగిన ప్రాజెక్టులు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్ సారంగుల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలలుగా కేంద్రానికి సహకరించడంలేదని, వివిధ పథకాలకు కేంద్రం నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకపోవడంతో అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్ సారంగుల ఆరోపించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి కోసం 2014 నుంచి నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.11 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇన్ని లక్షల కోట్లు ఇచ్చినా అనేక ప్రాజెక్టులు పూర్తి కాలేదని ధ్వజమెత్తారు. ఇతర రాష్ట్రాలు రీఫామ్స్ చేసి వేల కోట్లు పొందుతున్నా, తెలంగాణ మాత్రం చిన్నచిన్న సంస్కరణలు కూడా చేయకపోవడం వల్ల నిధులు కోల్పోయిందని విమర్శించారు. రాష్ట్రానికి రెవెన్యూ ఉన్నా.. రెస్పాన్స్ లేదని, అభివృద్ధి విషయంలో కోటలు దాటే మాటలు తప్ప గడప దాటడం లేదని అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం సలహాలు స్వీకరించాలని, అభివృద్ధిపై, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను వినియోగించుకునేలా రీఫామ్స్‌పై దృష్టిపెట్టాలన్నారు.


ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్


ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన 'హార్ట్ ఆఫ్ గోల్డ్' చారిటీ కార్యక్రమంలో మిస్ వేల్స్, మిస్ క్రొయేషియా తదితరులు

జిల్లాల వారీగా పంట పరిహారం వివరాలు..

జిల్లాలు	రైతుల సంఖ్య	పరిహారం (రూ.కోట్లలో)
సిద్దిపేట	4,913	6.141
ములుగు	2,933	5.727
జగిత్యాల	5,099	5.453
మంచిర్యాల	3,017	4.597
మహబూబ్‌నగర్	3,888	4.003
పెద్దపల్లి	3,297	3.567
మహబూబాబాద్	3,097	3.519
జనగాం	2,160	3.364
నిజామాబాద్	1,512	1.674
సిరిసిల్ల	1,449	1.671
యాదాద్రి	1,168	1.631
నాగర్‌కర్నూల్	1,034	1.588
మెదక్	1,313	1.144
సూర్యాపేట	662	1.104
వనపర్తి	888	0.877
వికారాబాద్	912	0.764
నల్లగొండ	710	0.759
కామారెడ్డి	879	0.740
ఆసిఫాబాద్	412	0.609
రంగారెడ్డి	413	0.563
నారాయణపేట్	354	0.520
ఖమ్మం	299	0.474
సంగారెడ్డి	334	0.421
ఆదిలాబాద్	234	0.246
కరీంనగర్	193	0.146
నిర్మల్	127	0.128
కొత్తగూడెం	36	0.050
వరంగల్	24	0.043
మొత్తం	41,361	51.528

గుంటూరు టు గుండెపుడి

నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలకు కేరాఫ్ • ఏటా రూ.2 కోట్లకు పైగా వ్యాపారం

మరిపెడ రూరల్: గుండెపుడి గ్రామం బీటీ–3 ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలకు కేరాఫ్‌గా మారింది. నాలుగేళ్లుగా బీటీ–3 పత్తి విత్తనాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల చందంగా కొనసాగుతోంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన కొందరు ఈజీ మనీకి అలవాటు పడి నిషేధిత పత్తి విత్తనాల వ్యాపారాన్ని ఎంచుకున్నారు. ఏపీలోని గుంటూరు నుంచి ఈ విత్తనాలను కొనుగోలు చేసుకొని గ్రామానికి తెస్తున్నారు. రహస్య ప్రదేశంలో విత్తన ప్యాకెట్లు దాచి పెట్టి సీజన్ సమయానికి ముందుగానే ఆయా గ్రామాలు, మండలాలకు చెందిన రైతులకు విక్రయిస్తున్నారు.

ఏటా రూ.2 కోట్లకు పైగా విక్రయాలు

బీటీ–3 విత్తనాల విక్రయాలు నాలుగేళ్లుగా జరుగుతు న్నాయి. ఏటా సుమారు రూ. 2 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. గుంటూరులో అరకిలో విత్తన ప్యాకెట్ రూ.600లకు కొనుగోలు చేసి ఇక్కడ రైతులకు రూ.1,500లకు విక్రయిస్తున్నారు. ఈ గ్రామం ఖమ్మం–మహబూబాబాద్–సూర్యాపేట జిల్లాలకు సరిహద్దు ఉండటంతో ఇక్కడి నుంచి ఏ జిల్లాకైన సులువుగా సరఫరా చేసే అవకాశముంది.

ఇటీవల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం

నిషేధిత పత్తి విత్తన ప్యాకెట్లు విక్రయిస్తున్న రేఖ సురేశ్‌పై కేసు నమోదు చేశారు. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి నెలలో ముందుగానే గుంటూరు నుంచి తెచ్చిన బీటీ–3 విత్తనాలను రైతులకు విక్రయించినట్టు తెలిసింది. మార్చి నెలలో సుమారు రూ.1.5 లక్షల విలువ చేసే బీటీ–3 పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. దీంతో నిషేధిత పత్తి విత్తనాల సాగుతో జరిగే అనర్థాలపై గుండెపుడి గ్రామ రైతులకు మరిపెడ వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.


గుండెపుడిలో బీటీ–3 పత్తి విత్తనాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర (ఫైల్)

రైతుల మొగ్గు ఎందుకంటే...

బీటీ–3 పత్తి విత్తనాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ విత్తనాలు నాటిన వెంటనే మొక్క మొలవకముందే కలుపు మందు గ్లైఫోసెట్‌ను చల్లాలి. దీంతో కలుపు మొక్కలు చనిపోతాయి. గ్లైఫోసెట్ మందుతో జన్యుపరమైన సమస్యలు వస్తాయి. రైతులకు కలుపు తీత ఖర్చులు చాలా వరకు తగ్గడంతో పాటు క్రిమికీటకాలు, పలు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి ఉంటుంది. అందుకు రైతులు బీటీ–3 సాగు వైపు మొగ్గు చూపుతారు. కలుపు ఖర్చు ఉండకపోవడం..ఆదాయం సమకూరడం కారణంగా రైతులు ఈ విత్తనాన్ని పెద్ద సంఖ్యలో సాగు చేస్తున్నారు. గ్లైఫోసెట్ మందును ప్రభుత్వం నిషేధించి, పలు షాపుల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



గుండెపుడి గ్రామం నుంచి బీటీ–3 విత్తనాలు అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తించాం. గతేడాది నిషేధిత విత్తనాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేయించాం. మార్చి నెలలో విక్రయిస్తున్న రూ.1.5 లక్షల బీటీ–3 పత్తి విత్తనాలు గుర్తించి సీజ్ చేశాం. పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాం. నిషేధిత విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నాం. – బోడ వీరసింగ్,
మండల వ్యవసాయ అధికారి, మరిపెడ

అన్నదాత.. సాగుబాట


ఖమ్మంలో పత్తి విత్తనాల కోసం వచ్చిన రైతులతో షాప్‌లో రద్దీ


యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో దుక్కి దున్నుతున్న రైతు


పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాత


సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో విత్తుకోవడం పూర్తయిన తర్వాత కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు

క్లుప్తంగా...

ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటించిన రైతు

యలమంచిలి: రొయ్యల ధర పెరగకపోవడం, మేతల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పశ్చిమ డెల్టాలో ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన ఆక్వా రైతు, సొసైటీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు తాను సాగు చేస్తున్న చెరువులకు బుధవారం క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రెండు దశాబ్దాలుగా ఆక్వా చెరువులు సాగు చేస్తున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో రొయ్య దిగుబడి బాగుంటున్నా ధర పతనం కావడం, మేతలు, మందుల ధరలు పెరిగిపోవడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీంతో జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం పిలుపు మేరకు పోడూరు మండలం అప్పనచెరువు పంచాయతీ రాజులగరువులో తాను సాగు చేస్తున్న 30 ఎకరాల ఆక్వా చెరువులకు పంట విరామం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

యోగాంధ్రకు 28 లక్షల రిజిస్ట్రేషన్‌లు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు 28.55 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. రెండు కోట్ల రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా యోగాంధ్ర-2025 ప్రచార కార్యాచరణ ప్రణాళికతో కూడిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రచార బాధ్యతలను ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులకు అప్పగించారు.

అసెంబ్లీ, సచివాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీలో ఎన్టీఆర్‌కు ఉన్నతాధికారులు నివాళులర్పించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, సీఎం ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర, ప్రొటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీ భవనంలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ ఎన్టీఆర్‌కు పుష్పాంజలి ఘటించారు.

రాజ్యసభ సభ్యుడిగా పాకా సత్యనారాయణ ప్రమాణం

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యుడిగా బీజేపీ నేత పాకా వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్.. సత్యనారాయణతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్, ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్

నరసరావుపేట టౌన్: దళిత నేత బోరుగడ్డ అనిల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. గాయత్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలలపాటు ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లలో సంతకం పెట్టాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. సదరు కేసులో బోరుగడ్డను మార్చి 24న పీటీ వారెంట్‌పై కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి బోరుగడ్డ రిమాండ్‌లోనే ఉన్నారు.

పదో తరగతి మూల్యాంకనం తప్పిదాలపై సీఎం అసంతృప్తి

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో ఈ ఏడాది పలువురు విద్యార్థులు నష్టపోయేలా జరిగిన తప్పిదాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్పిదానికి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే నివేదికను సమర్పించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీలో దరఖాస్తుకు అవకాశం

కాగా, మూల్యాంకనం తర్వాత మార్కుల నమోదులో తప్పులు జరిగాయని పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రీకౌంటింగ్ సమస్యతో ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులకు భరోసాను ఇచ్చింది. జూన్ 2, 3 తేదీల్లో వారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్లక్ష్యం.. బుసలు కొడుతోంది!

- పెద్దాసుపత్రిలో విషపురుగులు
- యథేచ్ఛగా తిరుగాడుతున్న పాములు, ఎలుకలు
- రాత్రిళ్లు దోమల బెడదతో సతమతం
- రూ.70లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం అంతంతే..



- నాలుగు రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయంలో పది అడుగుల నాగుపాము కనిపించింది. గది బయట బుసలుకొడుతున్న పామును చూసి ఓ ఉద్యోగికి గుండె ఆగినంత పనయింది. వెంటనే తేరుకొని కేకలు వేయగా చుట్టుపక్క ఉద్యోగులు వచ్చేసరికి ఓ తొర్రలోకి జారుకుంది. దీంతో మళ్లీ అది బయటకు రాకుండా సిమెంట్‌తో ఆ తొర్రను మూసేశారు.



- ఆసుపత్రిలోని ఓ అధికారి ఛాంబర్‌లో ఎలుకలు విపరీతంగా వచ్చి ఫైళ్లు పాడుచేసేవి. ర్యాట్‌ప్యాడ్‌లు పెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన కాస్త తెలివిగా ఆలోచించాడు. ఎక్కడికక్కడ బిస్కెట్లను ఏర్పాటు చేయడంతో వాటిని తిన్న ఎలుకలు ఫైళ్ల జోలికి వెళ్లకపోవడం గుర్తించాడు. ఇదేదో బాగుందని అదే ఉపాయాన్ని కొనసాగించారు.



- ఆసుపత్రిలో చెట్ల నీడ ఉందని వెళ్లి భోజనానికి కూర్చుంటే చాలు పందులు, కోతులు, కుక్కలతో పాటు ఎలుకలు కూడా వస్తున్నాయి. వీటి వల్ల రోగుల సహాయకులు ప్రశాంతంగా నాలుగు ముద్దలు కూడా తినలేని పరిస్థితి. రాత్రయితే చాలు దోమల దండయాత్ర నిద్రను దూరం చేస్తోంది. రాత్రిపూట అటుంచితే.. పట్టపగలే ఆసుపత్రి ఆవరణలో పాములు తిరుగాడుతుండటంతో రోగుల గుండె జారుతోంది. ఎలుకలు పట్టేందుకు బోధనాసుపత్రిలో ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం.



ఆసుపత్రిలో ఆవరణలో పాము, ఎలుకలను చంపేసిన దృశ్యం



సంచరిస్తున్న ఉడుము



కర్నూలు పెద్దాస్పత్రి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి ప్రభుత్వ ఆసుపత్రులలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు బోధనాసుపత్రిలో సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ కింద దోమలు, బల్లులు, బొద్దింకలు, ఈగలు, ఎలుకలు, పాములు, ఇతర విషకీటకాల నివారణకు వాడే పెస్టిసైడ్స్‌ను మధ్యాహ్నం వరకు హెల్త్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఎలుకలు, పాములు ఉంటే వాటిని పట్టుకుని సంహరించాలి. ఈ మేరకు నిర్వహణకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకు రూ.5లక్షలు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో రూ.30వేలు, మెడికల్ కాలేజీలో మరో రూ.30 వేలు కలిపి నెలకు రూ.5.90 లక్షలు, ఏడాదికి రూ.70,80,000 వెచ్చిస్తున్నారు. నిర్వహణ సంస్థలో పది మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆరుగురితో మమ అనిపిస్తుండటం వల్లే విష పురుగులు యథేచ్ఛగా తిరుగాడుతున్నాయని తెలుస్తోంది.

పట్టపగలే ఎలుకలు, పాముల సంచారం

ఆసుపత్రి, కళాశాల ఆవరణలో రాత్రేమో గానీ ఖాళీ ప్రదేశాల్లో పట్టపగలే ఎలుకలు, పాములు సంచరిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి బయటకు వచ్చి వార్డులు, కార్యాలయ గదుల్లోకి దూరుతున్నాయి. ముఖ్యంగా ఓల్డ్ గైనిక్ విభాగం, శక్తిసదన్, కంటి ఆసుపత్రిలోని ఖాళీ ప్రదేశాలు, డైట్ విభాగం, దాని పక్కనున్న ఖాళీ ప్రదేశాలు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంతం, సూపర్‌స్పెషాలిటి విభాగం పక్కనున్న ఖాళీ ప్రదేశం, ఐడీ వార్డు, మానసిక వ్యాధుల విభాగం, యుపీ, పీజీ హాస్టల్స్ పరిసరాలు పాములకు నిలయాలుగా మారాయి. ఆయా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, మొక్కలు ఏపుగా పెరగడంతో ఎలుకలు ఎక్కువగా తిరుగుతున్నాయి. వీటిని తినేందుకు పాములు వస్తున్నాయి. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఇటీవల నిరుపయోగంగా ఉన్న ఇనుప సామానును అంతా కుప్పపోసి ఉంచారు. వాటిని టెండర్ పాడిన వారు తీసుకెళ్లకపోవడంతో ఆ ప్రాంతంల్లో పాముల సంచారం అధికంగా ఉంటోందని రోగుల సహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగుల బంధువులు ఆరుబయట భోజనం చేసి, అక్కడే చేతులు కడుక్కోవడంతో మిగిలిపోయిన ఆహారాన్ని తినేందుకు ఎలుకలు, బొద్దింకలు అధికంగా పుట్టుకొస్తున్నాయి.



కారు షెడ్డులో రోగుల సహాయకుల దోమల నెట్

చీకటి పడితే చాలు దోమల బెడద

బోధనాసుపత్రిలో రోజూ సాయంత్రం అయితే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. వాటి బారి నుంచి రక్షణ పొందేందుకు రోగులు, వారి సహాయకులు మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ వాడుతున్నారు. అన్ని విభాగాల్లో ఈ పరిస్థితి కొనసాగుతోంది.

తూతూ మంత్రంగా పెస్ట్‌కంట్రోల్ నిర్వహణ

ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణ తూతూ మంత్రంగా జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్ర మే సంబంధిత ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు పాములు, ఎలుకలు, పందికొక్కులు తిరిగే చోటును గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సిన ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. వీరి పనితీరును బట్టి అధికారులు మార్కులు వేయాల్సి ఉంటుంది. పనితీరు సరిగ్గా లేకపోవడంతోనే ఇటీవల మూడు నెలలుగా బిల్లులకు ఆసుపత్రి అధికారులు బ్రేక్ వేశారు. టెండర్ కాలపరిమితి ముగియడంతో అధికారుల చర్యలకు సైతం కాంట్రాక్టర్ స్పందించడం లేదని సమాచారం.

పగలు ఈగలు, రాత్రి దోమల బాధ



మా అక్క కూతురు కాన్పు కోసం 16 రోజుల క్రితం గైనిక్ వార్డులో చేర్చాం. ఆమెకు రక్తస్రావం అవుతుంటే ప్రసవం ఆలస్యం అవుతోంది. ఈ క్రమంలో పగలు, రాత్రి వార్డు బయటే వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడి కారు షెడ్డులో రాత్రివేళ ఉంటున్నాం. ఇక్కడ పగలు ఈగలు, రాత్రి దోమల బాధ భరించలేకున్నాం. ఏదైనా తిందామంటే కూడా తిప్పలే. అందుకనే నెట్ తెచ్చుకొని అందులో ఉంటున్నాం.

– అంజలి, నంద్యాల పట్టణం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఆసుపత్రిలో ఎలుకలు పట్టేందుకు అవసరమైన ప్యాడ్‌లను ఏజెన్సీ వారు తెప్పించారు. పాములు రాకుండా అవసరమైన రసాయనాలు అక్కడక్కడా ఉంచుతున్నారు. ఎక్కడైనా ఎలుకలు, పాములు సంచరిస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

వాహనాలెక్కువ, కార్యకర్తలు తక్కువ

- మహానాడులో కనిపించని తమ్ముళ్ల సందడి
- రెండోరోజు నేతల ప్రసంగాలకు స్పందన కరువు
- భోజనాలకు శ్రేణుల ఇబ్బందులు
- వానొస్తుందేమోనని నేతల హైరానా

సాక్షి ప్రతినిధి, కడప/కడప రూరల్ : ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం సాగుతోంది. మహానాడు రెండోరోజైన బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా పలువురు మంత్రులు, ఇతర నేతలు ప్రసంగించారు. వారి ప్రసంగాలకు హాజరైన పార్టీ శ్రేణుల నుంచి స్పందన కనిపించలేదు. 'వచ్చాం.. బైటకు వెళ్తే వానొస్తుందేమోనని కూర్చున్నాం' అనేలా ఉండిపోయింది తమ్ముళ్ల తీరు. నేతలు రెచ్చిపోయి ప్రసంగించినా కార్యకర్తలు స్పందించలేదు. ఈ పరిణామం పార్టీ అగ్రనేతలకు నిరాశను కలిగించింది. ఇక ఈ కార్యక్రమం చూస్తే వాహనాలెక్కువ, కార్యకర్తలు తక్కువ అన్నట్లుగా ఉంది. అక్కడికి వచ్చిన వారు ప్రాంగణంలో నిలవలేదు. సీఎం చంద్రబాబు ఇతర ముఖ్య నేతల ప్రసంగాల సమయంలో ప్రతినిధులు నిరాసక్తంగా బయటకు వెళ్లిపోయారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రసంగాన్ని మాత్రమే కొంత ఆసక్తిగా ఆలకించారు. విపక్ష నేత వైఎస్ జగన్‌ను టార్గెట్ చేయడం మినహా నిర్దిష్టంగా దేనిమీదా సరైన చర్చ జరగలేదని.. ఇదో మాయా కార్యక్రమంలా కొనసాగుతోందని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానించారు.

ఆకలి తీర్చుకునేందుకు నానాపాట్లు..

వచ్చిన వారికి కేటగిరీల వారీగా టిఫిన్లు, భోజనాలు ఏర్పాటుచేసినప్పటికీ మధ్యాహ్నం రెండు గంటలు కాకుండానే చాలా కౌంటర్లలో భోజనాలు అయిపోయాయి. వచ్చిన వారు ప్లేట్లు పట్టుకుని వెతికారు. కొన్నిచోట్ల అన్నం మాత్రమే ఉంటే కూరలు లేవు. ఇలా వచ్చిన వారు ఆకలితో కడుపు నింపుకోవడానికి నానాపాట్లు పడ్డారు.

మేఘం కనిపిస్తే గుండెల్లో గుబులు..

నిజానికి.. వానలు రావాలని అందరూ కోరుకుంటున్నారు. అయితే, మహానాడు నిర్వాహకులు మాత్రం వానొద్దని వేడుకుంటున్నారు. ఎందుకంటే.. మహానాడు జరిగే ప్రదేశమంతా దాదాపుగా నల్లరేగడి నేల. కొద్దిగా వర్షం వస్తే చాలు నేలంతాత బురదగా మారుతుంది. పార్కింగ్ చేసిన వాహనాలు రోడ్డుపైకి రావడం చాలా కష్టం. దీంతో పార్టీ అగ్రనేతలతో పాటు ఇతర శ్రేణులకు మేఘం కనిపిస్తే చాలు గుండెల్లో గుబులు రేగుతోంది. మ.2 గంటల ప్రాంతంలో మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో అంతా కంగారుపడ్డారు.

టీడీపీ ఖజానా గలగల

ఇదిలా ఉంటే.. టీడీపీ ఖజానా కోట్లాది రూపాయలతో గలగలలాడుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.469.42 కోట్లు మిగులు ఉన్నట్లు కోశాధికారి పార్థసారథి తెలిపారు. ఈ ఏడాది రూ.169.98 కోట్లు మిగులు కాగా, రూ.61.13 కోట్లు వ్యయంచేశారు. మహానాడు వేదికగా టీడీపీ ఆర్థిక వివరాలను ఆయన వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.228.31 కోట్లు విరాళంగా లభించింది. ఈ ఏడాది మహానాడు కేంద్రంగా తొలిరోజు రూ.21.9 కోట్లు టీడీపీ నేతల ద్వారా విరాళాలు లభించాయి. రెండో రోజు బుధవారం రూ.3.24 కోట్లు అందాయి.



మహానాడు ప్రాంగణంలో భోజనాల కోసం పడిగాపులు కాస్తున్న టీడీపీ ప్రతినిధులు



భోజనం అయిపోవడంతో క్యూలైన్‌లో తమ్ముళ్లు

పదిరోజుల్లో 'ఉక్కు' పనులు..

ఇక వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు కొనసాగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. జిల్లాలో ఆన్ గోయింగ్ ప్రాజెక్టులు కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. పలువురు తెలుగు తమ్ముళ్లు జిల్లాకు నిర్దిష్టమైన హామీ ఇవ్వాలని కోరగా, బహిరంగ సభలో వెల్లడిస్తానని చెప్పుకొచ్చిన ఆయన జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత చేసిన ప్రసంగంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు పది రోజుల్లో కొనసాగించేలా జిందాల్ సంస్థను కోరినట్లు చెప్పారు.

ఆర్టీఈ కింద 23,117 మందికి సీట్ల కేటాయింపు

- రెండో విడత లాటరీ ఫలితాలు జూన్ 11న విడుదల

సాక్షి, అమరావతి : విద్యాహక్కు చట్టం కింద 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు తొలి విడతలో 23,117 మంది పిల్లలకు సీట్లు కేటాయించినట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు తెలిపారు. సీట్ల లాటరీని బుధవారం రాత్రి ఆయన వెల్లడించారు. ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం 37,427 మంది పిల్లలు నమోదు చేసుకున్నారన్నారు. వీరు 28,882 పాఠశాలలను ఎంచుకున్నారని.. ఆరు దశల ధ్రువీకరణ అనంతరం 28,561 మంది అర్హత సాధించినట్లు ఆయన చెప్పారు. వీరిలో మొదటి విడత లాటరీలో 23,117 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఎంపికైన వారి వివరాలను తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తామని, పూర్తి వివరాలు https://cse.ap.gov.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని శ్రీనివాసరావు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు వచ్చే నెల 7లోగా నిర్దేశిత ధృవపత్రాలతో ఆయా పాఠశాలల్లో ప్రవేశాలు నిర్ధారించుకోవాలని ఎస్పీడీ కోరారు. రెండో విడత లాటరీ ఫలితాలను జూన్ 11న విడుదల చేస్తామన్నారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599 సంప్రదించవచ్చన్నారు.

ఎన్‌సీటీఈ నిబంధనల మేరకే పదోన్నతులు

ఎస్ఏ ఇంగ్లిష్ పదోన్నతి అర్హతలపై క్లారిటీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టు అర్హతపై పాఠశాల విద్యాశాఖ వివరణ ఇచ్చింది. ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనలకు అనుగుణంగా ఈ పోస్టుకు పదోన్నతులు ఉంటాయని పేర్కొంది. ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ, ఇంగ్లిష్ మెథడాలజీతో బీఈడీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని ప్రకటించింది. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల అర్హతలపై కొందరు ఎస్జీటీలు ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ, బీఈడీలో ఇంగ్లిష్ మెథడాలజీ ఉన్నవారికే పదోన్నతి ఇవ్వాలని, పీజీ అర్హతను మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై విద్యాశాఖ వివరణ ఇచ్చింది. ఎన్‌సీటీఈ నిబంధనలు, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) పోస్టుకు ప్రస్తుత పదోన్నతి ప్రమాణాల ప్రకారం డిగ్రీ (ఇంగ్లిష్ లిటరేచర్) కనీస అర్హత గాను, పీజీ (ఇంగ్లిష్) అదనపు అర్హతగాను ఉంటుందని, డిగ్రీ లేదా పీజీల్లో ఇంగ్లిష్ ఉంటే సరిపోతుందని విద్యాశాఖ తెలిపింది. పిటిషనర్లు చెబుతున్నట్టుగా సబ్జెక్టుల్లో పదోన్నతి ప్రమాణాల్లో వ్యత్యాసం ఉందన్న అంశాన్ని సరిచేయాలన్నా, ప్రస్తుత ప్రమాణాల్లో మార్పులు చేయాలన్నా ఎన్‌సీటీఈ నిబంధనలతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసుల్లో హైకోర్టు తుది తీర్పునకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతి ప్రమాణాలను ఇతర భాషా సబ్జెక్టులతో పోల్చలేమని తేల్చి చెప్పింది. బీఈడీతో పీజీ లేదా గ్రాడ్యుయేషన్ ఇంగ్లిష్ అర్హత ఉన్నవారికే స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతి కల్పిస్తారని వివరించింది. కాగా స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టుల పదోన్నతులకు సమాన ప్రాతిపదికన అర్హతలు ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి.వి. ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పదే పదే లోకేశ్ పాట!

- అదేపనిగా కొడుకుని అభినందించిన చంద్రబాబు
- పార్టీకి వారసుడు అతనేనని అనధికారిక ప్రకటన

సాక్షి, అమరావతి : కడప టీడీపీ మహానాడు ఆద్యంతం తన కుమారుడు లోకేశ్‌ని తన వారసుడిగా చూపించేందుకు చంద్రబాబు తాపత్రయపడ్డారు. లోకేశ్ బాగా చదువుకున్న వాడని, అన్ని విషయాలు తెలిసినవాడంటూ ఆయన గురించే తన ప్రతి ప్రసంగంలోనూ చెప్పి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయనే భవిష్యత్తు నాయకుడని పరోక్షంగా చెప్పారు. మామూలుగా అయితే మహానాడులో ఎప్పుడూ వివిధ అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిపై చర్చించడం ఆనవాయితీగా జరిగేది. కానీ, ఈ మహానాడులో తీర్మానాలు దాదాపు పక్కకుపోయాయి. లోకేశ్‌ని గొప్పవాడిగా చూపించే క్రమంలో సూపర్ సిక్స్ హామీల తరహాలో సూపర్ సిక్స్ శాసనాలంటూ పాత అంశాలకే కొత్త పేర్లు పెట్టి ఆయనతో చెప్పించారు. మొదటి రోజు చర్చంతా ఆయన చెప్పిన అంశాల పైనే జరిగేలా చూశారు. ఈ శాసనాలు లోకేశ్ ఆలోచనలని, వీటి ద్వారా టీడీపీకి వచ్చే 40 ఏళ్ల వరకూ రూట్ మ్యాప్ రూపొందించినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబు తాను మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ ఈ శాసనాలు లోకేశ్ రూపొందించాడని, ఇవి అతని ఘనతేనని, వాటిని అందరూ పాటించాలని చెప్పుకొచ్చారు. నిజానికి ఈ శాసనాల్లో ఏమాత్రం కొత్తదనంలేదు. యువత, మహిళలు, రైతులు, పేదలు, కార్యకర్తలకు మేలు చేయడం, తెలుగుజాతిని గొప్పగా నిలబెట్టడమే ఈ శాసనాలు. ఏ రాజకీయ పార్టీ అయినా వీటి గురించే చెప్పడం సాధారణమైన విషయం. ఎందుకంటే సమాజంలో ఉన్నది ఈ వర్గాలే. ఏం చేసినా ఆ వర్గాల కోసమే చేయాలి. అలాంటప్పుడు ఇందులో లోకేశ్ గొప్పదనం ఏమిటో పార్టీ శ్రేణులెవరికీ అర్థంకాలేదు. ఏదో ఒక కొత్త పదం వాడాలి కాబట్టి శాసనాలు అనే పదం వాడినట్లు కనబడుతోంది తప్ప అందులో కొత్త అర్థంకానీ, కొత్త విషయం కానీ లేదని వారంటున్నారు.

లోకేశ్ కోసం డిమాండ్ల డ్రామా..

మరోవైపు.. లోకేశ్‌ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలని పలువురు నేతలు అదే పనిగా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో అర్జెంటుగా తనకు ఉన్నత పదవి కావాలని కోరుకుంటున్న లోకేశ్ అది కుదరకపోవడంతో తెలంగాణలో కేటీఆర్ తరహాలో ఇక్కడ తాను వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి తీసుకుంటారని సీనియర్ నేతలు చెబుతున్నారు. అంటే.. ఆయన పదవి వ్యవహారం ఎప్పుడో నిర్ణయమైపోయింది. కానీ, ఇప్పుడు అందరి ఆమోదంతో దాన్ని ఇచ్చినట్లు చూపించాలి కనుక సీనియర్ నాయకులతో ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని డిమాండ్లు చేయించారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ధూళిపాళ నరేంద్ర, పయ్యావుల కేశవ్ వంటి వారిని లోకేశ్ దూరం పెట్టడంతో వారు ఆయన్ను ఎలాగైనా ప్రసన్నం చేసుకునేందుకు మహానాడులో ఆయనకు అనుకూలంగా డిమాండ్లు చేసినట్లు కనబడుతోంది. మరోవైపు.. మహానాడులో అడుగడుగునా లోకేశ్ ఫొటోలను అత్యంత ప్రాధాన్యంగా ముద్రించారు.

రామ్మోహన్‌తో రాజకీయ తీర్మానం.. యనమలకు ఝలక్..

చివరిగా.. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో రాజకీయ తీర్మానం చేయించారు. రాజకీయ తీర్మానాన్ని ఎప్పుడూ సీనియర్ నేతతో చేయించడం ఆనవాయితీ. గతంలో యనమల రామకృష్ణుడు ఈ తీర్మానాన్ని ప్రతిపాదించే వారు. కానీ, ఇప్పుడు రామ్మోహన్‌తో ఈ తీర్మానం చేయించి సీనియర్ల అవసరంలేదని చెప్పకనే చెప్పారు.

తేలిపోయిన తీర్మానాలు..

ఇక రెండో రోజు రాజకీయ తీర్మానం సహా 15 అంశాలపై తీర్మానాలు చేసినా వాటిలో ఏమాత్రం పస లేకుండాపోయింది. వీటిలో ఒక్కటి తెలంగాణ తీర్మానం ఉండగా మిగిలినవన్నీ ఏపీకి సంబంధించినవే. తెలుగుజాతి–విశ్వఖ్యాతి, రాష్ట్రం–విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు అడుగులు, రాష్ట్రాభివృద్ధి కేంద్ర సహకారం, అభివృద్ధి వికేంద్రకరణ, ఉత్తరాంధ్ర అభివృద్ధి, రాయలసీమ అభివృద్ధి–రాయలసీమ డిక్లరేషన్, అమరావతి అభివృద్ధి వికేంద్రీకరణ, యోగాంధ్రప్రదేశ్, మౌలిక సదుపాయాల కల్పనతో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం, రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టు అభివృద్ధి, విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు, సమగ్ర సాగునీటి ప్రణాళికతో ఉజ్వల ప్రగతి వంటి తీర్మానాలు చేసి వాటిపై అసత్యాలు, మాయ మాటలు చెబుతూ నేతలు ప్రసంగించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ యోచన దుర్మార్గం

భారత విద్యార్థి సమాఖ్య మండిపాటు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలల (కొత్తవి) ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్, కార్యదర్శి కె.ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. కారు చౌకగా కళాశాలలను 66 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు అడుగులు వేస్తుండటం దుర్మార్గమని మండిపడ్డారు. కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవడమే కాక, నిరుపేదలకు ఉచిత వైద్యం దూరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానానికి సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. విద్యార్థులు, ప్రజలకు నష్టం చేకూర్చే ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, లేదంటే ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

శ్రీశైల పుణ్యక్షేత్రం కంటే అతి పురాతనమైందిగా ప్రసిద్ధి చెందిన మహా శైవధామమే త్రిపు రాంతకం. త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లు కొలువుదీరిన ఈ క్షేత్రం ప్రశాంతతకు పుట్టినిల్లుగా, ప్రకృతి అందాలకు నెలవుగా విరాజిల్లుతోంది. అలాంటి ఈ క్షేత్రం ప్రకాశం, కర్నూలు జిల్లాల సరిహద్దుల్లో ఉంది.







పుణ్య తీర్థం

భూలోక కైలాస క్షేత్రం


త్రిపురాంతకేశ్వరాలయం

ఓ అద్వితీయమైన ఆధ్యాత్మికానుభూతిని సొంతం చేసే త్రిపురాంతకంలో ప్రధాన ఆలయం త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం. శ్రీశైల ద్వారాలలో ప్రథమం, ప్రధాన మైనదిగా ఉన్న ఈ క్షేత్రం శ్రీశైల క్షేత్రానికి తూర్పుద్వారంగా విరాజిల్లుతోంది. శ్రీశైల భ్రమ రాంబిక అమ్మవారికి అధిష్ఠాన దేవత అయిన బాలాత్రిపురసుందరి కూడా ఈ క్షేత్రంలోనే కొలు వుదీరి ఉంది.

కుమారగిరి పర్వతంపై ఉన్న ఈ ఆలయం ప్రకృతి అందాలకు, ప్రశాంతతకు నెలవు. ఈ ఆలయాన్ని చేరుకోవడానికి మెట్లతోపాటు ఘాట్‌రోడ్డు సదుపాయం ఉంది.

ఆలయానికి వెళ్లే మార్గంలో వందలకొద్దీ శివలింగాలు దర్శనమిచ్చి ఇది భూలోక కైలాసమా అనే అనుభూతిని భక్తులకు కలిగి స్తాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ఆలయం శ్రీచక్రంపై నిర్మితమైంది. మది పులకించే సుందర మండపాలు, శిల్పాలు, మందిరాలతో ఈ ఆలయం అలరారు తుంది.

పురాణగాథ: విఘ్నేశ్వరునికి విఘ్నాధిపత్యం ఇచ్చిన తర్వాత కుమారస్వామి మనసు కలతచెంది కైలాసం వీడాడని, అలా కైలాసం వీడిన కుమారస్వామి త్రిపురాంతకానికి సమీపం లో గల కొండపై తపస్సు చేశాడట. అతని తపస్సుకు మెచ్చిన పార్వతీపరమేశ్వరులు ఆనాటినుంచి అక్కడ కొలువై ఉంటామని వరమిచ్చారని ఇక్కడ స్థలపురాణ కథనం. దీనివల్లే ఈ క్షేత్రానికి కుమారగిరి అని పేరు వచ్చినట్టు తెలుస్తుంది.









త్రిపురాసుర సంహారం జరిగిన క్షేత్రం

త్రిపురాసుర సంహారం ఈ క్షేత్రంలోనే జరగడంవల్ల దీనికి త్రిపురాంతకమనే పేరు వచ్చింది.

త్రిపురాంతకం సిద్ధ క్షేత్రం. అనేక యోగులు, సిద్ధులు తాంత్రికులకు ఆవాస భూమిగా ఉన్నది ఈ క్షేత్రం. అలాంటి మహిమగల ఈ దేవాలయ ధ్వజస్తంభాన్ని చూసినా పాపాలు పటాపంచలౌతాయని, త్రిపురాంతక నామ స్మరణం ముక్తి దాయకం అని పార్వతీదేవికి స్వయంగా ఆ పరమ శివుడే చెప్పా డని అంటారు. ఇక్కడ కొలువుదీరిన మహాదేవుడు త్రిపురాంతకే శ్వరస్వామిగా నీరాజనాలను అందుకుంటున్నాడు. అణువణువు శివ నామస్మరణంతో మారుమోగే ఈ ఆలయ గర్భాలయంలో త్రిపురాంతకేశ్వరస్వామి లింగరూపంలో దర్శనమిస్తాడు.

నాలుగు వైపులా నాలుగు ప్రధాన ద్వారాలు

ఈ ఆలయానికి నాలుగు వైపులా నాలుగు ప్రధాన ద్వారా లున్నాయి. నాలుగు వైపులా కొండ పైకి మెట్ల మార్గాలున్నాయి. ప్రధానాలయం శ్రీ చక్రాకారంలో నిర్మించబడింది. శివా లయం ఈ ఆకారంలో నిర్మించటం చాలా అరుదు. అలాంటి అరుదైన దేవాలయం ఇది. శ్రీ చక్రం శివ యోర్వపుః''అంటే శివ పార్వ తుల శరీరమే శ్రీ చక్రం. స్వామి ఉగ్ర రూపం కనుక తూర్పుగ్రామాలు తగల బడి పోయాయట. అందుకే ఆ ద్వారాన్ని మూసేశారు. పక్కగా ఉన్న దారిగుండా వెళ్లి దర్శనం చేసుకోవాలి. అమ్మవారు పార్వతీమాత. ఆలయ ప్రాంగణంలో అప రాధీశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, కుమారస్వామి, నగరేశ్వర స్వామి మందిరాలు దర్శనమిస్తాయి.

ఆలయంలో ఒకపక్క అగస్త్య మహాముని నిర్మించాడని చెప్పబడుతున్న బిల్వ మార్గమొకటి ఉంది. దీనిని చీకటిగుహగా పిలుస్తారు. శ్రీశైల క్షేత్రానికి ఈ మార్గంగుండానే వెళ్లేవారని ప్రతీతి. ఇక్కడే ఉన్న మండపంలో అలనాటి శాసనాలు దర్శనమి స్తాయి. ఇక్కడే మరోపక్క గణపతి మండపం ఉంది. దీనికి సమీపంలోనే నవగ్రహాలయం ఉంది. ఇంకా ఈ ఆలయంలో విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, శృంగి, భృంగి, నందీశ్వరుడితో పాటు అనేక శివలింగాలు దర్శనమిస్తాయి.

ఎక్కడ ఉంది?

ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నుండి మార్కాపురం మీదుగా అలాగే గుంటూరు నుండి శ్రీశైలం వెళ్లు మార్గంలో ఈ త్రిపురాంతకం వెళ్లవచ్చును.

బాలా త్రిపుర సుందరీ ఆలయం

త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయానికి కింద చెరువులో బాలాత్రిపురసుందరి మాత ఆలయం ఉంది. బాల త్రిపుర సుందరి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో వృశ్చికేశ్వరా లయం, పాపనాశనం దర్శనమిస్తాయి. ఇవి దాదాపు శిథిలావ స్థకు చేరుకున్నాయి. వీటికి కొంచెం ముందుకు వెళితే కదంబ వనం ఉంది. ఉజ్జయిని, కోల్‌కతా, కాశీలలో తప్ప మరెక్కడా ఈ కదంబ వృక్షాలు కనిపించవని చెబుతారు. అమ్మవారు కదంబ వనవాసిని కావడంవల్లనే ఇక్కడిలా కదంబవనం ఉందని భక్తులు చెబుతారు.

త్రిపురాసుర సంహారంలో త్రిలోచనునికి వింటికి (విల్లు) త్రిపురసుందరి ధనువై రాక్షస సంహారం చేసింది. అక్కడే ఆదిపరాశక్తి అనుగ్రహం కొరకు చేసిన చిదగ్ని హోమగుండంలో, బాలత్రిపుర సుందరి అంత ర్లీనం కావడం జరిగింది.

శివతేజోమయం త్రిపురాంతక క్షేత్రం

ఈ క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారిని, స్వామివారిని పూజిస్తే సకలైశ్వర్యాలు సిద్ధించ డమే కాకుండా శివ కైవల్యప్రాప్తి కలుగుతుం దని పురాణాలు చెబుతున్నాయి.

భూలోక కైలాసంగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో కోటికి పైగా శివలింగాలు, నూటికి పైగా జలా శయాలున్నాయని చెబుతారు.

ప్రతి సోమ, శుక్రవారాలలో విశేష ఉత్సవాలు మహా శివ రాత్రి నాడు కల్యాణోత్సవం వసంత నవరాత్రులు ,శరన్నవరా త్రులు శ్రావణ మాసంలోప్రత్యేక ఉత్సవాలు కార్తీకంలో అభిషే కాలు సంతర్పణలు జరుగుతాయి.

– డి.వి.ఆర్.

నైవేద్య ఫలాలు





కొబ్బరి కాయ (పూర్ణ ఫలం) – భగవంతుడికి కొబ్బరి కాయను నైవేద్యంగా సమర్పిస్తే మొదలు పెట్టిన పనులన్నీ త్వరిత గతిన సులభంగా విజయ వంతం అవుతాయి.




అరటి పండు – భగవంతుడికి అరటిపండు నైవేద్యం గా సమ ర్పిస్తే సకల కార్యసిద్ధి జరుగుతుంది. అరటి పండుని గుజ్జుగా చేసి నైవేద్యం గా సమర్పిస్తే అప్పుల బాధనుండి విముక్తి పొందుతారు. చేజారిన సొమ్ము తిరిగి సకాలంలో చేతికి అందుతుంది. చిన్న అరటిపళ్లు నైవేద్యం గా సమర్పిస్తే మధ్యలో నిలిచిపోయిన పనులు సక్ర మంగా పూర్తి అవుతాయి.



నేరేడు పండు – శనీశ్వరునికి నేరెడు పండు నైవేద్యం గా పెట్టి ఆ ప్రసాదాన్ని తింటే వెన్ను నొప్పి, నడుమునొప్పి, మోకాళ్ల నొప్పి వంటివి తొలిగిపోయి ఆరోగ్య వంతులు అవుతారు.



ద్రాక్ష పండు – భగవంతుడికి నివేదించిన ద్రాక్ష పండ్లు ముందు చిన్నపిల్లలకు, తర వాత పెద్దలకు పంచినట్లైతే ఎల్లవేళలా సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు. రోగాలు నశిస్తాయి. కార్యజయం లభిస్తుంది.



మామిడి పండు – దేవుడికి మామిడి పండుని నైవేద్యంగా పెడితే ప్రభుత్వం నుంచి రావలసిన నగదు ఎటువంటి అడ్డంకులు లేకుండా సకాలంలో అందుతుంది. నమ్మి మోసపోయిన ప్పుడు మామిడి పండుని దేవునికి అభిషేకం చేసిన తేనెలో కలిపి నైవేద్యం గా పెట్టి అందరికి పంచి ఆ తరువాత తిన్న ట్లయితే మోసం చేసిన వారు స్వయంగా మీ నగదును మీకు తిరిగి ఇచ్చేస్తారు.



అంజూర పండు – భగవంతుడికి నైవేద్యం పెట్టిన అన్జురా పండును అందరికి పంచిన తరువాత తిన్నవారికి ఆనారోగ్య భాధలు అన్ని తొలగి ఆరొగ్య వంతులు అవుతారు.



సపోటా పండు – సపోట పండు నైవేద్యంగా సమర్పిస్తే పెళ్లి నిశ్చయ సంబంధ విషయా లలో అవాంతరాలు అన్ని తొలగిపోతాయి.



యాపిల్ పండు – భగవంతుడికి యపిల్ పండు ని నైవేద్యంగా పెడితే దారిద్ర్యం తొలగి ధనవంతులు అవుతారు.



కమలా పండు – భగవంతుడికి కమలా పండు నివేదించి నట్లయితే నిలిచిపోయిన పనులు సజా వుగా పూర్తి అవుతాయి.



పనసపండు – పనసపండుని దేవుడికి నైవేద్యంగా పెడితే శత్రు నాశనం, రోగవిముక్తి కలిగి సుఖంగా ఉంటారు.



● పరిహారం

● కుటుంబసభ్యుల మధ్య వున్న విభేదాలు, తగాదాలు, ఘర్షణలు తొలగిపోయి... అందరూ కలిసి మెలిసి సత్సంబంధాలు ఏర్పడేందుకు 'విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామాల' ను నిత్యం పారాయణం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. విష్ణుసహస్రనామాన్ని ప్రతిరోజూ పఠిస్తే.. ఏ సమస్యలు తలెత్తవు. అన్ని పనులలో విజయాలను సాధిస్తారు.

● లక్ష్మీ అష్టోత్తర శతనామావళిని నిత్యం పారా యణ చేస్తే మంచి సద్గుణాలతో కలిగినవారు వివాహ సంబంధాలు తీసుకువస్తారు. అలాగే పెళ్లి పనులు కూడా ఎటువంటి ఆటంకాలు లేకుండా సక్రమంగా జరుగుతాయి.

● సంతానం లేని వారు ప్రతిరోజు 'గోపాల స్తోత్రం' పఠిస్తే.. మంచి ఫలితం లభిస్తుంది... అలాగే గర్భిణులు ఇదే స్తోత్రాన్ని ప్రతిరోజు పఠిస్తే ప్రసవం సుఖంగా అవుతుందని పండి తులు, పురోహితులు శాస్త్రాల ఆధారంగా చెబుతున్నారు. ● గరికను నగదు ఉంచే ప్రదేశంలో పెడితే, రావలసిన నగదు త్వరగా వచ్చేస్తుంది. ● శనీశ్వరుడిని శనివారం నాడు గరికతో పూజిస్తే ఏలిననాటి శని, అష్టమ శని దోషాలు తొలగిపోతాయి. ● గరికను దారంతో కట్టి గణపతికి మాల వేస్తే కోరికలు నెరవేరుతాయి.

● ఇస్లాం వెలుగు

జిల్ హజ్ మొదటి పది రోజుల ప్రాముఖ్యం



జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్ , హజ్రత్ ఇస్మాయీల్ అలైహి ముస్సలాంల త్యాగా లను స్మరించుకునే త్యాగోత్సవం. ప్రపంచ విశ్వా సుల పర్వదినం. ఇదేదో షరా మామూ లుగా జరిగే ఆచారం కాదు. ఇదొక మహత్తర సందేశం కలిగిన శుభ దినం. క్రియా రూపంలో దైవ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అద్భుత ప్రక్రియ.

ఇస్లామీయ క్యాలెండరులో చివరి నెల అయిన జిల్ హజ్ మాసంలోని మొదటి పదిరోజులను ముస్లింలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ రోజులు ఆధ్యాత్మిక వికాసానికి, ఆత్మప్రక్షాళనకు, సమాజ సంక్షేమానికి మంచి అవకాశం కల్పిస్తాయి.

జిల్‌హజ్ మొదటి పదిరోజులకు సంబంధించి ఖురాన్, హదీసులలో స్పష్టమైన సంకేతాలున్నాయి. సూరా అల్ ఫజ్ర్‌లో, 'ప్రభాత సమయం సాక్షిగా, పది రాత్రుల సాక్షిగా..' (ఖురాన్ 89:1–2) అని ఉంది. ప్రఖ్యాత ఖురాన్ వ్యాఖ్యాత ఇబ్నె కసీర్ .. ఈ ప్రస్తావన జిల్‌మాసం పదిరోజు లకు సంబంధించినదే అని తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో రాశారు. ప్రవక్త (స) వారి ప్రవచనం ప్రకారం, 'దైవా నికి ఈ పదిరోజులలో చేసే మంచి పనుల కన్నా ఇతరరోజుల్లో చేసే పనులు ప్రియమైనవి కావు' (సహీ బుఖారీ, హదీస్ 969) అని చెప్పారు. అంటే జిల్‌హజ్ మాసం మొదటి పదిరోజులకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో మనకు వీటి ద్వారా అర్థమవుతోంది.

ఈ పదిరోజులలో ఒకటైన తొమ్మిదవ రోజుకు అన్నిటి కన్నా ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. హజ్ యాత్రలో ఇది అత్యంత కీలకమైన రోజు. హజ్‌కు వెళ్లలేని వారు కూడా ఈ రోజున ఉపవాసం ఉండడం వల్ల గత సంవత్సరం, వచ్చే సంవత్సరం పాపాలు మన్నింపబడతాయని ప్రవక్త (స) వారు చెప్పారు. ఉపవాసం మనసుని నియంత్రించ డంలో, ఆత్మశుద్ధి సాధించడంలో, భయభక్తులు పెంపు దలలో గొప్ప సాధనంగా ఉపకరిస్తుంది.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● సువార్త

ఒక్కడే మీ తండ్రి

'ఒక్కడే మీ తండ్రి' అనునది అపొస్తలుల బోధ. వీరు యేసుక్రీస్తు దగ్గర మూడున్నర సంవత్సరాలపాటు ఆత్మ సంబంధ జ్ఞానాన్ని గ్రహించారు. పామరు లైన వీరంతా దేవుని బోధలు ఎలా చేయాలో క్రీస్తు అను మెస్సీయ వద్దనే నేర్చుకొన్నారు. క్రీస్తును గూర్చి 'ఈయనే నా ప్రియ కుమా రుడు అంటూ దేవుడు ఆకాశం నుండి పలికిన మాటలను ఆ దేవుని గొప్ప స్వరాన్ని పలుమార్లు విన్నారు.

దేవుని చేత పరము నుండి ఈ భూలోకమునకు పంపబ డిన 'పరలోక దేవుని అపొస్తలుడైన యేసు అసాధారణ బోధ', ఆ యేసు క్రీస్తు చేత ఈ సర్వ లోకములోనికి పంపబ డిన పన్నెండు మంది శిష్యులనబడిన 'క్రీస్తువారి అపొస్తలుల బోధ', యెరూషలేములోని ఆదిమ సంఘముగా చెప్పబడే 'క్రీస్తు ప్రభువు సంఘం చేత ప్రపంచ దేశాలకు పంపబడిన' సంఘపు అపొస్తలుల ఉపదేశం' అంతా ఒక్కటే. ఇందులో ఎలాంటి మార్పులు, చేర్పులు లేవు. ఇట్టి ఏకత్వం గల బోధ ఆనాడు భూలోకాన్ని తలకిందులు చేసింది. అపొస్తలులు మొదటగా చేసిన ప్రపంచ సువార్త పర్యటనలతోనే ప్రపం చాన్ని కదిలించారు. కారణం ఒక్కటే, ఎవరు ఏ మూలకు వెళ్ళి బోధించినా వారి వారి బోధలలో ఏకత్వం అనేది తేటగా పారదర్శకంగా వెల్లడి కావడం.

సత్యవాక్యమును సువార్తను ఇక్కడ పేతురు ప్రకటి స్తున్నా అక్కడ యోహాను వివరిస్తున్నా మరోచోట యాకోబు చెబుతూ ఉన్నా ఈ ముగ్గురి బోధలు ఒకేలా ఉండడం విశేషం. ఇదే అపొస్తలుల బోధనా విధానం ప్రత్యేకత. బోధలో ఏకత్వం లేదంటే, రాలేదంటే అది అపొస్తలుల బోధ కాదని సుస్పష్టంగా చాలా తేలిగ్గానే ఇట్టే చెప్పేయవచ్చు. ఇప్పుడైతే ఏ ముగ్గురి బోధలు విన్నా చదివినా బోధలు మూడు రకాలుగా ఉంటూ క్రైస్తవ సమాజాన్ని కలవ రానికి గురిచేస్తూ ఏకత్వాన్ని ధ్వంసం చేస్తున్నాయి.

నేడు దేవోక్తులకు చోటివ్వని నాయకత్వాలు అంతటా ప్రబలుతున్నాయి. అందులో ఒకటి 'నేను మీకు ఆత్మీయ తండ్రిని' అనే నాయకత్వం. విస్తరించిన పచ్చని చెట్టువలె ఉన్న ఇలాంటి నాయక త్వాలు విచ్ఛిన్నమై పుచ్చిపట్టి నేలకూల డానికి అవి ఎప్పుడూ సిద్ధం గానే ఉంటాయి (కీ ర్తన 37:35,36, 73:16–19). ఎందుకంటే, ఒకడు ఎన్నో ఆత్మలను రక్షించినా ఎంత ఆత్మ సంబంధిగా జీవించినా నెత్తిన తెల్లకిరీటం ఉన్నానూ అతడు ఆత్మీయ తండ్రి కాలేడు. యేసు అసాధారణ బోధ దీన్ని అనుమతించుట లేదు.



ప్రభువైన క్రీస్తు ఇలా అంటున్నాడు. 'పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెళ్ళగింపబడును'(మత్త 15:13). దీని భావం ఏమంటే, వివిధ రకాల లేఖన విరుద్ధ కొత్త సిద్ధాంతాలు, నాయ కత్వాలు, మానవ కల్పిత స్థాపిత సంఘాలు అనేవి సాటిలేని, ప్రత్యామ్నాయం లేని అపొస్తలుల బోధ ముందు అనగా, క్రీస్తు పరిశుద్ధులుగా పేర్గాంచిన అపొస్తలుల బోధ ముందు ఇవి నిలువలేవు. వ్యక్తుల బోధల ప్రతిభ పాట వాలు, ధన దాసత్వం, భక్తి హీనత వంటి అబద్ధ బోధలు నాయకత్వాలుగా పరిణమిస్తూ చెలామణిలో ఉంటూ రాజ్య మేలుతున్నాయి.

సత్యవాక్యం లోతుగా ఎరుగని కారణం చేతనే క్రైస్తవ్యంలో సత్య విషయమైన సత్య సంబంధిత ఈ ఆత్మ సంబంధ భావ దారిద్ర్యం నేడు ఎందరినో పట్టి పీడి స్తోంది. ఆత్మీయ తండ్రిగా పిలిపించుకోవడం అనేది అది వ్యక్తులు సృష్టించు కొన్న వారి సొంత బోధ.

పరలోక దేవుని అపొ స్తలుడైన క్రీస్తు వారి అత్యున్నతమైన అసాధారణ బోధ ఏమంటే,'మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు. మీరందరు సహోదరులు. భూమి మీద ఎవనికై నను తండ్రి అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి. ఆయన పరలోకమందున్నాడు' (మత్త 23 8, 9 ఎఫెసీ 4:6).

– జేతమ్

బిజినెస్ రీల్

సెబీ మాజీ చీఫ్ మాధవికి లోక్‌పాల్ క్లీన్ చిట్



న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ విషయంలో అనైతికంగా వ్యవహరించారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు లోక్‌పాల్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఆమెపై ఆరోపణలన్నీ ఊహాగానాలు, అభిప్రాయాలతో కూడుకున్నవేనని వ్యాఖ్యానించింది. టీఎంసీ ఎంపీ మహువా మైత్రా సహా ఇతరుల ఫిర్యాదులన్నీ కూడా, అదానీ కంపెనీలను టార్గెట్ చేసుకుంటారని పేరొందిన ఓ షార్ట్‌సెల్లర్ నివేదిక ఆధారంగా చేసినవేనని పేర్కొంది. ఇవన్నీ నిరాధారమైనవేనని స్పష్టం చేసింది. తదుపరి విచారణకు ఆదేశించడానికి ఎలాంటి ఆధారాల్లేవని పేర్కొంది. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాల్లో అవకతవకలు జరిగాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ విడుదల చేసిన నివేదికలు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. వాటిపై సెబీ చైర్మన్ హోదాలో బచ్ విచారణ జరపాల్సినప్పటికీ.. అదానీ గ్రూప్ కుంభకోణంతో సంబంధమున్న ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో గతంలో ఆమెకి, ఆమె భర్తకి వాటాలు ఉన్నందున సరైన చర్యలు తీసుకోలేదంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ ప్రాతిపదికన దాఖలైన ఫిర్యాదులను లోక్‌పాల్ తాజాగా కొట్టివేసింది.

మైక్రోసాఫ్ట్, యోటా జట్టు

దేశీయంగా ఏఐ వినియోగానికి దన్ను

న్యూఢిల్లీ: భారత్‌లో కృత్రిమ మేథని (ఏఐ) మరింతగా వినియోగంలోకి తెచ్చే దిశగా మైక్రోసాఫ్ట్, యోటా డేటా సర్వీసెస్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందం ప్రకారం యోటా ఏఐ క్లౌడ్ ప్లాట్‌ఫాం అయిన శక్తి క్లౌడ్‌లో మైక్రోసాఫ్ట్ తమ అజూర్ ఏఐ సర్వీసులను అందుబాటులోకి తెస్తుంది. దీంతో డెవలపర్లు, స్టార్టప్‌లు, కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇండియాఏఐ మిషన్‌లో భాగమైన సంస్థలకు అధునాతన సేవలు అందుబాటులోకి వస్తాయి. దేశీయంగా కృత్రిమ మేథ సామర్థ్యాలను పెంపొందించడం, నవకల్పనలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను పటిష్టపర్చడం ద్వారా ఇండియాఏఐ మిషన్ లక్ష్యాల సాధనకు కూడా మైక్రోసాఫ్ట్–యోటా భాగస్వామ్యం తోడ్పడనుంది. దేశీ ఏఐ మోడల్స్‌ను రూపొందించడానికి సంబంధించి 2025 మే నాటికి ఇండియాఏఐ మిషన్‌కు 500 పైగా ప్రతిపాదనలు వచ్చాయి.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	787.55	1.51
BEL	390.3	1.27
BAJFINANCE	9,282.00	1.21
HEROMOTOCO	4,376.00	0.87
BHARTIARTL	1,855.50	0.63

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NESTLEIND	2,421.00	-1.62
INDUSINDBK	804.9	-1.93
APOLLOHOSP	6,940.00	-1.89
ULTRACEMCO	11,213.00	-1.82
HINDALCO	648.6	-1.65

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,404
ఎన్‌ఎస్‌ఈ	1,12,539
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	3,64,323
ఎఫ్‌ఐఐ	+ 4.663
డీఐఐ	+ 7,912

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.06	$	60.89
బ్రెంట్	64.52	$	63.57

ఇండో-యూఎస్ వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు

- సమస్యలు తొలగిపోతాయ్
- పెట్టుబడులకు ఆకర్షణీయంగా భారత్
- కేంద్ర ఆర్థిక శాఖ నివేదిక అంచనా



న్యూఢిల్లీ: అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం విజయవంతమైతే ప్రస్తుత అడ్డంకులు తొలగిపోయి కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయని, ఎగుమతులు ఇతోధికం అవుతాయని కేంద్ర ఆర్థిక శాఖ భావిస్తోంది. భారత్‌పై విధించిన 26 శాతం అదనపు టారిఫ్‌లను 90 రోజుల పాటు (జూలై 8 వరకు) అమెరికా నిలిపివేయడం తెలిసిందే. దీంతో ఆలోపే అమెరికాతో ఒప్పందం చేసుకునేందుకు భారత్ విస్తృత స్థాయి చర్చలు నిర్వహిస్తోంది. తద్వారా భారత ఎగుమతులపై టారిఫ్‌ల పూర్తి మినహాయింపు ప్రయోజనం పొందొచ్చని భావిస్తోంది. అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య పెట్టుబడులకు భారత్ ఎంతో విశ్వసనీయ, ఆశావహ కేంద్రంగా కొనసాగుతుందని ఆర్థిక శాఖ నివేదిక పేర్కొంది. మధ్యకాలిక వృద్ధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని మరింత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వస్తాయని అంచనా వేసింది. నైపుణ్యాలు, ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచేందుకు చేపడుతున్న విధానపరమైన చర్యలు ఇందుకు మద్దతుగా నిలుస్తాయని తెలిపింది. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్న అంతర్జాతీయ సంస్థల నివేదికలను ప్రస్తావించింది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ సహా పలు సంస్థలు 2025–26లో భారత వృద్ధి రేటు 6.2–6.7 శాతం మధ్య ఉండొచ్చని పేర్కొనడం గమనార్హం. బలమైన దేశీ ఆర్థిక మూలాలు, మెరుగైన స్థూల ఆర్థిక నిర్వహణ, ప్రభుత్వ మూలధన వ్యయాల పెంపును ఈ నివేదిక ప్రస్తావించింది. దీంతో వెలుపలి షాక్‌లను ఆర్థిక వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడగలదని పేర్కొంది.

వినియోగం దన్ను..

వినియోగం బలంగా ఉండడం, గ్రామీణ వినియోగం పుంజుకోవడం, సేవల ఎగుమతులు పటిష్టంగా ఉండడం దేశీ వృద్ధి చోదకాలుగా పనిచేస్తాయని ఆర్థిక శాఖ నివేదిక తెలిపింది. వస్తు ఎగుమతుల్లో ఉన్న బలహీనతలను సేవల ఎగుమతులు భర్తీ చేస్తున్నట్టు వివరించింది. రూపాయి స్థిరంగా ఉండడంతోపాటు బలమైన విదేశీ మారకం నిల్వలు వెలుపలి షాక్‌లకు మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. ముఖ్యంగా గత బడ్జెట్‌లో ఆదాయపన్ను భారాన్ని తగ్గించడం, ద్రవ్య నియంత్రణ కోసం తీసుకున్న చర్యలు, ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు నిర్ణయాలు వినియోగాన్ని, పెట్టుబడులను పెంచుతాయని అంచనా వేసింది. దీంతో ఆర్థిక వృద్ధి మరింత పుంజుకుని 6.3–6.8 శాతం అంచనాల్లో గరిష్ట స్థాయికి చేరుకోవచ్చని తెలిపింది. ప్రైవేటు రంగం మూలధన వ్యయాలు ఒక్కటే పుంజుకోవాల్సి ఉన్నట్టు తెలిపింది. ఆహార ధరలు తగ్గుముఖం పట్టడంతో ద్రవ్యోల్బణం నియంత్రణల్లోనే ఉండొచ్చని అంచనా వేసింది. రబీ సాగు సానుకూలంగా ఉండడం, వేసవిలో పంటల సాగుతో రానున్న రోజుల్లో ఆహార వస్తువుల పరంగా ద్రవ్యోల్బణం అదుపులోనే ఉండొచ్చని వివరించింది. ఇక నైరుతిలో సాధారణం కంటే అధిక వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ అంచనాలతోపాటు, చమురు ధరలు కనిష్టాల్లో ఉండడం ఆర్థిక వ్యవస్థకు అనుకూలిస్తాయని అభిప్రాయపడింది.

బీఏఎస్ఎఫ్ నుంచి రెండు కొత్త ఉత్పత్తులు

అగ్రి సొల్యూషన్స్ వ్యాపారం డీమెర్జర్‌పై కసరత్తు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వరి, ఇతరత్రా పంటల్లో సుడి దోమ, తెగుళ్ల వంటి సమస్యలను పరిష్కరించేందుకు బీఏఎస్ఎఫ్ ఇండియా రెండు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. వీటిలో వాలెక్సియో, మిబెల్యా ఉన్నాయి. వాలెక్సియో కీటక నాశని వరి పంట కోసం ఉద్దేశించినది కాగా మిబెల్యా వరితో పాటు ఇతరత్రా వేరుశనగ, యాపిల్, మిరప వంటి పంటలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఎకరాకు సరిపోయే వాలెక్సియో 60 మిల్లీలీటర్ల ధర రూ. రూ. 1,755గా, అలాగే మెబిల్యా (120 మి.లీ.) రూ. 1,092గా ఉంటుందని బిజినెస్ డైరెక్టర్ (అగ్రికల్చరల్ సొల్యూషన్స్) గిరిధర్ రానువ తెలిపారు. ఇవి జూన్ నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మరోవైపు, 2027 జనవరి నాటికి అగ్రి సొల్యూషన్స్ వ్యాపార విభాగాన్ని విడదీసి, లిస్టింగ్ చేయడంపై కూడా కసరత్తు జరుగుతోందని ఆయన వివరించారు. వచ్చే నాలుగేళ్లలో 10–12 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు గిరిధర్ పేర్కొన్నారు.

భారీ స్థాయిలో ఏఐ ఏజెంట్లను రూపొందిస్తాం

- 'హ్యూమన్ ప్లస్ ఏఐ' విధానంలో సర్వీసులు అందిస్తాం
- టీసీఎస్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



ముంబై: కృత్రిమ మేథ (ఏఐ) ఏదో ఆషామాషీ టెక్నాలజీ కాదని, మానవ జాతి పురోగమనాన్ని మలుపు తిప్పే ఒక శక్తివంతమైన సాధనమని ఐటీ దిగ్గజం టీసీఎస్ బోర్డు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. అన్ని పరిశ్రమలకూ ఇది ప్రయోజనకరంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులతో కలిసి పని చేసే ఏఐ ఏజెంట్లను భారీ స్థాయిలో రూపొందిస్తామని చంద్రశేఖరన్ చెప్పారు. భవిష్యత్తులో 'హ్యూమన్ ప్లస్ ఏఐ' మోడల్ కింద సర్వీసులు అందిస్తామని షేర్‌హోల్డర్లకు టీసీఎస్ మాతృ సంస్థ టాటా సన్స్‌కి కూడా చైర్మన్ అయిన చంద్రశేఖరన్ తెలిపారు. అలాగే, ఏఐ డేటా సెంటర్లు, క్లౌడ్ మౌలిక సదుపాయాలపై ఇన్వెస్ట్ చేస్తామని చెప్పారు. హార్డ్‌వేర్ ప్రొవైడర్లు, సొల్యూషన్స్ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటామని వివరించారు. ఏఐ సాంకేతిక వినియోగంలో టీసీఎస్ ముందు వరుసలో ఉంటోందని, పలు సొల్యూషన్స్‌లో దీన్ని ఉపయోగిస్తోందని చంద్రశేఖరన్ తెలిపారు. 'టీసీఎస్ విజ్‌డంనెక్ట్స్' పేరిట కంపెనీల కోసం జెన్ ఏఐ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రామ్‌రాజ్ పంచకచం పంచె ప్రచారకర్తగా దుష్యంత్ శ్రీధర్



హైదరాబాద్: ఆధ్యాత్మిక వారసత్వాన్ని, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే ఆచార్య పంచకచం పంచెకు ప్రాచుర్యం కల్పించే లక్ష్యంతో రామరాజ్ కాటన్, సాంస్కృతిక విద్వాంసులు దుష్యంత్ శ్రీధర్‌ల మధ్య భాగస్వామ్యం కుదిరింది. ''గురువులు, ఆచార్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పంచకచం పంచె ఉత్పత్తిని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే లక్ష్యంగా దుష్యంత్ శ్రీధర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకున్నాము. పంచకచం పంచెలు సంప్రదాయ దుస్తులు మాత్రమే కాదు. పవిత్రమైన, పండుగ సందర్భాల్లో ధరించే మన వారసత్వానికి చిహ్నాలు'' అని రామరాజన్ కాటన్ వ్యవస్థాపకులు కేఆర్ నాగరాజన్ తెలిపారు. రామరాజ్ కాటన్ అనేది 'రామ' అనే పవిత్ర పేరును కలిగి ఉండటానికి ప్రత్యేకంగా ఆశీర్వదించిన బ్రాండ్ అని దుష్యంత్ శ్రీధర్ అన్నారు. ఆచార్య పంచకచం పంచెలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు.

ఐక్యూ నియో 10 స్మార్ట్‌ఫోన్

రూ. 29,999 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తాజాగా నియో 10 ఫోన్‌ను ఆవిష్కరించింది. ఆఫర్లు, డిస్కౌంట్లు పోగా రూ. 29,999 నుంచి ధర ప్రారంభమవుతుంది. భారత్‌లో తొలిసారిగా స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ప్రాసెసర్‌తో దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. శక్తివంతమైన 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.78 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఓఐఎస్ కెమెరా, 3 ఏళ్ల పాటు ఆండ్రాయిడ్.. 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్, మొదలైన ప్రత్యేకతలు ఈ ఫోన్‌లో ఉంటాయి. అమెజాన్, ఐక్యూ ఈ–స్టోర్‌లో జూన్ 3 మధ్యాహ్నం నుంచి ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయి. ముందుగా బుక్ చేసుకున్న వారికి ఐక్యూ టీడబ్ల్యూఎస్ 1ఈ కాంప్లిమెంటరీగా లభిస్తుంది.

హైదరాబాద్‌లో జియోస్టార్ రోడ్‌షో

హైదరాబాద్: తెలుగు ఆడియెన్స్‌కు, దక్షిణాదిలో ప్రకటనకర్తలకు మరింత చేరువయ్యే క్రమంలో హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించినట్లు జియోస్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. ప్రతి నెలా ప్రాంతీయంగా 90 శాతం మంది తమ స్టార్ మా, స్టార్ మా మూవీస్ తదితర చానల్స్‌లో కంటెంట్‌ను వీక్షిస్తున్నట్లు వివరించింది. దీంతో పెద్ద ఎత్తున వీక్షకులకు చేరువ కావడానికి ప్రకటనకర్తలకు ఇదొక అవకాశం కాగలదని పేర్కొంది. నటులు ఆమని, శ్రీముఖి, అవినాష్, ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 24,000 గంటల తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్, 1,800 పైగా టైటిల్స్‌తో జియోహాట్‌స్టార్ వద్ద అత్యధిక స్థాయిలో కంటెంట్ ఉన్నట్లు జియోస్టార్ రెవెన్యూ హెడ్ అజిత్ వర్గీస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-5-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగాయ్

- గత ఆర్థిక సంవత్సరంలో 50 బిలియన్ డాలర్లు
- కేంద్ర ప్రభుత్వ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) గత ఆర్థిక సంవత్సరంలో పెరిగాయి. 2024–25లో 13% వృద్ధితో 50 బిలియన్ డాలర్లు తరలివచ్చినట్లు ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. కాగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇవి 44.42 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. మొత్తం ఎఫ్‌డీలు(ఈక్విటీలు, రిఇన్వెస్టెడ్ ఎర్నింగ్స్, ఇతర మూలధనం) 14% పెరిగి 81.04 బిలియన్ డాలర్లుగా నిలిచాయి. గడిచిన మూడేళ్లలో ఇదే అత్యధికం. 2023–24లో ఇవి 71.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

- సమీక్షా కాలం(2024–25లో)లో సింగపూర్ నుంచి అత్యధిక (14.95 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చాయి. తర్వాతి స్థానాల్లో మారిషస్(8.34 బి. డాలర్లు), అమెరికా (5.45 బి. డాలర్లు), నెదర్లాండ్స్(4.62 బి.డాలర్లు), యూఏఈ(3.12 బి.డాలర్లు), జపాన్(2.47 బి.డాలర్లు), సైప్రస్(1.2 బి.డాలర్లు), యూకే(795 మిలియన్ డాలర్లు), జర్మనీ (469 మి.డాలర్లు), కై మన్ ఐస్‌లాండ్(371 మి.డాలర్లు) ఉన్నాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం(2023–24)తో నెదర్లాండ్స్, జపాన్, యూకే, జర్మనీల నుంచి పెట్టుబడులు తగ్గాయి.
- రంగాల వారీగా చూస్తే... సర్వీసెస్, ఎగుమతి, టెలికమ్యూనికేషన్, ఆటోమొబైల్, నిర్మాణాభివృద్ధి, పునరుత్పాదక, రసాయన రంగాల్లో పెట్టుబడులు పెరిగాయి. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, నిర్మాణ కార్యకలాపాలు, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో పెట్టుబడులు తగ్గాయి.
- 2024–25లో అత్యధికంగా మహారాష్ట్ర (19.6 బి.డాలర్లు) ఎఫ్‌డీఐ పొందింది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (6.61 బి.డాలర్లు), న్యూఢిల్లీ (6 బి.డాలర్లు), గుజరాత్ (5.7 బి.డాలర్లు), తమిళనాడు (3.68 బి.డాలర్లు), హర్యానా (3.14 బి.డాలర్లు), తెలంగాణ (2.99 బి.డాలర్లు)లు ఉన్నాయి.
- కాగా గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 24.5 శాతం తగ్గి 9.34 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. 2023–24 ఏడాది ఇదే త్రైమాసికంలో భారత్‌లోకి 12.38 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి.

మార్చి త్రైమాసిక ఫలితాలు

బాష్ డివిడెండ్ రూ. 512

- క్యూ4 లాభం రూ. 554 కోట్లు



ముంబై: ఆటో విడిభాగాల దిగ్గజం బాష్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 554 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 564 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 512 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 4,233 కోట్ల నుంచి రూ. 4,911 కోట్లకు బలపడింది. పూర్తి ఏడాదికి నికర లాభం 19 శాతం క్షీణించి రూ. 2,013 కోట్లను తాకింది. 2023–24లో రూ. 2,490 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 16,727 కోట్ల నుంచి రూ. 18,087 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో బాష్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం క్షీణించి రూ. 31,623 వద్ద ముగిసింది.

గ్రాన్యూల్స్ ఇండియా లాభం 17% అప్

- రూ. 1.5 డివిడెండు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 152 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం క్యూ4లో నమోదైన రూ. 130 కోట్లతో పోలిస్తే ఇది 17 శాతం అధికం. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 1,176 కోట్ల నుంచి రూ. 1,197 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 405 కోట్ల నుంచి రూ. 501 కోట్లకు చేరింది. అయితే, ఆదాయం మాత్రం రూ. 4,506 కోట్ల నుంచి రూ. 4,482 కోట్లకు తగ్గింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ. 1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 1.5 చొప్పున తుది డివిడెండు ప్రకటించింది. అధిక మార్జిన్లు ఉండే ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ, వ్యూహాత్మకంగా అమలు చేసిన ప్రణాళికలు విజయవంతం కావడంతో పటిష్టమైన ఆర్థిక పనితీరు సాధించగలిగినట్లు సంస్థ సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

బుధవారం బీఎస్‌ఈలో కంపెనీ షేరు సుమారు 1 శాతం క్షీణించి రూ. 522 వద్ద క్లోజయ్యింది.

ఇన్‌సెక్టిసైడ్స్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 14 కోట్లు



న్యూఢిల్లీ: పెస్టిసైడ్స్, ఆగ్రోకెమికల్స్ కంపెనీ ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 85 శాతం జంప్‌చేసి రూ. 14 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 8 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 32 శాతం ఎగసి రూ. 359 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 273 కోట్ల అమ్మకాలు సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 39 శాతం వృద్ధితో రూ. 142 కోట్లను అధిగమించింది. 2023–24లో రూ. 102 కోట్లు ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1.6 లాభంతో రూ. 830 వద్ద ముగిసింది.

త్రివేణి ఇంజినీరింగ్ లాభం అప్

- క్యూ4లో రూ. 187 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం త్రివేణి ఇంజినీరింగ్ అండ్ ఇండస్ట్రీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 187 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 161 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,564 కోట్ల నుంచి రూ. 1,935 కోట్లకు బలపడింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 395 కోట్ల నుంచి రూ. 238 కోట్లకు క్షీణించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,213 కోట్ల నుంచి రూ. 6,866 కోట్లకు పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 6.5 లాభంతో రూ. 452 వద్ద ముగిసింది.

నాట్కో ఫార్మా లాభం రూ. 406 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ నాట్కో ఫార్మా గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 406 కోట్ల లాభం (కన్సాలిడేటెడ్) నమోదు చేసింది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 386 కోట్లుగా నమోదైంది. ఆదాయం రూ. 1,110 కోట్ల నుంచి రూ. 1,287 కోట్లకు పెరిగింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 16 శాతం వృద్ధి చెంది రూ. 4,127 కోట్ల నుంచి రూ. 4,784 కోట్లకు చేరింది. లాభం రూ. 1,388 కోట్ల నుంచి 36 శాతం పెరిగి రూ. 1,883 కోట్లకు ఎగిసింది. భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, అమెరికాలో కీలక ఉత్పత్తులపై ధరలపరమైన ఒత్తిళ్లు, పరిశోధన..అభివృద్ధి కార్యకలాపాలపై వ్యయాలు తదితర అంశాల కారణంగా 2025–26లో ఆదాయం 20 శాతం, లాభాలు 30 శాతం తగ్గొచ్చని అంచనా వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

బీఎస్‌ఈలో నాట్కో షేరు సుమారు రెండు శాతం క్షీణించి రూ. 862.45 వద్ద క్లోజయ్యింది.

పీఅండ్‌జీ లాభం ఫ్లాట్

- క్యూ3లో రూ. 156 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్(పీఅండ్‌జీ) హైజీన్ అండ్ హెల్త్‌కేర్ ఈ ఏడాది(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ3)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 156 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 154 కోట్లు ఆర్జించింది. కంపెనీ జులై–జూన్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. మొత్తం ఆదాయం నామమాత్రంగా తగ్గి రూ. 992 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ3లో రూ. 1,002 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతంపైగా పెరిగి రూ. 791 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.2 నష్టంతో రూ. 14,213 వద్ద ముగిసింది.

బాటా లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 37 కోట్లు



న్యూఢిల్లీ: ఫుట్‌వేర్ తయారీ దిగ్గజం బాటా ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నిర్వహణ లాభం 36 శాతం క్షీణించి రూ. 37 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 58 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 798 కోట్ల నుంచి రూ. 788 కోట్లకు నీరసించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 9 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.3 నష్టంతో రూ. 1,276 వద్ద ముగిసింది.

యువ భారత్ 'హ్యాట్రిక్'



రొసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన యువ భారత్... ఆతిథ్య అర్జెంటీనాతో జరిగిన హోరాహోరీ పోరులో షూటౌట్‌లో విజయం సాధించి 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. నిర్ణీత సమయంలో ఇరు జట్ల స్కోర్లు 1-1 గోల్స్‌తో సమం కాగా... అనంతరం విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 2-0తో గెలుపొందింది. మ్యాచ్‌లో భారత్ తరఫున కనిక (44వ నిమిషంలో) ఏకైక గోల్ చేయగా... అర్జెంటీనా తరఫున మిలాగ్రోస్ డెల్ వాలె (10వ నిమిషంలో) ఒక గోల్ చేసింది. అర్జెంటీనా జట్టు తొలి క్వార్టర్‌లోనే గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లగా... మూడో క్వార్టర్‌లో కనిక గోల్‌తో భారత్ స్కోర్లు సమం చేయగలిగింది. షూటౌట్‌లో భారత్ తరఫున లాల్‌రిన్‌పుయి, లాల్‌థన్‌ట్లుంగి విజయవంతం అయ్యారు. యువ భారత జట్టు కెప్టెన్ నిధి గోల్‌కీపర్‌గా అర్జెంటీనా ప్లేయర్ల దాడులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో భారత్‌ టోర్నమెంట్‌లో వరుసగా మూడో విజయం నమోదు చేసుకుంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం చిలీతో భారత్ తలపడుతుంది.

అహ్మదాబాద్‌లో ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న ఆసియా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు అహ్మదాబాద్ వేదిక కానుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి 10 వరకు ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎల్ఎఫ్) బుధవారం వెల్లడించింది. గతేడాది జరిగిన ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య సమావేశంలోనే ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కగా... ఇప్పుడు వేదిక ఖరారైందని ఐడబ్ల్యూఎల్ఎఫ్ అధ్యక్షుడు సహదేవ్ యాదవ్ బుధవారం వెల్లడించారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య సవరించిన వెయిట్ కేటగిరీల్లో జరగనున్న తొలి ఆసియా చాంపియన్‌షిప్ ఇదే కాగా... తొలుత ఈ పోటీలను గాంధీనగర్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే క్రీడా మౌలిక సదుపాయాలు అహ్మదాబాద్‌లో మెరుగ్గా ఉండటంతో వేదికను ఇక్కడికి మార్చారు. ఈ పోటీలకు ముందు ఈ ఏడాది ఆగస్టులో అహ్మదాబాద్‌లోనే కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ కూడా జరగనుంది. 2036 ఒలింపిక్స్‌ను భారత్‌లో నిర్వహించాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం... అందుకు తగ్గట్లే అహ్మదాబాద్‌లో క్రీడా వసతులను మెరుగు పరచడంపై దృష్టి పెట్టింది. ఇక మరోవైపు 2030 కామన్వెల్త్ గేమ్స్‌ను అహ్మదాబాద్‌లో నిర్వహించేందుకు భారత్ బిడ్ కూడా వేసింది.

ఆసియాలో ఆరు పతకాల జోరు

4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే టీమ్‌లో పసిడి కైవసం

- రూపాల్, సంతోష్, విశాల్, సుభ బృందానికి అగ్రస్థానం
- ప్రవీణ్, తేజస్విన్, పూజ, రూపాల్‌కు వ్యక్తిగత రజతాలు
- కాంస్య పతకం నెగ్గిన యూనుస్ షా

గుమి (దక్షిణ కొరియా)

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత జోరు కొనసాగుతోంది. తొలి రోజు రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్లు... రెండో రోజు పోటీల్లో ఒక స్వర్ణం సహా మొత్తం ఆరు పతకాలు కైవసం చేసుకున్నారు. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే టీమ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు పసిడి పతకం నిలబెట్టుకోగా... డెకాథ్లాన్‌లో తేజస్విన్ శంకర్, పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజత పతకాలతో మెరిశారు. మహిళల 400 మీటర్ల పరుగులో రూపాల్ చౌదరి, మహిళల 1500 మీటర్ల పరుగులో పూజ కూడా రజత పతకాలు సాధించగా... పురుషుల 1500 మీటర్ల పరుగులో యూనుస్ షా కాంస్యం గెలుచుకున్నాడు. దీంతో భారత ఖాతాలో మొత్తంగా 8 పతకాలు (2 స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్యాలు) చేరాయి. 26వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన 4x400 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రూపాల్ చౌదరి, సంతోష్ కుమార్, విశాల్, సుభ వెంకటేశన్‌తో కూడిన భారత బృందం 3 నిమిషాల 18.12 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్ర స్థానంలో నిలిచింది. 2023లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన భారత జట్టులో సభ్యురాలైన సుభ ఈసారి కూడా సత్తా చాటింది. చైనా (3 నిమిషాల 20.52 సెకన్లు), శ్రీలంక (3 నిమిషాల, 21.95 సెకన్లు) బృందాలు వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచినా... అనర్హత వేటుకు గురయ్యాయి. దీంతో ఆ తర్వాత నిలిచిన కజకిస్తాన్ (3 నిమిషాల 22.70 సెకన్లు), కొరియా (3 నిమిషాల 22.87 సెకన్లు) జట్లకు రజత, కాంస్యాలు దక్కాయి. పోటీల తొలి రోజు పురుషుల 10,000 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ స్వర్ణం గెలుచుకోగా.. 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో సెబాస్టియన్ కాంస్యం గెలుచుకున్నాడు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ హవా



రూపాల్ డబుల్ ధమాకా...

మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణం నెగ్గిన రూపాల్ మహిళల 400 మీటర్ల ఈవెంట్‌లో రజతం కూడా గెలుచుకొని డబుల్ ధమాకా మోగించింది. మహిళల ఈవెంట్‌లో రూపాల్ 52.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో బరిలోకి దిగిన విద్య రామ్‌రాజ్ 53.00 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ననాకో మసుమొటో (52.17 సెకన్లు; జపాన్)కు స్వర్ణం, జానిబిబి హుకుమోవా (52.79 సెకన్లు; ఉజ్బెకిస్తాన్)కు కాంస్యం గెలుచుకుంది. 2022 ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు (4X400 మీటర్ల రిలే, 400 మీటర్ల పరుగు) సాధించిన రూపాల్ ఈ టోర్నీలోనూ రెండు పతకాలు నెగ్గడం విశేషం. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చిన రూపాల్... గాయాల బారిన పడకుండా మెరుగైన ఫలితాలు సాధించడమే తన లక్ష్యమని పేర్కొంది. 'పతకం సాధించడం ఆనందంగా ఉన్నా... ఫలితాలతో సంతృప్తిగా లేను. మరింత మెరుగైన టైమింగ్ సాధించాలనుకున్నా. దాని కోసం కఠోర సాధన చేస్తున్నా. గాయాల బారిన పడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్న' అని 20 ఏళ్ల రూపాల్ పేర్కొంది.

పూజకు రజతం



మహిళల 1500 మీటర్ల పరుగులో భారత అథ్లెట్ పూజ 4 నిమిషాల 10.83 సెకన్లలో గమ్యాన్ని చేరి రజతం నెగ్గింది. భారత్‌కే చెందిన లిలి దాస్ (4 నిమిషాల 13.81 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచి పతకానికి దూరమైంది. లి చున్‌హ్ (4 నిమిషాల 10.58 సెకనర్లు; చైనా)కి పసిడి, టొమాకా కైమురా (4 నిమిషాల 11.56 సెకన్లు; జపాన్)కు కాంస్య పతకాలు దక్కాయి.

యూనుస్‌కు కాంస్యం



పురుషుల 1500 మీటర్ల పరుగులో యూనుస్ 3 నిమిషాల 43.03 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. కజుటో లిజావా (3 నిమిషాల 42.56 సెకన్లు; జపాన్) వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో పసిడి గెలుచుకోగా... జియాంగ్ లీ (3 నిమిషాల 42.79 సెకన్లు; దక్షిణ కొరియా) కాంస్యం దక్కించుకున్నాడు. పురుషుల 400 మీటర్ల ఫైనల్లో విశాల్ వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ (45.57 సెకన్లు)తో రేసును ముగించినా... నాలుగో స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. 4X400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో పసిడి గెలిచిన భారత జట్టులో సభ్యుడైన విశాల... వ్యక్తిగత విభాగంలో మెరుగైన ప్రదర్శనే చేసినా పతకం మాత్రం సాధించలేకపోయాడు.

- ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మహిళల హర్డిల్స్‌లో జ్యోతి 13.18 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ముందంజ వేసింది.
- మహిళల లాంగ్‌జంప్‌లో శైలీ సింగ్, ఆన్సీ సోజన్ ఫైనల్‌కు అర్హత సాధించారు. బుధవారం క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో శైలీ సింగ్ 6.17 మీటర్లు దూకగా... ఆన్సీ 6.14 మీటర్ల దూరం లంఘించింది.



ప్రవీణ్ మూడో ప్రయత్నంలో...

పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజత పతకంతో మెరిశాడు. బుధవారం పోటీల్లో ప్రవీణ్ 16.90 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచాడు. 'పరిస్థితులు అనుకూలించాయి. తొలి రెండు ప్రయత్నాల్లో టాప్-8లో ఉంటే చాలు అనుకున్నా. మూడో ప్రయత్నంలో శక్తినంతా కూడదీసుకొని లంఘించా. ఆ తర్వాత వర్షం కారణంగా అంతరాయం కలిగింది. దీంతో కాస్త ఇబ్బందిపడ్డా. పతకం సాధించడం సంతోషంగా ఉంది' అని ప్రవీణ్ పేర్కొన్నాడు. తొలి ప్రయత్నంలో 16.60 మీటర్లు దూకిన ప్రవీణ్, రెండో ప్రయత్నంలో 16.67 మీటర్లు లంఘించాడు.



తేజస్విన్‌కు సిల్వర్

భారత స్టార్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ డెకథ్లాన్‌లో రజతం గెలుచుకున్నాడు. 10 ఈవెంట్ల (100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హై జంప్, 400 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్ వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్ల పరుగు) సమాహారమైన ఈ పోటీలో తేజస్విన్ 7618 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. ఫై జియాంగ్ (7634; చైనా)కు స్వర్ణం, కిసుకే ఒకుడా (7602; జపాన్)కు కాంస్య పతకం లభించింది.

సాత్విక్-చిరాగ్ జోడీ బోణీ



గాయంతో వైదొలిగిన లక్ష్యసేన్

- పోరాడి ఓడిన ఆకర్షి, ఉన్నతి
- సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సింగపూర్: మూడు నెలల విరామం అనంతరం బరిలోకి దిగిన భారత స్టార్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో బోణీ కొట్టింది. వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బుధవారం సాత్విక్-చిరాగ్ జోడీ 21-16, 21-13 చూంగ్ హోన్ జియాన్-మొహమ్మద్ హైకాల్ (మలేసియా) జంటపై గెలుపొందింది. 37 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రపంచ మాజీ నంబర్‌వన్ ద్వయం వరుస గేమ్‌ల్లో విజయం సాధించింది. చిరాగ్ గాయం కారణంగా ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ నుంచి తప్పుకున్న ఈ జంట... పూర్తి ఫిట్‌నెస్‌తో కోర్టులో సత్తా చాటింది. ప్రస్తుతం ప్రపంచ 27వ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ జోడీకి... 41వ ర్యాంకర్ మలేసియా జోడీపై ఇది రెండో విజయం. ఈ సీజన్‌లో మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన ఈ జంట... ఆ తర్వాత గాయాల కారణంగా ప్రధాన టోర్నీలకు దూరమైంది.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో గాయత్రి గోపీచంద్-ట్రిసా జాలీ జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. బుధవారం తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రిసా జంట 21-14, 19-21, 21-17తో చాంగ్ చింగ్ హుయి-యాంగ్ చింగ్ టున్ (చైనీస్ తైపీ) ద్వయంపై గెలచి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అడుగు పెట్టింది. రోహన్-శివాని జంట 21-16, 21-19 చెన్ జీ యీ-ఫ్రాన్సెస్కా కార్బెట్ (అమెరికా) ద్వయంపై గెలుపొందింది. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా పోరాడి ఓడారు. ఆకర్షి కశ్యప్ 21-17, 13-21, 7-21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ హన్ యీ చేతిలో ఉన్నతి 21-13, 9-21, 15-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జీ యీ చేతిలో పరాజయం పాలయ్యారు. సుమారు గంట పాటు సాగిన ఈ రెండు మ్యాచ్‌ల్లో తొలి గేమ్‌లో విజయం సాధించిన అనంతరం భారత షట్లర్లు పట్టు సడలించి టోర్నీ నుంచి నిష్క్రమించారు. అనుపమా ఉపాధ్యాయ 12-21, 16-21తో సంగ్ షో యున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడగా... మహిళల డబుల్స్‌లో వైష్ణవి-అలీషా జంట పరాజయం పాలైంది.

లక్ష్యసేన్‌కు గాయం

పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్యసేన్ టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలిగాడు. లిన్ చున్ యీ (చైనీస్ తైపీ)తో తొలి రౌండ్ మ్యాచ్ 21-15, 17-21, 5-13తో ఉన్న సమయంలో గాయం కారణంగా లక్ష్యసేన్ వైదొలిగాడు. 'వెన్ను నొప్పితో లక్ష్యసేన్ తొలి రౌండ్ నుంచి వైదొలిగాడు. టోర్నీ ఆరంభానికి ముందు ప్రాక్టీస్ నుంచే లక్ష్య ఈ గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. నొప్పి మరింత ఎక్కువ కావడంతో మూడో గేమ్ మధ్యలో ఆట నుంచి తప్పుకున్నాడు. లక్ష్యసేన్ వీలైనంత త్వరగా కోలుకునే విధంగా వైద్య బృందం చికిత్స అందిస్తోంది. ఇండోనేసియా ఓపెన్ వరకు అతడు తిరిగి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడనే నమ్మకముంది' అని అతడి తండ్రి, కోచ్ డీకే సేన్ పేర్కొన్నాడు.

డబ్ల్యూబీఎల్‌లో కోహ్లి పెట్టుబడి



ముంబై: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి... వరల్డ్ బౌలింగ్ లీగ్ (డబ్ల్యూబీఎల్)లో అడుగు పెడుతున్నాడు. ఇప్పటికే పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టిన కోహ్లి... డబ్ల్యూబీఎల్‌లో వ్యూహాత్మక పెట్టుబడిదారుడిగా మారాడు. డబ్ల్యూబీఎల్‌లో భాగంగా ఇటీవల తొలి జట్టు ఓఎమ్‌జీ ఫ్రాంచైజీని ప్రకటించింది. ఇప్పుడు తాజాగా క్రికెట్ సూపర్ స్టార్ కోహ్లి భాగస్వామ్యాన్ని బహిర్గతం చేసింది. 'నేను 11 ఏళ్ల వయసులో బౌలింగ్ చేయడం ప్రారంభించా. 12 ఏళ్ల వయసు నుంచి బంతిని తిప్పేందుకు ప్రయత్నిస్తున్నా. ఈ లీగ్‌లో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. వ్యాపారాభివృద్ధి కోణంలోనూ ఇది మంచి అడుగు అనుకుంటున్నా. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కొత్త క్రీడలను ప్రోత్సహించాల్సిందే. ఈ1 సిరీస్‌లో మా జట్టు పురోగతి చూస్తే ముచ్చటేస్తోంది. డబ్ల్యూబీఎల్ వ్యూహాత్మక పెట్టుబడిదారుడిగా, సహ యజమానిగా ఉండడం ఉత్సాహాన్నిస్తోంది'అని విరాట్ కోహ్లి వెల్లడించాడు.

గుకేశ్‌పై అర్జున్ విజయం

స్టావెంజర్ (నార్వే): ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు నార్వే చెస్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో పరాజయం ఎదురైంది. తొలి మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో ఓడిన గుకేశ్... రెండో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన అర్జున్ ఇరిగేశి చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ విజయంతో తెలంగాణకు చెందిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ అర్జున్ పాయింట్ల పట్టికలో హికారు నకమురా (4.5 పాయింట్లు; అమెరికా)తో కలిసి అగ్ర స్థానానికి చేరాడు. ఈ మ్యాచ్‌లో తెల్ల పావులతో ఆడిన అర్జున్ 62 ఎత్తుల్లో గుకేశ్‌పై విజయం సాధించాడు. గత మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న అర్జున్ ఈ విజయంతో 4.5 పాయింట్లు ఖాతాలో వేసుకొని తొలి స్థానానికి చేరాడు. మరో మ్యాచ్‌లో కార్ల్‌సన్‌పై నకమురా అర్మగెడాన్‌లో విజయం సాధించాడు. దీంతో 4 పాయింట్లతో ఉన్న కార్ల్‌సన్ పట్టికలో రెండో స్థానంలో ఉన్నాడు. వై యీ (చైనా)పై ఫాబియానో కరున విజయం సాధించాడు. మహిళల విభాగంలో భారత ప్లేయర్లు కోనేరు హంపి, వైశాలీ పరాజయం పాలయ్యారు. ఈ టోర్నీలో పురుషుల, మహిళల విభాగాల్లో టాప్-6 ప్లేయర్లు పాల్గొంటున్నారు. 'డబుల్ రౌండ్ రాబిన్' ఫార్మాట్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో ఒక్కో ప్లేయర్ తమ ప్రత్యర్థులతో రెండేసి మ్యాచ్‌లు ఆడనున్నారు.

భారత ఫుట్‌బాల్ జట్టులో సోహైల్

థాయ్‌లాండ్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం 28 మందితో జట్టు ఎంపిక

కోల్‌కతా: వచ్చే నెలలో థాయ్‌లాండ్‌తో జరగనున్న అంతర్జాతీయ స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం బుధవారం సునీల్ ఛెత్రీ సారథ్యంలో 28 మందితో కూడిన భారత జట్టును ప్రకటించారు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్‌కు సన్నాహకంగా... భారత జట్టు జూన్ 4న థాయ్‌లాండ్‌తో ఇంటర్నేషనల్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది. అనంతరం జూన్ 10న హాంకాంగ్‌తో టీమిండియా తలపడనుంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన సోహైల్ అహ్మద్ భట్‌కు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం దక్కింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో మోహన్ బగాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సోహైల్ తన అటాకింగ్ గేమ్‌తో ఆకట్టుకోవడంతో జాతీయ జట్టు తరఫున పిలుపు వచ్చింది.



సోహైల్‌కు ముందు కశ్మీర్ నుంచి చివరిసారిగా దానిశ్ ఫారూఖ్ జాతీయ జట్టు తరఫున ఆడాడు. సెంట్రల్ ఫార్వర్డ్ అన్వర్ అలీకి కూడా జట్టులో చోటు దక్కింది. ప్రస్తుతం భారత జట్టు సభ్యులంతా కోల్‌కతాలోని శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్నారు. 'తాజాగా జట్టుకు ఎంపిక చేసిన 28 మంది ప్లేయర్లు కోల్‌కతాలో శిక్షణ పొందుతున్నారు. జూన్ 4న ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం వీరంతా థాయ్‌లాండ్ వెళ్లనున్నారు' అని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసియా కప్ క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్‌లో బంగ్లాదేశ్, హాంకాంగ్, సింగపూర్‌తో కలిసి భారత జట్టు గ్రూప్ 'సి' నుంచి పోటీ పడుతోంది.

సత్వరం ఎన్నికలు

బీఎన్‌పీ నిరసనల హోరు

అట్టుడుకుతున్న బంగ్లాదేశ్

ఢాకా: బంగ్లాదేశ్‌లో మధ్యంతర ఎన్నికల కోసం తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్‌పై ఒత్తిళ్లు నానాటికీ పెరిగిపోతున్నాయి. డిసెంబర్లోగా ఎన్నికల జరపాలనే డిమాండ్‌తో బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) బుధవారం దేశవ్యాప్తంగా కదం తొక్కింది. రాజధాని ఢాకా వీధుల్లో భారీ నిరసన ర్యాలీలతో హోరెత్తించింది. దేశ నలుమూలల నుంచి ఆ పార్టీ యువ కార్యకర్తలు వేలాదిగా వాటిలో పాల్గొన్నారు. యూనస్ సర్కారు ఉద్దేశపూర్వకంగానే ఎన్నికలను ఆలస్యం చేస్తోందని బీఎన్‌పీ తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ దుయ్యబట్టారు. గతంలో తాత్కాలిక సారథులంతా మూడు నెలల్లోపే ఎన్నికలు నిర్వహించారని గుర్తు చేశారు. యూనస్ మాత్రం గద్దెనెక్కి 10 నెలలైనా ఎన్నికల ఊసే ఎత్తడం లేదంటూ మండిపడ్డారు. ప్రతిపాదిత సంస్కరణల అమలును వీలైనంతగా పూర్తి చేసి డిసెంబర్, జూన్ మధ్య ఎన్నికలు నిర్వహిస్తామని జపాన్ పర్యటనలో ఉన్న యూనస్ పునరుద్ఘాటించారు.

డిసెంబర్‌లోగా మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో బుధవారం ఢాకాలో ఆందోళనకు దిగిన బీఎన్‌పీ కార్యకర్తలు



ఆకాశహర్మ్యాల నడుమ... అద్భుత దృశ్యం!

కనువిందు చేయనున్న మన్‌హాటన్‌హెంజ్ సూర్యాస్తమయం

ఎత్తైన గుట్టలు, మధ్యలో అస్తమిస్తున్న సూర్యుడు. ఇలాంటి ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించని, ఆనందించని వారుండరు. అలాంటి దృశ్యాల కోసమే చాలామంది ప్రత్యేకంగా ప్రయాణాలు కూడా చేస్తుంటారు. మరి మహానగరాల్లో సూర్యాస్తమయం ఎలా ఉంటుంది? ఉరుకుల పరుగుల జీవితాల్లో ఎవరూ అంతగా పట్టించుకోరు! కానీ న్యూయార్క్ మహానగరంలో మాత్రం బుధవారం నాటి అందమైన సాయంత్రానికి ఓ ప్రత్యేకత ఉంది. హడ్సన్ నదికి ఆవల సూర్యుడు నెమ్మదిగా అస్తమిస్తుండగా ఆకాశహర్మ్యాల నడుమ అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. న్యూయార్క్‌లోని మన్‌హాటన్ వీధుల్లో ఆకాశాన్ని తాకే భవనాల మధ్య సూర్యుడు పసుపు, నారింజ, ఎరుపు రంగుల్లో వెలిగిపోతూ అస్తమించే దృశ్యాన్ని చూడటానికి జనం ఎగబడతారు. దీన్ని మన్‌హాటన్‌హెంజ్‌గా పిలుస్తారు. ఈ అందమైన దృశ్యం ఈ ఏడాది మే 28, 29ల్లో తిరిగి జూలై 11, 12 తేదీల్లో మాత్రమే కనిపిస్తుంది. తొలి మన్‌హాటన్‌హెంజ్ బుధవారం రాత్రి 8:13 గంటలకు, అంటే భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం 5.43కు కనిపిస్తుంది. మన్‌హాటన్‌లోని 14, 23, 34, 42, 57వ నంబర్ వీధుల్లో ఈ దృశ్యాన్ని చూడవచ్చు. షికాగో, బాల్టిమోర్, కెనడాలోని టొరంటో వంటి నగరాల్లోనూ ఇలాంటి సూర్యాస్తమయాలు కనువిందు చేస్తాయి. కానీ అన్నింట్లోకీ మన్‌హాటన్‌హెంజ్ బాగా ప్రసిద్ధమైనది.

మన్‌హాటన్ అనే పదాన్ని ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త నీల్ డిగ్రాస్సే టైసన్ 1997లో ప్రయోగించారు. ఆయన యుక్తవయసులో ఉండగా ఇంగ్లండ్‌లోని స్టోన్‌హెంజ్‌ను సందర్శించారు. ఆ నిలువురాళ్ల గుండా కనువిందు సూర్యాస్తమయం ఆయనను అమితంగా ఆకట్టుకుంది. తర్వాత తన స్వస్థలమైన న్యూయార్క్‌లోని మన్‌హాటన్ భవనాల గుండా సూర్యాస్తమయ హొయలు స్టోన్‌హెంజ్ సూర్యాస్తమయాన్ని పోలి ఉండటం ఆయనను ఆశ్చర్యపరిచింది. అందుకే ఆ పేరు పెట్టారు.

రాబోయే ఐదేళ్లూ భగభగలే!

పెరుగనున్న ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు

- 1850–1900 సగటు కంటే 1.5 డిగ్రీలకుపైగా అధికంగా నమోదయ్యే అవకాశం
- 2025–2029లో కనీసం ఒక అత్యధిక వేడి సంవత్సరం
- ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక
- ఆచరణకు దూరంగా పారిస్ వాతావరణ సదస్సు లక్ష్యాలు

న్యూఢిల్లీ/వాషింగ్టన్: కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల ధాటికి భూగోళంపై ఉష్ణోగ్రతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వాతవరణ మార్పులను కట్టడి చేసేందుకు చేపడుతున్న చర్యలేవీ ఆశించిన ఫలితాలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఉష్ణోగ్రతల పెరుగుదలను పారిశ్రామికవిప్లవం కంటే ముందున్న స్థాయికి తగ్గించాలన్న లక్ష్యాలు నెరవేరడం లేదు. అభివృద్ధి చెందిన, పారిశ్రామిక దేశాల నిర్వాకం వల్ల ఈ లక్ష్యాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగోళం మరింత వేడెక్కడం ఖాయమని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ)తోపాటు యునైటెడ్ కింగ్‌డమ్ వాతావరణ కార్యాలయం హెచ్చరించాయి. ఈ మేరకు బుధవారం ఒక నివేదిక విడుదల చేశాయి. ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే 2025 నుంచి 2029 వరకు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పైగా అధికంగా నమోదు కావడానికి 70 శాతం అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూఎంఓ తేల్చిచెప్పింది. రాబోయే ఐదేళ్లలో కనీసం ఒక సంవత్సరం అత్యధిక వేడి కలిగిన సంవత్సరంగా రికార్డుకు ఎక్కడానికి 80 శాతం అవకాశాలు ఉన్నట్లు స్పష్టంచేసింది. 2024 సంవత్సరం అత్యధిక వేడి సంవత్సరంగా రికార్డుకెక్కింది. రాబోయే ఐదేళ్లలో ఈ రికార్డు బద్దలు కానున్నట్లు డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. 1850–1900 నాటి సగటు ఉష్ణోగ్రతల కంటే 2024లో 1.5 డిగ్రీలకుపైగా అధిక ఉష్ణోగ్రత నమోదయ్యింది.

- ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలని 2015లో జరిగిన పారిస్ వాతావరణ సదస్సులో లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు ప్రపంచ దేశాలు అంగీకారం తెలిపాయి.
- 2031–2035కు సంబంధించిన జాతీయ వాతావరణ ప్రణాళికలను దేశాలు ఈ ఏడాది ఐక్యరాజ్యసమితికి సమర్పించాల్సి ఉంది.
- 1850–1900 నాటి సగటు ఉష్ణోగ్రతలతో పోలిస్తే 2025 నుంచి 2029 దాకా ప్రపంచ ఉపరితల సగటు ఉష్ణోగ్రతలు ప్రతి ఏటా 1.2 డిగ్రీల నుంచి 1.9 డిగ్రీల చొప్పున పెరుగుతాయని డబ్ల్యూఎంఓ నివేదిక తెలియజేసింది.
- 1850–1900 నాటి సగటు ఉష్ణోగ్రతల కంటే 2025 నుంచి 2029లో కనీసం ఒక సంవత్సరంలో ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్(2.7 డిగ్రీల ఫారెన్‌హీట్) అధికంగా నమోదయ్యే అవకాశం 86 శాతం ఉన్నట్లు పేర్కొంది.
- ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల ఎన్నెన్నో ప్రతికూల ప్రభావాలు ఉంటాయని డబ్ల్యూఎంఓ డిప్యూటీ సెక్రెటరీ జనరల్ కో బారెట్ చెప్పారు. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని, రోజువారి జీవితాలకు, పర్యావరణానికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.
- ప్రపంచంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంతం వేగంగా వేడెక్కే ప్రమాదం కనిపిస్తోంది. రాబోయే ఐదేళ్లలో ఇక్కడ మంచు చాలావరకు కరిగిపోతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- దక్షిణాసియాలో 2023లో మినహా గత కొన్నేళ్లలో మంచి వర్షాలే కురిశాయి. ఇక్కడ 2025 నుంచి 2029 దాకా సాధారణ కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని భావిస్తున్నట్లు ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. కొన్ని సీజన్లలో మాత్రం వర్షాలు పడకపోవచ్చని తెలియజేసింది.
- ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు పెరగడం వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర మార్పులకు, తుపాన్లు, కరువులకు దారి తీస్తుందని కార్నెల్ యూనివర్సిటీకి చెందిన వాతావరణ శాస్త్రవేత్త నటాలీ మహోవాల్డ్ చెప్పారు. ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ భూమిపై మనుషులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతుంటారని స్పష్టంచేశారు.

మూడో ప్రపంచ యుద్ధమే

- ట్రంప్ విమర్శలపై మెద్వెదెవ్ హెచ్చరికలు
- రష్యా మాజీ అధ్యక్షుని తీరుపై విమర్శలు

మాస్కో: అమెరికా, రష్యా మధ్య మాటల మంటలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఉక్రెయిన్‌తో శాంతి చర్చల్లో పాల్గొనకపోవడం ద్వారా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించడం తెలిసిందే. 'నేనే లేకుంటే రష్యా లెక్కలేనన్ని దుస్సంఘటనలు ఎదుర్కోవాల్సి వచ్చేది' అంటూ పుతిన్ తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. వాటిపై రష్యా మాజీ అధ్యక్షుడు, పుతిన్ సన్నిహితుడు ద్మిత్రీ మెద్వెదెవ్ ఘాటుగా స్పందించారు. ''నాకు తెలిసిన అతి పెద్ద దుస్సంఘటన ఒక్కటే. మూడో ప్రపంచ యుద్ధం! నా మాటల ఆంతర్యాన్ని ట్రంప్ అర్థం చేసుకుంటారనే అనుకుంటున్నా'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచం మొత్తాన్నీ యుద్ధంలోకి లాగుతామన్నదే మెద్వెదెవ్ ఆంతర్యమని విశ్లేషకులు అంటున్నారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవి నిజంగా నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలని ట్రంప్ సీనియర్ సలహాదారు, ఉక్రెయిన్ ప్రత్యేక రాయబారి కీత్ కెల్లాగ్ విమర్శించారు.



అన్నార్తుల దైన్యం

ఆహార పొట్లాల కోసం సెంట్రల్ గాజాలోని జవైదాలో ఐరాస గోదాంకు బుధవారం భారీ సంఖ్యలో పోటెత్తిన పాలస్తీనావాసులు. మంగళవారం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వితరణ కేంద్రంపైకి కూడా అన్నార్తులు ఇలాగే భారీ సంఖ్యలో విరగబడ్డారు. అక్కడికి అతి సమీపంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగడంతో ఒకరు మరణించారు. 50 మంది దాకా గాయపడ్డారు.

ఒక్క చేత్తో చప్పట్లు కొట్టలేం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- రేప్ కేసులో యువకుడికి మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: ఒక్క చేత్తో చప్పట్లు కొట్టలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అత్యాచారానికి గురైనట్లు చెబుతున్న 40 ఏళ్ల మహిళ చిన్నపిల్ల కాదని పేర్కొంది. ఆమె అంగీకారంతోనే లైంగిక చర్య జరిగినట్లు పరోక్షంగా వెల్లడించింది. అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 23 ఏళ్ల సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు న్యాయస్థానం బుధవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అతడిని అరెస్టు చేసి, జైల్లో పెట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా పోలీసులు అభియోగాలు నమోదు చేయలేదని, అందుకే మధ్యంతర బెయిల్ ఇస్తున్నట్లు పేర్కొంది. ఆ మహిళ ఆ యువకుడిని ఇష్టపూర్వకంగానే కలిస్తే అతడిపై రేప్ కేసు ఎలా నమోదు చేస్తారని ఢిల్లీ పోలీసులను జస్టిస్ బి.బి.నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఆమె అతడితో ఏడుసార్లు జమ్మూకశ్మీర్‌కు వెళ్లిందని, అతడిపై సెక్షన్ కింద 376 కింద కేసు పెట్టడం సరైంది కాదని పేర్కొంది. ఈ కేసులో సదరు మహిళ దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. తమ దుస్తుల బ్రాండ్ ప్రచారం కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన యువకుడిని సంప్రదించారు. క్రమంగా వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తనను మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆ మహిళ ఫిర్యాదు చేయగా, ఢిల్లీ పోలీసులు కేసు నమోదుచేశారు. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని యువకుడు కోరగా, ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దాంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. మధ్యంతర బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశాడు. సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. అయితే, బెయిల్‌పై బయట ఉన్నప్పుడు ఈ మహిళను కలవొద్దని షరతు విధించింది.

విమానంలో పావురం

సెయింట్‌పాల్ (యూఎస్): ఎగురుతున్న విమానంలోకి ఓ పావురం ఎగిరొచ్చి ప్రయాణికులను గాభరా పెట్టింది. ఈ ఉదంతం మంగళవారం అమెరికాలో చోటుచేసుకుంది. డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం మిన్నెపొలిస్–సెయింట్ పాల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విస్కాన్సిన్‌లోని మాడిసన్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో ఉండగా విమానం క్యాబిన్‌లోకి ఓ పావురం ఎగురుతూ రావడంతో గందరగోళం ఏర్పడింది. ఓ ప్రయాణికుడు దాన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుంది. దానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. నిజానికి జరిగిందేమిటంటే టేకాఫ్‌కు ముందే రెండు పావురాలు విమానం లోపలికి వచ్చాయి. సిబ్బంది ఒక పావురాన్నే గమనించి బయటికి పంపారు. రెండోది విమానంలోనే ఉండిపోయింది. అదే మార్గమధ్యంలో గందరగోళానికి కారణమైంది.

అమెరికాలో విలీనమైతే గోల్డెన్ డోమ్ ఫ్రీ

కెనడాకు ట్రంప్ బంపర్ ఆఫర్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కెనడా విలీన డిమాండ్‌కు తెరతీశారు. అమెరికా గగనతల రక్షణకు ప్రతిష్టాత్మక గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టును ట్రంప్ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. ఆ రక్షణ వ్యవస్థలో తానూ భాగస్వామిని అవుతానని కెనడా ప్రతిపాదించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే గోల్డెన్ డోమ్‌ను ఉచితంగా పొందవచ్చని కెనడాకు ఆఫర్ ఇచ్చారు. ''అద్భుతమైన మన గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థలో కెనడా భాగస్వామి కావాలని కోరుకుంటున్నా. అందుకు వారు 61 బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే మాత్రం ఎలాంటి ఖర్చూ ఉండదు'' అని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. తన ఆఫర్‌ను కెనడా చురుగ్గా పరిశీలిస్తోందని కూడా చెప్పుకొచ్చారు. దీనిపై కెనడా ఇంకా స్పందించలేదు. ట్రంప్ ప్రకటించిన గోల్డెన్ డోమ్ వ్యవస్థ క్షిపణి దాడులను నాలుగు దశల్లో సమర్థంగా ఎదుర్కొంటుంది. ప్రయోగానికి ముందే క్షిపణులను నిస్తేజం చేయడం, దారిలో అడ్డగించడం, అంతరాయం కలిగించడం, చివరి క్షణాల్లో నిరోధించడం చేస్తుంది. ఈ ప్రాజెక్టుకు తొలుత 175 బిలియన్ డాలర్లు కేటాయిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. 2029 నాటికి అది పూర్తవుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. గోల్డెన్‌డోమ్‌లో చేరే విషయమై అమెరికాతో చర్చలు జరుపుతున్నట్టు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. తమ దేశ రక్షణకు ఇది మంచి యోచనేనన్నారు. అయితే కెనడా అమ్మకానికి లేదని ఆయన పదేపదే చెబుతూనే వస్తున్నారు. ఇటీవలి ఎన్నికల విజయం తర్వాత మే 6న ట్రంప్‌తో కార్నీ భేటీ అయ్యారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరాలని ట్రంప్ మరోసారి ప్రతిపాదించగా తిరస్కరించారు. 'కెనడా అమ్మకానికి లేదు. ఉండదు, ఎప్పటికీ ఉండబోదు'' అని మరోసారి కుండబద్దలు కొట్టారు.

పండుటీగలు ప్రాణాలు నిలిపేనా?

అంతరిక్షంలో రేడియోధార్మికత ప్రభావాన్ని విశ్లేషించేందుకు సాయపడనున్న ఫ్రూట్ ఫ్లై

ఆగ్జియమ్ స్పేస్ మిషన్‌లో పండుటీగలను తీసుకెళ్లనున్న వ్యోమగాముల బృందం

ప్రతిష్టాత్మకమైన స్పేస్ మిషన్‌ల ద్వారా అంతరిక్షంలోకి చేరుకున్న ఉదంతాలను గుర్తుచేసుకుంటే నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్, రాకేశ్ శర్మ మనకు స్మరణకు వస్తారు. తాజాగా అయితే శుభాన్షు శుక్లా కూడా గుర్తొస్తారు. కానీ ఇప్పుడు ఈ జాబితాలోకి మరో విశిష్ట అతిథి వచ్చేశారు. అదే ఫ్రూట్ ఫ్లై. అంటే పండుటీగ! గతంలో ఎన్నోసార్లు ప్రయోగశాలల్లో ఎన్నో పరిశోధనలకు తన వంతు సాయం అందించిన పండుటీగ ఇప్పుడు అంతరిక్షం దాకా ఎగరనుంది! ఆగ్జియం స్పేస్ మిషన్ బృందం పండుటీగలను కూడా అంతరిక్షంలోకి పంపనుంది. అంతరిక్షంలో వ్యోమగాములకు ప్రమాదకరంగా మారిన రేడియోధార్మికత డీఎన్‌ఏను ధ్వంసం చేస్తోంది. ఈ సమస్యకు పండుటీగలతో పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వెళ్లే ఆగ్జియమ్–4 మిషన్‌లో భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా బృందంతోపాటు పండుటీగలు సైతం ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నాయి.

ఏం ప్రయోగం చేయబోతున్నారు?

పండుటీగలు అత్యంత వేగంగా పునరుత్పత్తి చేస్తాయి. దీంతో వీటిని అంతరిక్షంలో రేడియోధార్మిక ప్రభావానికి లోను చేస్తే రేడియేషన్ వాటిని ఏ స్థాయిలో నాశనం చేస్తుంది?. దాన్ని తట్టుకుని అవి ఎంతవరకు మనగల్గుతాయి? డీఎన్‌ఏను పునరుద్ధరించుకోగలవా? అలా డీఎన్‌ఏ మరమత్తులు సాధ్యమా? ఇలాంటి ప్రశ్నలకు వ్యోమగాములు సమాధానాలు వెతకనున్నారు. ఇందుకోసం పండుటీగలను, వాటి లార్వాలను ఐఎస్ఎస్‌కు తీసుకెళ్తున్నారు. రేడియేషన్ తర్వాత పండుటీగలు ఎలాంటి ప్రొటీన్లను ఉత్పత్తిచేసి డీఎన్‌ఏ రిపేర్లు చేసుకునే అవకాశముందనే విషయాలపై స్పష్టత రానుంది. పండుటీగ ప్రయోగం విజయవంతమైతే దాని సాయంతో శాస్త్రవేత్తలు భవిష్యత్‌లో చందమామ, అంగారకుడు, సుదూర ప్రాంతాలకూ మానవసహిత ప్రాజెక్ట్‌లను నిరభ్యంతరంగా చేపట్టే వీలుంది.



పండుటీగలే ఎందుకు?

ఇలాంటి ప్రయోగాలకు పండుటీగలే అత్యంత అనుకూలమని తేలింది. ఎందుకంటే మనిషి డీఎన్‌ఏలో సహజసిద్ధంగా ఉన్న సూక్ష్మస్థాయి లోపల కారణంగానే తరచూ పలు రోగాలు సోకుతాయి. అలా మనిషిలో రోగాలకు కారణమయ్యే జన్యువులు, పండుటీగల్లోని అలాంటి జన్యువులతో దాదాపు 75 శాతం పోలి ఉండటం విశేషం. అందుకే భవిష్యత్ ప్రయోగాలను చేపట్టనున్నారు. పైగా పండుటీగ లార్వా అత్యంత విపత్కర పరిస్థితులను సైతం తట్టుకోగలదు. అత్యధిక స్థాయి రేడియేషన్‌ను సైతం తట్టుకొని మనగలదని ఇప్పటికే స్పష్టమైంది. ఇంతటి రేడియేషన్‌ను చాలా రకాల జీవులు అస్సలు తట్టుకోలేవు. ఇంతటి విశిష్ట లక్షణాలు ఉన్నందుకే పండుటీగను ఈ ప్రయోగానికి ఎంచుకున్నారు. అంతరిక్షం అనేది మనం రాత్రిళ్ల ఆకాశం కేసి చూసినప్పుడు కనిపించినంత ప్రశాంతంగా ఉండదు. అక్కడ రేడియోధార్మికతను అడ్డుకునే ఎలాంటి వాతావరణం ఉండదు. అంతటా శూన్యం వ్యాపించి ఉండటంతో రేడియోధార్మికత అనేది నిరాటంకంగా తీక్షణస్థాయిలో ప్రసరిస్తుంది. రేడియేషన్ అనేది మనిషి డీఎన్‌ఏలోని నిచ్చెనలాంటి నిర్మాణాలను దెబ్బతీస్తుంది. గురుత్వాకర్షణ లేని కారణంగా వెంటనే మళ్లీ మరమత్తు చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. దీంతో భవిష్యత్తులో క్యాన్సర్ సోకే ముప్పు ఉంటుంది. అందుకే రేడియేషన్ నుంచి రక్షణ పొందుతూ వ్యోమగాములు వ్యోమనౌకల్లో మనుగడ సాగించాల్సి ఉంటుంది. అందుకే రేడియేషన్ నుంచి రక్షణ పొందే విధానాలపై ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు అవసరం. పండుటీగలోని ప్రోటీన్లు రేడియేషన్‌కు లోనైనా వెంటనే రిపేర్లు చేసుకోగలిగితే ఇదే తరహా ప్రోటీన్లతో శాస్త్రవేత్తలు కొత్తతరం ఔషధాలను అభివృద్ధిచేయనున్నారు. భవిష్యత్తులో వ్యోమగాములకు వీటిని అందించనున్నారు. జూన్ 8వ తేదీన భారత్, అమెరికా, పోలండ్, హంగేరీ దేశాల వ్యోమగాములతో ఆగ్జియమ్–4 క్యాప్సూల్ అంతరిక్షంలోకి వెళ్లనుంది. మనం తినే పండు చుట్టూ తిరిగే పండుటీగ చుట్టూ మన శాస్త్రవేత్తలు తిరుగుతారని మనం కలలో కూడా ఊహించి ఉండం.

– సాక్షి, నేషనల్ డెస్క్



సైనికుల కోసం చాయ్ తదితరాలు తీసుకెళ్తున్న బాలుడు



బాలునికి ఇష్టమైన ఐస్‌క్రీమ్ ప్యాక్‌ను అందజేస్తున్న మేజర్ జనరల్ రంజిత్ సింగ్ మన్రాల్

అన్నా యుద్ధం చెయ్.. అన్నీ నేనందిస్తా

ఆపరేషన్ సిందూర్ వేళ సైనికులకు టీ, పాలు, లస్సీ, మంచినీళ్లు, ఐస్ అందించిన పదేళ్ల బాలుడు

చండీగఢ్: జనం కేవలం బాంబు శబ్దం వినపడితేనే ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోతారు. అదే బాంబులు పడుతుంటే అసలు కనుచూపు మేరలో జనం కనపించరు. కానీ పదేళ్ల బాలుడు కాల్పుల మోతకు ఏమాత్రం భయపడకుండా తాపీగా వచ్చి భారత సైనికులకు ఛాయ్, లస్సీ, మంచినీళ్లు.. ఇలా చిరు ఆహార పదార్థాలు ఇచ్చి ఔరా అనిపించాడు. బాలుడి ధైర్యసాహసాలు మెచ్చి భారత ఆర్మీ సత్కరించింది. 7వ ఇన్‌ఫ్యాంట్రీ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అయిన మేజర్ జనరల్ రంజిత్ సింగ్ మన్రాల్ స్వయంగా గ్రామానికి వెళ్లి బాలుడిని అభినందించారు. పాకిస్తాన్ సైనికులకు తూటాలతో జవాబు చెప్తూ యుద్ధంలో మునిగిపోయిన భారత సైనికులకు తాగునీరు, తేనీరు, పాలు, లస్సీ, ఐస్ అందించిన ఈ అబ్బాయి పేరు శ్రవణ్ సింగ్. వయసు కేవలం పదేళ్లు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని మామ్దోత్ పరిధిలోని తారావాలీ గ్రామం ఇతని స్వస్థలం. ఈ గ్రామం పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉంది. దీంతో ఆపరేషన్ సిందూర్ వేళ ఈ గ్రామంపైనా పాకిస్తాన్ కాల్పుల మోత మోగించింది. గ్రామంలో శ్రవణ్‌సింగ్ కుటుంబానికి కొంత సాగుభూమి ఉంది. ఇక్కడ మోహరించిన భారత సైనికులు పాక్ కాల్పులకు దీటుగా బదులివ్వడం మొదలెట్టారు. తమ సొంతస్థలంలోకి సైనికుల వచ్చారని తెల్సుకుని శ్రవణ్ వాళ్లకు ఏదోలా సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఫ్లాస్క్‌లో చాయ్‌తో పాటు తాగడానికి టీ గ్లాసులు పట్టుకెళ్లి ఇచ్చాడు. పాలు, లస్సీ, మంచినీళ్లు, ఐస్ కూడా అందించాడు. సైనికులకు సాయపడిన బాలుడిని అంతా మెచ్చుకున్నారు. పెద్దయ్యాక సైనికుడినవుతా అని పిల్లాడు బదులిచ్చాడు. ''మా వాడిని చూస్తే నాకెంతో గర్వంగా ఉంది. ఇక సైనికుల సంగతి చెప్పనక్కర్లేదు. మా వాడిని తెగ మెచ్చుకున్నారు''అని బాలుడి తండ్రి ఆనందంతో చెప్పారు. ''సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు కొత్తగా దేశభక్తి నూరిపోయాల్సిన పనిలేదు. చిన్నతనం నుంచే నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉంటుంది''అని ప్రముఖులు వ్యాఖ్యానించారు.

ముక్కు కొరికేశాడు

- పార్కింగ్ వివాదంలో సొసైటీ సెక్రటరీపై దాడిచేసిన అపార్ట్‌మెంట్‌వాసి
- ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఘటన

కాన్పూర్: అపార్ట్‌మెంట్‌లో తనకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో వేరెవరిదో కారు నిలిపి ఉండటం చూసి పట్టరాని కోపంతో ఓ వ్యక్తి ఆ అపార్ట్‌మెంట్ సొసైటీ సెక్రటరీ ముక్కును రక్తమోడేలా కొరికేశాడు. ఈ అనూహ్యపరిణామం ఆదివారం సాయంత్రం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో జరిగింది. బాధితుడు రూపేంద్ర సింగ్ యాదవ్ కుమారుడు ప్రశాంత్, కుమార్తె ప్రియాంక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కాన్పూర్ శివారు నారామవూ ప్రాంతంలోని రతన్ ప్లానెట్ అపార్ట్‌మెంట్‌లో క్షితిజ్ మిశ్రా ఉంటున్నారు. ఆయనకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో ఆదివారం గుర్తు తెలియని కారు ఉండటంతో మిశ్రా వెంటనే సొసైటీకి ఫిర్యాదుచేశాడు. సొసైటీ సెక్రటరీగా పనిచేస్తున్న రిటైర్డ్ ఇంజనీర్ యాదవ్ అదేరోజు సాయంత్రం మిశ్రా దగ్గరకు వచ్చాడు. వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులకు చెప్పానని, కారు ఎవరిదో ఆరాతీసి వెంటనే మీ స్థలం నుంచి తీయిస్తానని మిశ్రాకు నచ్చజెప్పారు. అయినాసరే ఏమాత్రం వినిపించుకోని మిశ్రా కోపంతో యాదవ్‌పై పలుమార్లు చేయిచేసుకున్నారు. తర్వాత యాదవ్ మెడను గట్టిగా పట్టుకుని ముక్కు కొరికేశాడు. దీంతో రక్తం ధారలా కారింది. రక్తమోడుతున్న యాదవ్‌ను ఆయన కుటుంబసభ్యులు దగ్గర్లోని రీజెన్సీ ఆస్పత్రికి తరలించారు. శస్త్రచికిత్స అవసరమని వెంటనే ఢిల్లీకి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆగమేఘాల మీద ఆయనను ఢిల్లీకి తరలించారు. '' ప్రస్తుతం యాదవ్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిస్తే మిశ్రాపై తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదుచేస్తాం'' అని కళ్యాణ్‌పూర్ ఏసీపీ అభిషేక్ పాండే చెప్పారు. '' రక్తమొచ్చేలా కొరికిన కోపిష్టిని పోలీసులు కొద్దిసేపు అదుపులోకి తీసుకుని వదిలేశారు'' అని బాధితుడి కుమార్తె ప్రియాంక ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుగా ఎలాంటి ఫిర్యాదు అందని కారణంగానే మిశ్రాను విడిచిపెట్టామని, ఇకపై ఎఫ్ఐఆర్ ప్రకారం నడుచుకుంటామని ఏసీపీ చెప్పారు.

ప్రధానిని సమానుల్లో ప్రథముడు అన్నదెవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రధాని - మంత్రి మండలి

ప్రకరణ- 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంతవరకే మంత్రి మండలి అధికారంలో ఉంటుంది. రాష్ట్రపతి మంత్రి మండలిపై విశ్వాసం కోల్పోతే వారిని తొలగించగలడా అనే సంశయం ఉంది. ప్రకరణలో వాడిన పదజాలానికి స్థూలంగా అర్థం చెప్పినట్లయితే ప్రధాని, మంత్రి మండలిని రాష్ట్రపతి తొలగించగలడు. కానీ ఆచరణలో మాత్రం అది లాంఛనప్రాయమైనది అని తెలుస్తోంది. లోక్‌సభలో ప్రధాని పట్ల విశ్వాసం ఉన్నంతవరకు పదవి నుంచి తొలగించడం సాధ్యపడదు.

ప్రధానమంత్రి అధికారాలు - విధులు

- ప్రధానమంత్రి కేంద్ర ప్రభుత్వాధిపతి. కేంద్ర మంత్రి మండలికి అధ్యక్షుడు. ఇతనికి విశేషమైన అధికారాలు, విస్తృతమైన విధులు ఉన్నాయి. అయితే రాజ్యాంగంలో వీటి గురించి ప్రత్యేకంగా పేర్కొనలేదు.

మంత్రి మండలి

- మంత్రి మండలి ఎంపికలో ప్రధానిదే అంతిమ అధికారం. ఇందులో మార్పులు, చేర్పులు ఆయన ఇష్టాయిష్టాలపైన ఆధారపడి ఉంటాయి.
- ప్రధాని మంత్రులకు శాఖలను కేటాయించడంతోపాటు మంత్రి మండలికి అధ్యక్షత వహిస్తారు.
- సక్రమంగా పనిచేయని మంత్రులను రాజీనామా చేయమని కోరతారు. అలాగే, అలాంటి మంత్రులను తొలగించమని రాష్ట్రపతికి సలహా ఇస్తారు.

లోక్ సభ నాయకుడు

- ప్రధానమంత్రి లోక్ సభలో సభ్యుడైతే, దానికి నాయకుడిగా వ్యవహరిస్తారు.
- లోక్ సభలో ప్రధాన వక్తగా ఉంటారు.
- ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేస్తారు.
- పార్లమెంటు సమావేశాలు, దీర్ఘకాలిక వాయిదా మొదలైన అంశాలపై రాష్ట్రపతికి సలహాలిస్తారు.
- రాష్ట్రపతికి, మంత్రి మండలికి ప్రధాని అనుసంధాన కర్త.
- ప్రకరణ- 78 ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన అన్ని నిర్ణయాలను రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- రాష్ట్రపతి కోరిన సమాచారాన్ని, ఇతర అంశాలను తెలియజేస్తారు.
- దేశంలో అన్ని ముఖ్య నియామకాలు ప్రధాని నిర్ణయం మేరకు జరుగుతాయి.

ఇతర అధికారాలు

- నీతి ఆయోగ్, జాతీయాభివృద్ధి మండలి, జాతీయ సమగ్రతా మండలి, అంతర్రాష్ట్ర మండలి, జాతీయ జల వనరుల మండలి, జాతీయ భద్రతా మండలి, విపత్తు నిర్వహణ మండలి, జాతీయ నైపుణ్యత అభివృద్ధి మండలి మొదలైన వాటికి ప్రధాని చైర్మన్‌గా వ్యవహరిస్తారు.
- కేబినెట్ ముఖ్య కమిటీలైన నియామకాల కమిటీ, రాజకీయ వ్యవహారాల కమిటీ, అంతర్జాతీయ వ్యవహారాల కమిటీకి చైర్మన్‌గా ఉంటారు.
- అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రధానమంత్రిదే కీలకపాత్ర. ప్రధాని కేంద్ర ప్రభుత్వానికి అధికార ప్రతినిధి, జాతికి నాయకుడు, సంక్షోభాల నివారణా నిర్వాహకుడు.

ప్రధానమంత్రి ప్రాబల్యం పెరగడానికి కారణాలు

రాజ్యాంగపరంగా ప్రధానమంత్రికి ప్రత్యేక హోదా లేనప్పటికీ, రాజకీయంగా కీలకపాత్ర పోషిస్తారు. ఆయన ప్రాబల్యం పెరగడానికి ఈ కింది కారణాలను చెప్పొచ్చు.

- పార్టీ యంత్రాంగ గతిశీలక విధానాలు
- ఆకర్షణీయ, సమ్మోహక నాయకత్వం
- పార్టీలో, ప్రభుత్వంలో అధికార కేంద్రీకరణ, ప్రసార సాధనాల పాత్ర.
- విదేశీ విధానాల రూపకల్పనలో పాత్ర
- పార్లమెంటు సభ్యుల ప్రభావం తగ్గడం
- జనాకర్షక విధానాలు

ప్రధాని పాత్రపై ప్రముఖుల వ్యాఖ్యానాలు

- ప్రధాని సమానుల్లో ప్రథముడు-లార్డ్ మార్లే.
- కేబినెట్ సౌధానికి మూలస్తంభం లాంటివాడు - లార్డ్ మార్లే
- మొదట్లో ప్రధానమంత్రి సమానులలో ప్రథముడైనా ప్రస్తుతం మాత్రం చుక్కల్లో చంద్రుడు - హెర్బర్ట్ మారిసన్
- రాజ్యమనే నౌకకు ప్రధానమంత్రి చోదక చక్రం వంటివాడు.- రామ్‌సే మ్యూర్
- ప్రధానమంత్రి మంత్రి మండలిలో కేంద్రకం, జీవం, మరణకారకం కాబట్టి ఆయన ప్రభుత్వ యంత్రాంగానికి ఇరుసు వంటివాడు. - హెచ్.జె.లాస్కి
- ప్రభుత్వం దేశానికి యజమాని అయితే ప్రధానమంత్రి ప్రభుత్వానికి యజమాని. - హెచ్.ఆర్.జి. గ్రీవ్స్
- రాజ్యమనే నౌకకు ప్రధానమంత్రి కెప్టెన్ -మన్రో
- ప్రధానమంత్రి సూర్యుడైతే, సూర్యుడి చుట్టు తిరిగే గ్రహాలే మంత్రులు. - ఐవర్ జన్నింగ్స్
- ప్రధానమంత్రిగా వ్యవహరించేవారికి హుందాతనం, అధికారం, దృఢత్వం, నేర్పరితనం, సమయస్ఫూర్తి, వాస్తవికత, ప్రశాంతత, ప్రజలకు అందుబాటు, వ్యక్తిగతంగా దయ, దూరదృష్టి వంటి లక్షణాలు ఉండాలి. - విలియం హార్‌కోర్ట్
- భారత ప్రధానమంత్రిని అమెరికా అధ్యక్షుడితో పోలిస్తే ప్రధానమంత్రే సరియైన పోలికవుతుంది కానీ రాష్ట్రపతి కాదు. - బి.ఆర్.అంబేద్కర్

ఉప ప్రధానమంత్రి

డిప్యూటీ ప్రధానమంత్రి పదవికి సంబంధించి రాజ్యాంగంలో ఎలాంటి ప్రస్తావన లేదు కాబట్టి ఈ పదవి రాజ్యాంగేతర పదవి అవుతుంది. రాజకీయ కారణాలు, ప్రాంతీయ రాజకీయాలు ఈ పదవి ఏర్పాటుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఉప ప్రధానమంత్రి కూడా మంత్రిమండలిలో అంతర్భాగం. ప్రత్యేక అధికారాలు, విధులు ఉండవు. ఒక కేబినేట్ మంత్రి తనకు కేటాయించిన శాఖలను నిర్వర్తిస్తాడు. ఉప ప్రధాని హోదాతో పదవీ ప్రమాణ స్వీకారం చేయవచ్చునని 1989లో కేంద్ర మంత్రివర్గంలో ఉప ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దేవీలాల్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

కేంద్ర మంత్రి మండలి

ప్రకరణ 74(1) ప్రకారం, భారత రాష్ట్రపతికి విధుల నిర్వహణలో సహాయ, సలహాలను అందించడానికి ప్రధాని అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. దీని సలహా మేరకు రాష్ట్రపతి తన విధులను నిర్వర్తిస్తారు.

ప్రకరణ 74(2) ప్రకారం, మంత్రి మండలి.. రాష్ట్రపతికి ఇచ్చిన సలహాల గురించి ఏ న్యాయస్థానాల్లో కూడా ప్రశ్నించరాదు.

ప్రత్యేక వివరణ

ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి ఇచ్చిన సలహాలను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలా లేదా తన విచక్షణాధికారాన్ని వినియోగించవచ్చా అనే అంశంపై మౌలిక రాజ్యాంగంలో స్పష్టత లేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి. ఇదే విషయాన్ని మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్.. ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్‌లో తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాజ్యాంగంలో మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలనే నిబంధన ఏదీ లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

సుప్రీంకోర్టు తీర్పులు

1955లో రామ్ జయలీ వర్సెస్ పంజాబ్ కేసులో మంత్రి మండలి సలహాకు అనుగుణంగానే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇదే అభిప్రాయాన్నిరావ్ వర్సెస్ ఇందిరా (1971), షంషేర్ సింగ్ వర్సెస్ పంజాబ్ (1974) కేసుల్లో కూడా పునరుద్ఘాటించింది.

పైన ఉదహరించిన సందిగ్ధత 1976లో 42వ రాజ్యాంగ సవరణ తర్వాత తొలిగిపోయింది. ఈ సవరణ ప్రకారం ప్రకరణ 74కు 'Shall' అనే పదాన్ని చేర్చారు. (President shall act in accordance with advice of Council of Ministers). దీంతో మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలనే నిబంధన రూఢీ అయింది. అయితే 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొకసారి ప్రకరణ 74ను సవరించారు. రాష్ట్రపతి ఆమోదానికి పంపిన బిల్లులను , ప్రతి పాదనలను రాష్ట్రపతి.. మంత్రి మండలి పునఃపరిశీలనకు పంపొచ్చు. అలా పంపితే, మంత్రి మండలి వాటిని పునఃపరిశీలించవచ్చు లేదా యథాతథంగా రాష్ట్రపతి ఆమోదానికి తిరిగి పంపొచ్చు. ఈసారి రాష్ట్రపతి తప్పనిసరిగా తన ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుంది. పై రెండు రాజ్యాంగ సవరణల తర్వాత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, మంత్రి మండలి మధ్య సంబంధం స్పష్టమవుతోంది. మంత్రి మండలి నిర్ణయాని కనుగుణంగా రాష్ట్రపతి వ్యవహరించాలా లేదా అనే ప్రశ్న తలెత్తదు. రాష్ట్రపతి తప్పనిసరిగా మంత్రి మండలి నిర్ణయాన్ని పాటించాల్సి ఉంటుంది.

మంత్రి మండలి సంఖ్య

ప్రకరణ- 75 ప్రకారం ప్రధాని సలహా మేరకు మంత్రి మండలిని రాష్ట్రపతి నియమిస్తారు. మంత్రి మండలి సంఖ్య, మంత్రుల వర్గీకరణ గురించి మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావన లేదు. అయితే 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా మంత్రి మండలి సంఖ్యను నిర్ణయించారు. ఈ సవరణ ప్రకారం కేంద్రంలోని మంత్రి మండలి సంఖ్య లోక్ సభ మొత్తం సభ్యుల్లో 15 శాతానికి మించరాదు అనే గరిష్ఠ పరిమితిని విధించారు. అంటే లోక్ సభ మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 545 కాబట్టి కేంద్ర మంత్రి మండలి సంఖ్య 82కు మించరాదు.

మంత్రులు - రకాలు

1949లో గోపాలస్వామి అయ్యంగార్ సిఫారసుల మేరకు, మంత్రులను మూడు రకాలుగా వర్గీకరించారు. ఇది పరిపాలనా సౌలభ్యం కోసం చేసిన వర్గీకరణ మాత్రమే. దీనికి రాజ్యాంగబద్ధత లేదు.

1. కేబినేట్ మంత్రులు
2. స్టేట్ మంత్రులు
3. డిప్యూటీ మంత్రులు

కేబినెట్ మంత్రులు

కేబినెట్ అనే పదాన్ని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ- 352లో చేర్చారు. మంత్రి మండలిని గురించి వివరణ ప్రకరణ- 75లో లేదు. కేబినెట్ మంత్రులు తమ మంత్రిత్వ శాఖకు అధిపతులుగా స్వతహాగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రాముఖ్యత గల శాఖలైన రక్షణ, ఆర్థిక, హోం, రైల్వే, వ్యవసాయం మొదలైన వాటికి కేబినెట్ మంత్రు లుంటారు. అన్ని ముఖ్య నిర్ణయాలు ప్రధాన మంత్రి నేతృత్వంలో కేబినెట్ తీసుకుంటుంది. దీనికి కేంద్ర మంత్రి మండలిలో చాలా విలువ ఉంటుంది. వారానికి ఒకసారి సమావేశం కావాల్సి ఉంటుంది.

ఇంతవరకు ఉప ప్రధానులుగా పనిచేసినవారు

ఉప ప్రధాని	కాలం	ప్రధాన మంత్రి
1. సర్దార్ వల్లబాయ్ పటేల్	1947-50	జవహర్‌లాల్ నెహ్రూ
2. మొరార్జీ దేశాయ్	1967-69	ఇందిరా గాంధీ
3. చరణ్ సింగ్	1977-79	మొరార్జీ దేశాయ్
4. జగ్జీవన్‌రామ్	1977-79	మొరార్జీ దేశాయ్
5. వై.బి.చవాన్	1979-80	చరణ్ సింగ్
6. దేవీలాల్	1989-90	వి.పి.సింగ్
	1990-91	చంద్రశేఖర్
7. లాల్‌కృష్ణ అద్వానీ	2002-04	ఎ.బి. వాజ్‌పేయ్

పైపుల తయారీలో ఉపయోగించే ప్లాస్టిక్ ఏది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం

పాలీమర్లు

చిన్న చిన్న అణువులను అనేకసార్లు పునరావృతం చేసి అత్యంత పెద్ద అణువులను ఏర్పరిచే ప్రక్రియనే 'పాలీమరైజేషన్' అంటారు. ఈ విధంగా ఏర్పడిన అణువులను 'బృహదణువులు' లేదా 'పాలీమర్'లు అంటారు. ఈ ప్రక్రియలో ఉపయోగించిన చిన్న అణువులను 'మోనోమర్'లు అంటారు.

- ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించేవాటిని సహజ పాలీమర్‌లుగా పేర్కొంటారు.
  ఉదా: పట్టు, ఉన్ని, కాటన్ (సెల్యూలోజ్), పిండి పదార్థం (స్టార్చ్), ప్రోటీన్లు, సహజ రబ్బరు.
- వివిధ రసాయన పదార్థాలను ఉపయోగించి ప్రయోగశాలలో, పారిశ్రామికంగా తయారు చేసేవాటిని కృత్రిమ పాలీమర్లు అంటారు.
  ఉదా: పాలీథీన్, నైలాన్, టెఫ్లాన్, పీవీసీ.
- సహజ పాలీమర్లను పాక్షికంగా మార్పు చేయడం ద్వారా రూపొందించేవాటిని అర్ధ కృత్రిమ పాలీమర్లు అంటారు.
  ఉదా: సెల్యూలోజ్ ఎసిటేట్, సెల్యూలోజ్ నైట్రేట్.
- –C(=O)–NH– అనే సమూహం పునరావృతమయ్యే పాలీమర్లను పాలీ ఎమైడ్లు అని అంటారు. కార్బాక్సిలికామ్ల గ్రూపు, ఎమైనో గ్రూపులున్న మోనోమర్ల సంఘనన పాలీమరీకరణ ప్రక్రియ వల్ల పాలీ ఎమైడ్లు ఏర్పడతాయి.

కొన్ని పాలీమర్లు - వాటి మోనోమర్లు

పాలీమర్	సంబంధిత మోనోమర్
పాలీథీన్	ఇథిలీన్
పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ)	వినైల్ క్లోరైడ్
సహజ రబ్బరు	ఐసోప్రీన్
కృత్రిమ రబ్బరు	క్లోరోప్రీన్
టెఫ్లాన్	టెట్రా ఫ్లోరో ఇథిలీన్
నైలాన్ 6, 6	ఎడిపిక్ ఆమ్లం + హెక్సా మిథిలీన్ డై ఎమీన్ (హెచ్ఎండీఏ)
టెరిలీన్ (డాక్రాన్)	ఇథిలీన్ గ్లైకాల్ + డై మిథైల్ టెరిథాలేట్

ఉదా: ఉన్ని, మాంసం లాంటి సహజ ప్రోటీన్లు, నైలాన్ 6, 6 లాంటి కృత్రిమ పాలీమర్.

- –C(=O)–O– (–COO–) అనే సమూహం పునరావృతమయ్యే పాలీమర్లను పాలీ ఎస్టర్లు అంటారు. **ఉదా:** టెరిలీన్
- సాగే గుణం ఉన్న పాలీమర్లను 'ఎలాస్టోమర్లు' అంటారు. **ఉదా:** రబ్బరు.
- పోచల లాంటి నిర్మాణం ఉన్న పాలీమర్లను పోగులు (Fibres) అంటారు.
  ఉదా: కాటన్, నైలాన్, టెరిలీన్





- వేడి చేసినప్పుడు మెత్తబడి, చల్లార్చగానే తిరిగి గట్టిపడే పాలీమర్లను 'థర్మోప్లాస్టిక్'లు అంటారు.
  ఉదా: పాలీథీన్, పాలీ ఎస్టర్లు, పీవీసీ.
- వేడి చేసినప్పుడు వాటి ధర్మాలను పూర్తిగా కోల్పోయి, చల్లార్చినప్పుడు తిరిగి వాటి పూర్వ రూపాలను పొందని వాటిని ఉష్ణదృఢ పాలీమర్లు లేదా థర్మోసెట్టింగ్ పాలీమర్లు అంటారు. **ఉదా:** బేకలైట్, యూరియా - ఫార్మాల్డిహైడ్ రెజిన్.

ముఖ్యమైన పాలీమర్లు - అనువర్తనాలు

- **పాలీథీన్:** ఇథిలీన్(C_2H_4)ను పాలీమరీకరణం చేయడం ద్వారా లభించేదే పాలీథీన్. తయారీ విధానంలోని తేడా వల్ల ఇది రెండు రూపాల్లో లభిస్తుంది. మొదటిది అల్ప సాంద్రత ఉన్న పాలీథీన్ (LDPE). దీన్ని విద్యుత్ వైర్ల ఇన్సులేషన్‌లో, ఆటవస్తువులు, బాటిళ్లు, మృదువైన పైపులు, రెయిన్ కోట్లు, పాల ప్యాకెట్లు, క్యారీ బ్యాగుల తయారీలో ఉపయోగిస్తారు. రెండో రకమైంది అధిక సాంద్రత ఉన్న పాలీథీన్ (HDPE). దీన్ని బకెట్లు, చెత్త బుట్టలు, దృఢమైన బాటిళ్లు, పైపుల తయారీలో వినియోగిస్తారు.
- **రబ్బరు:** రబ్బరు చెట్ల ద్వారా లభించే సహజ/ముడి రబ్బరును లేటెక్స్ అంటారు. ఇది నీటిలో రబ్బరు కణాలు విస్తరించి ఉన్న ఒక కొల్లాయిడ్. రసాయనికంగా ఇది పాలీ ఐసోప్రీన్ (ఐసోప్రీన్ యొక్క పాలీమర్). సహజ రబ్బరు గట్టిదనాన్ని పెంచడానికి 'సల్ఫర్'ను కలిపి వేడి చేసే ప్రక్రియను 'వల్కనైజేషన్' అంటారు.
- క్లోరోప్రీన్‌ను పాలీమరీకరణం చేసి తయా రు చేసే కృత్రిమ రబ్బరును 'నియోప్రీన్' అంటారు. దీన్ని కన్వేయర్ బెల్టులు, గాస్కెట్ల తయారీలో ఉపయోగిస్తారు.
- బ్యూటా డయీన్, ఎక్రిలోనైట్రిల్‌లను ఉపయోగించి తయారు చేసే కృత్రిమ రబ్బరు బ్యూనా–N. ఇది పెట్రోల్, ఆయిల్ లాంటి వాటితో చర్య జరపదు. అందువల్ల దీన్ని 'ఆయిల్ సీల్'ల తయారీలో ఉపయోగిస్తారు.
- **పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ):** దీన్ని వినైల్ క్లోరైడ్ నుంచి తయారు చేస్తారు. ఇది గట్టి పదార్థం. నీటి పైపులు, చేతి సంచులు, గ్రామఫోన్ రికార్డులు, నేల కప్పడాలు, విద్యుత్ బంధకాలతో పాటు డయాలిసిస్, రక్త మార్పిడి చేయడానికి ఉపయోగించే గొట్టాల తయారీలో దీన్ని ఉపయోగిస్తారు.
- **నైలాన్ 6, 6:** గట్టిదనం, సాగే గుణం ఉన్న దారాల తయారీలో దీన్ని వాడతారు. బ్రష్‌లు, బ్రష్‌ల ముళ్లు, తివాచీలు, చేపల వలలు మొదలైన వాటిని తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు.
- **టెఫ్లాన్:** టెట్రాఫ్లోరో ఇథిలీన్ (C_2F_4) పాలీమర్‌ను టెఫ్లాన్ అంటారు. దీన్నే పాలీ టెట్రా ఫ్లోరో ఇథిలీన్ అని కూడా అంటారు. ఇది రసాయన పదార్థాలతో చర్య జరపదు. అధిక వేడిని తట్టుకుంటుంది, క్షయం కాదు. అందువల్ల దీన్ని నాన్‌స్టిక్ వంటపాత్రలు, ఆయిల్ సీల్‌ల తయారీలో వినియోగిస్తారు.
- **బేకలైట్:** ఫీనాల్ - ఫార్మాల్డిహైడ్ సంఘనన పాలీమర్ ఇది. మొదటి దశలోని 'నోవాలాక్'ను పెయింట్ల తయారీలో ఉపయోగిస్తారు. శాఖీయుత పాలీమర్ అయిన బేకలైట్‌ను దువ్వెనలు, ఎలక్ట్రిక్ స్విచ్‌ల తయారీలో వాడతారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో పాలీమర్ ఏది?
   1) సుక్రోజ్ 2) స్టార్చ్
   3) సాధారణ ఉప్పు 4) నీరు
2. కిందివాటిలో సహజ పాలీమర్ కానిది ఏది?
   1) సెల్యూలోజ్ 2) రబ్బరు
   3) పట్టు 4) పాలీథీన్
3. సహజ రబ్బరు అనేది ఒక? (గ్రూప్-2, 2012)
   1) జెల్ 2) ఘన ద్రావణం
   3) పాలీమర్ 4) కొల్లాయిడ్
4. సహజ రబ్బరు దేని పాలీమర్?
   1) వినైల్ క్లోరైడ్ 2) క్లోరోప్రీన్
   3) ఐసోప్రీన్ 4) ఎక్రిలోనైట్రైల్
5. రబ్బరును సల్ఫర్‌తో కలిపి వేడిచేసే ప్రక్రియను ఏమంటారు?
   1) కిణ్వ ప్రక్రియ 2) వల్కనైజేషన్
   3) రేషనలైజేషన్ 4) ప్లాస్టిసైజేషన్
6. టెరిలీన్‌కు మరో పేరు?
   1) రేయాన్ 2) టెఫ్లాన్
   3) నియోప్రీన్ 4) డాక్రాన్
7. జతపరచండి.
   ఎ) బేకలైట్ 1) థర్మోసెట్టింగ్ పాలీమర్
   బి) టెరిలీన్ 2) నైలాన్ 6, 6
   సి) పాలీ ఎమైడ్ 3) రేయాన్
   డి) కృత్రిమ సిల్కు 4) పాలీ ఎస్టర్

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	1	3	2	4
3)	4	1	2	3
4)	1	4	2	3

8. పరుపుల్లో ఫోమ్‌గా ఉపయోగించే 'కార్బమేట్' బంధాలున్న పాలీమర్ ఏది?
   1) పీవీసీ 2) టెఫ్లాన్
   3) పాలీయురీథేన్ 4) నియోప్రీన్
9. షాంపూలు, హెయిర్ కండిషనర్లలో వాడే పాలీమర్?
   1) పీవీసీ 2) పాలీథీన్
   3) పాలీసిలికోన్ 4) పాలీబ్యూటీన్
10. వేడిని తట్టుకునే, పెట్రోల్‌తో చర్యనొందని రబ్బరు ఏది?
    1) సహజ రబ్బరు
    2) నియోప్రీన్ రబ్బరు
    3) బ్యూనా-ఎన్
    4) సిలికోన్ రబ్బరు
11. పగలని స్వభావం ఉన్న కిచెన్ వేర్ తయారీలో వినియోగించే పాలీమర్ ఏది?
    1) పీవీసీ
    2) మెలమైన్ పాలీమర్
    3) సిలికోన్ పాలీమర్
    4) వినైల్ పాలీమర్
12. నోవాలాక్ పాలీమర్‌ను వేటి తయారీలో ఉపయోగిస్తారు?
    1) పెయింట్‌లు
    2) నాన్‌స్టిక్ వంటపాత్రలు
    3) పైపులు 4) చేతి సంచులు
13. నాన్‌స్టిక్ వంట పాత్రలు దేనితో పూత పూసి ఉంటాయి? (గ్రూప్-2, 2012)
    1) పాలీ వినైల్ క్లోరైడ్
    2) పాలీ టెట్రాఫ్లోరో ఎథిలీన్
    3) పాలీ ఎథిలీన్
    4) పాలీయురీథేన్
14. కృత్రిమ సిల్క్‌ను కింది విధంగా కూడా పిలువవచ్చు? (గ్రూప్-2, 2008)
    1) నైలాన్ 2) రేయాన్
    3) డెక్రాన్ 4) ఫైబర్ గ్లాస్
15. డయాలిసిస్, రక్త మార్పిడికి ఉపయోగించే నాళికలను ఏ పదార్థంతో రూపొందిస్తారు? (గ్రూప్-1, 2012)
    1) పాలీ ఇథిలీన్ 2) పాలీ సిలికాన్
    3) పాలీ వినైల్ క్లోరైడ్
    4) పాలీ బ్యూటీన్
16. పైపుల తయారీలో ఉపయోగించే ప్లాస్టిక్ ఏది?
    1) నైలాన్ 6, 6
    2) పాలీ ఇథిలీన్
    3) పాలీ వినైల్ క్లోరైడ్ (పీవీసీ)
    4) పాలీ ఎస్టర్
17. కిందివాటిలో పాలీ ఎస్టర్ ఏది?
    1) నైలాన్ 6, 6 2) పీవీసీ
    3) టెరిలీన్ (డాక్రాన్)
    4) సిల్కు
18. కృత్రిమ సిల్కుగా ప్రసిద్ధి చెందిన రేయాన్ తయారీకి ముడి పదార్థం ఏది?
    1) సెల్యూలోజ్ 2) స్టార్చ్
    3) సహజ సిల్కు 4) సహజ రబ్బరు
19. కెమెరా ఫిల్ముల తయారీలో వాడే పాలీమర్?
    1) సెల్యూలోజ్ ఎసిటేట్
    2) సెల్యూలోజ్ నైట్రేట్
    3) స్టార్చ్ 4) పీవీసీ
20. బుల్లెట్ ప్రూఫ్ గాజు తయారీలో వాడే పదార్థం ఏది?
    1) పాలీ ఎస్టర్ 2) పాలీ కార్బొనేట్
    3) పాలీ ఎమైడ్ 4) పాలీ స్టైరీన్
21. జతపరచండి.
    ఎ) నైలాన్ 6, 6 1) బ్రష్‌లు
    బి) పీవీసీ 2) క్యారీ బ్యాగులు
    సి) అధిక సాంద్రత ఉన్న పాలీథీన్ 3) బొమ్మలు
    డి) అల్ప సాంద్రత ఉన్న పాలీథీన్ 4) పాల ప్యాకెట్లు

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	4	1	2	3
4)	3	4	1	2

22. కిందివాటిలో 'పోగులు'గా వ్యవహరించని పాలీమర్ ఏది?
    1) డాక్రాన్ 2) సిల్క్
    3) ఉన్ని 4) టెఫ్లాన్
23. జతపరచండి.
    ఎ) సెల్లోఫేన్ టేప్ 1) సెల్యూలోజ్
    బి) గన్‌కాటన్ 2) సెల్యూలోజ్ ఎసిటేట్
    సి) సహజ దారం (కాటన్) 3) పాలీసిలికోన్
    డి) హెయిర్ కండిషనర్ 4) సెల్యూలోజ్ నైట్రేట్

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	3	4	1	2
4)	2	4	1	3

24. ఐసోప్రీన్ అనేది ఒక?
    1) చక్కెర 2) కృత్రిమ రబ్బరు
    3) సహజ రబ్బరు 4) మత్తు పదార్థం
25. కిందివాటిలో సహజ పాలీమర్ కానిది ఏది?
    1) రెజిన్ 2) జిగురు
    3) సెల్యూలోజ్ 4) టెఫ్లాన్

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 3; 5) 2; 6) 4; 7) 4; 8) 3; 9) 3; 10) 4; 11) 2; 12) 1; 13) 2; 14) 2; 15) 3; 16) 3; 17) 3; 18) 1; 19) 1; 20) 2; 21) 1; 22) 4; 23) 4; 24) 3; 25) 4.

పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
బయాలజీ

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ - దృఢ కణజాలం
   శ్వేత - మృదు కణజాలం
   శ్రియ - దారు కణజాలం
   శంకర్ - పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్ 2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్ 4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు - కొవ్వు ఆమ్లాలు
   2) ప్రోటీన్లు- పెప్టైడులు
   3) పిండి పదార్థాలు - మాల్టోజ్
   4) పిండి పదార్థాలు - పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి - రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు - సముద్ర జంతువులు
   2) పీతలు - సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు - జలగలు
   4) సముద్ర నక్షత్రం - షార్క్ చేప
7. రాడ్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము 3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
   ఎ. కప్ప బి. పావురం
   సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
   1) ఎ,బి 2) ఎ, డి
   3) బి, సి 4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
   1) ప్లీహం 2) కాలేయం
   3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
   1) ఆక్సిన్లు 2) ఆబ్‌సిసిక్ ఆమ్లం
   3) ఇథిలిన్ వాయువు 4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
   1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేక పోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
   1) అనుమస్తిష్కం 2) ద్వారగోర్థం
   3) మజ్జాముఖం 4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
   1) పరాగకోశం 2) పిండకోశం
   3) వేరు పోషక కణాలు
   4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
   1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
   3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
   ఎ. బొద్దింక బి. వానపాము
   సి. కప్ప డి. పాము



   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్థుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
   1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
   3) అనీమియా 4) జీరాఫ్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
   1) రెటినాల్ 2) కాల్సిఫెరాల్
   3) ఫోలిక్ ఆమ్లం 4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
   1) కాలేయ కణాలు
   2) లాలాజల గ్రంథులు
   3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
   1) జటిల ఎముకల విరుపు
   2) మూసివేసిన ఎముకల విరుపు
   3) లేత ఎముక విరుపు
   4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
   1) సమతుల ఆహార లోపం
   2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
   3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
   4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం ప్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
   1) ద్వారగోర్థం 2) మజ్జాముఖం
   3) పిట్యూటరీ గ్రంథి
   4) మస్తిష్క గోళార్ధాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
   1) టోటిపొటెన్సీ 2) కాలస్
   3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
   ఎ. ఐసోటాసిన్ బి. గ్లిసరాల్
   సి. లైజీన్ డి. లిపిడ్లు
   1) ఎ, బి 2) బి, డి
   3) ఎ, సి 4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
   1) BDE - ACK
   2) AEKC - BD
   3) BC - ADEK
   4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్‌ఐవీని కనుగొన్నారు?
   ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
   బి. ఇస్‌మార్క్
   సి. రాబర్ట్ గాలో
   డి. కార్ల్ లాండ్ స్టీనర్
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, డి 4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
   1) నెక్టాన్ 2) ప్లవకాలు
   3) బెంథాస్ 4) నిమ్నటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
   1) క్లోరిన్ 2) బ్రోమిన్
   3) అయోడిన్ 4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
   1) మాంసకృత్తులు 2) పిండి పదార్థాలు
   3) కొవ్వులు 4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియన్ తైలాన్ని స్రవించేది?
   1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
   3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
   1) పైరిడాక్సిన్
   2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
   3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాసక్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
   1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
   3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
   2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
   3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
   4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
   1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
   3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
   1) టెక్టోనా గ్రాండ్
   2) క్రొటలేరియా జన్షియా
   3) షోరియారాబస్టా
   4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
   1) బాసుమతి 2) పూసామోతి
   3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
   1) యూకలిప్టస్ 2) కాజురైనా
   3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
   1) డాల్బర్జియా లాటిపోలియా
   2) డిజిటాలిస్
   3) రిసినస్ కామ్యునిస్
   4) బోడ్రియో కైకస్ బ్రానై
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
   1) స్పాడిక్స్ 2) సమశిఖి
   3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
   1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్తకణాలు
   3) లింఫోసైట్లు 4) త్రాంబోసైట్లు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3
5) 2	6) 2	7) 3	8) 2
9) 3	10) 4	11) 1	12) 4
13) 3	14) 2	15) 2	16) 3
17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1
25) 2	26) 3	27) 2	28) 3
29) 3	30) 1	31) 4	32) 2
33) 1	34) 3	35) 1	36) 2
37) 2	38) 3	39) 4	40) 3
41) 1			

Education is the only weapon...



BANK EXAMS
GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sen tence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. He is well on the way (1)/ to establishing himself (2)/ between the top 10 players (3)/ in the world. (4)/ No error (5)
2. Students soon grow (1)/ worry of listening (2)/ to a parade of (3)/ histori cal facts. (4)/ No error (5)
3. Education is the only weapon (1)/ to fight (2)/ the spreading of (3)/ the dise ase. (4)/ No error (5)
4. The artist recently (1)/ arrived in Paris from Bulgaria (2)/ by the ways (3)/ of Vienna. (4)/ No error (5)
5. It was (1)/ a new production tech nique (2)/ aims at (3)/ minimizing wastage. (4)/ No error (5)

Directions (Q. No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Sometimes they had to _____ waist deep through mud.
   1) Wade 2) cross 3) swim 4) pull 5) push
7. The conversation got into the murky _____ of jealousy and relationships.
   1) Mud 2) position 3) place 4) waters 5) twist
8. A man in the water was shouting and ____ his arms around _____.
   1) Wading, furiously
   2) Waking, repeatedly
   3) Waving, frantically
   4) Waxing, frequently
   5) Waning, possibly
9. She _____ wove the flowers into a garland and offered it to the deity.
   1) Cleverness 2) positively 3) furiously 4) deftly 5) sullenly
10. The yard immediately needs attention as it is ___ with weeds.
   1) Outcast 2) overgrown 3) protected 4) blooming 5) picturesque

Directions: (Q. No. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. She walked off with the gold medal.
   1) Walked along 2) Walk into 3) Walk with 4) Walked away 5) No correction required
12. Her persistence paid on and she eventually wore me down.
   1) Paid upon 2) Paid out 3) Paid off 4) Paid for 5) No correction required
13. The pillars has to support the weight of the roof.
   1) Have to 2) Are to 3) Were to 4) Will have 5) No correction required
14. She was warned again that if she does it again she would lose her job.
   1) Did it 2) Do it 3) Done it 4) Do's it 5) No correction required
15. The guests of my wife's brother's are coming today.
   1) Wife brother's
   2) Wife's brothers
   3) Wife's brother
   4) Wife brother
   5) No correction required

Directions (Q. No. 16-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

For parents, few things are more important than their child's education. In many countries, parents of school-age children can choose to send their child to a private school rather than to a state school. In general state schools are those that do not charge tuition fees because they are funded and run by local or central government; private schools on the other hand, are funded almost entirely by the fees that they charge. Before deciding where to educate their child, parents need to examine the differences between the two types of school, particularly as regards the curriculum, the quality of tuition and student achievement.

Private and state schools are comparable in some respects. Like state schools, private schools aim to develop the knowledge, skills and character of students, in order to prepare them for their future lives. Both types of school are also very similar in the way they organize their teaching and assessment, using terms or semesters with assess ments at the end of the academic year.

Despite the similarities, there are a number of marked differences in the way that state and private schools operate. The range of subjects taught at state schools is largely limited by the demands of the national curriculum. In contrast, private schools can offer a greater choice of subjects, because they generally have more money to spend on equipment, technology and staff than state schools.

Teachers working in state schools must have recognized teaching qualifications and are paid according to a national scale. Private schools, however, need not essentially have a fixed pay structure and it is commensurate with the qualification and experience of the teacher.

In general, it is true to say that while state schools have a high student-teacher ratio, private schools tend to offer smaller classes. This may lead to better discipline in private schools with the result that students may achieve somewhat higher academic standards.

It is clear, therefore that there are significant differences between private and state schools, and that private schools may offer advantages. The benefits of private schooling must, however, be balanced against the cost involved and each family's budget.

16. The author opines that
   1) There are similarities between state and private schools
   2) There are differences between state and private schools
   3) There is no contrast between state and private schools
   4) Both 1 & 2 5) Either 1 or 2
17. Private and state schools are similar in
   1) developing knowledge skills and character
   2) greater choice of subjects
   3) up-to-date equipment
   4) sophisticated technology
   5) more staff
18. Standard pay structure is a norm followed in
   1) some private schools
   2) in many private schools
   3) in few state schools
   4) in all state schools
   5) in a few state schools
19. The probability of achieving higher academic standards is
   1) ruled out in private schools
   2) ruled out in state schools
   3) with advanced technology
   4) with small classes possible in private schools
   5) can be achieved in large classrooms in state schools
20. Private schools are
   1) striving in providing quality education
   2) putting relentless efforts in order to prepare students to meet their future needs
   3) pouring loads of work in order to mark their name in the market
   4) charging exorbitant prices which may be an uphill task for many families
   5) having low productivity when compared with state schools

Directions (Q.No. 21-23): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

21. Particularly
   1) predominantly 2) preposterously 3) premonition 4) presentiment 5) predilection
22. Tend
   1) shower 2) praise 3) incline 4) eulogize 5) extol
23. Organize
   1) assign 2) jumble 3) tangle 4) clutter 5) encumber

Directions (Q.No. 24-25): Choose the word which is MOST OPPOSITE in meaning to the word given from the five options.

24. Commensurate
   1) lopsided 2) correspond 3) exchange 4) barter 5) negotiate
25. Discipline
   1) restraint 2) possession 3) indulgence 4) bedlam 5) extravagance

Directions (Q. No. 26-30): Rearr ange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a mean ingful paragraph and then answer the questions given below.

A) Vallabhbhai Patel was one of the great social leaders of India.
B) He played a crucial role during the freedom struggle of India and was instrumental in the integration of over 500 princely states into the Indian Union.
C) Vallabhbhai Patel was born on October 31, 1875 in Gujarat to Zaverbhai and Ladbai.
D) The election on that occasion eventually meant for the election of the first Prime Minister of independent India.
E) Vallabhbhai, His father had served in the army of the Queen of Jhansi while his mother was a very spiritual woman.
F) Despite the choice of the people, on the request of Mahatma Gandhi, Sardar Patel stepped down from the candicacy of Congress president.

26. What is the LAST sentence after re arrangement?
   1) A 2) B 3) D 4) E 5) F
27. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
28. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F
29. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) E 5) F
30. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F

ANSWERS

1) 3;	2) 2;	3) 3;	4) 3;
5) 3;	6) 1;	7) 4;	8) 3;
9) 4;	10) 2;	11) 4;	12) 3;
13) 1;	14) 1;	15) 2;	16) 4;
17) 1;	18) 4;	19) 4;	20) 4;
21) 1;	22) 3;	23) 1;	24) 1;
25) 4;	26) 3;	27) 5;	28) 2;
29) 2;	30) 3.		

విద్య, ఉద్యోగ సమాచారం



ఎన్ఐఈ, చెన్నైలో యంగ్ ప్రొఫెషనల్స్-2 పోస్టులు

చెన్నై(తమిళనాడు)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎపిడెమియోలజీ(ఎన్ఐఈ).. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్-2 (ఎఫ్-ఎ, అడ్మిన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04. -**వేతనం:** నెలకు రూ.42,000.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎంకాం/ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.05.2025.
- **వెబ్‌సైట్:** https://www.nie.gov.in/

ఎన్ఆర్ఎస్‌సీలో 31 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్‌సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ ఇంజనీర్
- **మొత్తం పోస్టుల సంఖ్య :** 31
- **విభాగాలు:** ఫారెస్ట్రీ అండ్ ఎకాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, అర్బన్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్.
- **అర్హతలు :** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఆర్క్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 30.05.2025 నాటికి 18-30ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 30.05.2025
- **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in/CareerAp plylanguage_content_entity=en